www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

చిట్టితల్లిని చిదిమేశాడు!



గంజాయి మత్తులో ఓ మానవ మృగం ఘాతుకం
ఏడేళ్ల బాలికను హింసించి, హత్యాచారం
మృతదేహాన్ని నీళ్ల డ్రమ్ములో చుట్టిపెట్టి మత్తులోకి
నిందితుడ్ని అప్పగించాలంటూ స్థానికుల ఆందోళన
మదనపల్లెలో తీవ్ర ఉద్రిక్తత.. కఠినంగా
శిక్షిస్తామని మంత్రులు లోకేశ్, అనిత హామీ

14

ఆత్మహత్యకు ప్రేరేపించడం.. నేరమే



సినీ నటి ప్రత్యూష కేసులో సిద్ధార్థరెడ్డికి
రెండేళ్ల జైలు శిక్షను ఖరారు చేసిన సుప్రీంకోర్టు
నాలుగు వారాల్లోగా లొంగిపోవాలని నిర్దేశం
హైకోర్టు తీర్పును సమర్థించిన సుప్రీం
అత్యాచారం జరిగినట్లు
సాక్ష్యాల్లేవు: బెంచ్

14

బుధవారం | 18-2-2026 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 | సంచిక (Issue) : 343
శ్రీ విశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, శిశిరఋతువు, ఫాల్గుణమాసం, శుక్లపక్షం, తిథి:పాడ్యమి సా.4:58 తదుపరి విదియ, నక్షత్రం: శతభిషం రా.9:16 తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం:తె.3:33-5:08, దుర్ముహూర్తం: మ.12:06-12:52, అమృతఘడియలు: మ.2:04-3:40, రాహుకాలం: మ.12:00-1:30, సూర్యోదయం: 6:44, సూర్యాస్తమయం: 6:14 | గుంటూరు సిటీ
Guntur | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఎవరెస్ట్ ఎత్తుకు
రక్షణ బంధం

భారత్-ఫ్రాన్స్ మధ్య కీలక ఒప్పందాలు

ఎవరెస్టు ఎత్తుకు చేరగలిగే ఎయిర్‌బస్ హెచ్-125 హెలికాప్టర్లు, హ్యామర్ క్షిపణుల ఉమ్మడి తయారీ

కర్ణాటకలోని వేమగల్‌లో టాటా-ఎయిర్‌బస్ యూనిట్ ప్రారంభించిన ప్రధాని మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్

సాంకేతికతలు, ఆవిష్కరణల్లో భాగస్వామ్యం కోసం 'ఇండియా-ఫ్రాన్స్ సృజనాత్మక సంవత్సరం-2026'

రక్షణ, ఖనిజాలు, అత్యాధునిక సాంకేతికత,ఆరోగ్య రంగాల్లో పరస్పర సహకారం కోసం 21 ఒప్పందాలు

ముంబైలోని లోక్‌భవన్‌లో మోదీ, మేక్రాన్ భేటీ

ఫ్రాన్స్ నైపుణ్యానికి తోడుగా భారత సామర్థ్యాలు: మోదీ

రక్షణ సహకారం మరింత విస్తృతం: మేక్రాన్

3 రోజుల పాటు భారత పర్యటనలో ఫ్రాన్స్ అధ్యక్షుడు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: భారత్-ఫ్రాన్స్ మధ్య రక్షణ సంబంధాలు 'ఎవరెస్ట్' స్థాయికి చేరుతున్నాయి. ప్రపంచంలోనే అత్యంత ఎత్తుకు ఎగరగలిగే ఎయిర్‌బస్ హెచ్-125 హెలికాప్టర్లు, హ్యామర్ క్షిపణులను భారత్-ఫ్రాన్స్ సంయుక్తంగా ఉత్పత్తి చేయనున్నాయి. రక్షణ అంశాల్లో సమన్వయం, సమగ్రత కోసం ఇరు దేశాల సైన్యంలో పలువురు సైనికాధికారులను పరస్పరం నియమించుకోనున్నాయి. మొత్తంగా రక్షణ, కీలక ఖనిజాలు, అత్యాధునిక సాంకేతికతలు, ఆరోగ్య రంగాల్లో పరస్పర సహకారం కోసం భారత్-ఫ్రాన్స్ మధ్య 21 ఒప్పందాలపై ప్రధాని మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మేక్రాన్ మంగళవారం సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఇరు దేశాల మధ్య బంధాన్ని 'ప్రత్యేక అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామ్యం'గా ఇరువురు

మిగతా 2వ పేజీలో...



మేక్రాన్‌తో మోదీ



కళ్లజోడు.. ఏఐ తోడు

భారతీయ భాషల్ని రియల్‌టైమ్‌లో అనువదించే 'సర్వం కేజ్ గ్లాసెస్.. బెంగళూరు స్టార్టప్ ఘనత
ఇండియా ఏఐ సమ్మిట్‌లో ధరించిన ప్రధాని

సోషల్ మీడియా వినియోగంపై వయసుల వారీ నియంత్రణలు: కేంద్ర మంత్రి అశ్వనీ వైష్ణవ్

డేటా సెంటర్లపై అదానీ గ్రూప్ రూ. 9 లక్షల కోట్లు



సుప్రీంకోర్టులో శ్రీలక్ష్మికి
ఎదురుదెబ్బ

ఓఎంసీ కేసును ట్రయల్ కోర్టులోనే తేల్చుకోవాలన్న అత్యున్నత న్యాయస్థానం

గతంలో మరో పిటిషన్ అనుకుని స్టే ఇచ్చామన్న కోర్టు



ఇన్నిరోజులు స్టేను ఎంజాయ్ చేశారు కదా అంటూ వ్యాఖ్య

నిర్దోషిగా ప్రకటించాలన్న పిటిషన్ డిస్మిస్

శ్రీలక్ష్మి మరిది అక్రమాస్తులు కూడబెట్టారు

గనుల కేటాయింపులో లంచం అడిగారు

విచారణలో అక్రమాలన్నీ బయటపడతాయి

సుప్రీం కోర్టులో దర్యాప్తు సంస్థ వాదనలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) కేసులో ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. సీబీఐ కోర్టులో కేసు విచారణ దశలో ఉన్నందున, తామిప్పుడు మెరిట్స్‌లోకి వెళ్లలేమని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ట్రయల్ కోర్టులోనే తేల్చుకోవాలని ధర్మాసనం తేల్చిచెప్పింది. శ్రీలక్ష్మి పిటిషన్‌ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటిస్తూనే సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. గతంలో శ్రీలక్ష్మి పిటిషన్ విచారణ సందర్భంగా మరో పిటిషన్‌గా భావించి స్టే ఇచ్చామని ధర్మాసనం

మిగతా 12వ పేజీలో...



నాణ్యమైన లడ్డూలు

అత్యంత పారదర్శకంగా నెయ్యి కొనుగోళ్లు: టీటీడీ

క్వాలిటీ దెబ్బతినకుండా నిబంధనల్లో మార్పులు

టెండరు దక్కించుకున్న సంస్థలు నిబంధనల ప్రకారం అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాయి

ఎన్‌డీడీబీ నిపుణులు సూచించిన ఆవు నెయ్యి ధర పరిగణనలోకి

టెండరు కేటాయింపుల్లోనూ పారదర్శకత

శ్రీవారి ప్రసాదాల నాణ్యతను, పవిత్రతను కాపాడటానికి కట్టుబడి ఉన్నాం: టీటీడీ

అడ్డగోలు ఆరోపణలపై వాస్తవాలతో సవివర ప్రకటన

తిరుపతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి లడ్డూ ప్రసాదం నాణ్యత, రుచిపై (2024కు ముందు) భక్తుల నుంచి వ్యక్తమైన అనేక అనుమానాలు, విమర్శలను పరిగణనలోకి తీసుకుని నెయ్యి కొనుగోలు విధానంలో పలు మార్పులు చేసినట్లు టీటీడీ వెల్లడించింది. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. రవాణా సమయంలో నెయ్యి నాణ్యత దెబ్బతినకుండా ఉండేందుకు నిబంధనల్లో కీలక మార్పులు చేసినట్లు పేర్కొంది. టెండరు దక్కించుకున్న డెయిరీ సంస్థలు ఎఫ్ఎస్ఎస్ఏఐ, ఎన్‌డీడీబీ నిబంధనల ప్రకారం అన్ని పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాయని తెలిపింది. ఆవు నెయ్యి విషయంలో ఎన్‌డీడీబీ నిపుణులు

మిగతా 12వ పేజీలో...

మండలిలో వైసీపీ రచ్చ!

హెరిటేజ్‌పై చర్చకు పట్టు.. గంటల తరబడి నినాదాలు
చైర్మన్ పోడియంను చుట్టుముట్టిన ప్రతిపక్ష సభ్యులు
సంబంధం లేని అంశాన్ని ప్రస్తావిస్తారా?: మంత్రుల ఆగ్రహం
పలుమార్లు సభను వాయిదా వేసిన చైర్మన్

బడులకు 5 స్టార్ రేటింగ్: లోకేశ్
ఆక్వా రైతుకు యూనిట్ రూ.1.50కే: గొట్టిపాటి

హిందూ దేవుళ్లు, భక్తులపై జగన్ పగబట్టారు: అచ్చెన్న
కల్తీ లడ్డూ పాపాన్ని దారి మళ్లించేందుకే: కొలుసు
ఆధారాల్లేని నిందారోపణలు వైసీపీకి అలవాటే: సత్యకుమార్

13

ఇమ్రాన్ ఆరోగ్యంపై స్పందించండి

▸▸ పాక్ ప్రభుత్వానికి భారత దిగ్గజ క్రికెటర్ల లేఖ



న్యూఢిల్లీ, లాహోర్, ఫిబ్రవరి 17: ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యంపై మాజీ క్రికెట్ దిగ్గజాలు ఆందోళన వ్యక్తం చేశారు. జైలులో ఆయన అనారోగ్యం పాలయ్యారన్న వార్తల నేపథ్యంలో సునీల్ గవాస్కర్, కపిల్‌దేవ్ సహా 12 మంది మాజీ కెప్టెన్‌లు స్పందించారు. ఇమ్రాన్‌కు అవసరమైన వైద్య చికిత్స అందించాలని వారంతా పాకిస్థాన్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పాక్ ప్రభుత్వానికి ఒక లేఖ రాశారు. పాకిస్థాన్‌కు వరల్డ్ కప్ అందించిన జట్టుకు సారథ్యం వహించిన ఇమ్రాన్‌ఖాన్ కుడి కన్ను దాదాపు 85% చూపు కోల్పోయి ఇబ్బందులు పడుతున్నారన్న వార్తల నేపథ్యంలో మాజీ కెప్టెన్లంతా తమ ఆందోళనను వ్యక్తం చేశారు. 800 రోజుల నుంచి ఇమ్రాన్ జైలులో ఉన్న సంగతి తెలిసిందే.

ఏప్రిల్‌లో 4 రాష్ట్రాల అసెంబ్లీలకు ఎన్నికలు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: పశ్చిమ బెంగాల్, అసోం, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరి అసెంబ్లీలకు ఏప్రిల్‌లో ఎన్నికలు నిర్వహించనున్నారు. మార్చిలో వీటికి ఎన్నికల షెడ్యూల్ ప్రకటించనున్నట్లు అధికారులు మంగళవారం తెలిపారు. ఏప్రిల్ నెలలో వివిధ తేదీల్లో వీటికి ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ రాష్ట్రాల అసెంబ్లీల గడువు మే, జూన్ నెలల్లో ముగియనుంది. ఎన్నికల సంఘం ఇప్పటికే ఈ రాష్ట్రాల్లో ఎన్నికల ఏర్పాట్లను పరిశీలించేందుకు పర్యటనలు ప్రారంభించింది. పశ్చిమ బెంగాల్‌లో గత అసెంబ్లీ ఎన్నికలను 8 దశల్లో నిర్వహించారు. అసోంలో రెండు దశల్లో, తమిళనాడు, కేరళ, పుదుచ్చేరిల్లో ఒకే దశలో నిర్వహించారు. కాగా ఇప్పటికే పుదుచ్చేరిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ తర్వాత ఫిబ్రవరి 14న తుది జాబితాను ప్రకటించారు. తమిళనాడులో మంగళవారం, కేరళలో ఈ నెల 21న ప్రకటించనున్నారు. పశ్చిమ బెంగాల్‌లో ఫిబ్రవరి 28న ప్రచురించనున్నారు.

భోపాల్‌లో రూ.1.5 కోట్లకు భర్తను అమ్మిన భార్య

భోపాల్, ఫిబ్రవరి 17: సరిగ్గా 32 ఏళ్ల క్రితం 1994 తెలుగులో వచ్చిన 'శుభలగ్నం' మాదిరే ఓ మహిళ తన భర్తను.. ఆయన స్నేహితురాలికి రూ.1.5 కోట్లకే అమ్మేసిన ఉదంతం అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. ఈ ఘటన మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో చోటు చేసుకుంది. ఆ భర్త (42) ఓ మహిళ (52)తో వివాహేతర సంబంధం పెట్టుకుని తమను నిర్లక్ష్యం చేస్తుండటంతో సదరు మహిళ న్యాయం కోసం భోపాల్ ఫ్యామిలీ కోర్టును ఆశ్రయించారు. విచారణలో ఈ ముగ్గురికి కౌన్సిలింగ్‌తో సమస్య పరిష్కారానికి న్యాయస్థానం ప్రయత్నించినా.. సదరు వ్యక్తి ససేమిరా అన్నాడు. దీంతో అనూహ్యంగా సదరు మహిళ తన భర్తను వదులుకోవడానికి రూ.1.5 కోట్లు ఇవ్వాలని చేసిన ప్రతిపాదనను ఆయన స్నేహితురాలు అంగీకరించింది. అదనంగా తన భార్య, ఇద్దరు కూతుళ్ల ఆర్థిక భద్రత కోసం రూ.27 లక్షల నగదు, ఇల్లును ఇవ్వడానికి ఆమె భర్త ఒప్పందం చేసుకున్నాడు. దీంతో మహిళ తన కూతుళ్లతో కొత్త ఇంటికెళ్లేందుకు సిద్ధం కాగా.. ఈ పరిష్కారాన్ని కోర్టు అధికారికం చేసేసింది.

ప్రజల మధ్య సోదరభావాన్ని పెంపొందించాలి!

▸▸ రాజకీయ నాయకులకు సుప్రీంకోర్టు హితవు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: దేశ ప్రజల మధ్య సోదరభావాన్ని పెంపొందించేలా రాజకీయపార్టీల నేతలు వ్యవహరించాలని సుప్రీంకోర్టు హితవు పలికింది. రాజకీయ నేతల ప్రసంగాలపై, వాటికి మీడియా ఇచ్చే కవరేజీపై మార్గదర్శకాలు వెలువరించాలని కోరుతూ ప్రొఫెసర్ రూప్‌రేఖవర్మ తదితరులు 12 మంది దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. అస్సాం సీఎం హిమంత బిస్వ శర్మ వివాదాస్పద ప్రసంగాల నేపథ్యంలో దాఖలైన ఈ పిటిషన్ తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ.. ఏదో ఒక నాయకుడికి వ్యతిరేకంగా ఇది దాఖలు కాలేదన్నారు. దేశంలో విద్వేషపూరిత ప్రసంగాలు విషాన్ని వెదజల్లుతున్నాయని, వాటిని అరికట్టాలని అన్నారు. దీనిపై సీజేఐ స్పందిస్తూ.. పిటిషన్లు ఒక రాజకీయపార్టీకి, అందులోనూ ఆ పార్టీకి చెందిన కొందరికి వ్యతిరేకంగా ఉన్నట్లుగా కనిపిస్తోందన్నారు. దీనికి బదులుగా.. ప్రసంగాలపై ఇప్పుడున్న నిబంధనలు ఏమిటి? వాటిని రాజకీయపార్టీలు ఎలా ఉల్లంఘిస్తున్నాయన్న వివరాలతో కొత్త పిటిషన్ దాఖలు చేయాలన్నారు. ప్రస్తుత పిటిషన్‌ను కొట్టివేశారు.

ఆమ్కా నమూనాల తయారీ కోసం టాటా, ఎల్ అండ్ టీ, భారత్ ఫోర్జ్ ఎంపిక

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: భారత్ ఎంతో ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఐదవ తరం స్టెల్త్ ఫైటర్ జెట్.. అడ్వాన్స్‌డ్ మీడియం కాంబాట్ ఎయిర్‌క్రాఫ్ట్(ఆమ్కా) ప్రాజెక్టు కీలక దశకు చేరుకుంది. ఏఎంసీఏ నమూనాల తయారీ కోసం టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, ఎల్‌అండ్‌టీ-బెల్ కన్సార్టియం, భారత్ ఫోర్జ్ నేతృత్వంలోని బీఈఎంఎల్, డేటా ప్యాటర్న్స్‌తో కూడిన సంస్థలను డీఆర్‌డీవో షార్ట్ లిస్ట్ చేసింది. స్వదేశీ ఐదవ తరం స్టెల్త్ ఫైటర్ జెట్‌ను అభివృద్ధి చేయడం ఏఎంసీఏ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యం. 2028 నాటికి మొదటి ప్రొటోటైప్‌ను సిద్ధం చేయాలని నిర్ణయించారు. ఏఎంసీఏ ప్రాజెక్టులో భాగంగా 125 ఫైటర్ జెట్లను తయారు చేయాలని, 2035 నాటికి వాటిని వైమానిక దళంలోకి ప్రవేశపెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒకవేళ ఇది సాకారమైతే ఐదవ తరం యుద్ధ విమానాలు తయారు చేస్తున్న అమెరికా (ఎఫ్-22, ఎఫ్-35), చైనా (జే-20), రష్యా (సుఖోయ్-57) సరసన భారత్ కూడా చేరనుంది.

రాజీనామా ఆమోదించలేదంటే ఉద్యోగిని 'కట్టు బానిస'గా చూస్తున్నట్టే

కోచి, ఫిబ్రవరి 17: ఉద్యోగి రాజీనామా పత్రాన్ని ఆమోదించలేదంటే అతడ్ని 'కట్టుబానిస'గా చూస్తున్నట్టు కిందకే వస్తుందని కేరళ హైకోర్టు అభిప్రాయపడింది. నిబంధనలకు అనుగుణంగా రాజీనామా పత్రాన్ని సమర్పించినప్పుడు దాన్ని ఆమోదించడం యాజమాన్యం విధి అని స్పష్టం చేసింది. కేవలం నాలుగు సందర్భాల్లో మాత్రమే రాజీనామాను తిరస్కరించవచ్చని పేర్కొంది. తగిన వ్యవధిలో నోటీసు ఇవ్వకపోవడం, క్షణిక ఆవేశంతో రాజీనామా చేయడం, తీవ్రమైన క్రమశిక్షణ చర్యలు పెండింగ్‌లో ఉండడం, సంస్థకు ఆర్థిక నష్టం కలిగించిన సందర్భాల్లో రాజీనామాను ఆమోదించాల్సిన అవసరం లేదని వివరించింది.

కళ్లజోడు.. ఏఐ తోడు!

మేడిన్ ఇండియా ఏఐ కళ్లజోడు సర్వం కేజ్.. భారతీయ భాషల్ని రియల్‌టైమ్‌లో అనువదించే సత్తా

▸▸ ఇండియా ఏఐ సమ్మిట్‌లో ధరించిన ప్రధాని మోదీ

▸▸ అభివృద్ధి చేసింది బెంగళూరు స్టార్టప్.. 'సర్వం ఏఐ'



ప్రధాని మోదీకి సర్వం ఏఐ గురించి వివరిస్తున్న ప్రత్యూష్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: ఏఐ కళ్లజోళ్లు అనగానే అందరికీ గూగుల్, మెటా, యాపిల్ వంటి అంతర్జాతీయ టెక్ దిగ్గజ కంపెనీలు అభివృద్ధి చేస్తున్నవే గుర్తొస్తాయి! కానీ.. మన ఇండియాలోనూ 'సర్వం ఏఐ' అనే స్టార్టప్ సంస్థ కృత్రిమ మేధ పరిజ్ఞానంతో పనిచేసే కళ్లజోళ్లను రూపొందిస్తోంది! బెంగళూరుకు చెందిన ఆ స్టార్టప్ సంస్థ 'సర్వం కేజ్' పేరిట రూపొందించిన ఏఐ గ్లాసెస్.. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ సమ్మిట్‌లో ప్రధాన ఆకర్షణగా మారాయి. ప్రధాని మోదీ మంగళవారం ఆ కళ్లజోడును ధరించి, ఆసక్తిగా దాని వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆ ఫొటోను సంస్థ సహ వ్యవస్థాపకుడు ప్రత్యూష్‌కుమార్ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. ఈ కళ్లజోడును మొదటిసారి పెట్టుకుని ప్రయత్నించింది ప్రధాని మోదీయేనని పేర్కొన్నారు. దాన్ని డిజైన్ చేసింది, తయారుచేసింది భారత్‌లోనే అని.. దాంట్లో ఉన్న కృత్రిమ మేధ కూడా భారత్‌దేనని స్పష్టం చేశారు. ఈ కళ్లజోడు ప్రత్యేకతల విషయానికి వస్తే.. అది ఎదురుగా ఉన్న దృశ్యాలను చూసి అర్థం చేసుకోగలదు. కావాలంటే ఆ దృశ్యాలను రికార్డు కూడా చేయగలదు. మనం అడిగిన ప్రశ్నలు అర్థం చేసుకుని స్పందించి సమాధానమివ్వగలదు. మనం అడిగిన సమాచారాన్ని నెట్‌లో వెతికి చెప్పగలదు. మన ఎదురుగా ఉన్న వస్తువులను లేదా సమాచారాన్ని గుర్తుపట్టి వివరాలు అడిగితే ఇవ్వగలదు. అన్నిటికంటే ముఖ్యంగా.. పలు భారతీయ భాషలను అప్పటికప్పుడే (రియల్‌టైమ్‌లో) మనకు కావాల్సిన భాషలోకి అనువదించగలదు! ఉదాహరణకు.. ఈ కళ్లజోడు ధరించి మనం చెన్నైకో, కోయంబత్తూరుకో వెళ్లామనుకోండి. అక్కడ వాళ్లు మాట్లాడే తమిళ భాషను ఎంచక్కా మన తెలుగులోకి మార్చి వినిపిస్తుంది. మనం దానికి మాటల ద్వారా ఆజ్ఞలు జారీచేయొచ్చు. దీంట్లో చాట్ ఫీచర్ కూడా త్వరలోనే అందుబాటులోకి రానుంది. అంటే.. మొబైల్‌లో సర్వం యాప్ ద్వారా రాతపూర్వకంగా కూడా ఈ కళ్లజోడుకు మనం కమాండ్స్ ఇవ్వొచ్చు. దీనికి ఉన్న అసలైన ప్రత్యేకత ఏంటంటే.. ఈ పనులన్నీ ఇది ఆఫ్‌లైన్‌లో కూడా చేయగలదు. 'సర్వం ఎడ్జ్' అనే మినీ బ్రెయిన్‌ని 'సర్వం ఏఐ' సంస్థ ఈ కళ్లజోడులో అమర్చింది. అది పనిచేయడానికి ఇంటర్‌నెట్ అక్కర్లేదు. 'కేజ్' అంటే జపనీస్‌లో 'గాలి' అని అర్థం. 'గాలి'లా సర్వాంతర్యామిలా పనిచేస్తుంది కాబట్టే సర్వం ఏఐ సంస్థ ఈ కళ్లజోడుకు 'సర్వం కేజ్' అనే పేరు పెట్టింది. ఈ కళ్లజోడును మే నెలలో మార్కెట్లోకి తేనున్నట్టు తెలిపింది.


సర్కారు ఏఐ మిషన్‌లో భాగంగానే..

చాట్‌జీపీటీ, జెమినై వంటి ఏఐ మోడళ్లను వాడేటప్పుడు.. మన వివరాలు, మనం వాటిలోకి అప్‌లోడ్ చేసే ఫొటోలు.. అన్నీ విదేశీ సర్వర్లలోకి వెళ్తాయి. ఆ ప్రమాదం లేకుండా దేశీయంగా వాటికి దీటుగా కృత్రిమ మేధ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో 2024లో కేంద్ర ప్రభుత్వం రూ.10,372 కోట్లతో 'ఇండియన్ ఏఐ మిషన్'ను ప్రారంభించిన సంగతి తెలిసిందే. ఈ మిషన్‌లో భాగంగానే సర్వం ఏఐ ఈ కళ్లజోడును తయారు చేసింది. ఈ మిషన్ కోసం ప్రభుత్వం మన స్టార్టప్‌ల కోసం 38 వేలకు పైగా జీపీయూలను సమకూర్చింది.

25 ఏళ్ల తర్వాత ఉద్యోగాల అవసరం ఉండదు: వినోద్ ఖోస్లా

మరో పాతికేళ్లలో ప్రజలెవరికీ ఉద్యోగం చేయాల్సిన అవసరం ఉండదని టెక్ దిగ్గజం వినోద్ ఖోస్లా అంచనా వేశారు. అప్పటికి అన్ని రంగాల్లో ఏఐ వేగంగా దూసుకెళ్తుందని చెప్పారు. మంగళవారం ఆయన ఏఐ ఇంపాక్ట్ సదస్సులో మాట్లాడారు. 2050 నాటికి ఉద్యోగాల విషయంలో ఒక స్పష్టత వస్తుందని అన్నారు. ఐదేళ్లలో ఐటీ, బీపీవో వైట్ కాలర్ ఉద్యోగాలు అదృశ్యం అవుతాయని పునరుద్ఘాటించారు. ఐటీ ఉద్యోగాల మీద ఎక్కువగా ఆధారపడుతున్న భారత్ మీద దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెప్పారు. ఒక ఐటీ కంపెనీలో ఎవరైనా 15-20 ఏళ్లుగా పని చేస్తున్నట్లయితే వాళ్లను వెంటనే తీసేయొచ్చని అన్నారు. దేశ ప్రయోజనాలను కాపాడుకోవడానికి సావరిన్ ఏఐ మోడల్స్‌ను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఖోస్లా చెప్పారు. అందుకే సర్వంలో తాను పెట్టుబడులు పెట్టానన్నారు.

లోకం తీరు



డేటా సెంటర్లపై అదానీ గ్రూప్ 9 లక్షల కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: ప్రముఖ పారిశ్రామిక సంస్థ అదానీ గ్రూప్ ఏఐ రంగంలో భారీ పెట్టుబడి పెట్టనున్నట్లు మంగళవారం ప్రకటించింది. పునరుత్పాదక ఇంధనంతో నడిచే భారీ డేటా సెంటర్ల అభివృద్ధికి 2035 నాటికి రూ.9 లక్షల కోట్లు (100 బిలియన్ డాలర్లు) పెట్టుబడి పెడతామని వెల్లడించింది. ఈ పెట్టుబడులతో దేశంలో సర్వర్ల తయారీ, క్లౌడ్ ప్లాట్‌ఫామ్స్, ఇతర అనుబంధ రంగాల్లో మరో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చే అవకాశం ఉందని పేర్కొంది. మొత్తంగా రాబోయే దశాబ్దకాలంలో ఏఐ మౌలిక సదుపాయాల వ్యవస్థకు రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు వస్తాయని తెలిపింది. తద్వారా ఏఐ రంగంలో భారత్ నాయకత్వ స్థానంలో నిలవనుందని అదానీ అన్నారు. కాగా, అదానీకానెక్స్‌కు ఇప్పటికే 2 గిగావాట్ల సామర్థ్యం కలిగిన డేటా సెంటర్ ఉంది. దీన్ని 5 గిగావాట్ల సామర్థ్యానికి పెంచాలని కంపెనీ లక్ష్యంగా పెట్టుకుంది. ఇందు కోసం గూగుల్‌తో కలిసి విశాఖపట్నం, నోయిడాల్లోనూ, మైక్రోసాఫ్ట్‌తో కలిసి హైదరాబాద్, పుణెల్లో డేటా సెంటర్లను ఏర్పాటు చేస్తోంది.

ప్రతి పౌరుడికీ ఏఐ: పెమ్మసాని

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): దేశంలోని ప్రతి గ్రామానికి ఇంటర్నెట్ కనెక్టవిటీ ఉండేలా చేసి, ప్రతి పౌరుడు కృత్రిమ మేధ(ఏఐ) వినియోగించుకునేలా చేయడమే భారత ప్రభుత్వ లక్ష్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. ఏఐ ఆధారిత భారత్ నిర్మాణానికి సాంకేతిక అనుసంధానత(డిజిటల్ కనెక్టివిటీ)నే ప్రధాన మౌలిక సదుపాయమని తెలిపారు. 2014లో 6 కోట్ల మంది ఉన్న బ్రాడ్‌బ్యాండ్ వినియోగదారులు, 2025 నాటికి 100 కోట్లకు చేరడం దేశ డిజిటల్ ప్రగతికి నిదర్శనమని చెప్పారు. ఇండియా ఏఐ మిషన్ కోసం ప్రభుత్వం రూ. 10,372 కోట్లు కేటాయించినట్లు తెలిపారు.

సోషల్ మీడియా వినియోగంపై వయసుల వారీ నియంత్రణలు

▸▸ చట్టం చేయడంపై కంపెనీలతో చర్చిస్తున్నాం

▸▸ కేంద్ర ఐటీ మంత్రి అశ్వనీ వైష్ణవ్ వెల్లడి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: సోషల్ మీడియా వినియోగం విషయంలో వయసుల వారీగా నియంత్రణలు పెట్టే అంశాన్ని సోషల్ మీడియా వేదికలతో చర్చిస్తున్నట్లు కేంద్ర ఐటీ మంత్రి అశ్వనీ వైష్ణవ్ ప్రకటించారు. మంగళవారం ఆయన ఏఐ ఇంపాక్ట్ సదస్సు జరుగుతున్న ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో డీప్‌ఫేక్ పోస్టుల మీద, వయసుల వారీ నియంత్రణల మీద ఏం చేయాలనే దాని మీద సోషల్ మీడియా సంస్థలతో చర్చలు జరుగుతున్నాయని చెప్పారు. 140 కోట్ల మంది జనాభా ఉన్న భారతదేశంలో సోషల్ మీడియాపై ఎలాంటి నియంత్రణలు వచ్చినా అది మెటా, గూగుల్ లాంటి సంస్థలపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ఇప్పటికే ఆస్ట్రేలియా, డెన్మార్క్, స్పెయిన్ దేశాలు 16 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించే దిశగా చర్యలు తీసుకున్నాయి. ఈ దేశాలలో 13 ఏళ్లలోపు పిల్లలకు సోషల్ మీడియా ఖాతా అనుమతించరు. 13-16 వయసు పిల్లలకు తల్లిదండ్రుల పర్యవేక్షణలో అనుమతిస్తారు. కొత్త వాళ్లకు మెసేజ్ చేసే అవకాశం ఉండదు. టార్గెటెడ్ యాడ్స్ ఉండవు. ఇదిలా ఉండగా, వారం రోజుల్లో భారత్‌కు 20,000 జీపీయూల డేటా స్టోరేజీ అందుబాటులోకి వస్తుందని మంత్రి తెలిపారు. ఇప్పటికే 38,000 జీపీయూ అందుబాటులో ఉందని తెలిపారు. వచ్చే రెండేళ్లలో భారత్‌లో రూ.18 లక్షల కోట్లు ఏఐ రంగంలో పెట్టుబడులు వస్తాయన్నారు. ఏఐ ఇంపాక్ట్ సమిట్ తొలి రోజు అతిథులకు ఇబ్బందులు తలెత్తడంపై అశ్విని వైష్ణవ్ క్షమాపణలు చెప్పారు. సోమవారం కార్యక్రమానికి 70 వేల మంది వచ్చారని తెలిపారు. మిగిలిన రోజుల్లో ఇబ్బందులు లేకుండా చూస్తామన్నారు. ఇదిలా ఉండగా, ఏఐ అధీకృత సమాచారం కోసం సంప్రదాయ మీడియా సంస్థల మీద ఆధారపడుతోందని, కాబట్టి ఏఐ సంస్థలు మీడియా సంస్థలకు తన ఆదాయం నుంచి కొంత పరిహారం ఇవ్వాలని అశ్వనీ వైష్ణవ్ సూచించారు. సమాచార సేకరణలో సంప్రదాయ మీడియా ఎంతో శ్రమిస్తోందన్నారు.

ఎవరెస్ట్ ఎత్తుకు 'రక్షణ' బంధం

(మొదటిపేజీ తరువాయి)

నేతలు అభివర్ణించారు. మంగళవారం ముంబైలోని మహారాష్ట్ర లోక్‌భవన్‌లో ప్రధాని మోదీ, మేక్రాన్, విదేశాంగ మంత్రి జైశంకర్, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, ఫ్రాన్స్ రక్షణ అధికారులు భేటీ అయి ద్వైపాక్షిక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ, మేక్రాన్ ఇద్దరూ కలిసి కర్ణాటకలోని వేమగల్‌లో ఏర్పాటు చేస్తున్న టాటా-ఎయిర్‌బస్ సంస్థల సంయుక్త 'హెచ్125 లైట్ యుటిలిటీ హెలికాప్టర్ ఫైనల్ అసెంబ్లింగ్ యూనిట్'ను వర్చువల్‌గా ప్రారంభించారు. అనంతరం సంయుక్తంగా మీడియా సమావేశంలో మాట్లాడారు.

నాలుగోసారి భారత్‌కు..

మేక్రాన్ ఫ్రాన్స్ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత నాలుగో సారి భారత్‌కు వచ్చారు. ఈసారి 3 రోజుల పర్యటన నిమిత్తం మంగళవారం తెల్లవారుజామునే ముంబైకి చేరుకున్న ఆయన.. తీరంలోని మెరైన్ డ్రైవ్ ప్రాంతంలో జాగింగ్ చేశారు. అనంతరం తన సతీమణి బ్రిగిట్టేతో కలిసి తాజ్‌మహల్ ప్యాలెస్ హోటల్ సమీపంలోని స్మారకం వద్ద 26/11 ముంబై ఉగ్రదాడి మృతులకు నివాళి అర్పించారు. అనంతరం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. మేక్రాన్ గురువారం ఢిల్లీలో ఏఐ ఇంపాక్ట్ సదస్సులో పాల్గొననున్నారు.

21 ఒప్పందాలు.. హెలికాప్టర్లు, క్షిపణులు..

ప్రధాని మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ భేటీ సందర్భంగా ఇరు దేశాల మధ్య సహకారానికి సంబంధించి 21 ఒప్పందాలు, అవగాహనా పత్రాలపై సంతకాలు జరిగాయి. ఆ ఒప్పందాల ప్రకారం ఇరుదేశాల రక్షణ సహకార ఒప్పందాన్ని పదేళ్లు పొడిగించారు.

- ఎయిర్‌బస్ హెచ్125 హెలికాప్టర్లను కర్ణాటకలోని వేమగల్‌లో ఏర్పాటు చేస్తున్న టాటా-ఎయిర్‌బస్ ప్లాంట్‌లో ఉత్పత్తి చేయనున్నారు. ప్రతికూల వాతావరణాన్ని సమర్థవంతంగా తట్టుకుని, ఎవరెస్ట్ శిఖరం వరకు కూడా చేరుకోగల సామర్థ్యం ఈ యుటిలిటీ హెలికాప్టర్ సొంతం. దీనిని భారత్‌లో ఉత్పత్తి చేయడమేగాకుండా విదేశాలకు విక్రయించేందుకూ తాజా ఒప్పందం వీలుకల్పించనుంది. 2027 మార్చి నాటికి తొలి మేడిన్ ఇండియా హెచ్-125 హెలికాప్టర్‌ను డెలివరీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.
- అత్యంత కచ్చితత్వంతో లక్ష్యాలను ఛేదించగల హ్యామర్ క్షిపణులను కూడా భారత్‌లో ఉత్పత్తి చేయడానికి ఒప్పందం కుదిరింది. ఇందుకోసం హ్యామర్ క్షిపణులను అభివృద్ధి చేసిన ఫ్రెంచ్ సంస్థ సాఫ్రాన్, భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీఈఎల్) ఉమ్మడి సంస్థను ఏర్పాటు చేయనున్నాయి. రఫేల్ యుద్ధ విమానాల నుంచి ప్రయోగించగలిగే ఈ హ్యామర్ క్షిపణుల సామర్థ్యం గరిష్ఠంగా 70 కిలోమీటర్లు.
- ఇరుదేశాల మధ్య పెట్టుబడులను ప్రోత్సహించేందుకు వీలుగా.. ఇరువైపులా పన్ను (డబుల్ ట్యాక్సేషన్) లేకుండా ఒప్పందం కుదిరింది.
- ఆరోగ్య రంగంలో కృత్రిమ మేధ, డిజిటల్ సైన్స్ అండ్ టెక్నాలజీ, విమానయాన రంగాల్లో పరస్పర సహకారం కోసం ప్రత్యేక ఇండో-ఫ్రెంచ్ సెంటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.



ముంబైలో రోడ్లపై జాగింగ్ చేస్తున్న ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్

- ఇక 'ఇండియా-ఫ్రాన్స్ సృజనాత్మక సంవత్సరం' పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని ప్రధాని మోదీ, మేక్రాన్ ప్రారంభించారు. రెండు దేశాల ఆవిష్కరణలను సమన్వయం చేసేందుకు 'ఇండో-ఫ్రెంచ్ ఇన్నోవేషన్ నెట్‌వర్క్'ను ఏర్పాటు చేస్తారు.
- 'ఇన్నోవేషన్ ఇయర్' కార్యక్రమంలో భాగంగా హైదరాబాద్‌కు చెందిన ధ్రువ స్పేస్, కర్ణాటకకు చెందిన పిక్సెల్ స్పేస్ సంస్థలు ఫ్రాన్స్ అంతరిక్ష సంస్థ ఎక్సోట్రెయిల్‌తో ఒప్పందం కుదుర్చుకున్నాయి. ధ్రువ, పిక్సెల్ సంస్థలు ప్రయోగించే ఉపగ్రహాలకు అవసరమైన ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ వ్యవస్థలను ఎక్సోట్రెయిల్ సరఫరా చేయనుంది.

ప్రస్తుతం అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నాయని.. ఇలాంటి సమయంలో భారత్-ఫ్రాన్స్ భాగస్వామ్యం ప్రపంచ స్థిరత్వానికి దోహదం చేస్తుందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. "భారత్-ఫ్రాన్స్ మధ్య భాగస్వామ్యానికి ఎలాంటి సరిహద్దులూ లేవు. సముద్రపు లోతుల నుంచి ఎత్తయిన పర్వత శిఖరాల వరకు ఈ భాగస్వామ్యం విస్తరించగలదు. హెచ్-125 హెలికాప్టర్ల ఉమ్మడి తయారీ అంశం ఇరు దేశాల మధ్య లోతైన నమ్మకానికి చిహ్నం" అని మోదీ చెప్పారు. ఫ్రాన్స్‌కు భారత్ అత్యంత విశ్వసనీయమైన భాగస్వామి అని మేక్రాన్ పేర్కొన్నారు.

రఫేల్ ఒప్పందంపై వెలువడని ప్రకటన

ఫ్రాన్స్ నుంచి 114 రఫేల్ ఫైటర్ల కొనుగోలు ప్రతిపాదనలకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని 'రక్షణ కొనుగోళ్ల మండలి (డీఏసీ)' ఇటీవలే ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే. సుమారు రూ.3.6 లక్షల కోట్ల విలువైన ఈ ఒప్పందంపై మంగళవారమే ప్రకటన వెలువడుతుందని భావించారు. కానీ రాలేదు. బుధ, గురువారాల్లోనూ మేక్రాన్ భారత్‌లోనే పర్యటించనున్నారు. గురువారం ఢిల్లీలో ప్రధాని మోదీతో భేటీకానున్నారు. అక్కడ దీనిపై ప్రకటన రావొచ్చని చెబుతున్నారు.

వేమగల్‌లో టాటా-ఎయిర్‌బస్ యూనిట్

బెంగళూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కోలారు జిల్లా వేమగల్‌లో టాటా-ఎయిర్‌బస్ యూనిట్‌ను ప్రధాని మోదీ, ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ వర్చువల్‌గా ప్రారంభించగా.. వేమగల్‌లో జరిగిన కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్, విమానయాన మంత్రి రామ్మోహన్, ఫ్రాన్స్ రక్షణ మంత్రి కేథరిన్ పాల్గొన్నారు. ఇక్కడ హెచ్125తోపాటు మిలిటరీకి అవసరమైన హెచ్125ఎం హెలికాప్టర్లనూ తయారు చేయనున్నారు.

ఏఐపై కఠిన నియంత్రణ ఉండాలి

▸▸ ఏఎన్ఐ ఇంటర్వ్యూలో ప్రధాని మోదీ




న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: నానాటికీ విస్తృతంగా వినియోగంలోకి వస్తున్న కృత్రిమ మేధ దుర్వినియోగానికి గురవుతుండడంపైన.. డీప్‌ఫేక్ వీడియోలపైన ప్రధాని మోదీ ఆందోళన వ్యక్తం చేశారు. అలా జరగకుండా ఉండడానికి భారత్ కఠిన నియంత్రణ చర్యలు తీసుకుంటోందని ఆయన పేర్కొన్నారు. ఏఐ సాయంతో సృష్టించిన కంటెంట్‌కు అది కృత్రిమమేధతో తయారైందన్న విషయం తెలిసేలా వాటర్ మార్కింగ్ వేసేలా నిబంధనలు విధించడం, డేటా రక్షణను మరింత మెరుగుపరచడం, విలువలతో కూడిన, బాధ్యతాయుతమైన ఏఐ వినియోగాన్ని ప్రోత్సహించడానికి 'ఇండియా ఏఐ సేఫ్టీ ఇన్‌స్టిట్యూట్'ను స్థాపించడం వంటి చర్యలన్నీ అందులో భాగమేనని మోదీ వెల్లడించారు. ఢిల్లీలో జరుగుతున్న ఏఐ సమ్మిట్ నేపథ్యంలో ఏఎన్ఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రధాని కృత్రిమ మేధకు సంబంధించిన పలు అంశాలపై మాట్లాడారు. సాంకేతిక పరిజ్ఞాన అంతిమ లక్ష్యం, సాంకేతిక పురోగమనం మానవాళి సేవకేగానీ, దాన్ని పక్కకు తప్పించడానికి కాదని.. అందుకే ఈ సదస్సుకు 'సర్వజన హితాయ-సర్వజన సుఖాయ' అనే ఇతివృత్తాన్ని ఎంచుకున్నామని పేర్కొన్నారు. ఇంటర్వ్యూలో కొన్ని ముఖ్యాంశాలు ఆయన మాటల్లోనే..

- ❖ వికసిత భారత్ లక్ష్యం దిశగా మా పయనం వేగం పుంజుకోవడంలో కృత్రిమ మేధ ఒక పరిణామశీల అవకాశానికి ప్రతీక. ఏఐతో పలు పెను సవాళ్ల పరిష్కారం సులభం కాగలదు. ఇది సరికొత్త ఆర్థిక అవకాశాలను పూర్తిస్థాయిలో సృష్టించగలదు. కృత్రిమ మేధతో అంతరాలు పెరుగుతాయని ప్రపంచం ఆందోళన చెందుతోందిగానీ.. భారత్ మాత్రం అంతరాలను రూపుమాపడానికి 'ఏఐ'ని వాడుతోంది.
- ❖ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు సరిగ్గా చేర్చడం, మోసాలను గుర్తించడం, మౌలిక సదుపాయాల ముందస్తు నిర్వహణ, పట్టణ ప్రణాళిక, ప్రభుత్వ వ్యవస్థల్లో పారదర్శకతను పెంపొందించడంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తుంది.
- ❖ భారతదేశ ఐటీ రంగం మన సేవల ఎగుమతులకు వెన్నెముకగా ఉండటమే కాకుండా ఆర్థిక వృద్ధికి కీలక చోదక శక్తిగా నిలుస్తోంది. ఈ రంగానికి ఏఐ అద్భుతమైన అవకాశాలను అందించడంతోపాటు.. సవాళ్లనూ సంధిస్తోంది. అయితే, ఐటీ రంగాన్ని ఏఐ భర్తీ చేయడం లేదు.. దాన్ని రూపాంతరం చెందేలా చేస్తోంది.
- ❖ ఏఐ మానవ సామర్థ్యాలను మెరుగుపరచొచ్చు. కానీ నిర్ణయాధికారానికి సంబంధించిన తుది బాధ్యత మాత్రం మానవుల దగ్గరే ఉండాలి. డీప్‌ఫేక్ వీడియోల తయారీ, నేరాలు, ఉగ్రవాద కార్యకలాపాలకు ఏఐను వాడడంపై కఠినమైన నిషేధాలు ఉండాలి.
- ❖ ఉద్యోగ మార్కెట్లో ఏఐ ప్రభావం గురించి మన యువత ఆందోళనను నేను అర్థం చేసుకున్నాను. భయానికి ఉత్తమ విరుగుడు సన్నద్ధతే. అందుకే ఏఐ ఆధారిత భవిష్యత్తు కోసం మన ప్రజల నైపుణ్యాలను మెరుగుపరచడం కోసం విరివిగా పెట్టుబడులు పెడుతున్నాం.

ఎప్‌స్టీన్ బాధితుల్లో భారతీయ బాలిక!

▸▸ ఎప్‌స్టీన్ ఈ-మెయిల్స్ సంభాషణలో వెల్లడి



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17: ఎప్‌స్టీన్ లైంగిక నేరాల బాధితుల్లో భారత్‌కు చెందిన ఓ బాలిక కూడా ఉందని తాజాగా వెల్లడైంది. 'ఎప్‌స్టీన్' ఫైల్స్‌లోని ఈ-మెయిల్స్ ద్వారా ఈ విషయం బయటకు వచ్చింది. బాధితుల ఫండ్ నుంచి ఆమెకు పరిహారం అందించేందుకు, సదరు బాధితురాలు ఎక్కడ ఉందనే విషయంపై అమెరికా అధికారుల ఓ ఈ-మెయిల్‌లో చర్చ జరిగింది. సదరు బాధిత బాలిక ఆచూకీ కోసం భారతీయ రాయబార కార్యాలయంతో సంప్రదింపులు చేయడంపై కూడా అధికారులు మాట్లాడుకున్నారు. 'భారత్‌లో ఉన్న వ్యక్తి అడ్రస్, సమాచారాన్ని మీరు ఇవ్వగలిగితే.. నేను అక్కడి రాయబార కార్యాలయంలోని మా సహోద్యోగులతో సమన్వయం చేసుకుంటాను. మీకు ఏవైనా అదనపు ప్రశ్నలు ఉంటే, దయచేసి నాకు కాల్ చేయండి' అని ఆ మెయిల్‌లో రాసి ఉంది. ఈ మెయిల్‌ను పంపిన, స్వీకరించిన వారి పేర్లను ఫైల్స్‌లో అస్పష్టంగా ఉంచారు. అయితే 'ఎప్‌స్టీన్ బాధితులు' అనే సబ్జెక్టు పేరుతో ఉన్న 2020 జనవరి 12న నాటి ఈ మెయిల్‌లో జరిగిన కమ్యూనికేషన్ విధానాన్ని పరిశీలిస్తే.. అది అమెరికా అధికారుల మధ్య జరిగినట్లు తెలుస్తోంది. కాగా, ఇప్పటికే కేంద్ర మంత్రి హర్దీప్ పురీ పేరు ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో దర్శనమివ్వగా.. కేంద్ర మాజీ మంత్రి హర్షవర్ధన్ పేరు కూడా కనిపించడం చర్చనీయాంశంగా మారింది. గతంలో కేంద్ర మంత్రిగా ఉన్న హర్షవర్ధన్‌తో భేటీ కావడంపై ఎప్‌స్టీన్, బిల్‌గేట్స్ మధ్య 2014లో సంభాషణ జరిగింది.

ఎప్‌స్టీన్‌తో 14 సార్లు పురీ భేటీ: కాంగ్రెస్

'ఎప్‌స్టీన్ ఫైల్స్' అంశంపై హర్దీప్ పురీ అబద్ధాలు చెబుతున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. ఎప్‌స్టీన్‌కు, పురీ మధ్య 2014, 2017 మధ్యకాలంలో 62 ఈ-మెయిల్ సంభాషణలు జరిగాయని, 14సార్లు సమావేశమయ్యారని పేర్కొంది. వారు ఏం మాట్లాడుకున్నారనే దానిపై స్పష్టత ఇవ్వాలంది. కేంద్ర మంత్రి పదవికి పురీ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది.

బంగ్లా ప్రధానిగా తారిఖ్ రెహమాన్ ప్రమాణ స్వీకారం

▸▸ కొత్త ప్రభుత్వంలో ఓ హిందూ మంత్రి!



తారిఖ్‌కు ఓం బిర్లా శుభాకాంక్షలు

ఢాకా, ఫిబ్రవరి 17: బంగ్లాదేశ్ నూతన ప్రధానిగా తారిఖ్ రెహమాన్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి భారత్ తరఫున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ హాజరయ్యారు. గత 35 ఏళ్లుగా బంగ్లాదేశ్‌ను మహిళా ప్రధానులే పాలిస్తూ వచ్చారు. మాజీ ప్రధాని ఖలిదా జియా వారసుడిగా సుదీర్ఘ కాలం తర్వాత ఆ దేశపగ్గాలు చేపట్టిన పురుష ప్రధానిగా రెహమాన్ నిలిచారు. ప్రస్తుతం దేశం ఎదుర్కొంటున్న ఆర్థిక సంక్షోభం, ప్రజాస్వామ్య వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టడమే తనముందున్న ప్రధాన లక్ష్యమని తారిఖ్ స్పష్టం చేశారు. 50మంది సభ్యులతో ఏర్పాటుచేసిన క్యాబినెట్‌లో.. బీఎన్‌పీ వైస్ చైర్మన్ నితాయ్ రాయ్ చౌదరి ఏకైక హిందూ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. కాగా, బంగ్లాదేశ్ ప్రభుత్వ బాధ్యతల నుంచి తప్పుకొంటూ యూనస్.. భారత ఈశాన్య రాష్ట్రాలను ప్రత్యేక దేశం అనే అర్థం వచ్చేలా వివాదస్పద వ్యాఖ్యలు చేశారు.

పదవీ విరమణ వయసు పెంపులో వివక్ష ఎందుకు?

- స్వయంగా కోర్టుకు హాజరై వివరణ ఇవ్వండి: హైకోర్టు
- వ్యవసాయశాఖ ప్రత్యేక సీఎస్ బుడితి రాజశేఖర్‌కు ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాశాఖ పరిధిలోని యూనివర్సిటీలలో పనిచేస్తున్న ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసును 62 నుంచి 65కి పెంచిన రాష్ట్ర ప్రభుత్వం, ఉద్యానవన, వెటర్నరీ, ఫిషరీస్ యూనివర్సిటీలు, ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీల్లోని ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసును పెంచకపోవడాన్ని హైకోర్టు ధర్మాసనం ఆక్షేపించింది. ఉన్నత విద్య, వ్యవసాయ యూనివర్సిటీలలో పనిచేస్తున్న ప్రొఫెసర్ల మధ్య ఎందుకు వివక్ష చూపిస్తున్నారని ప్రశ్నించింది. అన్ని అర్హతలు ఉండి, యూజీసీ స్కేల్ తీసుకుంటున్న ప్రొఫెసర్ల పదవీ విరమణ వయసును ఎందుకు పెంచడం లేదని నిలదీసింది. స్వయంగా తమ ముందు హాజరై ఈ వ్యవహారంపై వివరణ ఇవ్వాలని వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్‌ను ఆదేశించింది. విచారణను ఈనెల 23వ తేదీకి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ మండవ కిరణ్మయితో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

'బీసీ సింహగర్జన'పై వివరాలు సమర్పించండి

- పోలీసులకు హైకోర్టు ఆదేశం.. విచారణ రేపటికి వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): బీసీ సింహగర్జన బహిరంగ సభకు అనుమతిచ్చేలా పోలీసులను ఆదేశించాలని కోరుతూ బీసీవై(భారత చైతన్య యువజన) పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ జరిపింది. ఈ వ్యవహారంపై వివరాలు సమర్పించాలని పోలీసులను ఆదేశించింది. విచారణను ఈనెల 19వ తేదీకి వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వై.లక్ష్మణరావు మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా ఈ నెల 22న మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు బీసీ సింహగర్జన సభ నిర్వహించాలని తాను తలపెట్టినట్టు రామచంద్రయాదవ్ సోమవారం హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. సభ నిర్వహణకు అనుమతి కోరుతూ పలుమార్లు వినతులు సమర్పించామని, పోలీసుల నుంచి ఎలాంటి స్పందనా లేదని పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ కోర్టు దృష్టికి తెచ్చారు. రాజకీయపార్టీ బహిరంగ సభ నిర్వహణకు అనుమతి ఇవ్వకపోవడం ప్రాథమిక హక్కును హరించడమే అవుతుందన్నారు. కాగా, పిటిషనర్ వినతులపై పోలీసులు ఏమి చర్యలు తీసుకున్నారో వివరాలు తెప్పించుకొని కోర్టు ముందు ఉంచుతామని పోలీసుల తరఫున సహాయ ప్రభుత్వ న్యాయవాది అజయ్ తెలిపారు. ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి విచారణను గురువారానికి వాయిదా వేశారు.

జేఈఈ ఫలితాల్లో ఆదిత్య విద్యార్థుల ప్రతిభ

కాకినాడ రూరల్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్-2026 ఫలితాల్లో ఆదిత్య విద్యార్థులు ప్రతిభ కనబరచారని విద్యాసంస్థల ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి తెలిపారు. జాతీయస్థాయిలో 10 మంది విద్యార్థులు 99.9 పర్సంటైల్‌పైన, 41 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ పైన సాధించారని చెప్పారు. ఎన్.శ్రీసాయి వైభవ్ ఓపెన్ కేటగిరిలో 99.99, వీవీఎస్ఎస్ రాఘవరావు, గంజి శ్రీజన్ 99.98 పర్సంటైల్, బుడి శ్రీరామ్ 99.97, సత్యం భువనచంద్ర 99.96 పర్సంటైల్ పొందారన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరచి అత్యుత్తమ పర్సంటైల్ సాధించిన విద్యార్థులను ఛైర్మన్ ఎన్.శేషారెడ్డి, కార్యదర్శి ఎన్.కృష్ణదీపక్‌రెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ లక్ష్మీరాజ్యం, డైరెక్టర్లు శృతి, సుగుణ అభినందించారు.

జేఈఈ టాపర్‌కు గౌతం ఎడ్యుకేషనల్ సొసైటీ అభినందనలు


మోహిత్

హైదరాబాద్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్ ఫలితాల్లో వంద పర్సంటైల్ సాధించిన పి.మోహిత్ తమ పాఠశాల పూర్వ విద్యార్థి అని డాక్టర్ కేకేఆర్ గౌతమ్ విద్యా సంస్థ తెలిపింది. పూర్తి మార్కులు సాధించిన అతడిని కళాశాల ప్రిన్సిపాల్ అభినందించారు. దేశవ్యాప్తంగా 12 మంది మాత్రమే 300/300 పూర్తి మార్కులు సాధించగా, వీరిలో పి.మోహిత్ ఉండటం తమ విద్యాసంస్థతోపాటు రాష్ట్రానికీ గర్వకారణమని డాక్టర్ కేకేఆర్ గౌతమ్ విద్యాసంస్థ ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ స్థాయి పోటీ పరీక్షలు జేఈఈ, నీట్‌లతో తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు జాతీయస్థాయి టాపర్లుగా నిలుస్తున్నారని అన్నారు.

ప్రమాదకర స్థితిలో దేశ ఆర్థిక వ్యవస్థ

- వడ్డీ చెల్లింపునకు రూ.14 లక్షల కోట్లు
- మన దేశాన్ని అమెరికా కాళ్ల వద్ద పెట్టిన ఘనత మోదీకే దక్కుతుంది: రామకృష్ణ
- సమస్యలను గాలికొదిలి... లడ్డూపై కొట్లాట సరికాదు: ఈశ్వరయ్య


మీడియాతో మాట్లాడుతున్న రామకృష్ణ

కాకినాడ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): 'దేశంతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత ప్రమాదకర స్థితిలో ఉంది. దేశ ప్రయోజనాలు దెబ్బతినేలా మోదీ సర్కారు అమెరికా వంటి దేశాలు చెప్పినట్టు చేస్తూ, వారికి ఊడిగం చేస్తోంది' అని సీపీఐ జాతీయ కార్యదర్శి వర్గ సభ్యుడు కె.రామకృష్ణ అన్నారు. సీపీఐ రాష్ట్ర సమితి కార్యవర్గ సమావేశం రెండో రోజు మంగళవారం కాకినాడ సూర్యకళా మందిర్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'దేశ ప్రయోజనాలు దెబ్బతినేలా, వ్యవసాయానికి తీవ్ర నష్టం చేసేలా మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. అమెరికా నుంచి దిగుమతి చేసుకునే వ్యవసాయ ఉత్పత్తులకు సుంకం లేకుండా అనుమతిచ్చి, రైతులను, రైతు ఉత్పత్తులను నాశనం చేస్తోంది. మనదేశ నిర్ణయాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటనలు చేస్తున్నా ప్రధాని మోదీ ఖండించకపోవడం దారుణం. మనదేశాన్ని అమెరికా కాళ్లవద్ద పెట్టిన ఘనత ఆయనకే దక్కుతుంది. కేంద్ర బడ్జెట్ రూ.53 లక్షల 40 వేల కోట్లతో ప్రవేశపెట్టారు. అందులో రూ.14 లక్షల కోట్లు వడ్డీ చెల్లింపునకు కేటాయించడం చూస్తే దేశ ఆర్థిక పరిస్థితి ఎంతలా దిగజారిందో అర్థమవుతుంది. ఉపాధి హామీ పథకం పేరు మార్చి, నిరుపేద కూలీలతో ఆటలాడుతోన్న మోదీ సర్కారు తీరుకు నిరసనగా 25, 26 తేదీల్లో అనంతపురం జిల్లా బండ్లపల్లిలో ఆందోళన చేపడతాం' అని రామకృష్ణ తెలిపారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ, 'రాష్ట్రంలో ప్రజా సమస్యలను గాలికొదిలి.. కూటమి పాలకులు, వైసీపీ నేతలు లడ్డూ పేరుతో రాజకీయాలు చేస్తున్నారు. కల్తీ జరిగిందని నివేదిక వస్తే, బాధ్యులపై, అక్రమంగా రూ.కోట్లు దోపిడీ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోకుండా ఇరువర్గాలు వాదోపవాదనలకు దిగడం ఎంతవరకు సమంజసం? హిందువుల మనోభావాలు దెబ్బతినేలా టీడీపీ, బీజేపీ, జనసేన, వైసీపీ ప్రవర్తిస్తున్నాయి' అని విమర్శించారు.

కొడుకును కొడుతుంటే అడ్డుగా వెళ్లి... తల్లి బలి

- రెండు కుటుంబాల మధ్య ఘర్షణకు దారితీసిన వివాహేతర సంబంధం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): వివాహేతర సంబంధం రెండు కుటుంబాల మధ్య గొడవకు దారితీసింది. ఈ క్రమంలో కుమారుడిపై దాడిని అడ్డుకునేందుకు వెళ్లిన తల్లి ప్రాణాలు కోల్పోయింది. అనంతపురం నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన మేరకు, అనంతపురం నగరంలోని కొవ్వూరు నగర్‌కు చెందిన ఇమ్రాన్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు. వర్క్ ఫ్రం హోం చేస్తున్నాడు. ఇతని కుటుంబానికి, పక్కింటి వారి మధ్య సోమవారం రాత్రి ఘర్షణ జరిగింది. ఇమ్రాన్‌పై దాడిచేసి కొడుతుండగా అతని తల్లి గౌసియా(59) అడ్డుకునేందుకు ప్రయత్నించింది. ఈ సందర్భంలో ఆమెపై కూడా దాడి చేయడంతో స్పృహ తప్పి పడిపోయింది. కుటుంబ సభ్యులు ఆమెను జిల్లా సర్వజన వైద్యశాలకు తరలించగా, అప్పటికే ఆమె మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఇమ్రాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఐదుగురిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మార్కుల్లో తేడా వస్తే

టీచర్లకు జరిమానా

రూ. 1,500 నుంచి రూ. 4 వేలు వరకు ఫైన్.. టెన్త్ మూల్యాంకనంలో సంస్కరణలు

- పొరపాట్ల నివారణకు విద్యాశాఖ పరిష్కారం
- కౌంటింగ్‌లో రెండంచెల విధానం
- మాన్యువల్, డిజిటల్‌గా మార్కుల లెక్కింపు
- ఒక్కో పేపర్ కనీసం 12 నిమిషాలు దిద్దాలి
- అన్ని మూల్యాంకనం కేంద్రాల్లో సీసీ కెమెరాలు

(అమరావతి- ఆంధ్రజ్యోతి)

గతేడాది పదో తరగతి మూల్యాంకనంలో జరిగిన పొరపాట్లు మళ్లీ జరగకుండా పాఠశాల విద్యాశాఖ శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టింది. మూల్యాంకనంలో సమూల మార్పులు తెచ్చేందుకు పలు సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. రీకౌంటింగ్‌లో 5 కంటే ఎక్కువ మార్కులు తేడాలు వస్తే టీచర్లకు జరిమానా విధించేలా నిబంధనలు రూపొందించింది. మార్కుల వ్యత్యాసం ఆధారంగా రూ. 1,500 నుంచి రూ. 4 వేల వరకు ఆ జరిమానాలు విధించనుంది. గతేడాది పలువురు విద్యార్థుల మార్కుల్లో భారీ వ్యత్యాసాలు వచ్చాయి. పేపర్లను సక్రమంగానే దిద్దినా వాటిని తుది మార్కుల్లో కలపడంలో చేసిన పొరపాట్ల కారణంగా విద్యార్థులకు మార్కులు తగ్గాయి. ఓ విద్యార్థినికి ఏకంగా 30 మార్కులు తక్కువ వేయడం అప్పట్లో వివాదం అయ్యింది. ఆ అనుభవంతో పాఠశాల విద్యాశాఖ పొరపాట్లకు ఆస్కారం లేకుండా చర్యలు ప్రారంభించింది. అందులో ప్రధానంగా పేపరును దిద్దిన అనంతరం ఆ మార్కులను పొరపాట్లు లేకుండా లెక్కించడంపై దృష్టి పెట్టింది. గతేడాది వరకు ఉన్న నిబంధనల ప్రకారం పేపరును దిద్దిన టీచరే మొత్తం కౌంటింగ్ చేసి తుది మార్కులు వేస్తారు. ఈ క్రమంలో కొన్ని ప్రశ్నల మార్కులను వదిలేయడం వల్ల తుది మార్కుల్లో పొరపాట్లు దొర్లాయి. పొరపాట్లు పునరావృతం కాకుండా ఈ ఏడాది నుంచి రెండంచెల విధానం అమలు చేయనున్నారు. మొదట టీచర్ పేపరును దిద్ది మార్కులు వేస్తారు. అనంతరం అదే పేపరును మరో టీచర్ మూల్యాంకనం సాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ చేసిన ట్యాబ్‌లో నమోదు చేస్తారు. సాఫ్ట్‌వేర్ ఆటోమేటిక్‌గా మార్కులు లెక్కించి తుది మార్కులు చూపిస్తుంది. టీచర్ వేసిన మార్కులు, సాఫ్ట్‌వేర్ చూపించిన మార్కులు ఒకేలా ఉంటేనే ఆ పేపరును స్కానింగ్‌కు పంపుతారు. అయితే ఇందులో మరో కీలక అంశం కూడా ఉంది. మాన్యువల్ విధానంలో చాయిస్ ప్రశ్నల మార్కులలోనూ పొరపాట్లు జరుగుతున్నాయి. ఉదాహరణకు ఒక విద్యార్థి చాయిస్ ప్రశ్నకు కూడా సమాధానం రాస్తే తొలుత రెండు సమాధానాలకు మార్కులు వేస్తారు. తుది మార్కుల్లో ఎక్కువ మార్కులున్న సమాధానాన్ని లెక్కలోకి తీసుకోవాలి. కానీ మాన్యువల్ విధానంలో అనేక మంది తక్కువ మార్కులున్న సమాధానాన్ని పరిగణనలోకి తీసుకుని మార్కులు వేయడం వల్ల విద్యార్థులకు నష్టం జరుగుతోంది. కొత్త విధానంలో టీచరు పొరపాటు చేసినా సాఫ్ట్‌వేర్ చాయిస్ ప్రశ్నల మార్కులను సరిదిద్దుతుంది. ఏ ప్రశ్నకు ఎక్కువ మార్కులు వేయాలో సూచిస్తుంది. అలాగే పేపర్లు దిద్దే సమయంలోనూ నిబంధనలను కచ్చితంగా అమలుచేయాలని పాఠశాల విద్యాశాఖ చెబుతోంది. ఇందులో భాగంగా టీచరు ఒక పేపరును తప్పనిసరిగా 12 నిమిషాలు దిద్దాలనే నిబంధనను ఉల్లంఘించకుండా చర్యలు చేపట్టింది. అందుకోసం టీచర్లకు ఒక రోజులో దిద్దాల్సిన 40 పేపర్లను ఉదయమే ఇవ్వకూడదని నిర్ణయించింది. ఉదయం 20 పేపర్లు, మధ్యాహ్నం 20 పేపర్లు వేర్వేరుగా ఇవ్వనుంది. అలాగే పేపరును ఎంత సమయంలో దిద్దుతున్నారు అనేది సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేయనుంది. దీనివల్ల టీచర్లు హడావుడిగా మూల్యాంకనం చేసే పరిస్థితి తలెత్తదని విద్యాశాఖ వర్గాలు అంటున్నాయి. ఈ చర్యల తర్వాత కూడా కౌంటింగ్‌లో పొరపాట్లు వస్తే పేపరును దిద్దిన టీచరుకు, వాటిని సాఫ్ట్‌వేర్‌లో నమోదు చేసిన టీచర్‌కు జరిమానా విధిస్తారు. అలాగే సర్వీసు పాయింట్లలోనూ కోత పెట్టనున్నారు.

పక్క మండలాల్లో ఇన్విజిలేషన్

ఈసారి ఇన్విజిలేషన్‌లోనూ మార్పులు తీసుకొచ్చారు. సాఫ్ట్‌వేర్ ద్వారా ఆటోమేటిక్‌గా ఇన్విజిలేషన్ బాధ్యతలు టీచర్లకు కేటాయిస్తారు. అలాగే సొంత మండలంలో టీచర్లకు ఇన్విజిలేషన్ బాధ్యతలు ఇవ్వకుండా, పక్క మండలంలో నియమించాలనే నిబంధన పెడుతున్నారు. అలాగే భాషా సబ్జెక్టుల పరీక్షలకు సైన్స్, సోషల్, గణితం టీచర్లను.. సైన్స్, సోషల్, గణితం సబ్జెక్టుల పరీక్షలకు భాషా టీచర్లను ఇన్విజిలేటర్లుగా నియమించనున్నారు. అనారోగ్య సమస్యలున్న వారికి బాధ్యతలను మినహాయించనున్నారు. మొత్తం 33 వేల మంది ఇన్విజిలేటర్లు అవసరం అని పాఠశాల విద్యాశాఖ అంచనా వేసింది. అందులో 25వేల మంది ప్రభుత్వ టీచర్లను, 8 వేల మంది ప్రైవేటు టీచర్లను ఇన్విజిలేటర్లుగా నియమిస్తారు. అలాగే అన్ని మూల్యాంకనం కేంద్రాల్లోనూ ఈ ఏడాది నుంచి సీసీ కెమెరాలు ఏర్పాటుచేయాలనే నిర్ణయం తీసుకున్నారు.


తిరుమల ఆలయం ముందు జస్టిస్ గోపాలకృష్ణారావు

శ్రీవారి సేవలో జస్టిస్ గోపాలకృష్ణారావు

తిరుమల, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణారావు మంగళవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం ఆయన రంగనాయక మండపానికి చేరుకోగా అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే సినీ దర్శకుడు శైలేష్ కొలను, సంగీత దర్శకుడు కోటి, హీరోయిన్లు ఇషా రెబ్బా, రుహానీ శర్మ, తెలంగాణ ప్రభుత్వ సలహాదారు శ్రీనివాసరాజు తదితరులు కూడా వెంకన్నను దర్శించుకున్నవారిలో ఉన్నారు.

వందేమాతరం ఆరు చరణాలు పాడమనటం సరికాదు

- అవసరమైతే సుప్రీం కోర్టును ఆశ్రయిస్తాం: ఏపీ క్రైస్తవ సంఘాలు

విజయవాడ అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): భారత హోం మంత్రిత్వ శాఖ వందేమాతరం ఆరు చరణాలు పాడాలని నోటిఫికేషన్ జారీ చేయటం సరికాదని, దీనిపై అవసరమైతే సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామని ఆంధ్ర క్రైస్తవ సంఘాల ప్రతినిధులు తెలిపారు. మంగళవారం విజయవాడలో జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వందేమాతరంలోని మొదటి రెండు చరణాలను మాత్రమే ప్రస్తుతం పాడుతున్నామని, దీనివల్ల ఎవరికీ అభ్యంతరం లేదన్నారు. రవీంద్రనాథ్ ఠాగూర్ కూడా వందేమాతరం గేయంలో మొదటి రెండు చరణాలు మాత్రమే దేశభక్తికి సంబంధించినవని ఆనాడే ప్రకటించారని గుర్తు చేశారు. ఇటీవల భారత హోంమంత్రిత్వ శాఖ వందేమాతరం ఆరు చరణాలను కచ్చితంగా పాడాలని జారీ చేసిన నోటిఫికేషన్ సరైనది కాదని, దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నోటిఫికేషన్ మైనార్టీల మత విశ్వాసాలను, హక్కులను దెబ్బతీసే విధంగా ఉందని తెలిపారు. దేశభక్తిని అడ్డుపెట్టుకుని సెక్యులరిజాన్ని నాశనం చేసే ఇలాంటి చర్యలను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు చెప్పారు. మైనార్టీల హక్కులను, స్వేచ్ఛను అణచివేసే విధంగా ఉన్న కేంద్ర ప్రభుత్వ చర్యలను నిరసిస్తూ తాము సుప్రీం కోర్టులో న్యాయపోరాటం చేసేందుకు కార్యాచరణ రూపొందించినట్టు తెలిపారు. ప్రభుత్వం వెంటనే జారీ చేసిన ఈ నోటిఫికేషన్‌ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ లీడర్స్ ఫోరం కన్వీనర్ అలివర్ రాయ్, స్వర్ణదీపిక పత్రిక సంపాదకుడు శివాజీరాజ్, తిరుపతి పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధి అరుసు పీటర్ జ్యోతి ఆనంద్ రవికుమార్ తదితరులు ఉన్నారు.


పుష్కరిణిలో అవబృథ స్నానం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఈవో, చైర్మన్

శ్రీశైలంలో నేటితో ముగియనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు

- వైభవంగా ధ్వజావరోహణ
- పదో రోజు పూర్ణాహుతి, త్రిశూల, అవబృథ స్నానాలు

శ్రీశైలం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా శ్రీశైల మహాక్షేత్ర ంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు పదోరోజు వైభవంగా కొనసాగాయి. మంగళవారం రాత్రి ధ్వజావరోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం యాగశాలలో రుద్ర హోమం. పూర్ణాహుతి నిర్వహించారు. ఆ తర్వాత కలశోద్వాసన, త్రిశూల స్నానం, మహదాశీర్వచనం జరిపారు. అనంతరం ఆలయ పుష్కరిణిలో అవబృథ స్నానం చేయించి వసంతోత్సవాన్ని నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి మెట్టెలు, నల్లపూసలు సమర్పించి సదస్యం నాగవల్లి కార్యక్రమాన్ని ఆనవాయితీగా జరిపించారు. మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు 11వ రోజు బుధవారం ముగియనున్నట్టు ఈవో శ్రీనివాసరావు తెలిపారు.

24న వెలిగొండకు సీఎం చంద్రబాబు

ప్రాధాన్య ప్రాజెక్టుల పూర్తే లక్ష్యం.. జూన్ నాటికి వెలిగొండను పూర్తి చేయాలని నిర్ణయం

- పనులు పూర్తికాకుండానే నాడు ప్రారంభోత్సవం చేసిన జగన్
- లక్ష్యాన్ని చేరుకునేలా పనుల వేగాన్ని పెంచాలి: మంత్రి నిమ్మల

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రాధాన్య జలవనరుల ప్రాజెక్టులను పూర్తి చేసి వరుసగా ప్రారంభోత్సవాలు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయించారు. ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్న వెలిగొండ ప్రాజెక్టును ఈనెల 24న ఆయన సందర్శించనున్నారు. పనుల పురోగతిని పరిశీలించనున్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు ప్రధానమైన పనులు పూర్తికాకుండానే ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్మోహన రెడ్డి వెలిగొండకు ప్రారంభోత్సవం చేసిన విషయం తెలిసిందే. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చాక వెలిగొండ పనులపై సీఎం చంద్రబాబు సమీక్ష చేశారు. ఈ సమీక్షలో అత్యంత కీలకమైన హెడ్ రెగ్యులేటర్లు, టన్నెల్-2 తీగలేరు కెనాల్ హెడ్ రెగ్యులేటర్ పనులు పూర్తి కాలేదని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. టన్నెల్స్, ప్రధాన కాలువలకు రూ. 637.43 కోట్లు కావాలని సీఎం దృష్టికి తీసుకువచ్చారు. అదేవిధంగా కాలువలు, డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్ పనులకు రూ. 341.68 కోట్లు, సహాయ, పునరావాస మౌలిక సదుపాయాలకు రూ. 37 కోట్లు (ఏడు కాలనీల్లో), 7,321 నిర్వాసిత కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ నగదు ప్యాకేజీ కింద రూ. 887 కోట్లు, 1,233 ఎకరాల భూసేకరణ కోసం రూ. 139.32 కోట్లు.. మొత్తంగా రూ. 2,042 కోట్లు వెలిగొండ కోసం కావాలని సీఎం చంద్రబాబును జల వనరుల శాఖ అధికారులు కోరారు. ఇంత భారీ మొత్తంలో పనులు మిగిలి ఉండగానే.. వెనుకబడ్డ ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేసేలా ఎన్నికలకు ముందు జగన్ అట్టహాసంగా ఎలా ప్రారంభోత్సవం చేస్తారంటూ అధికారుల వద్ద చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మంత్రి నిమ్మల టెలికాన్ఫరెన్స్

ముఖ్యమంత్రి వెలిగొండ పర్యటన నేపథ్యంలో ఇంజనీరింగ్ అధికారులతో జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మంగళవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. పనుల్లో వేగాన్ని పెంచాలని కాంట్రాక్టు సంస్థకు సూచించారు. లక్ష్యాన్ని చేరుకోవడానికి మరో నాలుగు నెలల సమయమే ఉన్నందున రోజువారీగా లక్ష్యాన్ని నిర్దేశించుకుని పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనకు వచ్చేలోగా తాను కూడా రోజువారీగా టెలికాన్ఫరెన్స్ నిర్వహిస్తానని అధికారులకు నిమ్మల స్పష్టం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసానంద సరస్వతి

శ్రీవారి లడ్డూ అపచారానికి ప్రాయశ్చిత్తం

- త్వరలో తేదీ, సమయం వెల్లడిస్తాం: శ్రీనివాసానంద సరస్వతి

సీతమ్మధార (విశాఖపట్నం), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): 'రసాయనాలు కలిపిన లడ్డూ భక్తులు స్వీకరించినా వారికి ఏమీ కాలేదంటే అది ఆ స్వామి మహిమే.. శ్రీవారి ప్రసాదానికి జరిగిన అపచారానికి భక్తులు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి.. ఇంటిలో దీపం పెట్టుకుని ఆలయంలో ముడుపులు చెల్లించాలి' అని ఆనందాశ్రమ పీఠాధిపతి, రాష్ట్ర సాధు పరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసానంద సరస్వతి సూచించారు. విశాఖపట్నంలో మంగళవారం ఆయన అధ్యక్షతన రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన మఠాధిపతులు, పీఠాధిపతులు, సాధువులు సమావేశమై లడ్డూ కల్తీపై చర్చించారు. ఈ సందర్భంగా శ్రీనివాసానంద సరస్వతి మాట్లాడుతూ విజయవాడలో సాధువులు, మఠాధిపతులు, పీఠాధిపతులతో కలిసి రాష్ట్ర సాధు పరిషత్ సమావేశం నిర్వహించి ప్రాయశ్చిత్తం చేసుకునే సమయం, తేదీని త్వరలో వెల్లడిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌ను కూడా కుటుంబ సమేతంగా పాల్గొనాలని కోరతామన్నారు. మాజీ సీఎం జగన్మోహనరెడ్డి, వారి కుటుంబ సభ్యులు కూడా ప్రాయశ్చిత్తం కార్యక్రమంలో పాల్గొనాలని, కలియుగ దైవానికి ఎవరు తప్పు చేసినా, వారిని వదిలిపెట్టే సమస్యే లేదన్నారు.

తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి మహాపాపం

- బాధ్యులను కఠినంగా శిక్షించాలని సీఎంకు శ్రీమఠం పీఠాధిపతి లేఖ

కర్నూలు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడకంపై మంత్రాలయం గురు రాఘవేంద్రస్వామి మఠం (శ్రీమఠం) పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థశ్రీపాద స్వాములు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కలియుగ దైవమైన శ్రీవారి ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి సరఫరా చేయడం మహా పాపం అని.. ఇంతటి పాపానికి ఒడిగట్టిన వారిని చట్ట ప్రకారం శిక్షించాలని సీఎం చంద్రబాబుకు పీఠాధిపతి మంగళవారం లేఖ రాశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కల్తీ నెయ్యి వ్యవహారంపై నిష్పక్షపాతంగా విచారణ జరిపించి కోట్లాది హిందువుల మనోభావాలను దెబ్బతీసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో.. బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స లేదా..?

- పొరుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వాస్పత్రుల్లో ఉచితంగా చికిత్స
- మన రాష్ట్రంలో ఈ సౌకర్యం లేకపోవడం ఏమిటి..?
- విస్మయం వ్యక్తం చేసిన హైకోర్టు ధర్మాసనం
- ఎప్పటిలోగా అందుబాటులోకి తెస్తారో చెబుతూ.. అఫిడవిట్ వేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశం

అమరావతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలల్లో బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స అందుబాటులో లేకపోవడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. పొరుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్స అందిస్తున్నప్పుడు.. ప్రగతిశీల రాష్ట్రమైన ఏపీలో ఈ సౌకర్యం లేకపోవడం ఏమిటని ప్రశ్నించింది. ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్సకు అవకాశం కల్పిస్తున్నప్పటికీ, చెల్లించే సొమ్ముపై రూ.11లక్షలు పరిమితి నిర్ణయించారని గుర్తుచేసింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్సను అందుబాటులోకి తీసుకురావడంపై అఫిడవిట్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే రోగులకు అందించే ఆర్థిక సహాయం పరిమితిని పెంచే విషయాన్ని కూడా పరిశీలించాలని సూచించింది. రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ప్రణతి స్పందిస్తూ... ప్రభుత్వ ఆస్పత్రుల్లో బోన్‌మ్యారో చికిత్సను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుందని వివరించారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ... ఈ ప్రక్రియ ఎప్పటిలోగా పూర్తి చేస్తారు..? ఎప్పటి నుంచి చికిత్సను ప్రారంభిస్తారో తెలియజేస్తూ అఫిడవిట్ వేయాలని ఆదేశించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం ఇటీవల ఉత్తర్వులు జారీచేసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రులు, వైద్య కళాశాలల్లో బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్స అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ ఎన్టీఆర్ జిల్లా పెనుగొలను గ్రామానికి చెందిన గుంతవెంకట సాయికుమార్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. పార్టీ ఇన్ పర్సన్‌గా వాదనలు వినిపించారు. ప్రైవేటు ఆస్పత్రుల్లో మాత్రమే చికిత్స అందుబాటులో ఉందని, దాని కోసం రోగులు భారీగా సొమ్ము చెల్లించాల్సి వస్తోందని అన్నారు. ఆర్థిక స్థోమత లేని చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద చికిత్స అందిస్తున్నప్పటికీ, చికిత్సకు అందించే సొమ్మును రూ.11 లక్షలకే పరిమితం చేశారన్నారు. పొరుగు రాష్ట్రాల్లోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో బోన్‌మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్ చికిత్సను ఉచితంగా అందిస్తున్నారని వివరించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వెస్ట్‌బ్యాంక్‌పై బకాసుర కుట్ర

అద్భుతమైన గాజాను శ్మశానంలాగా మార్చేసిన ఇజ్రాయెల్ దృష్టి ఇప్పుడు వెస్ట్‌బ్యాంక్‌మీదకు మళ్లింది. అంతర్జాతీయ చట్టాలు, ఒప్పందాలన్నింటినీ తుంగలోతొక్కి, ఆ ఆక్రమిత ప్రాంతంలో అధికభాగాన్ని మింగేయడానికి ఇజ్రాయెల్ సిద్ధపడుతోంది. వెస్ట్‌బ్యాంక్‌లోని పాలస్తీనియన్ల భూములను ప్రభుత్వ ఆస్తిగా మార్చివేసే ఈ కుటిలయత్నంపై ఐక్యరాజ్యసమితి ఆవేదనను, ఆశ్చర్యాన్ని వెలిబుచ్చింది. అరబ్‌దేశాలతో పాటు, యూరోపియన్ యూనియన్ సైతం ఇజ్రాయెల్ మంత్రివర్గ నిర్ణయాన్ని ఖండించింది. స్వతంత్ర పాలస్తీనా ఆశని, ఆకాంక్షని సమూలంగా నాశనం చేసేందుకు ఇజ్రాయెల్ చేస్తున్న ప్రయత్నాల్లో ఇదీ ఒకటి. ఇజ్రాయెల్ పాలస్తీనాలు ఇరుగుపొరుగుగా వర్ధిల్లాలన్న ఆలోచనలను తుంచేయడానికీ, ఆ తరహా ప్రతిపాదనలు జరపకుండా కూడా చేయడానికి ఇజ్రాయెల్ వేసిన ఎత్తుగడ ఇది.

స్వతంత్ర పాలస్తీనా ఆకాంక్షకు పునాదివంటి వెస్ట్‌బ్యాంక్‌లోని అత్యధిక ప్రాంతాలను ఇజ్రాయెల్ రాజ్యం తన ఆస్తిగా మార్చి దానికి ఈ కొత్తదారి వెదుక్కుంది. తమ భూములమీద యాజమాన్య హక్కును రుజువుచేసుకోవాల్సిన బాధ్యత పాలస్తీనియన్లదే. వారు తాతలకాలంనాటి భూమిని తమదిగా నిరూపించుకోలేకపోతే అది ఇజ్రాయెల్ ప్రభుత్వపరం అవుతుంది. పాలస్తీనా లిబరేషన్ ఆర్గనైజేషన్ (పీఎల్‌వో), ఇజ్రాయెల్ మధ్య 1993లోజరిగిన ఓస్లో ఒప్పందం ప్రకారం ఆక్రమిత వెస్ట్‌బ్యాంక్‌ను ఏ, బీ, సీలుగా విభజించి, పాలస్తీనా అథారిటీకి ఆయా ప్రాంతాలపై పాలనాపరమైన అధికారాలను కల్పించారు. సీ కేటగిరీ కిందకు వచ్చే 60శాతం భూభాగంపై నియంత్రణ కూడా వాస్తవానికి పాలస్తీనా అథారిటీకే దక్కవలసి ఉండగా, దానిని ఇజ్రాయెల్ తన నియంత్రణలోనే ఉంచుకొని సర్వహక్కులూ చెలాయిస్తోంది. అరవైయేళ్లుగా భూ క్రయవిక్రయాలను, నిర్మాణాలను ఇజ్రాయెల్ దాదాపుగా నిలిపివేసిన కారణంగా ఈ ప్రాంతంలో ఇప్పటివరకూ పాలస్తీనియన్లు జరిపిన లావాదేవీలన్నీ అనధికారికమే అవుతాయి. వారసత్వాన్నీ, ఆస్తి హక్కునీ నిరూపించే డాక్యుమెంట్లు అధికుల వద్ద లేకపోవడంతో పాటు, వారిలో వారు చేసుకున్న రాతకోతల ఒప్పందాలు కూడా చెల్లవు కనుక, అక్రమ నిర్మాణాల పేరిట వాటిని కూల్చివేయడానికి ఇజ్రాయెల్‌కు అవకాశం దక్కుతుంది. అనేకతరాలుగా అనుభవిస్తున్న భూమిమీద తమహక్కును అత్యధికశాతం పాలస్తీనియన్లు నిరూపించుకోలేని స్థితి ఆధారంగా ప్రభుత్వ వశం అవుతుంది. ఏరియా సీ పూర్తిగా ఇజ్రాయెల్ అధీనంలో ఉన్నందున, ఇజ్రాయెలీల సెటిల్‌మెంట్లు కూడా ఇక్కడే అధికం. పాలస్తీనియన్ల మీద ప్రభుత్వ బలగాలతో పాటు ఇజ్రాయెలీలు కూడా విరుచుకుపడి ప్రతి ఏటా వేలాదిమందిని అక్కడనుంచి తరిమికొట్టడం రివాజు. ఓస్లో ఒప్పందాన్ని ఉల్లంఘిస్తూ, ఈ ప్రాంతంలో ఇజ్రాయెలీలను స్థిరపరిచే కార్యక్రమం క్రమంగా సాగి, నెతన్యాహూ అధికారంలోకి వచ్చిన తరువాత మరింత వేగం పుంజుకుంది. ఇజ్రాయెల్ దాష్టీకాలకు తట్టుకోలేక ఇక్కడనుంచిపోయినవారూ, ఉన్నవారూ కూడా తమ కాళ్లకింద భూమి తమదేనని నిరూపించుకోలేని స్థితిలో ఉండటం ఇజ్రాయెల్‌కు అందివచ్చిన వరం. పాలస్తీనియన్లను తరిమికొట్టడం, ఉన్నవారికి ఎటువంటి హక్కులూ అనుమతులూ ఇవ్వకపోవడం, మరోపక్క ఇజ్రాయెలీలను తెచ్చి అక్కడ స్థిరపరిచి, అన్ని అనుమతులూ ఇవ్వడం ద్వారా వెస్ట్‌బ్యాంక్‌ను వశపరచుకొనే వ్యూహం అమలవుతోంది.

గాజా మారణకాండ తరువాత, అమెరికా, ఇజ్రాయెల్ వినా మిగతా ప్రపంచమంతా ద్విదేశ సిద్ధాంతానికి కొత్తగా గట్టిగా పట్టుబడుతున్న నేపథ్యంలో, భవిష్యత్తులో అటువంటి ఆలోచనలకు ఊతమూ, ఊనికా లేకుండా చేయడం నెతన్యాహూ లక్ష్యం. పాలస్తీనియన్లనుంచి ఇలా భూమిని ప్రభుత్వపరం చేసుకొని, ఆ తరువాత దానిని ఇజ్రాయెలీలకు కట్టబెట్టేందుకు, కొత్త ఆవాసాలను సృష్టించేందుకు ఆయన వాడకోబోతున్నారు. కనీసం వందేళ్ళ వారసత్వాన్ని అరబ్బులు రుజువుచేసుకోవాల్సి ఉండగా, యూదులు మాత్రం యథేచ్ఛగా ఆ భూములను ఆక్రమించుకొంటున్నారు. ఇక, జనావాసాలు లేని పెద్ద పెద్ద ప్రాంతాలను ప్రభుత్వం నేరుగా తన ఖాతాలో రాసుకోవడం సరేసరి. ఈ కొత్త భూ ఆక్రమణ విధానం ద్వారా వెస్ట్‌బ్యాంక్‌లో యాభైశాతం భూభాగాన్ని ఇజ్రాయెల్ వశపరచుకోగలదని మీడియా విశ్లేషణ. నెతన్యాహూ తెలివితేటలు చూసి 'బోర్డ్ ఆఫ్ పీస్' సృష్టికర్త ఎంత మురిసిపోతున్నారో మరి.

కమ్యూనిస్టు కవి రాజేశ్వరరావు

ఎందరో సామాన్యులను కవులుగా, రచయితలుగా, ప్రజా కళాకారులుగా కమ్యూనిస్టు ఉద్యమం సృష్టించుకుంది. అలాంటి వారిలో ప్రముఖ అభ్యుదయ రచయిత, కమ్యూనిస్టు కవి.. కాగితాల రాజేశ్వరరావు(కె.రా) ఉద్యమంతో మమేకమై అభ్యుదయ పథమే తన జీవన విధానంగా బతికినవారు. 'సాహిత్యంలో సవ్యసాచి' అని సోదుం రామ్మోహన్, 'ఇంత పాండిత్యం, ఇంత ప్రతిభ ఒక వ్యక్తిలో ఉండటం అరుదైన విషయం' అని చేకూరి రామారావు, 'అభ్యుదయ సాహిత్యోద్యమ యోధుడు కె.రా' అని చందు సుబ్బారావు, 'అభ్యుదయోద్యమ ఉత్తుంగ తరంగం రాజేశ్వరరావు' అని ఎస్వీ సత్యనారాయణ లాంటి ప్రముఖ సాహితీ విమర్శకులు, ఆప్తులు రాజేశ్వరరావుకు కితాబు ఇచ్చారు.

తెలుగు బాలల్లో శాస్త్రీయ భావాల వ్యాప్తి కోసం విశాలాంధ్ర వెలువరించిన 'చిన్నారి లోకం' మాసపత్రికకు 1985 నుంచి 1995 వరకు సంపాదకుడిగా ఉన్న కె.రా మూడున్నర దశాబ్దాలు విద్యార్థి, యువజన, ప్రజా నాట్యమండలి, కమ్యూనిస్టు ఉద్యమాల్లో అవిశ్రాంతంగా పనిచేశారు. అన్ని సాహిత్య ప్రక్రియల్లోనూ ప్రవేశం ఉన్న అభ్యుదయ కవిగానే ప్రసిద్ధి పొందారు. 'చిన్నారి లోకం'తో పాటు మిసిమి, సౌమ్య, స్నేహ వంటి మాస పత్రికలకు సంపాదకుడిగా వ్యవహరించారు. చురకత్తుల్లాంటి పదాలతో కష్ట జీవుల కడగండ్లను తన కవనంలో పలికించారు. కన్నీటి హృదయాలను సమర పతాకాలుగా మలిచారు. మత్తగజాల వంటి పద్యాలతో నిప్పులు కురిపించి, తనకు కవితా గురువైన గజ్జెల మల్లారెడ్డిని అబ్బురపరిచారు.



భారత కమ్యూనిస్టు పార్టీ 10వ మహాసభలు 1975లో విజయవాడలో జరిగినప్పుడు అందులో ప్రదర్శించిన 'జనశ్రేణి కదిలింది' నృత్య నాటిక ఎన్నో ప్రశంసలు పొందింది. 1984, 1985 సంవత్సరాల్లో భారత ప్రభుత్వం, వయోజన విద్యాశాఖ నిర్వహించిన పోటీలో 'వెలుగు బాట' రచనకు, ఎన్‌సీఈఆర్‌టీ బాలసాహిత్యంలో జాతీయ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో వాణీరంగారావుతో కలిసి 'శ్రీహరికోట' రచనకు బహుమతి అందుకున్నారు. కొవ్వొత్తిలాగా కాలిపోతున్నా వెలుగును చిమ్ముతూనే బతికిన కవి రాజేశ్వరరావు. ఇంటి పేరు సార్థకమై తన సంపదంతా కాగితాలకే పరిమితమైపోయింది.

కమ్యూనిస్టు పార్టీ చరిత్రనంతా ఒక గేయకావ్యంగా 'నా పార్టీ' పేరుతో రచించాలని ఉందని కె.రా చాలా వేడుకల్లోనూ, సాహితీ సమావేశాల్లోనూ చెప్పేవారు. అది తన సాహిత్య జీవితంలో మైలురాయి అవుతుందనేవారు. కానీ, వ్యక్తిగత పరిస్థితులు ఆయన కావ్యశక్తిని చంపే యత్నం చేశాయి. బతుకు పోరాటంలో మునిగిపోయి, ఆయన కలగన్న 'నా పార్టీ' అసంపూర్తిగానే మిగిలిపోయింది. మొత్తం కమ్యూనిస్టు ఉద్యమాన్ని ఒక్క గేయంలోనే ప్రతిబింబించేలా రాశారు. బ్రిటిష్ వాళ్ళు భారతదేశానికి వచ్చినప్పటి నుంచి కవితాత్మకంగా మొదలుపెట్టి రాసిన చిత్తుప్రతి కొద్దిభాగం 'రాజేశ్వరరావు కవితలు'గా వేసిన పుస్తకంలో ఉంది.

పుడమి తల్లి పొత్తిటిలో/ పుష్పించిన మందారం/ అంధతమో వారాసిని/ ప్రభవించిన అంగారం!/ జనించింది నా పార్టీ/ శ్రమజీవుల కాయుధమై/ అగణిత పీడిత జనగణ/ ఆశయ ప్రతి రూపమ్మై!!

56 ఏళ్లపాటు సాగిన సాహిత్య–ఉద్యమ ప్రయాణం 2004 ఫిబ్రవరి 18న ముగిసినా, కె.రా కవిత్వం మాత్రం ఇప్పటికీ అభ్యుదయ సాహిత్యంలో జీవించే ఉంది.

● కాగితాల రాజశేఖర్

కనపడని ఎప్‌స్టీన్‌ల మాటేమిటి?



■ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

కనీవినీ ఎరుగని అకృత్యాలకు పాల్పడ్డ జెఫ్రీ ఎడ్వర్డ్ ఎప్‌స్టీన్‌కు సంబంధించి అన్ని ఫైళ్లను విడుదల చేశామని అమెరికా అటార్నీ జనరల్ పామ్ బాండీ వెల్లడించిన రెండు రోజుల్లోనే తాను నిర్దోషి అన్న విషయం రుజువయిందని, ఆ నేరస్థుడితో తనకు ఎలాంటి సంబంధాలు లేవని అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఈ ఫైళ్లలో ట్రంప్ పేరు 38వేల సార్లు ప్రస్తావితమయినప్పటికీ, వాటిలో పేర్లు దొర్లినంత మాత్రాన అందరికీ ఎప్‌స్టీన్ ఘోర కృత్యాలతో సంబంధం ఉన్నట్లు కాదని కూడా అమెరికా న్యాయశాఖ ప్రకటించింది. ఎప్‌స్టీన్ ఈ–మెయిల్స్‌లో ఉన్నవారి పేర్లపై, ఇంటర్నెట్‌లో వస్తున్న రకరకాల ఫోటోలపై మరికొంత కాలం సోషల్ మీడియాలో అనేకానేక వదంతులు రావచ్చు కాని అమెరికానే కాకుండా ఎన్నో దేశాలను కుదిపివేసిన ఎప్‌స్టీన్ ఉదంతానికి తెరదించే ప్రయత్నం చాలా బలంగా జరుగుతోంది. నిజానికి 2019లో ఎప్‌స్టీన్ అమెరికా జైలులో శవమయి తేలినప్పుడే అతడి నేరాలకు మసిపూసి మారేడుకాయ చేసే ఘట్టంలో ఒక ప్రధాన అంకం ముగిసినట్లయింది. అమెరికా ప్రధాన పార్టీల అగ్రనాయకులతో పాటు ప్రపంచ వ్యాప్తంగా అనేకమంది నేతలు, వ్యాపారవేత్తలు, ప్రముఖులకు ఎప్‌స్టీన్‌తో ఉన్న సంబంధాల విషయమై తామిక ప్రకటించాల్సింది ఏమీ లేదని అమెరికా న్యాయశాఖ చెప్పడంతో అనేకమంది ఊపిరి పీల్చుకునే ఉంటారు. పైకి మర్యాదగా కనిపించే ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లోని డొల్లతనం, రాజకీయ వ్యవస్థల్లోని మురికి ఉబికి బయటకు వచ్చి తమను ముంచేయడాన్ని వారెలా ఆహ్వానిస్తారు?

ఎప్‌స్టీన్ ఫైళ్లు బయటపడితే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వానికీ ముప్పు వాటిల్లవచ్చని ఆయన ప్రత్యర్థులు అనేకమంది భావించారు. అయితే అది టీ కప్పులో తుఫానుగానే తేలిపోయింది. ట్రంప్ పని నిమిత్తమై మోదీ ఇజ్రాయిల్ వెళ్లారనే విషయం మినహా ఆ ఈ–మెయిల్స్‌లో మోదీ గురించి ఇంకెలాంటి ప్రస్తావన ఎక్కడా లేదు. ఇక కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి గురించి అనేకసార్లు ప్రస్తావనకు వచ్చినప్పటికీ ఎప్‌స్టీన్ నేర కార్యకలాపాల్లో ఆయన పాల్గొన్నారని చెప్పేందుకు ఎలాంటి ఆధారాలు లభించలేదు. తాను ఒక అంతర్జాతీయ శాంతి సంస్థలో పనిచేస్తున్నప్పుడు, ఒక ప్రతినిధి వర్గంలో సభ్యుడుగా ఉన్న ఎప్‌స్టీన్ తనకు పరిచయమయ్యారని, ఆ తర్వాత భారత్‌కు ప్రయోజనాలు సమకూర్చేందుకు అతడి సహాయం తీసుకున్నానని హర్దీప్‌సింగ్ వాదిస్తున్నారు. భారత విదేశాంగశాఖ నుంచి 2013లో పదవీవిరమణ చేసిన హర్దీప్‌సింగ్ 2019లో కేంద్ర మంత్రిమండలిలో నియమితులయ్యారు. మాజీ దౌత్యవేత్తకు ప్రధాని మోదీ అనేక కీలక బాధ్యతలు అప్పజెప్పారంటే అంతర్జాతీయ స్థాయిలో ఆయనకు, దేశానికి ఉపకరించే పనులు హర్దీప్‌సింగ్ చేసిపెట్టే ఉంటారనడంలో అతిశయోక్తి లేదు.

ఎప్‌స్టీన్ వ్యవహారం ఏమి చెబుతోంది? భారతదేశంలోనే కాదు, మరే దేశంలో కూడా న్యాయపాలన సమానంగా లేదని స్పష్టం చేస్తోంది. వ్యక్తుల సంపద, పలుకుబడి, సామాజిక హోదాతో సంబంధం లేకుండా అందరికీ సమానంగా న్యాయం లభించే అవకాశం ప్రపంచంలో ఎక్కడా లేదని, దర్యాప్తు ప్రక్రియలో సంస్థాగత బలహీనతలు అంతటా ఉంటాయని వెల్లడించింది. ఆర్థిక శక్తి, రాజకీయ పలుకుబడి దన్నుతో నేర న్యాయ విచారణ వ్యవస్థను లెక్క చేయకుండా ఘోర కృత్యాలకు పాల్పడే తత్వం ప్రబలిపోవడం ఆధునిక న్యాయవ్యవస్థకు ఒక ప్రధాన సవాలుగా ఉన్నది.

మైనర్ బాలికల అక్రమ రవాణాకు ఎప్‌స్టీన్ పాల్పడ్డాడన్న ఆరోపణలు 2005లోనే వచ్చినప్పటికీ అమెరికా న్యాయవ్యవస్థ పట్టించుకోలేదు. 2008లో అరెస్టయినప్పుడు తనపై అభియోగాన్ని ఎప్‌స్టీన్ అంగీకరించాడు. తద్వారా తనపై న్యాయవిచారణ తీవ్రత తగ్గించుకునే అతడి ప్రయత్నాలకు న్యాయవ్యవస్థ తల ఒగ్గింది. కొద్ది నెలలు కస్టడీలో ఉన్నప్పటికీ ఆ సమయంలో తన పలుకుబడితో చట్టవిరుద్ధ కార్యకలాపాలు యథావిధిగా జరిపినా చూసీ చూడనట్లు ఊరుకుంది. బాధితుల ఆక్రందనలు, కొత్త ఆరోపణలు వెల్లువెత్తడంతో 11 ఏళ్ల తర్వాత 2019లో అతడిపై కేసు మళ్లీ తెరిచి చివరకు అరెస్ట్ చేశారు. అరెస్టయిన కొద్ది రోజులకే జైలులలో ఎప్‌స్టీన్ అనుమానాస్పద స్థితిలో మరణించాడు. అది ఆత్మహత్యగా నిర్ధారించారు. మీడియా వార్తలు, ప్రజల డిమాండ్ల వల్ల ఎప్‌స్టీన్ ఫైళ్లను విడుదల చేశారు. ఎందరో హేమాహేమీల పేర్లు బయటకు వచ్చి సంచలనం సృష్టించాయి

విషాదకరమైన విషయం ఏమంటే ప్రపంచమంతా ఇలాంటి ఎప్‌స్టీన్‌లతోనే నిండిపోయింది. రాజకీయ, ఆర్థిక వ్యవస్థల్లో ఉన్న లొసుగులను ఉపయోగించుకుని ఎప్‌స్టీన్ లాంటి వ్యక్తులు పెద్ద మనుషులుగా వెలిగిపోతుంటారు. ఎలాంటి డిగ్రీ అంటూ లేకపోయినా ఒకప్పుడు టీచర్‌గా పనిచేసిన ఎప్‌స్టీన్ చనిపోయే నాటికి 600 మిలియన్ డాలర్ల ఆస్తులకు అధిపతి. న్యూయార్క్ నగరంలో అతి పెద్ద విలాసవంతమైన బంగళా, రెండు ద్వీపాలు, న్యూమెక్సికో, పారిస్‌లలో ఇళ్లు, అనేక కార్లు, ప్రైవేట్ విమానాలు, పలు సంస్థల్లో భారీ పెట్టుబడులు ఆయనకు ఉన్నాయి. ఇవన్నీ ఎలా వచ్చాయి?

“ ఎప్‌స్టీన్ వ్యవహారం ఏమి చెబుతోంది? భారతదేశంలోనే కాదు, మరే దేశంలో కూడా న్యాయపాలన సమానంగా లేదని స్పష్టం చేస్తోంది. వ్యక్తుల సంపద, పలుకుబడి, సామాజిక హోదాతో సంబంధం లేకుండా అందరికీ సమానంగా న్యాయం లభించే అవకాశం ప్రపంచంలో ఎక్కడా లేదని, దర్యాప్తు ప్రక్రియలో సంస్థాగత బలహీనతలు అంతటా ఉంటాయని వెల్లడించింది. ఆర్థికశక్తి, రాజకీయ పలుకుబడి దన్నుతో నేర న్యాయ విచారణ వ్యవస్థను లెక్కచేయకుండా ఘోర కృత్యాలకు పాల్పడే తత్వం ప్రబలిపోవడం ఆధునిక న్యాయవ్యవస్థకు ఒక ప్రధాన సవాలుగా ఉన్నది.



అమెరికా అధ్యక్షులు ట్రంప్, బైడెన్, క్లింటన్; కుబేరులు ఎలాన్ మస్క్, మెలీనా ట్రంప్, బిల్‌గేట్స్‌తో పాటు అనేక మంది దేశాధినేతలు, వ్యాపార ప్రముఖులు, ఉన్నతాధికారులతో సంబంధాలు నెలకొల్పుకుని పబ్బం గడుపుకున్న వ్యక్తి ఎప్‌స్టీన్. కనీసం వంద దేశాల రాజకీయ నాయకులు, సీనియర్ దౌత్యవేత్తలు, 200 మందికి పైగా బిలియనీర్లు, కార్పొరేట్ అధిపతులు అతడి ఉచ్చులో చిక్కుకున్నారు. అనేకమంది ప్రజా ప్రతినిధులకు, న్యాయవాదులకు, చివరకు మీడియా సంస్థలకు నిధులు అందించాడు. యూనివర్సిటీలు, పరిశోధనా సంస్థలకు ఆర్థిక సహాయమందించాడు. చివరకు నోమ్ ఛామ్‌స్కీ వంటి ప్రగతిశీల మేధావి కూడా అతడి ఆదరాన్ని పొందిన వారిలో ఉన్నారు. ఎప్‌స్టీన్ అనేక మందిని తన ప్రత్యేక విమానాల్లో తిప్పాడు. పలువురికి తన పామ్ బీచ్‌లోని బంగళాలో విలాసాలు చవి చూపించాడు. మోడలింగ్‌ను వృత్తిగా పెట్టుకున్న అనేకమంది యువతులను, మైనర్ బాలికలను లైంగిక అత్యాచారాలకు గురిచేయడమే కాక ప్రముఖులకు ఎర వేశాడు. యూరప్‌లో అనేక దేశాల్లో నాయకులకు నిధులు అందించి అక్కడి రాజకీయాలను తారుమారు చేశాడు. అతడితో సంబంధాల గురించి వెల్లడి కాగానే పది దేశాల్లో పెద్ద తలకాయలు రాజీనామాలు చేశాయి. అనేక దేశాల్లో దౌత్యవేత్తలు, మంత్రులు తప్పుకున్నారు. కొందరు పశ్చాత్తాపం ప్రకటించారు. అయితే అత్యధికులు స్తబ్దుగా ఉండిపోయారు. 'ఏమైతేనేం డాక్యుమెంట్లు పుకార్లకు దారి తీస్తాయి కాని వాటి ద్వారా కేసులను నిర్మించలేము' అని అమెరికా న్యాయనిపుణుడొకరు అన్నారు. ఈ మొత్తం ప్రహసనం రాజకీయ నాయకులు, నేరచరితులు, బడా వ్యాపారవేత్తల మధ్య అంతర్గత సంబంధాలను వెలికితీసింది. రాజకీయ ఆర్థిక వ్యవస్థల చలన సూత్రాలను దళారులు, బ్రోకర్లు నిర్ణయిస్తారని తేల్చింది.

మన దగ్గర దళారులు లేరా? ఢిల్లీ వీధుల్లో తిరిగే దళారుల గురించి, ప్రధానమంత్రి కార్యాలయం నుంచి ఇతర కేంద్రమంత్రిత్వ శాఖల్లోనూ, పార్టీ కార్యాలయాల్లోనూ వారు నిర్వహించే పాత్ర గురించి, వాటిలో కనిపించే స్త్రీ పాత్ర గురించి దివంగత ప్రధానమంత్రి పాములపర్తి వెంకటనరసింహారావు తన 'లోపలి మనిషి' నవలలో లీలామాత్రంగా ప్రస్తావించారు. రక్షణ కొనుగోళ్లలో మధ్యదళారుల పలుకుబడి గురించి వాజపేయి హయాంలో సీవీసీ రూపొందించిన నివేదికను బయటకు పొక్కనివ్వలేదు. మధ్య దళారులను చట్టబద్ధం చేయాలని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ సూచించినప్పటికీ పారదర్శకంగా ఆర్థిక లావాదేవీలు వెల్లడించడానికి ఎవరు సిద్ధపడతారు?

గ్లోబల్ పెట్టుబడిదారీ విధానం పూర్తిగా సంపద, సామాజిక, రాజకీయ నెట్‌వర్క్‌ల ద్వారానే నడుస్తోంది. అధికారం తరుచూ అధికారిక హోదాల ద్వారా కాకుండా నెట్‌వర్క్‌ల ద్వారా సాగుతుంది. మన దేశంలో నెట్‌వర్క్‌లు, లాబీయింగ్ పేరిట, కేసులను పరిష్కరించుకునేందుకు, అక్రమంగా సంపాదించిన నిధులు విదేశాలకు బదిలీ చేసేందుకు, బడా వ్యాపారవేత్తలకు ప్రయోజనాలు కల్పించేందుకు నాయకులే తహతహలాడుతున్నారు. ఈ క్రమంలో స్పాన్సరింగ్‌లు, లైంగిక కార్యకలాపాలు, ఖరీదైన బహుమతులు, విలాసవంతమైన హోటళ్లలో విందులు మొదలైనవి మామూలే. ఇవన్నీ అభివృద్ధి ముసుగులో జరుగుతుంటాయి. ఎవరిని ఎక్కడ ఉంచాలో అన్న విషయంలో నేతలు విచక్షణ పాటించడం లేదు. బాధాకరమైన విషయం ఏమంటే ఈ బ్రోకర్లు, దళారులు కొన్ని సందర్భాల్లో బాహటంగా దర్శనమిస్తున్నారు. అంతేనా? వారు చట్టసభల్లో సభ్యులు అయ్యేందుకు మన నేతలే దోహదం చేస్తున్నారు!


'ట్రాన్స్‌పరెన్సీ ఇంటర్నేషనల్' నివేదిక ప్రకారం మన దేశం అవినీతిలో 182 దేశాల్లో 91వ స్థానంలో ఉన్నది. నేషనల్ క్రైమ్స్ రికార్డ్ బ్యూరో నివేదిక ప్రకారం ప్రతి 8 నిమిషాలకూ ఒక బాలిక మాయమవుతోంది. భారతదేశంలో సెక్స్ వ్యాపారం, చిన్నపిల్లల అక్రమ రవాణా గురించి సుప్రీంకోర్టు కూడా తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేసింది. మన వ్యవస్థలు ఏ విధంగా పనిచేస్తున్నాయో దీన్నిబట్టి అర్థమవడం లేదా? సనాతన ధర్మం, సాంప్రదాయం, రామరాజ్యం, దేశభక్తి, ధర్మం మొదలైన వాటి గురించి గంభీరంగా మాట్లాడే మన రాజకీయ నాయకులు నిజాయితీ, పారదర్శకత, జవాబుదారీ విధానంతో వ్యవహరిస్తున్నారా? దర్యాప్తు సంస్థలు, న్యాయవిచారణలు సక్రమంగా నడుస్తున్నాయా? చట్టాలకు నిబద్ధమైన వారిని వ్యవస్థలు కాపాడుతున్నాయా? అన్నిటికీ మించి నైతిక ప్రమాణాలను కాపాడగలుగుతున్నారా? అమెరికాలో కనీసం ప్రజల డిమాండ్ మేరకు ఒక దుర్మార్గుడికి సంబంధించిన డాక్యుమెంట్లను బహిర్గతం చేశారు. మన దేశంలో ఇలాంటి ఘోరమైన రహస్యాల గురించి ఎవరు చర్చిస్తారు?

(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

కర్తవ్యాన్ని మరువని బడ్జెట్!

రాష్ట్రాభివృద్ధికి కీలక పాత్ర పోషించే బడ్జెట్ రూపకల్పన వెనుక ఎంతో కసరత్తు, దూరదృష్టి ఉంది. స్వర్ణాంధ్ర @ 2047 లక్ష్యంగా ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ 2025–26లో రూ.3,22,359 కోట్లతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అప్పుల భారం, వడ్డీల చెల్లింపులు ఒకవైపు భయపెడుతున్నా, సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యత పాటిస్తూ ఆయన బడ్జెట్‌ను రూపొందించారు. విద్య, వైద్యం, పట్టణ పరిపాలన, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, జల వనరులు, రహదారులు వంటి శాఖలకు భారీగా నిధులు కేటాయించి అభివృద్ధి, సంక్షేమం పట్ల కూటమి ప్రభుత్వం తన నిబద్ధతను నిరూపించుకున్నది.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యాలకు, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా బడ్జెట్ రూపకల్పన జరిగింది. ప్రజలే ముందు అనే నినాదాన్ని బడ్జెట్ కేటాయింపుల్లో నిజం చేసి చూపించారు. భారమైనా భారీగానే బడ్జెట్ కేటాయింపులు జరిపి సమస్యలకు, సవాళ్లకు తలొగ్గేది లేదన్న తెగువను కనబర్చారు ఆర్థికమంత్రి. గత అయిదేళ్ళ పాలనలో విధ్వంసం అయిన ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం ప్రారంభమయింది. ప్రజలపై పన్నుల భారం మోపకుండానే వీలైనంతగా ప్రభుత్వ ఆదాయం పెంపునకు కృషి చేస్తామని బడ్జెట్‌లో వాస్తవికతను ప్రజల కళ్లకు కట్టారు. సంక్షేమంతో ఆంధ్రప్రదేశ్‌లో శ్రేయోరాజ్యం స్ఫూర్తిని చాటడం ద్వారా రాజ్యాంగ నిర్మాతల ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్నారు. రెండు అంకెల వృద్ధి రేటు కేవలం గణాంకం కాదు, రాష్ట్ర ఆర్థిక శక్తికి, సమర్థ పాలనకు, పెట్టుబడుల సాధన, ప్రజల జీవన ప్రమాణాల పెంపునకు నమ్మకమైన సంకేతం. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ పాలనకు ప్రాధాన్యత ఇచ్చి ధ్వంసం అయిన వ్యవస్థలను గాడిలో పెట్టి 20 నెలల్లో ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరించి, రాష్ట్ర జీఎస్‌డీపీ మొత్తంగా 11.75శాతం వృద్ధి సాధించడం గర్వించదగ్గ విషయం.



రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో వ్యవసాయం కీలకం. ప్రస్తుత ఆర్థిక పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వృద్ధి రేటును పెంచే లక్ష్యంతో ఈ బడ్జెట్‌లో సాగునీటి ప్రాజెక్టులకు కేటాయింపులు పెరగడం రైతుల ఆదాయం పెంపుదలకు సానుకూల సంకేతం. ప్రభుత్వానికి అతిపెద్ద ఆర్థిక భారమయ్యేది సంక్షేమం. అభివృద్ధి లేకుండా సంక్షేమం కొనసాగదు. ఆదాయం లేకుండా పథకాలు నిలవవు. ఈ బడ్జెట్‌లో పరిశ్రమలకు ప్రోత్సాహకాలు, ఐటీ రంగానికి ప్రాధాన్యత, స్టార్టప్‌లకు మద్దతు, ఆర్థిక క్రమశిక్షణ నిజమైన మార్పు. అలాగే మూలధన వ్యయం పెంపు, పరిపాలనా ఖర్చుల నియంత్రణ, అప్పుల నిర్వహణ కొనసాగితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ స్థిరపడే అవకాశం ఉంది. సొంత ఆదాయాన్ని పెంచుకుంటూనే, సంక్షేమ పథకాలను ఆపకుండా నిర్వహించడం కత్తిమీద సామే. విభజన హామీలు, ప్రత్యేక ప్యాకేజీల రూపంలో కేంద్రం నుంచి ఆశించిన స్థాయిలో నిధుల రాబట్టాల్సి వుంది. ఏది ఏమైనా కేటాయింపులు కాగితాలకే పరిమితం కాకుండా, అవి క్షేత్రస్థాయిలో అమలుకు నోచుకున్నప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది.

● నీరుకొండ ప్రసాద్

వందేమాతరం – నిర్బంధం

'వందేమాతరం'లోని ఆరు చరణాలను ఆలపించడాన్ని నిర్బంధం చేస్తూ కేంద్ర హోం మంత్రిత్వశాఖ ఇటీవల విడుదల చేసిన ఉత్తర్వులు రాజ్యాంగ విరుద్ధమైనవి. మన రాజ్యాంగ నిర్మాతలు, జాతి పెద్దల నిర్ణయానికి భిన్నంగా ఈ ఉత్తర్వులు జారీ చేయడం వారిని అగౌరవపరచడమే. రాజ్యాంగ నిర్మాతల ఆశయాల సాధనకు కృషి చేయవలసిందిపోయి, వారి సమిష్టి అభిప్రాయానికి తిలోదకాలివ్వడం గర్హనీయం.

వందేమాతరం గేయంలోని మిగతా చరణాలలో మతపరమైన అంశాలు ఉన్నందువల్ల దానిని మొదటి రెండు చరణాలకే పరిమితం చేయాలని భారత రాజ్యాంగ సభ నిర్ణయించింది. ఈ మేరకు దేశ తొలి రాష్ట్రపతి డా. బాబూరాజేంద్రప్రసాద్ 1950 జనవరి 24న ఒక ప్రకటన చేశారు. అంతకు ముందు 1937లో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో కూడా జాతీయ నాయకులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. 1939 జూలై 1న 'హరిజన' పత్రికలో రాసిన వ్యాసంలో కొన్ని వర్గాల ప్రజలు ఆక్షేపించేటట్లయితే వందేమాతరం పాటను పాడనవసరం లేదని గాంధీజీ కూడా స్పష్టం చేశారు. అలాగే తన పుస్తకం 'నిర్మాణాత్మక కార్యక్రమం'లో వందేమాతరం పాటను ఇతరులపై బలవంతంగా రుద్దరాదని గాంధీజీ పేర్కొన్నారు. ముస్లింలకు అభ్యంతరకరంగా, కోపం తెప్పించేదిగా ఉండరాదని కూడా స్పష్టం చేశారు. 1896లోనే విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ మొట్టమొదటిగా వందేమాతరాన్ని ఆలపించారు. వందేమాతరంలోని మొదటి రెండు చరణాలనే ఆయన పాడారు. అవి వివాదరహితమయినవని ఆయన అభిప్రాయపడ్డారు. మిగతా చరణాలు దుర్గామాతను స్తోత్రించే విధంగా ఉన్నాయని ఆయన భావించారు.

రాజ్యాంగ సభ వందేమాతర గేయానికి జాతీయ గీతంతో పాటు సమాన హోదా కల్పించలేదు. దానికి చట్టబద్ధత కూడా లేదు. కాని హోం మంత్రిత్వశాఖ తాజాగా విడుదల చేసిన ఉత్తర్వులలో వందేమాతరం గేయాన్ని తప్పనిసరిగా జాతీయ గీతం కంటే ముందు పాడాలని, ఆరు చరణాలను కూడా ఆలపించాలని నిర్బంధించడం అహేతుకం. ఇతర మతస్తులను కూడా హిందూమత ప్రాధాన్యం కలిగిన వందేమాతర గీతంలోని అన్ని చరణాలను ఆలపించాలని ఆజ్ఞాపించడం వారి మత స్వేచ్ఛకు, సెక్యులర్ భావనలకు భంగకరం.

– డా. పి.సి సాయిబాబు

నెలసరి సమస్యకు జీవించే హక్కు దాకా వెళ్లాలా?!

ఇటీవల సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఒక ప్రజాప్రయోజన వ్యాజ్యంపై ఆదేశాలను వెలువరిస్తూ– దేశంలో విద్యార్థినుల నెలసరి ఆరోగ్య సమస్యను భారత రాజ్యాంగంలోని జీవించే హక్కులో భాగంగా వ్యాఖ్యానించింది. ఈ నెలసరి సమస్య స్కూలు విద్యార్థినుల చదువుకునే సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తున్నప్పుడు, అది వారి విద్యా హక్కునూ వారికి గల గౌరవప్రదమైన జీవించే హక్కునూ ప్రభావితం చేస్తున్నట్టేననీ, కాబట్టి పౌరుల ప్రాథమిక హక్కులకు జవాబుదారీ అయిన ప్రభుత్వాలు ఈ విషయంలో ఆడపిల్లల ఆరోగ్యాన్ని పరిరక్షించే విధానాలు చేపట్టాలని కోర్టు ఆదేశించింది. ఈ ఆదేశానికి మూడు నెలల్లోగా అమలు రూపం తీసుకురావాలని గడువు విధించింది. ఈ విషయాల పర్యవేక్షణ బాధ్యతను విద్యాశాఖకూ, బాలల హక్కుల కమిషన్‌లకూ అప్పగించింది కూడా. ఈ ఆదేశాన్నొక చరిత్రాత్మకమైన ముందడుగుగా చాలామంది భావిస్తున్నారు.

ఆడపిల్లల నెలసరి ఆరోగ్య సమస్య స్కూళ్లలో వారి హాజరునూ, మానసిక స్థితినీ ప్రభావితం చేస్తున్నప్పుడు, అది వారిని పూర్తి సామర్థ్యాలతో ఎదగనీయకుండా అడ్డుకోగలదు. ఆ పిల్లల కుటుంబాల ఆర్థిక స్తోమత వల్ల కూడా ఈ సమస్య ప్రభావం పెరుగుతుంది. అలా, వారికి తమ జెండరే ఒక ఆటంకం కాగా, పేదరికం మరో ప్రధాన ఆటంకం. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు తీర్పును ఆహ్వానించాల్సిందే.

అయితే ఈ తీర్పు కొంత సంతోషాన్నీ, ఎక్కువ నిర్వేదాన్నీ కలుగజేస్తున్నది. సంతోషం ఎందుకంటే– ఇప్పుడు అరకొరగా అమలవుతున్న ఈ విధానం, కోర్టు ఆదేశాలతో మరికొంత విస్తృతంగా అమలయ్యే అవకాశం ఉంది కాబట్టి. కోర్టు చెప్పిన స్థాయిలో కాకున్నా, ప్రభుత్వాలు కనీసం విద్యార్థినులకు శానిటరీ పాడ్స్ సరఫరా చేసినా కూడా, చాలామంది పేద మధ్యతరగతి ఆడపిల్లలకు ఎంతో సహాయం చేసినట్టే. ఇక నిర్వేదం ఎందుకంటే– కోర్టులు ఎంత చెప్పినా ప్రభుత్వాల దగ్గర నుంచి ఆ స్థాయి స్పందన ఆశించే కాలం పోయింది కాబట్టి. కనీసం సగం ప్రభుత్వ స్కూళ్లలో ఇవాళ్టికీ సురక్షిత మంచినీటికీ, కనీస స్థాయి టాయిలెట్లకూ, పుస్తకాలకూ, యూనిఫారాలకే అవకాశాల్లేని పరిస్థితుల్లో స్కూళ్లలో శానిటరీ పాడ్స్ కోసం వెండింగ్ మిషన్స్ అమర్చడం, పర్యావరణహితమైన డిస్పోజబుల్ వ్యవస్థలను ఏర్పాటు చేయటం ఊహించనలవి కాని విషయాలే.


ఆడపిల్లల నెలసరి సమస్యను వ్యక్తిగతమైనదిగా కాక, అది సామాజిక సమస్య అని, ఈ విషయంలో ప్రభుత్వానికి ప్రధాన బాధ్యత ఉందని, దానిని జీవించే హక్కులో భాగంగా వ్యాఖ్యానిస్తే తప్ప.. పాలకులు కదలని స్థితిలో ఉండటమే విచారకరం.

ఆడపిల్లల నెలసరి సమస్య వ్యక్తిగతమైనది కాదు, అది సామాజిక సమస్య అని, ఈ విషయంలో ప్రభుత్వానికి ప్రధాన బాధ్యత ఉందని చెప్పిన సుప్రీంకోర్టు ఆదేశం ఆహ్వానించదగ్గదే. అయితే విద్యార్థినుల నెలసరి ఆరోగ్య పరిరక్షణను జీవించే హక్కులో భాగంగా వ్యాఖ్యానిస్తే తప్ప పాలకులు కదలని స్థితిలో ఉండటమే విచారకరం.



పౌరులు తమ వికాసానికి సంబంధించిన అంశాలను సొంతంగా నిర్వహించుకోలేక లేదా అరకొరగా మాత్రమే నిర్వహించుకుంటూ, మిగతా వారికంటే వెనుకబడిపోతుంటే ఆ లోపాన్ని సవరించే బాధ్యతను ప్రభుత్వాలు తీసుకోవడం నాగరికం, నైతికం. భారతదేశంలో పౌర రాజకీయ హక్కుల కంటే ఆర్థిక, సామాజిక హక్కులు ముందు వరుసలో ఉండాలి. విచారకరంగా, మన రాజ్యాంగం పౌర రాజకీయ హక్కులను ప్రాథమిక హక్కులుగా చేసి ఆర్థిక, సామాజిక హక్కులను ఆదేశిక సూత్రాల్లో మాత్రమే పెట్టుకోగలిగింది. ఆదేశిక సూత్రాలు పరిపాలనకు ఆదర్శాల లాంటివే కానీ, వాటిని అమలు చేసి తీరాల్సిన బాధ్యత తమకు లేదని పాలకులు భావిస్తారు. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు చాలా కాలంగా ఈ ఆర్థిక సామాజిక హక్కులను పౌర, రాజకీయ హక్కుల్లోని అతి ముఖ్యమైన జీవించే హక్కుకు అనుసంధానం చేయటానికి తంటాలు పడుతున్నది. అలా గత 40 ఏళ్లుగా జీవించే హక్కును విస్తరింపజేస్తూ వెళ్తున్నది. జీవనోపాధి, గృహ వసతి, విద్య, వైద్యం, పర్యావరణం వంటి వాటిని కలుపుకుని ఇప్పటికి 26 అంశాలను అలా జీవించే హక్కులో భాగం చేసింది. ఈ పరంపరలో ఇప్పుడీ నెలసరి ఆరోగ్య హక్కు ఇరవై ఏడవది. తప్పనిసరి ప్రాథమిక విద్య అనే అంశం ఒక్కటే రాజ్యాంగ సవరణ ద్వారా ప్రాథమిక హక్కుల జాబితాలో చేరింది. మిగతావేవీ సుప్రీంకోర్టు వ్యాఖ్యానాల పరిధి దాటి ముందుకు కదలలేదు. అసలు జీవించే హక్కునే రోజూ ఎన్‌కౌంటర్ చేస్తున్న కాలంలో ఈ కొసరు జీవించే హక్కులకు హామీ పడేదెవరు? ఒకవైపు, సమాజంలో ఆర్థిక సామాజిక అంతరాలను మరింత పెంచే పరిపాలనల మధ్య, ఏ అవసరాన్ని ఎంత పెద్ద హక్కులో భాగం చేస్తే మాత్రం పరిస్థితిలో మార్పు వస్తుందా? సామాన్య పౌరులు ఆధిపత్య వర్గాలకు కొమ్ము కాసే ప్రభుత్వాలకు వంత పాడినంతకాలం వారి పిల్లల నెలసరి సమస్య, విద్య, గౌరవాలు పాలకుల ప్రాధాన్యతల్లో, జీవించే హక్కులో భాగం అవుతాయా?

■ డా. ఎస్.తిరుపతయ్య



21న జడ్పీ మొదటి స్థాయి సంఘ సమావేశం

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు జిల్లా పరిషత్ మొదటి స్థాయి సంఘ సాధారణ సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు సీఈవో వీర్ల జ్యోతిబసు తెలిపారు. జడ్పీ కార్యాలయంలోని చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టీనా చాంబర్‌లో ఆమె అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు. ప్రణాళికలు, ఆర్థిక వ్యవహారాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులు, సభ్యులు సమావేశానికి హాజరుకావాలన్నారు.



కన్నుల పండువగా రథోత్సవం

అమరావతి అమరేశ్వరాలయంలో మంగళవారం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి వార్ల రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. రథోత్సవం ప్రారంభమైనప్పటి నుంచి ముగిసే వరకు భక్తుల శివనామస్మరణలతో ప్రధాన రహదారి మారుమోగింది.

8లో..

ట్రాఫిక్‌పై ఎస్పీ దృష్టి

- గుంటూరులో ద్విచక్ర వాహనంపై పర్యటన
- ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని ఆదేశాలు

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): శంకర్ విలాస్ బ్రిడ్జి నిర్మాణంతో తరచూ నగరంలో ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఎస్పీ వకుల్‌జిందాల్ రంగంలోకి దిగారు. ఆయన స్వయంగా మంగళవారం ఈస్ట్ ట్రాఫిక్ సీఐ అశోక్ కుమార్ ద్విచక్ర వాహనంపై పర్యటించారు. కంకరగుంట అండర్ పాస్, గుజ్జనగుండ్ల సెంటర్, కొరిటెపాడు రోడ్డు, ఎన్‌టీఆర్ స్టేడియం సర్కిల్, లక్ష్మీపురం మెయిన్ రోడ్, మదర్‌థెరిస్సా సెంటర్, లాడ్జి సెంటర్, శ్రీనగర్ మెయిన్ రోడ్, మూడు వంతెనల అండర్ పాస్, కొత్తపేట శివాలయం జంక్షన్, గుంటగ్రౌండ్ సెంటర్, ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతం, బీఆర్ స్టేడియం సర్కిల్, హిమనీ సెంటర్, ఎంటీబీ సెంటర్, మహిళా కళాశాల సెంటర్, నాజ్ సెంటర్, రైల్వే స్టేషన్, కోర్టు రోడ్డు, నగరం పాలెం, జిల్లా పోలీస్ కార్యాలయం వరకు ఎస్పీ ద్విచక్ర వాహనంపై పర్యటించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తే ప్రదేశాలను, డైవర్షన్లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో తీసుకోవాల్సిన ట్రాఫిక్ నియంత్రణ చర్యల గురించి, అదనపు ట్రాఫిక్ సిబ్బంది నియామకంపై అధికారులతో చర్చించారు.



ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్‌తో కలసి ద్విచక్ర వాహనంపై పర్యటిస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

ఆక్రమణల తొలగింపునకు చర్యలు

రోడ్లపై ఆక్రమణలను మున్సిపల్ సహకారంతో వెంటనే తొలగించాలని, వాహనాలు రోడ్లపై నిలపకుండా వారికి కౌన్సెలింగ్ ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద బస్సులు, ఆటోలు ఆగకుండా నిర్ణీత పార్కింగ్ ప్రదేశాలను కేటాయించాలన్నారు. నిబంధనలు అతిక్రమించే వారికి జరిమానా విధించాలని సూచించారు. వాహనదారులు తప్పకుండా రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని లేకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీలు అబ్దుల్ అజీజ్, శ్రీనివాసులు, బెల్లం శ్రీనివాస్, సీఐలు అళహరి శ్రీనివాస్, వీరయ్య, సింగయ్య తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహాల్లో పర్యవేక్షణ ఏదీ..?



- అనుమతి లేకుండా విద్యార్థినులు బయటకు..!
- హాస్టల్స్‌లో పెచ్చు మీరుతోన్న సిబ్బంది ఆగడాలు

8

ఉండవల్లి పంపింగ్ హౌస్-2కు రూ. 595 కోట్లు

- 8,400 క్యూసెక్కుల సామర్థ్యంతో నిర్మాణం
- సర్వే, డిజైన్, నిర్మాణం, 15 ఏళ్లపాటు నిర్వహణ
- నిధులు మంజూరు చేసిన పురపాలక శాఖ

చింతలపూడిలో భారీ చోరీ

- 42 సవర్ల బంగారం,10 కిలోల వెండి అపహరణ

పీఎఫ్ బకాయిల జమకు మీనమేషాలు

- గత ప్రభుత్వ హయాం నుంచి బకాయి

6



- అమాంతం పెరిగిన ధరలు
- ధూమపాన ప్రియులకు షాక్
- జీఎస్టీ, ఎక్సైజ్ పెంపుతో పెరుగుదల
- వాస్తవ ధర కన్నా అధిక ధరకు విక్రయం

సిగరేట్

తెనాలి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ధూమపానప్రియులకు సిగరెట్ ధరలు షాక్ ఇస్తున్నాయి. సిగరెట్లపై జీఎస్టీ, ఎక్సైజ్ సుంకాలను కేంద్ర బడ్జెట్‌లో పెంచారు. దీంతో సిగరెట్ల ధరలు భారీగా పెరిగాయి. దీనికితోడు చిల్లర వర్తకులు, డీలర్లు కుమ్మక్కై వాస్తవ ధర కన్నా అధిక ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దుకాణానికో ధర చెబుతుండడంతో వాస్తవంగా ఎంత పెరిగిందో తెలియక వినియోగదారులు అయోమయానికి గురవుతున్నారు. సిగరెట్ల విక్రయాల్లో అవకతవకలు చోటుచేసుకుంటున్నాయన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. కృత్రిమ కొరత సృష్టించి డీలర్లు, హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు వినియోగదారుడి జేబుకు చిల్లు పెడుతున్నారని ఆరోపణలున్నాయి.

బడ్జెట్‌కు ముందే పెంచేశారు..

బడ్జెట్‌లో సిగరెట్లపై సుంకాలు విధిస్తారన్న ముందస్తు సమాచారంతో డీలర్లు, హోల్‌సేల్ వ్యాపారులు ధరలను అమాంతం పెంచేశారు. కృత్రిమ కొరత సృష్టించి రిటైలర్లకు అధిక ధరలకు విక్రయించారు. దీంతో వారు ఆ భారాన్ని వినియోగదారులపై మోపేలా చేశారు. గత ఏడాది డిసెంబరు నుంచి ఒక్కో సిగరెట్ ప్యాకెట్‌పై రూ.10 నుంచి రూ.20 వరకు(బ్రాండ్‌ను బట్టి) ధరను పెంచి విక్రయించారు. తాజాగా ఫిబ్రవరి 1 నుంచి ఒక్కో పెట్టెపై రూ.20 నుంచి రూ.60 వరకు పెంచి విక్రయిస్తున్నారు. ఓ కంపెనీకి చెందిన పాపులర్ బ్రాండ్ 10 సిగరెట్ల ప్యాకెట్ ధర డిసెంబరుకు ముందు రూ.180 ఉండగా సుంకాలు పెంచుతారన్న (మిగతా 8వ పేజీలో)

ఇతర ఉత్పత్తులపైనా..

నమిలి తినే పొగాకు ఉత్పత్తులపై కూడా భారీగా సుంకాలను పెంచారు. ఖైనీ, గుట్కా వంటి ఉత్పత్తులపై గతంలో 25 శాతం సుంకాన్ని 100 శాతానికి పెంచగా, హుక్కా పొగాకుపై పన్ను 25 శాతం నుంచి 40 శాతానికి, ముడి పొగాకుపై 60 శాతం నుంచి 70 శాతానికి పెంచారు.

వైద్యులు నిరంతర విద్యార్థులే..



వైద్య విద్యార్థికి డిగ్రీ ప్రదానం చేస్తున్న కేంద్ర సహాయ మంత్రి అనుప్రియ పటేల్, మంత్రి లోకేశ్

- జీవితాంతం నేర్చుకుంటూ పరిణతి చెందాలి
- కేంద్ర సహాయ మంత్రి అనుప్రియ పటేల్
- ఘనంగా మంగళగిరి ఎయిమ్స్ స్నాతకోత్సవం

8

డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మిపై వేటు

- పోస్టింగ్ ఇవ్వకుండా డైరెక్టరేట్‌కి సరెండర్
- నూతన డీఎంహెచ్‌వోగా వెంకటేశ్వర్లు నియామకం

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు డీఎంహెచ్‌వో డాక్టర్ కే విజయలక్ష్మిపై ప్రభుత్వం క్రమశిక్షణ వేటు వేసింది. పోస్టింగ్ ఇవ్వకుండా, రాష్ట్ర వైద్య ఆరోగ్యకుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టరేట్‌కు సరెండర్ చేస్తూ మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. ఆమె స్థానంలో ప్రకాశం జిల్లా వైద్యాధికారి డాక్టర్ టీ వెంకటేశ్వర్లును నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఒంగోలు ప్రభుత్వాస్పత్రిలో సివిల్ సర్జన్ రెసిడెంట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ బీ మాధవిలతను ప్రకాశం డీఎంహెచ్‌వోగా నియమించింది.



తురకపాలెం జ్వరాలపై నిర్లక్ష్యం..

డాక్టర్ విజయలక్ష్మిపై పలు ఆరోపణలు రావడంతో ప్రభుత్వం ఆమెపై చర్యలు తీసుకున్నట్లు సమాచారం. నగర శివార్లలోని తురకపాలెంలో ప్రబలిన జ్వరాలను గుర్తించి ఆరోగ్యశాఖను అప్రమత్తం చేయడంలో ఆమె ఉదాసీనంగా వ్యవహరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. జ్వరాలతో అకాల మృత్యువు బారిన పడుతున్నా సరైన నివారణ చర్యలు చేపట్టడంలో డాక్టర్ విజయలక్ష్మి నిర్లక్ష్యంగా వ్యవహరించారని, జిల్లా స్థాయి అధికారిగా ఆమె సరిగా స్పందించ లేదని నేరుగా ఆరోగ్య శాఖ డైరెక్టర్‌కు అప్పట్లో ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు ఫిర్యాదు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో చేపట్టిన పలు నియామకాల్లో అవినీతి జరిగినట్లు ఫిర్యాదులు ఉన్నతాధికారులకు అందాయి. ఇందులో డీఎంహెచ్‌వో పాత్రపై అనుమానాలు ఉన్నాయని, వీటిపై విచారణ జరపాలని పలు ఫిర్యాదులు ప్రభుత్వానికి అందాయి. ఈ నేపథ్యంలో మంగళవారం ప్రభుత్వం డాక్టర్ విజయలక్ష్మిపై వేటు వేసింది.

మిర్చి ధర.. తగ్గుదల

- అన్ని రకాల కాయలపైన ప్రభావం
- క్వింటాల్‌కు రూ.3 వేల వరకు తగ్గిన రేటు
- దిగుమతికి తగ్గట్లుగా యార్డులో కొరవడిన డిమాండ్



గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇంచుమించు రెండు నెలల పాటు మెరిసిన మిర్చి ధరలు తగ్గుముఖం పట్టాయి. గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ (మిర్చి యార్డు)కు నిత్యం లక్ష టిక్కీల వరకు దిగుమతి జరుగుతుండగా వాటికి తగ్గట్టుగా కొనుగోళ్ల డిమాండ్ లేదు. దీంతో వారం వ్యవధిలోనే క్వింటాల్‌కు రూ.3 వేల వరకు ధర తగ్గింది. తేజ, దేవనూరు డీలక్స్, బ్యాడిగి, 334 తదితర రకాల ధరలు తగ్గాయి. ఈ ఏడాది మిర్చి సాగు విస్తీర్ణం తక్కువగా ఉండటం, వర్షాలతో పంట దెబ్బతినడం తదితర కారణాలతో గత డిసెంబరు నుంచి మిర్చి ధర పెరుగుతూ వచ్చింది. ఒక దశలో దేవనూరు డీలక్స్, బ్యాడిగి రకాలు క్వింటాల్ రూ.27 వేల వరకు చేరాయి. తేజ రకం మిర్చి క్వింటాల్ రూ.20 వేలు దాటింది. అయితే వారం నుంచి కొనుగోళ్లలో మందకొడి వాతావరణం నెలకొనడంతో ధరలు తగ్గాయి. తేజ వెరైటీ క్వింటాల్ రూ.3 వేలు తగ్గి రూ.17 వేలకు చేరింది. కారం తయారీకి ఎక్కువగా వినియోగించే బ్యాడిగి, దేవనూరు డీలక్స్, 334, 341 రకాలు క్వింటాల్ రూ.23 వేల లోపునకు వచ్చాయి. దీంతో రైతులు మిర్చిని విక్రయించేందుకు వెనకడుగు వేస్తున్నారు. మహా శివరాత్రికి ముందే రోజుకు లక్ష టిక్కీలకు పైగా రాగా పండగ తర్వాత దిగుమతి పెరుగుతుందని అంచనా వేస్తే నేడు 80 వేల నుంచి 84 వేల టిక్కీల మధ్యనే రైతులు తీసుకొస్తున్నారు.

కల్లాల్లోనే విక్రయాలకు మొగ్గు..

ధరలు తగ్గుతుండటంతో ఎగుమతి దారులు ఆచితూచిగా మిర్చి కొనుగోలు చేస్తు న్నారు. దీంతో చాలామంది రైతులు మిర్చి యార్డుకు తీసుకు రాకుండా గ్రామాల్లోనే విక్రయిస్తున్నారు. రెండు రోజుల నుంచి యార్డుకు సరుకు రాక తగ్గుముఖం పట్టింది. రైతులు కల్లాల వద్దే మిర్చి టిక్కీలు విక్రయిస్తున్నారు. మిర్చియార్డుకు తీసుకొచ్చే ప్రతీ టిక్కీపైనా రవాణా, దిగుమతి, కాటా, దొడ్డికా పలా, కమీషన్ వంటి ఖర్చులతో రూ.40 వరకు అదనపు ఖర్చు రైతు భరించాల్సి వస్తుంది. పైగా ఎగుమతి వ్యాపారులు గుమస్తాలు, కొంతమంది హమాలీలు రైతులు తీసుకొచ్చిన మిరపకాయలను ఒక్కో లాట్ నుంచి మచ్చు కాయల పేరుతో తీసుకుని బయటకు తీసుకెళ్లి విక్రయించుకుంటున్నారు. అదే ఊళ్లల్లో అయితే ఈ ఖర్చులతో పాటు రవాణా చార్జీలు కూడా ఉండవు. వ్యాపారులే రైతు కల్లాల వద్దకు వెళ్లి కొనుగోలు చేసి అక్కడికక్కడే నగదు చెల్లిస్తున్నారు. ఇది కూడా సరుకు రాక తగ్గుముఖం పట్టడానికి ఒక కారణంగా మారింది. ఈ నేపథ్యంలో మార్కెటింగ్ అధికారులు ధరలు మరింత పడిపోకుండా తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. అలానే రైతులు యార్డుకు తీసుకొచ్చి విక్రయిస్తే లాభం కలుగుతుందన్న వాతావరణాన్ని ఏర్పరచాలి. లేకుంటే మార్కెట్ ఫీజు రూపంలో ఏఎంసీ ఆదాయం కోల్పోక తప్పదు.



పకడ్బందీగా అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ పరీక్షలు

- పరుగు పోటీలను పరిశీలించిన జేసీ అశుతోష్

6

ఇళ్ల కాంట్రాక్టర్లపై క్రిమినల్ చర్యలు

- ఉగాది గృహ లక్ష్యాలు పూర్తి చేయాలి
- సమీక్షలో కలెక్టర్ అన్సారియా ఆదేశాలు

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల నిర్మాణాల్ని మధ్యలో ఆపేసిన కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కలెక్టర్ తమీమ్‌అన్సారియా ఆదేశించారు. గృహనిర్మాణం, జిల్లా నీటి యాజమాన్య సంస్థల ఆధ్వర్యంలో జరుగుతోన్న అభివృద్ధి పనులపై మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలతో కలెక్టరేట్ నుంచి ఆమె వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ గృహ నిర్మాణం వల్ల ఒక లబ్ధిదారుకు సొంత ఇంటి కల నెరవేరుతుందని గ్రహించాలన్నారు. ఉగాది నాటికి జిల్లాలో 22,952 గృహాల లక్ష్యం పూర్తి చేసేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. ఉపాధి హామీలో పనులు చేసుకోవచ్చని, బిల్లుల చెల్లింపు వెంటనే జరుగుతుందని లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. పి.యం.ఎ.వై 2.0 కింద 1755 గృహాలకు 262 మాత్రమే ప్రారంభించారని, మిగిలినవి వెంటనే ప్రారంభించేలా చూడాలన్నారు. గృహ నిర్మాణ సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ జె.వి.ఎస్.ఆర్.కె ప్రసాద్ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలు, ఫిరంగిపురం, ప్రత్తిపాడు, కొల్లిపర, తాడికొండ, కాకుమాను, పెదనందిపాడు, గుంటూరు మండలాల్లో ప్రగతి మెరుగుపడాలన్నారు.

తాగునీటి సమస్య రాకూడదు

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తరాదని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. జిల్లా నీరు-పారిశుద్ధ్య కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. పంచాయతీల వారీగా స్పష్టమైన కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసి, నిధుల లభ్యతపై నివేదికలు సమర్పించాలన్నారు.



ప్రభుత్వాసుపత్రి వద్ద అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ కృతికా శుక్లా

21న వినుకొండకు సీఎం

స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి చంద్రబాబు

ఏర్పాట్లపై అధికారులకు సూచనలు చేసిన కలెక్టర్ కృతికా శుక్లా

వినుకొండ టౌన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వినుకొండ మున్సిపల్ పట్టణ పరిధిలో శనివారం జరిగే స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు పాల్గొననున్నారు. సీఎం పర్యటన ఖరారైన నేపథ్యంలో ఏర్పాట్లపై మంగళవారం కలెక్టర్ కృతికా శుక్లా అధికారులతో పట్టణంలోని ప్రభుత్వ వైద్య శాలలో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమన్వయంతో పని చేసి ముఖ్యమంత్రి పాల్గొనే స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. సమావేశం అనంతరం ఆర్డీఓ మధులత, ఇతర అధికారులతో కలిసి హెలిప్యాడ్ ఏర్పాటుకు సంబంధించి జూనియర్ కళాశాల, లయోలా స్కూల్లోని స్థలాలను పరిశీలించారు. బహిరంగ సభ ఏర్పాటుకు ఎన్ఎస్‌పీ కాలనీలో స్థలాన్ని పరిశీలించి మున్సిపల్, రెవెన్యూ, విద్యుత్ అధికారులకు పలు సూచనలు చేశారు.

కోల్డ్ స్టోరేజీలో 1,148 మిర్చి టిక్కీలు మాయం

● లబోదిబోమంటున్న తెలంగాణ రైతులు
● ప్రస్తుతం వాటి విలువ రూ.91 లక్షలు
● విచారణ ప్రారంభించిన ఏఎంసీ అధికారులు

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు నగరంలోని ఓ కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ చేసిన మిర్చిని సంబంధిత యాజమాన్యం మాయం చేసిందని తెలంగాణ రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన ఏడుగురు రైతులు లబోదిబోమంటున్నారు. వీటి విలువ ప్రస్తుత మార్కెట్ ధరల ప్రకారం సుమారు రూ.91 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. మిర్చియార్డులో కమీషన్ ఏజెంట్ లైసెన్సు కలిగిన వ్యాపారి, కోల్డ్‌స్టోరేజ్ యజమాని కలిసి ఈ మోసానికి పాల్పడినట్లు రైతులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై ఇప్పటికే అక్కడి మార్కెటింగ్ జిల్లా అధికారికి ఫిర్యాదు చేశారు. దాంతో జోగులాంబ గద్వాల జిల్లా మార్కెటింగ్ అధికారి గుంటూరు మార్కెటింగ్ అధికారులకు ఫిర్యాదును పంపించి రైతులకు తగిన న్యాయం జరిగేలా చూడాల్సిందిగా కోరారు. ఈ నేపథ్యంలో దీనిపై మిర్చియార్డులో విచారణ ప్రారంభమైంది.

● మూడేళ్ల క్రితం నిల్వ

మూడేళ్ల క్రితం తెలంగాణ రాష్ట్రంలోని జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన రైతులు తమ మిర్చి టిక్కీలను కమీషన్ వ్యాపారి ద్వారా మిర్చియార్డుకు సమీపంలోని శీతల గిడ్డంగిలో నిల్వ చేశారు. అప్పట్లో ధర తక్కువగా ఉండటంతో ఆ మిరపకాయలపై టిక్కీకి రూ. 3వేల లోను తీసుకొన్నారు. ఈ రైతులు అప్పుడప్పుడు వచ్చి తమ మిరపకాయలను అమ్మవద్దని, తీసుకున్న రుణాన్ని వడ్డీతో సహ చెల్లిస్తామని కమీషన్ వ్యాపారి, కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యానికి చెబుతూ వచ్చారు. ప్రస్తుతం మార్కెట్ కొంత ఆశాజనకంగా ఉండటంతో కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ ఉంచిన మిర్చి టిక్కీలను విక్రయించేందుకు రైతులు రాగా వాటిని ఎప్పుడో యాజమాన్యం అమ్మేసిందని తెలుసుకొని ఆశ్చర్యపోయారు. దీంతో తాము మోసపోయామని భావించిన రైతులు తమ వద్ద ఉన్న ఆధారాలతో మార్కెటింగ్ అధికారులను ఆశ్రయించారు. మంగళవారం మిర్చియార్డు అధికారుల వద్ద తమ గోడును వెళ్లబోసుకున్నారు. తాము నిల్వ చేసిన మిర్చి టిక్కీల విలువ రూ.91 లక్షల వరకు ఉంటుందని తెలిపారు. దీనిపై కమీషన్ వ్యాపారి, కోల్డ్‌స్టోరేజ్ యజమానిని అడుగుతుంటే సమాధానం చెప్పకుండా బెదిరింపులకు దిగుతున్నారని ఆరోపించారు. ఎలాగైనా తమ మిర్చిని తమకు ఇప్పించి న్యాయం చేయాలని కోరారు. కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ చేసినట్లు రైతుల వద్ద అన్ని ఆధారాలు ఉండటంతో సంబంధిత యజమాన్యానికి నోటీసులు జారీ చేయాలని మార్కెటింగ్ అధికారులు నిర్ణయించారు.

భారత్ విస్తార్‌తో సత్వర సమాచారం

● ఎన్జీ రంగా వర్సిటీ విస్తరణ సంచాలకులు శివనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న విస్తరణ సంచాలకులు జి.శివనారాయణ

లాంఫాం (తాడికొండ), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): రైతులకు సత్వరమే వ్యవసాయ సమాచారాన్ని అందించటానికి కేంద్ర ప్రభుత్వం భారత విస్తార్ (వర్చువల్లీ ఇంటిగ్రేటెడ్ సిస్టమ్ టు యాక్సెస్ అగ్రికల్చర్ రిసోర్స్)ను రూపొందించిందని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ పేర్కొన్నారు. మంగళవారం రాజస్థాన్‌లోని జైపూర్‌లో కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్‌చౌహాన్ భారత్ విస్తార్‌ను ప్రారంభించారు. కార్యక్రమాన్ని వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి వర్చువల్‌గా రైతులు, శాస్త్రవేత్తలు, విశ్వవిద్యాలయ అధికారులు వీక్షించారు. ఈ సందర్భంగా శివనారాయణ మాట్లాడుతూ, రైతులకు వారి సొంత బాషలో ఫోన్ కాల్ ద్వారా సమాచారాన్ని అందించడానికి ఏఐ ఆధారితంగా ఈ ప్లాట్‌ఫామ్‌ను రూపొందించారని తెలిపారు. పంట ప్రణాళిక, పద్ధతులు, వాతావరణ సూచనలు, మార్కెట్లు, ప్రభుత్వ పథకాల సమాచారం, అర్హత, దరఖాస్తు, ఫిర్యాదుల పరిష్కారాలపై సమాచారం లభిస్తుందన్నారు. రైతులు 155261కు ఫోన్ చేసి దీనితో అనుసంధానం కావచ్చన్నారు. కార్యక్రమంలో, ఏపీ బీజేపీ కిసాన్ మోర్చా జనరల్ సెక్రటరీ వై.వి.సుబ్బారావు, పరిశోధనా సంచాలకులు పీవీ సత్యనారాయణ, ఇంజనీరింగ్ డీన్ ఏ.మణి, జి.రామచంద్రరావు, సంపత్ కుమార్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం అదనపు డాక్టర్ ఎన్‌వీవీఎస్ దుర్గాప్రసాద్, బీజేపీ స్టేట్ మీడియా ప్రెసిడెంట్ తిరుపతిరావు పాల్గొన్నారు.

బీటెక్ పరీక్ష ఫలితాల విడుదల

ఏఎన్‌యూ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం గతేడాది నిర్వహించిన బీటెక్ 2వ సెమిస్టర్ సప్లిమెంటరీ 3/4 ఫలితాలను పరీక్షల నిర్వహణాధికారి ఆలపాటి శివప్రసాదరావు మంగళవారం విడుదల చేశారు. రీవాల్యుయేషన్ కావాలనుకునే వారు ఒక్కో సబ్జెక్టుకు రూ.1860 చెల్లించి పీజీ కోఆర్డినేటర్ కార్యాలయంలో దరఖాస్తులను ఈ నెల 27లోగా సమర్పించాలన్నారు. పర్సనల్ వెరిఫికేషన్, జిరాక్స్ కాపీ ఆన్సర్ బుక్‌లెట్ల కోసం రూ.2190 చెల్లించాలన్నారు. పరీక్ష ఫలితాలను ఏఎన్‌యూ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు తెలిపారు. దీంతో పాటు ఎమ్మెస్సీ సాలిడ్ వాటర్ మేనేజ్ మెంట్ మూడో సెమిస్టర్, ఎమ్మెస్సీ మూడో సెమిస్టర్ ఫలితాలను విడుదల చేశామన్నారు.

చింతలపూడిలో భారీ చోరీ

● 42 సవర్ల బంగారం, 10 కిలోల వెండి అపహరణ

పొన్నూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పొన్నూరు మండలం చింతలపూడి గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంట్లో భారీ చోరీ జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, మాజీ మంత్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి సతీమణి ధూళిపాళ్ల ప్రమీల దేవి గృహంలో గుర్తు తెలియని దుండగులు సోమవారం అర్ధరాత్రి దొంగతనం చేశారు. ఇంటిలోకి ప్రవేశించి తలుపులు బద్దలు కొట్టి బీరువాలో భద్రపరిచిన 42 సవర్ల బంగారు ఆభరణాలు, పది కిలోల వెండి వస్తువులను తస్కరించారు. చోరీ సమాచారాన్ని అందుకున్న రూరల్ పోలీసులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని గ్రామంలోని సీసీ టీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించారు. చోరీ జరిగిన ప్రాంతంలో క్లూస్ టీం నిపుణులు సమాచారాన్ని సేకరించారు. డాగ్ స్క్వాడ్ తనిఖీలు జరిగాయి. ప్రమీల దేవి మూడు రోజులుగా గుంటూరులోని కుమారుడు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ గృహంలో ఉంటున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దుండగులు ప్రవేశించి చోరీ చేయడం చర్చనీయాంశమైంది.

యూనిఫైడ్ సర్వేలో పాల్గొంటేనే పథకాలు

● జిల్లా స్వర్ణ గ్రామ, వార్డు అధికారి చొప్పర కృష్ణ

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే ప్రతి కుటుంబం యూనిఫైడ్ సర్వేలో పాల్గొనడం తప్పనిసరని గుంటూరు జిల్లా స్వర్ణ గ్రామ, వార్డు అధికారి చొప్పర కృష్ణ అన్నారు. మేడికొండూరు--1 గ్రామ సచివాలయాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, పీ-4సర్వే, సిటిజన్ ఈ-కేవైసీ కార్యక్రమాల అమలు విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిర్వహిస్తున్న సర్వే వివరాలను ప్రత్యక్షంగా పరిశీలించి నమోదు ప్రక్రియలో కచ్చితత్వం, పారదర్శకత ఉండాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అందుతున్న సేవలపై అభిప్రాయాలు తెలుసుకొని, అర్హులైన ప్రతి కుటుంబం సర్వేలో నమోదు కావాలని ఆయన సూచించారు. సిటిజన్ ఈ- కేవైసీ ప్రక్రియను వేగంగా పూర్తి చేసి, ఎలాంటి పొరపాట్లు లేకుండా పనిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయాల కోఆర్డినేటర్ మోహన్ రెడ్డి, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



మేడికొండూరులో యూనిఫైడ్ సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా సచివాలయాల అధికారి చొప్పర కృష్ణ

● సిబ్బంది గైర్హాజరుపై ఆగ్రహం

మేడికొండూరు సచివాలయాన్ని ఆకస్మికంగా సందర్శించిన జిల్లా స్వర్ణ గ్రామ, వార్డు అధికారి చొప్పర కృష్ణ సిబ్బంది గైర్హాజరుపై ఆగ్ర హం వ్యక్తం చేశారు. సచివాలయంలో మొత్తం 9 మంది సిబ్బందికి గాను, ఆరుగురు మాత్రమే విధుల్లో ఉండటం, మిగిలిన వారు ఎక్క డికి వెళ్ళింది మూమెంట్ రిజిస్టర్‌లో వివరాలు లేకపోవడం గమనించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పీఎఫ్ బకాయిల జమకు మీనమేషాలు

● గత ప్రభుత్వ హయాం నుంచి బకాయి

తెనాలి అర్బన్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ జమానాలో బకాయి పడ్డ పీఎఫ్ సొమ్ములను జమ చేసేందుకు జిల్లా పరిషత్ పీఎఫ్ విభాగం మీనమేషాలు లెక్కిస్తోంది. మండల పరిషత్, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయులకు జిల్లా పరిషత్ ప్రావిడెంట్ ఫండ్ పథకం కింద ప్రతినెలా మినహాయించిన మొత్తాన్ని ఎంఈవోలు, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు షెడ్యూల్‌ను రూపొందించి జిల్లా పరిషత్‌కు పంపుతుంటారు. 2022 జనవరి నెలలో జగన్ ప్రభుత్వం ఉపాధ్యాయులు, ఉద్యోగులకు జీతాలను నేరుగా చెల్లించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో రివర్స్ పీఆర్‌సీ కారణంగా కొత్త జీతాలు వద్దని, పాత జీతాలే చెల్లించాలంటూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు పట్టుబట్టారు. కాని ప్రభుత్వం బలవంతంగా ఉద్యోగుల బ్యాంకు ఖాతాలలో జీతాలు జమ చేసింది. ఆ నెలలో మినహాయించిన పీఎఫ్ సొమ్ములు నాలుగేళ్లయినా ఉపాధ్యాయుల ఖాతాలకు చేరలేదు. ఎట్టకేలకు ఇటీవల ఇందుకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో ఆ మొత్తాలను ఉపాధ్యాయుల పీఎఫ్ ఖాతాలకు జమ చేసే పని మొదలు పెట్టారు. ఇందుకోసం రకరకాల ప్రొఫార్మాలలో వివరాలు జిల్లా పరిషత్‌కు పంపుతున్నారు. ఆ సమయంలో పనిచేసిన ఉపాధ్యాయులు బదిలీల్లో పలు చోట్లకు మారారు. జిల్లా పరిషత్‌కు పంపించే నివేదికల ప్రొఫార్మాలో స్పష్టత లేకపోవడంతో ఇక్కడి అధికారులు కొన్ని పేర్లనే పంపారు. ఇదికాదు అదికాదంటూ పీఎఫ్ విభాగం సిబ్బంది, అధికారులు, సదరు మొత్తాలను జమ చేయడంలో జాప్యం చేస్తున్నారని ఉపాధ్యాయులు విమర్శిస్తున్నారు.

● డీఏ బకాయిలూ జమ కాని వైనం

2018 నుంచి 2020 వరకు రావాల్సిన డీఏ బకాయిలు ప్రస్తుత ప్రభుత్వం చెల్లింపులు చేసింది. సీపీఎస్ విధానంలో ఉద్యోగుల ఖాతాలకు జమ కాగా పీఎఫ్ ఖాతా ఉన్న ఉపాధ్యాయులకు సక్రమంగా బకాయిలు జమ కాలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సదరు బకాయిలు నాలుగైదు విడతలుగా జమ కావాల్సి ఉండగా కొందరికి ఒక్క విడత కూడా జమ కాలేదు. మరికొందరికి కొన్ని విడతల బకాయిలే జమయ్యాయి. ఈ సమస్యను ఎలా ఎదుర్కోవాలో తెలియక ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు. 2022 ఫిబ్రవరిలో జమ కావాల్సిన పీఎఫ్‌తో పాటు డీఏ బకాయిలు జమ చేసేందుకు జిల్లా పరిషత్ అధికారులు స్పష్టమైన విధి విధానాలను డీడీవోలకు వివరించి సమస్య పరిష్కరించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

90 వేల టన్నుల పొగాకు సాగు లక్ష్యం

● పొగాకు బోర్డు సమావేశంలో నిర్ణయం



సమావేశంలో పాల్గొన్న పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్, ఈడీ విశ్వశ్రీ

గుంటూరు సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మార్కెట్‌లో ఉన్న డిమాండ్, సాగుకు అనుకూల పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని 2026-27 కర్ణాటక ప్రాంత పంట కాలానికి 90 వేల టన్నులు ఉత్పత్తి అయ్యే విధంగా పొగాకు సాగు చేయాలని పొగాకు బోర్డు సమావేశంలో నిర్ణయించారు. గుంటూరులోని బోర్డు ప్రధాన కార్యాలయంలో మంగళవారం 166వ పొగాకు బోర్డు సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్ కుమార్ అధ్యక్షత వహించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో లోక్‌సభ సభ్యుడు పి.మహేశ్ కుమార్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ సంచాలకురాలు శనికా గౌర్, రాజమహేంద్రవరంలోని జాతీయ పొగాకు పరిశోధనా కేంద్రం సంచాలకుడు డాక్టర్ మాగుంట శేషు మాధవ్, పొగాకు బోర్డు కార్యనిర్వాహక సంచాలకురాలు బి.విశ్వశ్రీ, వేలం పాటల సంచాలకుడు శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల వ్యవసాయ శాఖ ప్రతినిధులు, పొగాకు బోర్డు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశంలో ప్రధాన అంశంగా 2026-27 సంవత్సరానికి కర్ణాటక ప్రాంతపు పంట కాలానికి సంబంధించిన పొగాకు ఉత్పత్తి పరిమాణాన్ని నిర్ణయించారు. నిర్ధారించిన పరిమితికి లోబడి రైతులు పంట పండించి మెరుగైన ధరలు సాధించవలసిందిగా బోర్డు సూచించింది.

తల్లిదండ్రుల మందలింపు..

ఇంటి నుంచి పారిపోయిన పిల్లలు

● కాచిగూడ రైల్వేస్టేషన్‌లో క్షేమంగా ఉన్నట్లు పోలీసులకు సమాచారం



తల్లిదండ్రులను విచారిస్తున్న పట్టణ సీఐ మల్లికార్జునరావు

రేపల్లె, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు మందలించారనే కోపంతో ఇరువురు పిల్లలు ఇంటి నుంచి పారి పోయిన సంఘటన బాపట్ల జిల్లా రేపల్లె మండలంలోని పేటేరులో జరిగింది. పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపిన వివరాల ప్రకారం, పేటేరు పంచాయతీ బావూజీపాలేనికి చెందిన దిట్ల గోపయ్య, సంధ్యారాణిల కుమారులు రాజ్‌కుమార్, జాషువా పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 7, 3వ తరగతులు చదువుతున్నారు. ఆడుకోవటానికి చిన్నారులకు తల్లిదండ్రులు అనుమతి ఇవ్వకపోవడంతో అలిగిన వారు మంగళవారం ఉదయం 7 గంటల సమయంలో వారి సైకిళ్ల వేసుకొని ఇంటి నుంచి వెళ్ళిపోయారు. ఎంతసేపటికి పిల్లలు తిరిగి రాకపోవటంతో తల్లిదండ్రులు చుట్టు పక్కల వెతికారు, స్కూల్లోనూ ఆచూకీ లభించకపోవటంతో పోలీసులను ఆశ్రయించారు. పట్టణ సీఐ మల్లికార్జునరావు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించటంతో పాటు సమీపంలోని సీసీ టీవీ ఫుటేజీలను సేకరించారు. చిన్నారుల ఆచూకీని కనుగొనేందుకు మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కాగా తప్పిపోయిన చిన్నారులు కాచిగూడ రైల్వే స్టేషన్‌లో ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఆర్పీఎఫ్ పోలీసులు బాలుర తల్లిదండ్రులకు ఫోన్ చేసి బాలురు సురక్షితంగా ఉన్నట్లు తెలియజేశారు.

భక్తుల సేవలో తరించిన చినరాములు సేవా ట్రస్ట్



ఉప్పుటూరి చినరాములు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే ప్రవీణ్, చినరాములు

అమరావతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరిం చుకొని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరేశ్వరాలయంలో స్వామివారిని దర్శించుకున్న భక్తులకు ఉప్పుటూరి చినరాములు సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పాలు, మజ్జిగ, వాటర్ బాటిల్స్ పంపిణీ చేశారు. మహాశివరాత్రి రోజున, రథోత్సవం రోజున భక్తులకు పంపిణీ చేసి వారి మన్ననలు పొందారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొని భక్తులకు మజ్జిగ ప్యాకెట్లు అందజేశారు. భక్తులకు చినరాములు సేవాట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవలకుగానూ చిన రాములును ఎమ్మెల్యే ప్రవీణ్ అభినందించారు.

పకడ్బందీగా అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ పరీక్షలు

● పరుగు పోటీలను పరిశీలించిన జేసీ అశుతోష్



ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్‌ను పరిశీలిస్తున్న జేసీ అశుతోష్ శ్రీవాస్తవ

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఆర్మీ అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ పరీక్షలు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పకడ్బందీగా కొనసాగుతున్నాయి. మంగళవారం జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ పోటీలు జరుగుతున్న ఏఎన్‌యూను సందర్శించారు. ఈ సందర్భంగా బ్రాంచ్ రిక్రూటింగ్ అధికారులతో సమావేశమై చర్చించారు. పరుగు పోటీని జెండా ఊపి ప్రారంభించారు. 10 రోజుల పాటు జరగనున్న ఈ రిక్రూట్‌మెంట్‌లో నిత్యం 850 మందికి శరీర దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరుగు పోటీని అర్ధరాత్రి వేళ నిర్వహిస్తున్నారు. అభ్యర్థులు దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని అధికారులు సూచించారు.

ఉండవల్లి పంపింగ్ హౌస్- 2కు

రూ. 595 కోట్లు

● 8,400 క్యూసెక్కుల సామర్థ్యంతో నిర్మాణం ● సర్వే, డిజైన్, నిర్మాణం, 15 ఏళ్లపాటు నిర్వహణ ● నిధులు మంజూరు చేసిన పురపాలక శాఖ

మంగళగిరి(గుంటూరు), ఫిబ్రవరి 17 (ఆంధ్ర జ్యోతి): రాజధాని అమరావతిలో వరద నివారణ నిమి త్తం ఉండవల్లిలో కొండవీటివాగుపై నిర్మిస్తున్న రెండో పంపింగ్ హౌస్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.595.01 కోట్లు మంజూరు చేసింది. 8,400 క్యూసెక్కుల సామర్థ్యంతో ఉండవల్లిలోని తొలి పంపింగ్ హౌస్ పక్కనే దీనిని కూడా నిర్మించనున్నారు. పంపింగ్ హౌస్ ఏర్పాటుకు సంబంధించి సర్వే, ఇన్వెస్టిగేషన్, డిజైన్, నిర్మాణం, పరిశీలన, పదహేనేళ్లపాటు నిర్వహణకు సంబంధించి వ్యయం రూ.595.01 కోట్లుగా అంచనా వేసిన రాష్ట్ర పురపాలకశాఖ నిధులు మంజూరు చేస్తూ సోమవారం జీవో జారీ చేసింది. గతంలో కాంట్రాక్టు విలువను రూ. 423.64 కోట్లుగా ఏడీసీఎల్ అంచనా వేసింది. అయితే నిర్మాణ, నిర్వహణ దృష్ట్యా నిధులను రూ.595.01 కోట్లకు పెంచారు.

● వరదను నివారించడంలో పంపింగ్ హౌస్ కీలకం

రాజధాని అమరావతికి కొండవీటివాగు వరద ముంపును నివారించడంలో ఈ పంపింగ్ హౌస్ కీలకం కానుంది. అయితే ఇప్పటికే ఒక పంపింగ్ హౌస్ ఉండగా, దీన్ని అదనంగా నిర్మిస్తున్నారు. కొండవీటివాగు నుంచి వరద నీటిని ఈ పంపింగ్ హౌస్‌కు తరలించేందుకు అప్రోచ్ చానల్‌ను నిర్మించనున్నారు. ఇన్‌టేక్ సంప్, పంప్ ఫౌండేషన్, సూపర్ స్ట్రక్చర్ హౌసింగ్ పంపులతో కలిసిన పంపింగ్ స్టేషన్‌ను నిర్మించనున్నారు. పంపులు, మోటార్లు, వాల్వులు, గేట్లు, స్టాప్‌లాగ్‌లు, మెకానికల్, ఎలక్ట్రికల్ సిస్టమ్‌లను ఏర్పాటు చేయనున్నారు. యాంకర్, థ్రస్ట్ బ్లాక్స్, సర్జ్ ప్రొటెక్షన్ ఏర్పాట్లతో కూడిన వరద నీటి విడుదల విధానాన్ని ఇందులో రూపొందిస్తున్నారు. ఈ నేపథ్యంలో నిధులను పెంచారు. రాజధాని నిర్మాణంలో భాగంగా రాజధాని గ్రామాల గుండా వెళ్లే కొండవీటివాగు, పాలవాగులను విస్తరిస్తున్నారు. కొండవీటివాగు వరద నీటిని నిల్వ చేయడం కోసం శాఖమూరుల్లో నిర్మిస్తున్న 300 ఎకరాల సెంట్రల్ పార్కులో 50 ఎకరాల విస్తీర్ణంలో రిజర్వాయర్‌ను నిర్మిస్తున్నారు. దీంతోపాటు నీరుకొండ రిజర్వాయర్, కురగల్లు, పెనుమాక వద్ద రిజర్వాయర్లు ఏర్పాటు చేస్తున్నారు. అయినప్పటికీ వరద ముంపు అవకాశం లేకుండా ఉండేందుకు ఉండవల్లి వద్ద రెండో పంపింగ్ హౌస్‌ను నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.25 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	116, 123, 135
చికెన్ విత్ స్కిన్(కిలో)	220.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	230.00

మిర్చియార్డు సమాచారం

(మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	85,520
అమ్మకాలు	83,205
నిల్వ	20,788

నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	13500	21500
నెంబరు. 5	13500	22000
273	----	----
341	14000	24000
4884	----	----
సూపర్ 10	----	----
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	18000
షార్క్-1	-----	----
బ్యాడిగి	14000	25000
దేవనూరు డీలక్స్	15500	26000
ఆర్మూరు	13000	17000
ఏసీ కామన్ వెరైటీ		
334	13500	20000
నెంబరు. 5	13000	20500
273	----	----
341	14000	23000
4884	----	----
సూపర్ 10	----	----
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	13000	18000
బ్యాడిగి 355	14000	23500
దేవనూరు డీలక్స్	----	----
తాలుకాయలు	7500	12000

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

బిల్‌గేట్స్ రాకతో ప్రభుత్వ పాలనకు అంతర్జాతీయ గుర్తింపు

● నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : అమరావతికి బిల్‌గేట్స్ రాక ఎంతో శుభ పరిణామం అని, గేట్స్ ఫౌండేషన్ ఇప్పటికే 130 దేశాల్లో పని చేస్తుందని, భవిష్యత్తు భాగస్వామిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో మన రాష్ట్రంలోనూ ఫౌండేషన్ సహకారం అందిస్తుందని మేయర్ కోవెలమూడి రవీంద్ర సంతోషం వ్యక్తం చేశారు. బిల్‌గేట్స్ పర్యటన నేపథ్యంలో ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో విదేశీ ఫౌండేషన్లు క్యూ కడతాయని, అమరావతి వరల్డ్ క్లాస్ సిటీగా అవతరించనుందని రవీంద్ర ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే మన రాష్ట్రంలో కుప్పంలో సంజీవని పైలట్ ప్రాజెక్ట్‌పై బిల్‌గేట్స్ సం తృప్తి వ్యక్తం చేశారన్నారు. ఆయన బృందం చంద్రబాబు ఇచ్చిన ప్రజెంటేషన్‌తో పాటు ఆయా అంశాలపై ఎంతో నిశితంగా పరిశీలించి సంతృప్తి చెందారని అన్నారు. రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి చంద్రబాబుతో బిల్‌గేట్స్‌కు ఉన్న అను బంధం, అదేవిధంగా ఆయన దూరదృష్టి, దార్శనికత దృష్ట్యా లక్షల కోట్ల ఫం డింగ్, చారిటీకి సంబంధించి ఆర్థిక సహకారం, సాంకేతిక సహకారం అంది స్తుందని మేయర్ తెలిపారు. ఈ ఫౌండేషన్‌తో విద్య, వైద్యం, వ్యవసాయం బలో పేతం అవుతుందని తెలిపారు. ప్రత్యేకించి ఏపీ 62 శాతం వ్యవసాయ ఆధారిత రాష్ట్రమైనందున వ్యవసాయానికి మరింత లబ్ధి చేకూరనుందన్నారు. కొంతమంది వైసీపీ నాయకులు అమరావతి బ్రాండ్ ఇమేజ్‌ని అపఖ్యాతి పాలు చేయాలని పని కట్టుకొని స్టీన్ ఫైల్స్ ఉదంతాన్ని ఉటంకిస్తూ.. అంతర్జాతీయ ప్రముఖుడు అయిన బిల్ గేట్స్ వ్యక్తిత్వ హననానికి పాల్పడటం చూసి రాష్ట్ర ప్రజలంతా ప్రత్యేకించి విద్యార్థులు, యువకులు విస్మయానికి గురవుతున్నారని అన్నారు.



స్టాల్‌లో రోబో టెక్నాలజీని వివరిస్తున్న డాక్టర్ నరేంద్రరెడ్డి

రోబోలతో కలసి పని చేయడానికి సిద్ధమవ్వాల్సిందే

● జాయింట్, రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ నరేంద్రరెడ్డి

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సమీప భవిష్యత్తు వైద్య రంగంలో రోబోటిక్, ఏఐ టెక్నాలజీదేనని, వాటితో కలసి వైద్యనిపుణులు పని చేయాల్సిందేనని సాయిభాస్కర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ అధినేత, సీనియర్ జాయింట్, రీప్లేస్‌మెంట్ సర్జన్ డాక్టర్ బూసిరెడ్డి నరేంద్రరెడ్డి తెలిపారు. గుంటూరు వైద్య కళాశాలలో జరుగుతున్న మెడికల్ ఎగ్జిబిషన్ మెడ్‌ఫ్యూజన్ 26లో ఏర్పా టు చేసిన సాయిభాస్కర్ హాస్పిటల్ స్టాల్‌ను మంగళవారం పెద్ద సంఖ్యలో విద్యార్థులు తిలకించారు. స్టాల్‌లో ఏర్పాటు చేసిన టీవీ స్ర్కీన్ మీద మాకో స్మార్ట్ రోబోటిక్ ద్వారా జరుగుతున్న మోకీలు మార్పిడి శస్త్రచికిత్సలను ఆసక్తిగా తిలకించారు. డాక్టర్ నరేంద్రరెడ్డి మాట్లాడుతూ రోబోటిక్ టెక్నాలజీ గురించి, రోబో, ఏఐ టెక్నాలజీ ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. వివిధ రంగాల్లో రోజు రోజుకు నూతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాట్లోకి వస్తున్నట్లు తెలి పారు. రోబోటిక్ టెక్నాలజీ ద్వారా జరిగే ఆపరేషన్లు ఖచ్చితత్వంతో ఉండటంతో పాటు మంచి ఫలితాలను ఇస్తాయన్నారు. అంతకు ముం దు రోబో, ఏఐ టెక్నాలజీపై రూపొందించిన ప్రశ్నావళిని విద్యార్థుల చేత పూర్తి చేయించి వారి సందేహాలను నివృత్తి చేశారు. విద్యార్థులకు చాక్లెట్లు, బిస్కెట్లు, పెన్నులను ఆసుపత్రి సిబ్బంది అందజేశారు.

రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రయోగాల వినూత్న పోటీలు

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా సైన్స్ మాసం (ఫిబ్రవరి) జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి సైన్స్ ప్రయోగాల వినూత్న పోటీలు నిర్వహిస్తున్నట్లు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యా ర్థులలో నైపుణ్యాభివృద్ధి, సైన్స్‌ని మెరుగ్గా అర్థం చేసుకోవడం, చదువు లో ఆత్మవిశ్వాసం పెంపొందించడం కోసం ఈ పోటీలు నిర్వహిం చడం జరుగుతుందన్నారు. ఈ పోటీలు ఇన్నోవేషన్- టెక్నాలజీ, పర్యావరణం-వ్యవసాయ రంగం, అపోహలు-శాస్త్రీయ నివారణలో ఉంటాయన్నారు. ఈ ప్రయోగాలలో కాస్ట్ నో కాస్ట్ చేసిన ప్రయో గాలకు ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తామన్నారు. 8, 9, 10 వ తరగతి చదివే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొనవచ్చ న్నారు. ఈ ప్రయోగాలను వీడియో తయారుచేసి మార్చి 8వ తేదీ లోపు పంపాలని, వీడియో నిడివి ఐదు నిమిషాలు మించకూడదని, వివరాలకు 8500960840, 9394782540 నెంబర్లలో సంప్రదించాల న్నారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ ఆఫీసులో కరపత్రం ఆవిష్క రించారు. ఈ కార్యక్రమంలో టి.జాన్ బాబు, బి.ప్రసాదు, టీఆర్ రమేష్, ఎస్ఎం సుభాని, అనురాధ, గురవయ్య, బి.ప్రతాప్ సింగ్, యు.రామ్మోహనరావు, కే. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

22 వరకు మెడికల్ ఎగ్జిబిషన్ నిర్వహణ పొడిగింపు

● జీఎంసీ ప్రిన్సిపాల్ సుందరాచారీ వెల్లడి

గుంటూరు మెడికల్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గుంటూరు మెడికల్ కాలేజీలో జరుగుతున్న మెడికల్ ఎగ్జిబిషన్ మెడ్ ఫ్యూజన్ 26ను ఈనెల 22వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారీ తెలిపారు. కాలేజీలో వివిధ వైద్య విభాగాధిపతులు, వివిధ పాఠశాలల నుంచి వచ్చిన అభిప్రాయాల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటి వరకు మెడికల్ ఎగ్జిబిషన్‌ను 38,120 మంది సందర్శించినట్లు ఆయన తెలిపారు. వివిధ పత్రికలు, ఎలక్ట్రానిక్ మీడియాలో పని చేస్తున్న పాత్రికేయులు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో పని చేసే క్షేత్రస్థాయి సిబ్బందికి, వైద్యాధికారులకు, ట్రాఫిక్ పోలీసులకు ఎగ్జిబిషన్ సందర్శనకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు డాక్టర్ సుందరాచారీ తెలిపారు. ఉచిత ప్రవేశం పొంద దల్చిన వారు తమ ఐడీ కార్డును తీసుకురావాలని ఆయన కోరారు.

దాతల సహకారం మరవలేనిది

● కేజేఎస్‌ఎస్ అధ్యక్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి



మల్లెల హరేంద్రనాద్ చౌదరికి చెక్కును అందజేస్తున్న రావి సత్యనారాయణ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పేద, ప్రతిభ విద్యార్థినులకు అండగా నిలుబడుతున్న దాతల దాతృత్వం మరువ లేనిదని కమ్మ జన సేవా సమితి (కేజేఎస్‌ఎస్) అధ్య క్షుడు మల్లెల హరేంద్రనాథ్ చౌదరి అన్నారు. కేజేఎస్‌ఎస్ ఆధ్వర్యంలో పేద విద్యార్థులకు అంద జేసే ఉపకార వేతనాల నిధికి తెనాలికి చెందిన రావి సత్యనారాయణ రూ.2.50 లక్షల విరాళాన్ని మంగళవారం, కుందులరోడ్డులోని కమ్మ బాలికల వసతి గృహంలో ఆయనకు అందజేశారు. ఈ సందర్భంగా మల్లెల హరేంద్రనాద్ చౌదరి మాట్లాడుతూ తొమ్మిది పదుల వయస్సులో వసతి గృహాన్ని సందర్శించి, ఆయన విరాళం ఇవ్వడం సంతోషంగా ఉందన్నారు. రావి సత్యనారాయణ మాట్లాడుతూ గ్రామీణ బాలికలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ చెక్కును అందజేశానని తెలిపారు. తన భార్యతో సంప్రదించి నూతన భవన సముదాయంలో ఒక గదికయ్యే ఖర్చు విరాళాన్ని త్వరలోనే అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముసునూరి అప్పారావు, వసతి మేనేజర్ చావా బోసు తదితరులు పాల్గొన్నారు.

కేహెచ్‌ఐటీలో క్యాంపస్ ఇంటర్వ్యూలు

గుంటూరు (విద్య), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడవరం లోని కళ్ళం హరనాథరెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో మంగళవారం మెగా ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో క్యాంపస్ ఇంట ర్వ్యూలు నిర్వహించినట్లు డైరెక్టర్ ఉమా శంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ విభాగాలకు చెందిన బీటెక్ విద్యార్థులు 18 మంది క్యాంపస్ ఇంటర్వ్యూలలో ఎంపికయ్యారని తెలిపారు. విద్యా ర్థులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.ఎస్.బి.రెడ్డి అభినందించారు.

నిర్దేశిత కాల వ్యవధిలో ఆర్వోబీ పూర్తి చేయాలి

● కలెక్టర్ తమీమ్ అన్సారియా



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పక్కన కమిషనర్ మయూర్ అశోక్ తదితరులు

గుంటూరు కార్పొరేషన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): శంకర్ విలాస్ రైల్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు నిర్దేశిత కాల వ్యవధిలో పూర్తి అయ్యేలా నిర్మాణ కాంట్రాక్ట్ ఏజెన్సీని సమన్వయం చేసుకుంటూ ఆర్ అండ్ బీ, నగరపాలక సంస్థ అధికారులు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణ పనులను, ఏటుకూరు రోడ్డులోని కంపోస్ట్ యార్డును మంగళవారం కలెక్టర్ ఏ తమీమ్ అన్సారియా, నగరపాలక సంస్థ కమిషనర్ మయూర్ అశోక్‌తో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ పిల్లర్లు, డ్రైనేజీలు, తదితర ఇతర నిర్మాణాలు ప్లానింగ్‌లో నిర్దేశించిన సమయానికి పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని నిర్మాణ ఏజెన్సీకి సూచించారు. వర్షాకాలంలో ఇబ్బందులు లేకుండా మే నెల చివరి నాటికి బ్రిడ్జికి ఇరువైపులా డ్రైనేజీల నిర్మాణం పూర్తి చేయాలన్నారు. నిర్మాణ ప్రాంతంలో అడ్డంగా ఉన్న విద్యుత్ పోల్స్‌ను పక్కకు తరలించాలని విద్యుత్ శాఖ అధికారులకు సూచించారు. అనంతరం కలెక్టర్ ఏటుకూరు రోడ్డులోని కంపోస్ట్ యార్డులో ఎంఆర్ఎఫ్, విండ్రో, వర్మి కంపోస్ట్ యూనిట్స్, వేస్ట్ రీ సైక్లింగ్ పాయింట్స్, నిర్మాణంలోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ (జీటీఎస్) లను పరిశీలించారు. నగరంలో ఉత్పత్తి అయ్యే వ్యర్థాలతో ఏటుకూరు పాయింట్ లో 50 టన్నుల విండ్రో, 35 టన్నుల వర్మి కంపోస్ట్ ని తయారు చేస్తున్నామని, వీటి సామర్థ్యాలను పెంచుకోవడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వచ్చిన ఎరువును కిచెన్ గార్డెన్ నిర్వాహకులు, జీఎంసి పార్కులు, డివైడర్లపై మొక్కలకు వేస్తున్నామని కమిషనర్ కె.మయూర్ అశోక్ జిల్లా కలెక్టర్‌కు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ ఎస్ఈ వెంకటేశ్వరరావు, సీఎంఓహెచ్ డాక్టర్ శాంతి కళ, డీసీపీ సూరజ్ కుమార్, ఈఈలు విష్ణు, వేణు, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్పెషలిస్ట్ అనిల్ కుమార్, ఆర్ అండ్ బీ, విద్యుత్, శంకర్ విలాస్ ఆర్వోబీ నిర్మాణ పనులు నిర్వహిస్తున్న ఏజెన్సీ ప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలను ప్రజలకు చేరువ చేయాలి

● ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వందనాదేవి



బృందావన్ గార్డెన్స్ గ్రంథాలయాన్ని సందర్శిస్తున్న భీమినేని వందనాదేవి

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలను ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తున్నట్టు ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భీమినేని వందనాదేవి అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్, శాఖ గ్రంథాలయాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. గ్రంథాలయంలో వసతులు, పుస్తకాల సంఖ్య, సభ్యత్వం వంటి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకుని, నిర్వహణపై సంతృప్తి ని వ్యక్తం చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రంథాలయాలకు రావాల్సిన బకా యిలపై త్వరలోనే నగరపాలక అధికారులతో చర్చిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయాధికారులు బి.శకుంతల, వి.గిరీష్ కుమార్, సిబ్బంది పి.కోటేశ్వరి, పి సుధాకర్, లక్ష్మీ పాల్గొన్నారు.

క్రీడాకారులను అభినందించిన కలెక్టర్

గుంటూరు క్రీడలు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పవర్ లిఫ్టింగ్ క్రీడల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులను కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అభినందించారు. కర్నూలులో ఫిబ్రవరి 13 నుంచి 15 వరకు అమరావతి పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించగా, హరిద్వార్‌లో జనవరి 17 నుంచి 21 వరకు ఇండియన్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించింది. ఈ పోటీలలో విజేతలుగా నిలిచిన తుపాకుల నాగజ్యోతి, కె.సత్య రామరాజు, టి.నాగజ్యోతిలను కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ అభినందించారు. క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శిక్షకుడు ఎండీ ఖయ్యుద్దీన్, క్రీడాకారుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ కలిగిన క్రీడాకారులను గుర్తించడమే శాప్ లక్ష్యం

● జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్‌ఖాన్

గుంటూరు (తూర్పు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : క్రీడాకారులను గుర్తించి వారి ప్రతిభను వెలికితీయడమే శాప్ లక్ష్యమని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి అఫ్రోజ్‌ఖాన్ అన్నారు. స్థానిక బీఆర్ స్టేడియంలో జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్రరాజు ఆధ్వర్యంలో మంగళవారం శాప్ లీగ్ జిల్లా స్థాయి చెస్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను స్థానిక కార్పొరేటర్ మీరావలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా అఫ్రోజ్‌ఖాన్ మాట్లాడుతూ ఈ పోటీలలో జిల్లా వ్యాప్తంగా దాదాపు 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారని పేర్కొన్నారు. విజేతలుగా నిలిచిన వారు ఈనెల 21, 22 తేదీలలో తిరుపతిలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో చెస్ ఆర్బిటర్ అబ్దుల్ నబీ, పవన్, కోచ్‌లు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు. అండర్-13 విభాగంలో ఎం.తేజ్ భరత్‌రెడ్డి, ఎన్.ధార్మిక, అండర్-15లో రామన్ నాయుడు, తేజ అనూష, అండర్-17లో మేఘ శ్యామ్ సాయి, చిన్మయి, అండర్-19: డి ధృవేష్ విజేతలుగా నిలిచారు.

డాక్టర్స్ క్రికెట్ పోటీలు ప్రారంభం

గుంటూరు క్రీడలు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) నాగార్జున యూనివర్సిటీ సమీపంలోని డీఎస్ఏ క్రికెట్ మైదానంలో మంగళవారం డాక్టర్ ప్రీమియం లీగ్ క్రికెట్ పోటీలు ప్రారంభమయ్యాయి. మొత్తం పది జట్లు పాల్గొంటున్న ఈ పోటీలు 12 రోజులపాటు కొనసాగనున్నాయి. నగరానికి చెందిన 140 మంది డాక్టర్లు పాల్గొంటున్న ఈ పోటీలు మొదటి 10 రోజుల లీగ్ మ్యాచ్‌లు నిర్వహించబడతాయి. ఈనెల 28న సెమీ ఫైనల్స్, మార్చి 1న ఫైనల్ మ్యాచ్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ టోర్నమెంట్ వివరాలను డాక్టర్స్ స్పోర్ట్స్ అండ్ కల్చరల్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆవుల శ్రీనివాస్, సెక్రటరీ డాట్ల శ్రీనివాస్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. విధి నిర్వహణలో నిత్యం బిజీగా ఉండే డాక్టర్లకు ఇలాంటి క్రీడా పోటీలు మానసిక, శారీరక ఉల్లాసాన్ని కలిగిస్తాయని వారు పేర్కొన్నారు. ఈ పోటీలకు ఆదిత్య మెడికవర్ హాస్పిటల్ ప్రధాన స్పాన్సర్‌గా వ్యవహరించనుంది. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కమిటీ ఛైర్మన్ టి. చంద్రశేఖర్‌రెడ్డి, సభ్యులు వెంకట్ నవీన్, డాక్టర్ ప్రదీప్, డాక్టర్ సందీప్, అస్లాం, జాన్ షాహిద్, అలాగే ఆదిత్య మెడికవర్ హాస్పిటల్ యూనిట్ హెడ్ డాక్టర్ మంజు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడిగా నరసింహారావు

● ఉత్తర్వులు జారీ చేసిన పౌరసరఫరాల శాఖ

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడిగా డాక్టర్ వీవీఎల్ నరసింహారావు నియమితుడయ్యారు. హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశాల మేరకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకొన్నది. కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన కొత్త నిబంధనల ప్రకారం కమీషన్ నూతన అధ్యక్షుడి నియామక ప్రక్రియ పూర్తి అయ్యేంత వరకు నరసింహారావు కొనసాగుతారు. ఈ మేరకు ప్రభుత్వ ఎక్స్ అఫీషియో సెక్రెటరీ సౌరబ్ గౌర్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

విద్వేషపు విష సంస్కృతి నుంచి దేశాన్ని రక్షించుకోవాలి : సీపీఎం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): మానవత్వంతో విద్వేషపు విష సంస్కృతి నుంచి దేశాన్ని రక్షించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ పిలుపు నిచ్చారు. స్థానిక అంబేద్కర్ కూడలిలో మంగళవారం మతసామరస్య వేదిక ఆధ్వర్యంలో చిరు వ్యాపారస్తుడు కోవా బన్ను వలికి మద్దతు తెలుపుతూ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిష్టీ, ఎం.హనుమంత రెడ్డి, నళినీకాంత్, అరుణ, లక్ష్మణరావు, నీలంబరం తదితరులు పాల్గొన్నారు.

అంబటి కుటుంబ సభ్యులకు మాజీ మంత్రి ఆదిమూలపు పరామర్శ

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి అంబటి రాంబాబు కుటుంబ సభ్యులను వైసీపీ నేత, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ పరామర్శించారు. గుంటూరు సిద్దార్థనగర్‌లోనున్న అంబటి నివాసానికి మంగళశారం విచ్చేసిన మాజీ మంత్రి సురేష్ కుటుంబ సభ్యులను పరామర్శించి ఇటీవల ఇంటిపై జరిగిన దాడి ఘటనను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి పాలనలో ప్రశ్నించే గొంతును నొక్కే ప్రయత్నం జరుగుతుందని విమర్శించారు. అక్రమ కేసులకు భయపడే ప్రసక్తేలేదని, ప్రజా గళాన్ని మరింత వినిపిస్తామని స్పష్టం చేశారు.

కర్పూరి ఠాకూర్ ఆలోచనలతోనే బీసీలకు రాజ్యాధికారం

● 39వ వర్ధంతి సభలో సంఘాల వక్తలు

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కర్పూరి ఠాకూర్ ఆలోచనల తోనే బీసీలకు రాజ్యాధికారం సిద్దిస్తుందని పలువురు వక్తలు ఆశాభావం వ్యక్తం చేసారు. జననాయక్ భారతరత్న అవార్డు గ్రహీత కర్పూరి ఠాకూర్ 39వ వర్ధంతి సభ స్థానిక అరండల్ పేటలో మంగళవారం సాయంత్రం నాయీబ్రాహ్మణ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తాటికొండ నరసింహారావు అధ్యక్ష తన నిర్వహించారు. తొలుత కర్పూరి ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం కర్పూరి ఠాకూర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వర్ధంతి సభకు విచ్చేసి నివాళుల ర్పించి ప్రసంగించిన వారిలో బహుజన పొలిటికల్ సెంటర్ కోఆర్డినేటర్ సాదు మాల్యాద్రి, జాతీయ బీసీ ఓబీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్, వడ్డెర సంఘం అధ్యక్షుడు ఓర్సు ప్రేమరాజు, విసికె రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కైలా జయసుధ, నాయీ బ్రాహ్మణ జేఏసీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు కోడూరు అంకమ్మరావు, అర్బన్ ఆర్గనైజర్ అద్దంకి రవి, బహుజన ఐక్యవేదిక అధ్యక్షులు గంటా ప్రభుదాసు, భీమ్సేన సేవాదళ్ అధ్యక్షులు నల్లపు నీలాంబరం, ఆర్‌పిఐ పార్టీ కార్యదర్శి విప్పర్ల ముత్తయ్య, పూలే అంబేద్కర్ లిటరేచర్ కోఆర్డినేటర్ బత్తుల విల్సన్, బీసీ చైతన్య వేదిక అధికార ప్రతినిధి తన్నీరు సాంబయ్య, మంచాల జోసఫ్ ఉన్నారు.

అన్న క్యాంటీన్ కూల్చివేతపై కేసు నమోదు

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పలకలూరురోడ్డులో గల అన్న క్యాంటీన్‌ను కూల్చివేసిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. 39వ డివిజన్ పరిధిలో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వం అన్న క్యాంటీన్‌ను నిర్మించింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత దీనిని మూసి వేసారు. ప్రస్తుతం అది పనిచేయడం లేదు. అయితే కాంటీన్ వెనుక ఉన్న అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయానికి దారి కోసం ఈ నెల 14న అర్ధరాత్రి సమయంలో ఆలయ కమిటీ సభ్యులు క్యాంటీన్‌ను కూల్చివేశారని మున్సిపల్ ఏఈ ఎం. విజయ్ బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆలయ కమిటీ చైర్మన్ గుర్రాల రవి, కమిటీ సభ్యులు గుర్రాల వెంకటేశ్వర్లు, గుర్రాల శివ శంకర్, ఆళ్ల మధు, పోగుల వెంకటేశ్వర్లు, పోగుల శివప్రసాద్, గుర్రాల ఉష, పులి కిషోర్ తదితరులపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్ధరాత్రి షాపు కూల్చి ఇంటి ఆక్రమణకు యత్నం

స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని జేకేసీ కాలేజిరోడ్డులోని కెఎల్‌పీ స్కూల్ ఎదురు షాపును కూల్చి, ఇంటిలోని వారిపై దాడి చేసి ఇల్లు కబ్జాకు యత్నించిన వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కామాదుల వెంకటేశ్వర్లు కేఎల్పీ స్కూల్ ఎదురుగా గత 16 సంవత్సరాలుగా అదే చిరునామాలో నివసిస్తూ, పాత ఇనుము స్ర్కాప్ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఈనెల 12న అర్ధరాత్రి 12 గంటల సమయంలో సుమారు 20–25 మంది గుర్తుతెలియని వ్యక్తులు ఇనుప రాడ్లు, క్రోబార్లు, కర్రలు చేతబట్టి ఒక ఎక్స్‌కవేటర్‌తో అక్కడికి వచ్చి సమీపంలోని ఒక షాపును అక్రమంగా కూల్చివేసారు. తరువాత వెంకటేశ్వర్లు ఇంటిని కూడా కూల్చేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో నిందితులు వెంకటేశ్వర్లును, అతని కుమారుడిని దాడి చేసి గాయపరిచారు, ఇంటిలోకి బలవంతంగా చొరబడి భార్య, కుమార్తెపై దాడి చేసి చంపేస్తామని బెదిరించారు. అలాగే వ్యాపార అవసరాల కోసం ఉంచిన రూ. లక్షా 50 వేల నగదును దోచుకొని వెళ్లారు. పోలీసుల రాకతో నిందితులు పరారయ్యారు. కాగా సంఘటనా స్థలంలో ఒక ఎక్స్‌కవేటర్, ఏపీ 07 ఎక్స్ 1869 నంబరు గల లారీని వదిలివెళ్లారు అని వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రాజ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సివిల్ కేసు ఉపసంహరించుకోవాలని బెదిరింపులు

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : కోర్టు విచారణలో ఉన్న సివిల్ కేసు ఉపసంహరించుకోవాలని అన్నను బెదిరించిన చెల్లెలు, మరికొందరిపై అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో పోలీసులు కేసు నమోదు చేసారు. భారత్ పేటకు చెందిన పగడాల సాంబశివరావుకు అతని చెల్లెలు చిలుమూరి చెన్నమ్మకి మధ్య ఆస్తి తగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో ఆమె, మరికొంత మంది వ్యక్తులు కలిసి కోర్టులో ఉన్న సివిల్ కేసును ఉపసంహరించు కోవాలని, లేకపోతే చంపుతామని బెదిరిస్తున్నట్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుంటూరు- 2 డిపో గ్యారేజ్ పరిరక్షణకు సంఘటితం కావాలి

● ఎన్‌ఎంయూ జోనల్ కార్యదర్శి శ్రీనివాస్

గుంటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగులంతా సంఘటితమై గుంటూరు-2 డిపో గ్యారేజ్‌ను పరిరక్షించుకోవాలని నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ జోనల్ కార్యదర్శి తులసీ శ్రీనివాస్ పిలుపుని చ్చారు. గుంటూరు-2 డిపో జేఏసీ ఛైర్మన్, కన్వీనర్‌లు పి.అమర్‌నాథ్, ఎస్‌టీ దత్తు ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్ బస్టాండ్‌లో సోమవారం నుంచి రిలే నిరాహార దీక్షలు ప్రారంభమయ్యాయి. ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రికల్ బస్సుల నిర్వ హణ పేరుతో గుంటూరు-2 డిపో గ్యారేజ్‌ను ప్రైవేటు సంస్థకు అప్పగించా లన్న ఆర్టీసీ యాజమాన్యం ఆలోచనను ఉప సంహరించుకోవాలని డిమాం డ్ చేశారు. ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణారావు మాట్లాడు తూ ఆర్టీసీ ఆస్తులను ప్రైవేటుకు అప్పగించాలన్న ఆలోచనను విరమించుకో వాలని డిమాండ్ చేశారు. జేఏసీ ఛైర్మన్ అమర్‌నాథ్ మాట్లాడుతూ గ్యారేజ్‌ను ప్రైవేటు పరం చేయాలన్న ఆలోచనను విరమించుకునేంత వరకు రిలే దీక్షలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఎంఎస్ రెడ్డి (ఎన్ఎంయూ), విజయ్‌కుమార్ (ఈయూ), రవిశంకర్ (ఎస్‌డబ్ల్యూఎఫ్), సుబ్బారావు (ఎన్ఎంయూ), నాయకులున్నారు.

స్ఫూర్తి నింపేలా విజయాలు సాధించాలి : వెస్ట్ డీఎస్పీ

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ఇతరుల్లో స్ఫూర్తి నింపేలా మన విజయాలు ఉండాలని వెస్ట్ డీఎస్పీ కే.అరవింద్ అన్నారు. స్థానిక ప్రాంతీయ గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయంలో చదువుతూ వివిధ రంగాలలో ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన వారికి ఓల్డ్ లైబ్రరీ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన సభ జరిగింది. అసోసియేషన్ చైర్మన్ గుర్రం మురళీమోహన్ అధ్యక్షతన జరిగిన సభలో అరవింద్ మాట్లాడుతూ గ్రంథాలయాలు యువత భవిష్యత్తుకు బలమైన పునాది అని అన్నారు. అనంతరం గ్రూప్2లో ఉద్యోగం సాధించిన వీరాంజ నేయులు, సీనియర్ అసిస్టెంట్‌గా మౌలాలి, లోకో పైలెట్‌గా హర్షవర్ధన్, ఉపాధ్యాయుడిగా సుధాకర్‌లను స్మారక చిహ్నాలతో ఘనంగా సత్కరిం చారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు గేదెల శివప్రసాద్, కే.సుధాకర్, షేక్ ఖయ్యం, శ్రీనివాసరావు, సిబ్బంది సభ్యులు పాల్గొన్నారు.

హజ్ హౌస్ విశ్వాసానికి ప్రతీక

● తూర్పు ఎమ్మెల్యే నసీర్ ● అమరావతిలో పది ఎకరాల్లో నిర్మించండి



శాసన సభలో మాట్లాడుతున్న తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): హజ్ హౌస్ అనేది ముస్లిం మైనార్టీల విశ్వాసానికి ప్రతీక అని, అమరావతిలో పది ఎకరాల్లో హజ్ హౌస్‌ను నిర్మించాలని తూర్పు ఎమ్మెల్యే నసీర్ కోరారు. శాస న సభలో మంగళవారం ఆయన మాట్లాడారు. తమ జీవిత కాలంలో హజ్ యాత్రకు ఒక్కసారైనా వెళ్లాలనే సంకల్పం మైనారిటీలకుంటుందని, హజ్ యాత్రకు వెళ్లే వారి ఆశలకు మద్దతుగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి లక్ష రూపాయలు అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హజ్ హౌస్ నిర్మించిన ఘనత చంద్రబాబు నాయుడుదేనన్నారు. 2014 రూ.13 కోట్లతో 52 అడుగుల విస్తీర్ణంలో కడపలో హజ్ హౌస్ నిర్మించారని, అయితే గత వైసీపీ ప్రభుత్వం కరోనా సమయంలో ఆ భవనాన్ని ఉపయోగించుకుందని తెలిపారు. అనంతరం భవనాన్ని పూర్తి నిర్లక్ష్యం చేసిందని వివరించారు. ఈ క్రమంలో పోటీపరీక్షలు రాసే మైనారిటీ విద్యార్థుల కోసం కడపలో హజ్ హౌస్ ఉపయోగించాలని కోరారు. రాజధాని అమరావతిలో హజ్ హౌస్ నిర్మాణం చేపట్టాలని, దీని కోసం పది ఎకరాల స్థలం కేటాయించాలని విన్నవించారు. దీంతోపాటు ఇస్లామిక్ రీసెర్చ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. 2024 ముందు హజ్ యాత్రకు వెళ్లిన వారికి అప్పటి వైసీపీ ప్రభుత్వం కనీసం సబ్సిడీ కూడా ఇవ్వలేదని, ఒక్కొక్కరికి రూ.60 వేలు అందించాల్సి ఉందని తెలిపారు. వెంటనే ఈ నిధులు కూడా విడుదలయ్యేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

సంక్షేమ పాలనకు నిదర్శనం సీఎం సహాయ నిధి

● ఎమ్మెల్యే గళ్లా మాధవి ● సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేత

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రజలకు అండగా ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న సంక్షేమ పాలనకు ముఖ్యమంత్రి సహాయనిధి ఓ నిదర్శనమని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్లా మాధవి అన్నారు. సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన రూ.24 లక్షల విలువైన చెక్కులను మంగళవారం ఆమె పశ్చిమ కార్యాలయంలో 34 మంది లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి అనేది కేవలం ఒక ఆర్థిక సహాయం మాత్రమే కాదని, ఇది పేదల పాలిట ఒక భరోసా అని అన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా ఒక్క సంవత్సరంలోనే రూ. 400 కోట్లకు పైగా ఆర్థిక సహాయం అందించి వేలాది మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపారని ఆమె చెప్పారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు 6.29 కోట్లకు పైగా ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు మంజూరు చేయించామని, నియోజకవర్గ ప్రజలకు సహాయం చేయటానికి తాను సిద్ధంగా ఉంటానని ఎమ్మెల్యే గళ్లా మాధవి తెలిపారు.



సీఎంఆర్ఎఫ్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే గళ్లా మాధవి

అసెంబ్లీ సమావేశాల బందోబస్తు పరిశీలించిన ఎస్పీ

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : వెలగపూడిలోని అసెంబ్లీ భవనంలో వరుసగా 5వ రోజు నిర్వహించబడుతున్న బడ్జెట్ సమావేశాల సందర్భంగా జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ క్షేత్ర స్థాయిలో బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. వీవీఐపీ, వీఐపీల భద్రతను దృష్టిలో ఉంచుకొని అసెంబ్లీ భవనం లోపలికి వెళ్లే ప్రతి ఒక్కరిని జిల్లా భద్రతా విభాగం సిబ్బంది ద్వారా క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. వీవీఐపీ, వీఐపీల రాకపోకల మార్గాల్లో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులకు దిశానిర్దేశం చేశారు. అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా యుటిఎఫ్ చలో విజయవాడ పిలుపుమేరకు లోటస్ పాయింట్, ఉండవల్లి గుహలు, అప్పారావు చెక్ పోస్ట్, వెంకటపాలెం చెక్ పోస్ట్‌లు ఏర్పాటు చేసి నార్త్ డీఎస్పీ ఆధ్వర్యంలో పర్యవేక్షణలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ రవికుమార్, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్బి డీఎస్పీ శ్రీనివాసులు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.



బందోబస్తుపై అధికారులకు ఆదేశాలిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

పాల ఉత్పత్తి పెంచేందుకు గేదెలకు స్టెరాయిడ్స్

● గుట్టు రట్టు చేసిన టాస్క్‌ఫోర్స్

● మహిళను అదుపులోకి తీసుకుని స్టెరాయిడ్స్ స్వాధీనం

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి) : పాల ఉత్పత్తి పెంచేందుకు గేదెలకు గుట్టుగా ప్రమాదకర స్టెరాయిడ్స్ ఎక్కిస్తుండటంతో టాస్క్‌ఫోర్స్ బృందాలు రట్టు చేశాయి. స్థానిక నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెడ్డిపాలెం 5వ లైనులో కొంత కాలంగా పల్లపోతు రేణుక ఈ స్టెరాయిడ్స్‌ను విక్రయిస్తోంది. నిఘా వర్గాలకు అందిన సమాచారం మేరకు నల్లపాడు పోలీసులతో కలసి టాస్క్‌ఫోర్స్ బందాలు దాడి చేశాయి. అనారోగ్య కారకమైన ఈ స్టెరాయిడ్స్‌ను ఉయ్యూరుకు చెందిన ఎస్.పున్నారావు అనే వ్యక్తి రెడ్డిపాలేనికి చెందిన రేణుకకు అప్పగించి ఆమె ద్వారా ఈ బాటిల్స్ గుంటూరు పరిసర ప్రాంతాల వారికి విక్రయిస్తున్నట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు గుర్తించారు. రేణుక ఒక్కో బాటిల్ రూ.150 చొప్పున విక్రయిస్తున్నట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా రేణుక ఇంటిలో సుమారు 1,860 బాటిల్స్ పట్టుబడినట్లు పోలీసులు తెలిపారు. వాటి ఖరీదు రూ. 2 లక్షల 79 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ స్టెరాయిడ్స్ ఇచ్చిన గేదెల పాలు తాగిన వారికి అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని వారు తెలిపారు. దీనిపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రధాన నిందితుడు పున్నారావు పట్టుబడితే గాని ఈ స్టెరాయిడ్స్‌కు సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగుచూడనున్నాయి.



నిందితురాలు రేణుకను అదుపులోకి తీసుకుని, స్టెరాయిడ్స్ సీజ్ చేసిన టాస్క్‌ఫోర్స్ సిబ్బంది

వైభవంగా బాబా వారి ధ్యాన మందిర వార్షికోత్సవం

గుంటూరు(తూర్పు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తపేట, శ్రీ గణేశ్వరరావు వీధిలో ఉన్న శ్రీ షిరిడి సాయిబాబా ధ్యాన మందిరం దేవస్థానం 13వ వార్షిక వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగాయి. అనంతరం స్వరరాగ సాయి బృందం చే భక్తి గీతాలు ఆలాపన, హారతి భక్తులకు తీర్థ అన్న ప్రసాద వితరణ గావించారు. ఈ కార్యక్రమంలో రాదాదేవి, జనార్ధన రావు, రోజా రాణి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక అలంకరణలో అమరేశ్వరస్వామి



అమరావతిలోని అమరేశ్వరస్వామి రథోత్సవానికి భారీగా హాజరైన భక్తులు

కన్నుల పండువగా రథోత్సవం

● శివనామస్మరణలతో మార్మోగిన అమరారామం

అమరావతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన బాలచాముండికా సమేత అమరేశ్వరాలయంలో మంగళవారం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామివార్ల రథోత్సవం కన్నుల పండువగా జరిగింది. మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని జరుగుతున్న బ్రహ్మోత్సవాలలో భాగంగా స్వామివార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించిన రథంలో



ప్రత్యేక అలంకరణలో స్వామి వార్లు

ఉంచి రథోత్సవం జరిపారు. ఏపీ శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, పులివర్తి నాని, జూలకంటి బ్రహ్మారెడ్డి, గురజాల జగన్మోహన్, భాష్యం విద్యాసంస్థల అధినేత భాష్యం రామకృష్ణ కొబ్బరి కాయలు కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. రథోత్సవం ప్రారంభమైనప్పటి నుంచి ముగిసే వరకు భక్తుల శివనామస్మరణలతో ప్రధాన రహదారి మారుమోగింది. రథోత్సవానికి ముఖ్య అతిథులుగా వచ్చిన డిప్యూటీ స్పీకర్, ఎమ్మెల్యేలు అమరావతిని రాజధానిగా చేసుకొని పాలించిన జమిందారు వాసిరెడ్డి వెంకటాద్రినాయుడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. రథోత్సవ కార్యక్రమంలో ఆలయ అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు, అర్చకులు, వేదపండితులు, కూటమి నాయకులు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు. రథోత్సవం ముగిశాక రహదారి వెంబడి ఏర్పాటు



రథోత్సవంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు, ఎమ్మెల్యేలు భాష్యం ప్రవీణ్, పులివర్తి నాని, జూలకంటి బ్రహ్మారెడ్డి, గురజాల జగన్మోహన్

చేసిన వివిధ దుకాణాలు రద్దీగా మారాయి. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు.

వైద్యులు నిరంతర

విద్యార్థులే..

● జీవితాంతం నేర్చుకుంటూ పరిణతి చెందాలి

● కేంద్ర సహాయ మంత్రి అనుప్రియ పటేల్

● ఘనంగా మంగళగిరి ఎయిమ్స్ స్నాతకోత్సవం

మంగళగిరి సిటీ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): వైద్య వృత్తిలో ఉన్న ప్రతి ఒక్క వైద్యుడు జీవితాంతం కొత్త విషయాలు నేర్చుకుంటూ వృత్తి పరంగా పరిణతి చెందాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ సూచించారు. మంగళగిరిలోని అఖిల భార త వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్) ద్వితీయ స్నాతకోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మంత్రి అనుప్రియ పటేల్ వైద్య విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆస్పత్రికి వచ్చే రోగులు వైద్యులను దైవంతో సమానంగా భావిస్తారని, వృత్తి పరంగా వైద్యులు ఎంత విజ్ఞానం, నిపుణత కలిగి ఉన్నారనే విషయం రోగులకు అవసరం లేదని, తమకు ఏ మేరకు చికిత్స అందించారన్న విషయాన్ని మాత్రమే గుర్తుంచుకుంటారని చెప్పారు. పేద, మధ్యతరగతి ప్రజల ఆరోగ్య సంరక్షణకు భారత ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందన్నారు. ఇటీవల ప్రకటించిన బడ్జెట్ కేటాయింపుల్లో వైద్య, ఆరోగ్యం కోసం 9 శాతం నిధులు పెంచిందన్నారు. కృత్రిమ మేధ వంటి



వైద్య విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న మంత్రి నారా లోకేశ్

అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానాలను యువ వైద్యులు అందిపుచ్చుకొని రోగులకు మెరుగైన వైద్యం అందించాలని మంత్రి అనుప్రియ పటేల్ పిలుపునిచ్చారు.

ప్రాణదాతలు వైద్యులు : మంత్రి నారా లోకేశ్

జీవితానికి, మరణానికి మధ్య నిలబడి ప్రాణదాతలుగా సేవలందించడం వల్లే వైద్యులకు సమాజంలో అత్యున్నత గౌరవం లభిస్తోందని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఎయిమ్స్ స్నాతకోత్సవానికి గౌరవ అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, కోవిడ్ సమయంలో ప్రపంచమంతా ఇళ్లకే పరిమితమైనా ప్రాణాలను కాపాడడానికి వైద్యులు ప్రమాదకర పరిస్థితుల్లోనూ సేవాభావంతో నడిచారని గుర్తుచేశారు. 2015లో అతి సామాన్యంగా ప్రారంభించిన మంగళగిరి ఎయిమ్స్ నేడు 1300 మందికి పైగా విద్యార్థులతో సమగ్ర సంస్థగా ఎదిగిందన్నారు. 50 పడకలతో ప్రారంభమై నేడు 650 పడకలకు చేరుకుందన్నారు. యువ వైద్యులు విధి నిర్వహణలో నైతికతకు కట్టుబడి పనిచేయాలని, క్రమశిక్షణ, అంకితభావంతో రోగులకు సేవలు అందించాలని మంత్రి లోకేశ్ సూచించారు. ఎయిమ్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ అహంతెం శాంతాసింగ్ ఈ ఏడాది సంస్థ సాధించిన పురోగతిని నివేదిక రూపంలో సమర్పించారు. స్నాతకోత్సవం సందర్భంగా 49 మంది ఎంబీబీఎస్ విద్యార్థులు, ఐదుగురు పీజీ విద్యార్థులు, నలుగురు పీడీసీసీ గ్రాడ్యుయేట్లకు పట్టాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో మంగళగిరి ఎయిమ్స్ అధ్యక్షుడు మేజర్ జనరల్ డాక్టర్ తపన్‌కుమార్ సాహా, అధ్యాపకులు, వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సిగరేట్

(5వ పేజీ తరువాయి)

ఊహాగానాలతో రూ.200కు పెంచారు. అదే ప్యాకెట్‌ను బడ్జెట్ తర్వాత ఫిబ్రవరి 1 నుంచి రూ.240కి విక్రయిస్తున్నారు. ఒక్కో పెట్టెపై రూ.60 అదనంగా పెరగడంతో ధూమపాన ప్రియులు బెంబేలెత్తుతున్నారు. 2025-26 బడ్జెట్‌లో సిగరెట్లు, పొగాకు ఉత్పత్తులపై సుంకాలను కేంద్ర ప్రభుత్వం భారీగా పెంచింది. పొగాకు వినియోగాన్ని తగ్గించి ప్రజారోగ్యాన్ని మెరుగుపరచాలనే ఆలోచనతో కొత్త పన్ను విధానాన్ని ఫిబ్రవరి 1 నుంచి అమల్లోకి తెచ్చింది. గతంలో సిగరెట్లపై ఉన్న జీఎస్టీ కాంపెన్సేషన్ సెస్ స్థానంలో కొత్తగా ఎక్సైజ్ డ్యూటీని ప్రవేశపెట్టింది. దీంతో పన్ను భారం గణనీయంగా పెరిగింది. సిగరెట్లపై జీఎస్టీ గతంలో 28 శాతం ఉండగా దానిని 40 శాతానికి పెంచారు. సిగరెట్ పొడవు, రకాన్ని బట్టి(ఫిల్టర్, నాన్ ఫిల్టర్) ఎక్సైజ్ డ్యూటీని భారీగా సవరించారు. గతంలో వెయ్యి స్టిక్స్‌పై రూ.200 నుంచి రూ.735 ఉండగా ఇప్పుడు దానిని రూ.2,150 నుంచి రూ.8,500 వరకు పెంచారు. కొన్ని రకాలపై అయితే ఏకంగా రూ.11 వేలకు పెంచారు. దీంతో ఒక్కో సిగరెట్‌పై రూ.2 నుంచి రూ.5 వరకు అదనపు భారం పడింది. 10 సిగరెట్లు కలిగిన ప్యాకెట్ ధర రూ.20 నుంచి రూ.30 వరకు, ప్రీమియం బ్రాండ్లు రూ.50 వరకు పెరిగాయి. అయితే పెంచిన ధరలు ఒక్కో దుకాణంలో ఒక్కో రకంగా వసూలు చేస్తున్నారు. కంపెనీ, పొడవును బట్టి రూ.22 వరకు విక్రయిస్తుండగా మరికొన్ని దుకాణాల్లో రూ.24 వరకు విక్రయిస్తున్నారు. పక్క దుకాణంలో తక్కువకు విక్రయిస్తున్నారు అదనంగా ఎందుకు తీసుకుంటున్నారని ప్రశ్నిస్తే బ్లాక్‌లో కొనుగోలు చేస్తున్నాం మా దగ్గర అంతే అంటున్నారు.

రక్షణ రంగ పరిశోధనకు ప్రాధాన్యం

● క్వాంటమ్ నావిగేషన్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలి

● ఎస్‌ఆర్‌ఎం అధ్యాపక బృందానికి డీఆర్డీవో చైర్మన్ అభినందన



అధ్యాపక బృందం సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్డీవో చైర్మన్ ఎస్వీ కామత్

తుళ్లూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ నేవిగేషన్ సిస్టంపై పరిశోధనలు చేస్తున్న ఎస్‌ఆర్‌ఎం అధ్యాపక బృందాన్ని డీఆర్డీవో చైర్మన్ డాక్టర్ ఎస్వీ కామత్ అభినందించారు. ఎస్‌ఆర్‌ఎం విద్యాసంస్థల గ్రూప్ రీసెర్చ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.నారాయణరావు పర్యవేక్షణలో ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ పరిశోధక అధ్యాపక బృందంతో మంగళవారం కామత్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అధ్యాపక బృందం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తమ రిసెర్చ్ ప్రాజెక్టుల గురించి చైర్మన్‌కు వివరించారు. అనంతరం యూనివర్సిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ పి.సత్యనారాయణన్ అధ్యక్షతన జరిగిన అధ్యాపక బృందం సమావేశంలో పలువురు ప్రొఫెసర్లు తమ పరిశోధక ప్రాజెక్టుల గురించి డీఆర్డీవో చైర్మన్‌కు వివరించారు. జీపీఎస్ అవసరం లేకుండా జామింగ్ లేదా స్పూఫింగ్‌కు గురికాని క్వాంటమ్ నేవిగేషన్ సిస్టమ్ అభివృద్ధిపై డాక్టర్ జతీస్ కుమార్ దాస్ బృందం వివరించింది. అదేవిధంగా క్వాంటమ్ సెన్సార్ల అభివృద్ధిపైనా పరిశోధనల గురించి వివరించారు. స్పందించిన డాక్టర్ కామత్ క్వాంటమ్ నేవిగేషన్ సిస్టంకు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరిగిందని, రక్షణ రంగాలు కూడా దీని కోసం ఎదురు చూస్తున్నాయని పేర్కొన్నారు. ఎస్‌ఆర్‌ఎం వర్సిటీ క్వాంటమ్ నేవిగేషన్ సిస్టంపై పరిశోధనలు చేయడం అభినందనీయమన్నారు. క్షిపణుల కోసం హై ఎనర్జీ మెటీరియల్స్ అభివృద్ధిపై దృష్టి సారించి డీఆర్డీవో శాస్త్రవేత్తల సహకారం తీసుకోవాలని వర్సిటీ రీసెర్చ్ డీన్ ఆచార్య రంజిత్‌కు సూచించారు. తీవ్ర ఉష్ణోగ్రత అనువర్తనాల కోసం సోడియం అయాన్ బ్యాటరీల అభివృద్ధిపై వివరించిన డాక్టర్ సుర్జీత్ సాహును కూడా చైర్మన్ అభినందించారు. ఎత్తు ఎక్కువ ఉన్న ప్రాంతాల్లో మైనస్ 30 డిగ్రీల వాతావరణ పరిస్థితుల్లో కూడా పనిచేసే సోడియం అయాన్ బ్యాటరీలు అభివృద్ధి చేయాలని సూచించారు. సాలిడ్ ప్రొపెల్లెంట్స్‌ను పర్యవేక్షించే స్మార్ట్ ఫైబర్ సెన్సార్లపై ప్రొఫెసర్ మంగళంపల్లి కిరణ్ ప్రదర్శించిన రీసెర్చ్ ప్రాజెక్టుపైనా కామత్ ఆసక్తి కనబరిచారు. రీసెర్చ్ ప్రాజెక్టులకు అవసరమైన సహకారం కోసం డీఆర్డీవో ప్రయోగశాల డైరెక్టర్‌ను సంప్రదించాలని ఆయన వర్సిటీ బృందానికి సూచించారు. ఏపీ ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ప్రెసిడెంట్ డాక్టర్ సత్యనారాయణన్ మాట్లాడుతూ, తమ విశ్వవిద్యాలయాన్ని కృత్రిమ మేధ, గ్రీన్ హైడ్రోజన్ వంటి రంగాల్లో ప్రపంచ స్థాయిలో అభివృద్ధి చేయనున్నామని పేర్కొన్నారు. సమగ్ర పరిశోధనలకు నిలయమైన యూనివర్సిటీగా ఏపీ ఎస్‌ఆర్‌ఎంను తీర్చిదిద్దే లక్ష్యంతో ఉన్నామని ఆచార్య నారాయణరావు, వైస్ చాన్స్‌లర్ ఆచార్య సతీష్ కుమార్ వివరించారు. ఈ సమావేశంలో యూనివర్సిటీ పరిశోధక అధ్యాపకులు ఆచార్య వినోద్ కుమార్, డాక్టర్ పార్థసారధి, సుజిత్ కల్లూర్, డాక్టర్ మహేష్ రవ్వ తదితరులు పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలి

● వీటిపై అపోహలను వివరించి నివృత్తి చేయాలి ● ఏపీ సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డి

గుంటూరు, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని కేటగిరీల్లో పూర్తిస్థాయిలో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కార్పొరేషన్ లిమిటెడ్ సీఎండీ పి.పుల్లారెడ్డి సూచించారు. గుంటూరు సంగడిగుంటలోనున్న విద్యుత్ భవన్‌లోని స్కాడా సమావేశ మందిరంలో మంగళవారం విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ మాట్లాడుతూ, స్మార్ట్ మీటర్లపై వినియోగదారుల్లో కొన్ని అపోహలున్నాయని, వాటిని వివరించి నివృత్తి చేయాలన్నారు. విద్యుత్ వ్యవస్థపై ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రజాభిప్రాయసేకరణ చేస్తోందని, ప్రజల సంతృప్తి స్థాయిని పెంచేలా పనితీరు ఉండాలని సూచించారు. విద్యుత్ అంతరాయాలను పూర్తిస్థాయిలో నివారించాలని, సెక్షన్ స్థాయిలో ఎల్‌టీ లైన్‌లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. మరోవైపు ఆర్‌డీఎస్‌ఎస్ పథకం పనుల పురోగతిపై సీఎండీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఆ పనులను సత్వరమే పూర్తి చేయాలని ఆదేశించారు. సర్కిల్‌లో బకాయిలను పరిశీలించిన ఆయన వసూళ్లను వేగవంతం చేయాలని, ముఖ్యంగా ప్రైవేటు బకాయిలు పేరుకుపోకుండా చూడాలని సూచించారు. సమావేశంలో సీపీడీసీఎల్ డైరెక్టర్స్ ఆవుల



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న సీఎండీ పుల్లారెడ్డి, పక్కన డైరెక్టర్ మురళీకృష్ణయాదవ్, ఎస్ఈ రమేష్ తదితరులు

మురళీకృష్ణయాదవ్ (టెక్నికల్), టీవీఎస్ఎన్ మూర్తి (ప్రాజెక్ట్స్), వెంకటేశ్వర్లు (ఫైనాన్స్), గుంటూరు సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈ చల్లా రమేష్, ఎస్ఏవో పాశం రామిరెడ్డి, గుంటూరు, తెనాలి డివిజన్ ఆపరేషన్ ఈఈలు పీహెచ్ ఖాన్, ఏ.సత్యనారాయణ పాల్గొన్నారు.

వసతిగృహాల్లో

పర్యవేక్షణ ఏదీ..?

● అనుమతి లేకుండా విద్యార్థినులు బయటకు..!

● హాస్టల్స్‌లో పెచ్చు మీరుతోన్న సిబ్బంది ఆగడాలు

గుంటూరు (విద్య) ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతిగృహాల్లో విద్యార్థినుల భద్రతపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కొందరు విద్యార్థినులు అనుమతి లేకుండా బయటకు వెళ్తూ ప్రమాదాల బారిన పడటం, అపరిచితుల మాయమాటలు నమ్మి మోసపోవడం, కొన్నిసార్లు కిడ్నాప్‌కు గురి కావడం జరుగుతోంది. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వచ్చినప్పుడు మాత్రమే నిబంధనల ప్రకారం విద్యార్థినులను బయటకు పంపాల్సి ఉండగా కొన్నిచోట్ల ఇందుకు విరుద్ధంగా సిబ్బంది వ్యవహరిస్తున్నట్లు తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. తాజాగా తెనాలిలోని సాంఘిక సంక్షేమ శాఖ కళాశాల వసతి గృహం నుంచి ఓ విద్యార్థిని బయటికి వెళ్లి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సంఘటన జిల్లాలో కలకలం సృష్టించింది. దీనికి ప్రధాన కారణం హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ పరివేక్షణ లోపం, నాలుగో తరగతి ఉద్యోగుల నిర్లక్ష్యమేనని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఇటీవల కాలంలో సంక్షేమ హాస్టల్స్‌లో ప్రత్యేకించి విద్యార్థినుల హాస్టళ్లలో జరుగుతున్న సంఘటనలు తల్లిదండ్రులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

- కలెక్టర్ బంగ్లా రోడ్‌లోని ఓ కళాశాల హాస్టల్‌లో మూడు నెలల క్రితం ఓ విద్యార్థిని నెలరోజుల పాటు కనిపించకుండా పోయింది. ఇదే హాస్టల్లో డిగ్రీ చదువుతున్న మరో విద్యా ర్థిని గర్భం దాల్చి బిడ్డకు జన్మనిచ్చిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించింది. ఇటీవల ఇదే హాస్టల్లోని వాష్ రూముల్లో ప్రెగ్నెన్సీ కిట్లు పెద్ద సంఖ్యలో బయటపడటంతో తరువాత కలెక్టర్, సాంఘిక సంక్షేమశాఖ మంత్రి ఆకస్మి కంగా తనిఖీ చేసి విద్యార్థినులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.
- ఏసీ కళాశాల సమీపంలోని విద్యార్థినుల హాస్టల్‌లో ఓ విద్యార్థిని నెలరోజులపాటు కనిపించకుండా పోయిందని ఫిర్యాదులు వచ్చాయి.
- మున్సిపల్ ట్రావెల్స్ బంగ్లా పక్కనే ఉన్న హయ్యర్ హాల్ ప్రాంగణంలో ఉన్న కళాశాల హాస్టల్స్‌లో పనిచేసే ఓ మహిళా ఉద్యోగి విద్యార్థులను హిజ్రాలకు అప్పగించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. హిజ్రాల వద్ద పెద్ద మొత్తంలో ఫోన్ పే ద్వారా నగదు తీసుకొని విద్యార్థులను వారి వైపుకు మళ్లించినట్లు ఆరోపణలొచ్చాయి.
- గుంటూరు నగరంలోని పట్టాభిపురం సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్‌లో ఓ విద్యార్థిని గత వైసీపీ పాలనలో కిడ్నాప్‌కు గురైన సంఘటన జిల్లావ్యాప్తంగా కలకలం సృ ష్టించింది. వైసీపీకి చెందిన చోటా నాయకులు కళాశాల హాస్టల్ నుంచి విద్యార్థిని కిడ్నాప్ చేసి అడవి తక్కెళ్ళపాడులోని రాజీవ్ గృహకల్ప సముదాయంలో నిర్బంధించారు.
- రెండు సంవత్సరాల క్రితం నగరంపాలెంలోని ఓ విద్యార్థినుల హాస్టల్‌లో నాలుగో తరగతి ఉద్యోగుల సహకారంతో కొంతమంది ఆకతాయిలు విద్యార్థుల్ని లైంగికంగా వేధించి, అసభ్యంగా ప్రవర్తించిన సంఘటన వెలుగులోకి వచ్చింది.

● సీసీ కెమేరాలు పర్యవేక్షణ నామ మాత్రమే

సంక్షేమ హాస్టల్స్‌లో ప్రత్యేకించి విద్యార్థినుల వసతిగృహాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేస్తున్నట్లు మంత్రి స్థాయిలో ప్రకటనలు వెలువడటం తప్ప పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ఫిర్యాదులు ఉన్నాయి. కొన్నిచోట్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినా వాటి పరిరక్షణ గురించి పట్టించుకోవడం లేదు. హాస్టల్స్‌లోకి ఎవరు వస్తున్నారు? ఎవరు వెళ్తున్నారు? విద్యార్థినులను బయటకు పంపే సమయంలో అనుసరించాల్సిన నిబంధనలు సక్రమంగా పాటించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. నాలుగో తరగతి ఉద్యోగులు హాస్టళ్లలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు ఫిర్యాదులు ఉన్నాయి. విద్యార్థినుల్ని ఇంటికి పంపించే సమయంలో తల్లిదండ్రులు, రక్త సంబంధీకులు వస్తేనే పంపాలి కాని కొన్నిచోట్ల ఈ ప్రక్రియ సక్రమంగా అమలు చేయడం లేదు. విద్యార్థినుల బంధువుల పేరుతో యువకులు తమ చెల్లెలు, అక్క అంటూ చెప్పగానే వారి వెంట పంపుతున్నారని ఫిర్యాదులు ఉన్నాయి. తాజాగా తెనాలి సాంఘిక సంక్షేమ కళాశాల హాస్టల్ నుంచి విద్యార్థినిని బయటకు పంపిన సంఘటన కూడా ఇలాగే జరిగింది. తల్లిదండ్రులు కళాశాల హాస్టల్‌కు రాకుండానే ఒంటరిగా విద్యార్థినిని ఓ మహిళా ఉద్యోగి బయటకు పంపినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఈ విద్యార్థిని తన స్నేహితుడి ద్విచక్ర వాహనంపై క్వారీ తిరునాళ్లకు వెళుతూ ప్రమాదానికి గురైంది. ఆమె ప్రాణాపాయ స్థితిలో ఉండటానికి కారణం హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యమేనని విద్యార్థి సం ఘాలు ఆరోపిస్తున్నాయి. తల్లిదండ్రులు ఎంతో నమ్మకంతో విద్యార్థులను హాస్టళ్లకు పంపితే వారి భద్రత గురించి అటు అధికారులు ఇటు సిబ్బంది పట్టించుకోవడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి.



తెనాలిలోని సాంఘిక సంక్షేమశాఖ కళాశాల వసతి గృహం

ఫ్యాషన్

డేరింగ్ డంగరీ

సౌకర్యవంతమైన, ఆధునికమైన దుస్తులు కచ్చితంగా ఆదరణ పొందుతాయనడానికి 'డంగరీ' ఒక ఉదాహరణ. వస్త్రం పేరే దుస్తుల పేరుగా స్థిరపడిపోయిన డంగరీలను అన్ని వయసుల మహిళలూ ఇష్టంగా ఎంచుకుంటూ ఉంటారు. వీటినెలా ఎంచుకోవాలో, దేంతో మ్యాచ్ చేయాలో తెలుసుకుందాం!





ఫుట్‌వేర్ ఇలా..

హీల్స్, ట్రైనర్స్, స్లైడర్స్ బ్లాక్ హీల్స్, బూట్స్... ఇలా పలు రకాల ఫుట్‌వేర్ డంగరీలకు సూటవుతాయి. నలుపు రంగు బ్లేజర్, హైహీల్స్ అద్భుతమైన మ్యాచింగ్. హెమ్స్‌ను రోల్ చేసి, ట్రైనర్, లెదర్ జాకెట్ కలిపి ధరిస్తే స్టైలిష్‌గా కనిపిస్తారు. బూట్స్, లాంగ్ కోట్స్ కూడా డంగరీలతో మ్యాచ్ చేయొచ్చు.

మ్యాచింగ్ మ్యాచింగ్

మరింత ఆధునికంగా కనిపించాలనుకుంటే, బందనా లేదా క్యాప్‌తో డంగరీలను మ్యాచ్ చేయాలి. మీ లుక్ మరింత ప్రత్యేకంగా ఉండాలనుకుంటే, రెండింట్లో ఒక బ్రేస్‌ను వదిలేయవచ్చు. అలాగే యాంకిల్ లెంగ్త్ ట్రౌజర్స్ కలిగిన డంగరీలను ఎంచుకోవచ్చు. లేదా యాంకిల్ బూట్స్, ట్రైనర్స్ కనిపించేలా ట్రౌజర్‌ను మడుచుకోవచ్చు. సాధారణంగా డంగరీలను క్రాప్ టాప్‌తో కలిపి ధరిస్తారు. వెరైటీ కోరుకునే వారు ఓవర్‌కోట్ లేదా బైకర్ జాకెట్ వేసుకోవచ్చు.

యాక్సెసరీస్

పెద్ద డయల్ వాచ్, ఆక్సిడైజ్‌డ్ సిల్వర్ జువెలరీ డంగరీలకు మ్యాచ్ అవుతాయి. అయితే ఈ ఆభరణాలు వీలైనంత సింపుల్‌గా ఉండేలా చూసుకోవాలి. స్టేట్‌మెంట్ ఫింగర్ రింగ్స్, కడాలు డంగరీలకు బాగుంటాయి.

న్యూస్‌మేకర్

ఇషాన్ ఇష్ట సఖి

టీ20 ప్రపంచ కప్‌లో పాకిస్తాన్‌తో మ్యాచ్ తరువాత దేశానికి క్రికెట్ అభిమానులకు ఇషాన్ కిషన్ ఫీవర్ పట్టుకుంది. అదే సమయంలో మరో పేరు కూడా ఇప్పుడు తెగ వినిపిస్తోంది. అది ఎవరో కాదు... ఇషాన్ ప్రియురాలు **అదితి హుండియా.** క్రీజ్‌లో ఉన్న అతడి స్క్రీన్ షాట్‌ను ఇన్‌స్టాలో పోస్ట్ చేసి... ఓ మూడు హార్ట్ ఎమోజీలు కూడా జత చేసింది. ఇక నెటిజనులు ఆగుతారా..! లెక్కకు మించిన లైక్‌లు... వేలకు వేల షేర్లతో సామాజిక మాధ్యమాలను ముంచెత్తుతున్నారు. ఇంతకీ ఎవరీ అదితి..? ఏమిటి ఆమె ప్రత్యేకత?

అదితి హుండియా... క్రికెట్ ప్రపంచానికి పరిచయమైంది ఇషాన్ స్నేహితురాలిగానే. కానీ అంతకుముందే తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు ఉంది. రాజస్థాన్ జైపూర్‌కు చెందిన ఆమె... ప్రముఖ మోడల్. ఒకప్పుడు 'ఫెమినా మిస్ ఇండియా' పోటీల ఫైనలిస్టు. త్రుటిలో అందాల కిరీటం చేజారినా... ఆ పోటీలతో 29 ఏళ్ల అదితి పేరు దేశమంతటికీ పరిచయమైంది. ముఖ్యంగా చెదరని ఆమె ఆత్మవిశ్వాసం నాడు న్యాయనిర్ణేతలను విశేషంగా ఆకట్టుకుంది. ఆ మరుసటి ఏడాది 'మిస్ దివా'గా అవతరించింది. బ్రాండ్ విలువను అమాంతం పెంచేశాయి. పలు ప్రముఖ బ్రాండ్‌లు ఈ మోడల్‌ను తమ ప్రచార కర్తగా నియమించుకున్నాయి.



వ్యాపార కుటుంబం...

జైపూర్‌లో పుట్టి పెరిగిన అదితి తండ్రి లలిత్ హుండియా వ్యాపారవేత్త. తల్లి బబిత. సోదరుడు యష్. జైపూర్‌లోని 'ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్'లో ప్రాథమిక విద్యాభ్యాసం పూర్తి చేసిన అదితి... 'సెయింట్ జేవియర్స్ కాలేజీ' నుంచి బ్యాచులర్ ఆఫ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ (బీబీఏ) పట్టా పొందింది. కుటుంబ నేపథ్యం, కెరీర్ నిర్మాణాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యూహాత్మకంగా బీబీఏను ఎంచుకుంది.

ఇన్‌స్టాలో చురుగ్గా...

సామాజిక మాధ్యమాల్లో చురుగ్గా ఉండే అదితి... ఎప్పటికప్పుడు తన అప్‌డేట్స్‌ను పోస్ట్ చేస్తుంటుంది. ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమెకు దాదాపు మూడు లక్షల మంది ఫాలో అవుతున్నారు. తన మోడలింగ్, బ్రాండ్ ప్రమోషన్ షూట్స్ తదితర వీడియోలు, ఫొటోలు అభిమానులతో పంచుకొంటుంది. అయితే వ్యక్తిగత విషయాలను సాధ్యమైనంతవరకు గోప్యంగా ఉంచుతుంది. కుటుంబ సభ్యులు, సన్నిహితులతో గడిపిన క్షణాలను అరుదుగా అప్‌లోడ్ చేస్తుంటుంది.

ఐపీఎల్‌తో అలా...

భారత్ స్టార్ ఓపెనర్, వికెట్ కీపర్ ఇషాన్ కిషన్‌తో అదితి ప్రేమ బంధం గురించి తరచూ వార్తలు వస్తూనే ఉన్నాయి. అయితే వీరిద్దరూ ఇప్పటివరకు ఎక్కడా ఆ విషయంపై మాట్లాడకపోయినా... 2019 నుంచి సాన్నిహిత్యంగా ఉన్నట్టు సమాచారం. ఐపీఎల్ కావచ్చు... అంతర్జాతీయ మ్యాచ్ కావచ్చు... ప్రస్తుత టీ20 ప్రపంచ కప్ కావచ్చు... ఇషాన్ ఎక్కడ ఆడితే అక్కడ ప్రత్యక్షమవుతుంది అదితి. అతడి విజయానికి తన ఆనందాన్ని జోడించి అందరితో పంచుకొంటుంది. మొన్నటి మ్యాచ్‌లో ఇషాన్ మెరుపు బ్యాటింగ్‌తో పాకిస్థాన్‌కు నిద్ర లేని రాత్రులు మిగిల్చాడు. అతడు అర్ధ శతకం కొట్టి, బ్యాట్‌తో అభివాదం చేస్తున్న స్క్రీన్ షాట్‌ను అదితి తన ఇన్‌స్టాలో షేర్ చేసింది. దానికి మూడు హార్ట్ సింబల్స్‌ను కూడా జోడించింది. వారిద్దరి మధ్య ప్రేమ బంధానికి ఇది మరో రుజువు అంటూ నెటిజనులు ఆ పోస్టును లైక్‌లతో ముంచెత్తుతున్నారు. అన్ని మాధ్యమాల్లో షేర్ చేయడంతో ఒక్కసారిగా అదితి పేరు క్రికెట్ ప్రపంచంలో మారుమోగుతోంది.

పెళ్లి ప్రస్తావన...

దాదాపు ఏడేళ్లుగా కలిసి తిరుగుతున్న అదితి, ఇషాన్‌ల బంధంలో మరో అడుగు ముందుకు పడిందని తెలుస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న టీ20 ప్రపంచ కప్ తరువాత ఇరువురూ వివాహ బంధంతో ఒక్కటి కాబోతున్నారనే వార్తలు వినిపిస్తున్నాయి. 'ఇషాన్ ఎవరిని ఇష్టపడితే వారితోనే అతడి పెళ్లి చేస్తాం. ఇందులో మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. వాడి పెద్దన్నయ్య పెళ్లి కూడా ఇలానే జరిగింది' అంటూ ఇషాన్ కిషన్ తాతయ్య అనురాగ్ పాండే వెల్లడించారు. అంతేకాదు... అదితి, ఇషాన్ డేటింగ్‌లో ఉన్నట్టు కూడా ఆయన చెప్పారు. దీంతో వారి పెళ్లి వార్తలకు మరింత బలం చేకూరింది. 2021లో అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన 27 ఏళ్ల ఇషాన్ కిషన్ స్వరాష్ట్రం... బిహార్. పాట్నాలో పుట్టి పెరిగిన అతడు కొద్ది కాలంలోనే భారత జట్టులో స్టార్ బ్యాట్స్‌మన్‌గా ఎదిగాడు. బౌలర్లకు సింహస్వప్నంగా మారాడు. కెరీర్‌లో ఒడుదొడుకులు ఎదురైనా నిరంతర కృషి, పట్టుదల, ఆత్మవిశ్వాసంతో వాటిని అధిగమించాడు.

విజేత

ఖాకీ కొలువు యోగా గెలుపు

కూలి పనుల నుంచి కొలువు దాకా.. కొండల నడక నుంచి జాతీయ వేదికల దాకా ఆమె ప్రయాణం పెద్ద సవాల్. ఇద్దరు పిల్లల తల్లిగా బాధ్యతలు నిర్వర్తిస్తూనే.. ఖాకీ దుస్తుల్లో యోగాసనాలతో పతకాలు సాధిస్తున్నారు **రావాడ రోహిణి.** కష్టాలను నిచ్చెనగా మార్చుకుని శిఖరం చేరిన తన ప్రస్థానం గురించి ఆమె 'నవ్య'తో ఇలా చెప్పుకొచ్చారు.



"మాది శ్రీకాకుళం జిల్లా జలుమూరు మండలంలోని లింగంనాయుడుపేట. అక్కడ మూడో తరగతి వరకు చదువుకున్నా. తర్వాత అమ్మమ్మ పున్నమ్మను చూసుకోవాల్సి రావడంతో అక్కడికి పంపించారు. మా ఊరికి 30 కిలోమీటర్ల దూరంలోని సారవకోట మండలం బైదలాపురం అనే గిరిజన గ్రామం అది. అమ్మమ్మను చూసుకుంటూ ఐదో తరగతి వరకు చదువుకున్నా. తర్వాత హైస్కూలు. మాకు దగ్గరలో అంటే శ్రీముఖలింగం అనే ఊరు వెళ్లాలి. రోజూ రానుపోను 12 కిలోమీటర్లు కొండ మార్గంలో నడిచి వెళ్లేదాన్ని. ఉదయం 7.30కి బయలుదేరితే 9 గంటలకు స్కూలుకు చేరేదాన్ని. సాయంత్రం ఇంటికి చేరేప్పటికి ఆరు గంటలయ్యేది. ఇంట్లో ఉన్నదేదో తీసుకువెళ్లడమే. వర్షం, ఎండ.. ఉదైనా స్కూల్ మానడం నాకు తెలియదు. 8వ తరగతిలో అమ్మమ్మ కాలం చేయడంతో మళ్లీ మా ఊరు లింగంనాయుడుపేట వెళ్లిపోయా. అక్కడి నుంచి రెండు కిలోమీటర్ల దూరంలోని తిమడాంలో 9, 10 చదువుకున్నా. రోజూ రానుపోను 4 కిలోమీటర్లు నడకే.

కూలి డబ్బులతో బస్సు చార్జీలు

కష్టాలు పడుతూనే పది పాసై ఇంటర్మీడియట్ నర్సన్నపేటలోని జూనియర్ కళాశాలలో చేరాను. రోజూ ఉదయం 6 గంటలకు బస్సు. అది మిస్సయిందంటే ఆ రోజు స్కూల్‌కి ఆబ్సెంట్. రెండో ఏడాది చదవుతుండగా అమ్మ ఆరోగ్యం పాడైంది. నేను, చెల్లి, నాన్న కూలి పనికి వెళితేగానీ ఇల్లు గడిచేది కాదు. అలా కాలేజీ సెలవు రోజున కూలికి వెళుతూ బస్సు చార్జీలకు వాటిని వాడుకుంటూ ఎలాగైతేనేం ఇంటర్ పూర్తి చేశాను. కానీ బస్సు చార్జీలు కూడా పెట్టుకోలేని స్థితిలో ఫీజులు కట్టుకోలేక డిగ్రీపై ఆశలు వదులుకున్నా. బుడితి జంక్షన్‌లోని నేతాజీ రెసిడెన్షియల్ స్కూల్‌లో టీచర్‌గా చేరాను. ఓ ఏడాది అలా గడిచింది. తర్వాత ఫీజు రీయింబర్స్‌మెంట్ రావడంతో నరసన్నపేటలో డిగ్రీలో చేరాను.

కానిస్టేబుల్‌గా ఎంపిక

మా అమ్మ నాగమ్మ, నాన్న సత్యనారాయణ, చెల్లి, నేను కూలి పనులకు వెళ్లేవాళ్లం. అమ్మకు ఆరోగ్యం బాగోలేకపోవడంతో మేం ముగ్గురం కూలికి వెళ్లేవాళ్లం. రోజుకు నాన్నకు రూ.40, నాకు చెల్లికి రూ.20 చొప్పున వచ్చేది. కష్టాల నుంచి బయట పడాలంటే బాగా చదువుకొని ప్రభుత్వోద్యోగం సంపాదించాలని చిన్నప్పుడే నిర్ణయించుకున్నా. అదే పట్టుదలతో ఇంటర్ పూర్తయ్యాక టీచర్‌గా చేస్తూనే సీఆర్పీఎఫ్, ఎస్ఎస్‌సీ, పోస్టల్, ఆర్ఆర్‌బీ ఇలా చాలా రాశాను. కూలి డబ్బులు ఇంట్లో ఇస్తే ఉద్యోగ దరఖాస్తు ఫీజుకు అవసరమైనపుడు అమ్మానాన్న ఇచ్చేవారు. అలా 2012లో మహిళా పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి రాశా. దానిలో ఎంపికై 2014లో డిగ్రీ పూర్తి చేసిన వెంటనే శిక్షణకు వెళ్లిపోయా. అదే ఏడాది ఉద్యోగంలో చేరాను.

అనుకోకుండా యోగాలోకి



రాజమండ్రి మహిళా పోలీస్ స్టేషన్‌లో పోస్టింగ్. అప్పట్లో ప్రతి శుక్రవారం పోలీసులకు రన్నింగ్ పోటీలుండేవి. నాకు స్కూల్ నుంచే లాంగ్ రన్నింగ్ అలవాటు. దాంతో పురుషుల కంటే ముందే లక్ష్యాన్ని చేరుకునేదాన్ని. అలా 2016లో ఒక రోజున అఖిలభారత పోలీస్ స్పోర్ట్ మీట్ ఉందని మెసేజ్ వచ్చింది. నేను రన్నింగ్ బాగా చేస్తానని అప్పటి స్టేషన్ రైటర్ శ్రీనివాసరావు, డీఎస్పీ భరత్‌మాతాజీ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మమ్మల్ని మోటివేట్ చేశారు. ఓ తండ్రిలా మంచిచెడులు చెప్పేవారు. అలా ఆ పోటీల్లో పాల్గొన్నాను. అయితే అక్కడ రన్నింగ్ ఉండదని చెప్పారు. యోగాలో పాల్గొనాలని సూచించారు. ఆంధ్రా యూనివర్సిటీ యోగా విలేజ్‌లో 45 రోజుల శిక్షణ. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకూ సాగేది. సాత్వికాహారం, తిన్న తర్వాత రెస్ట్. అయితే మొదటి మూడు రోజుల తర్వాత తీవ్రమైన ఒళ్లు నొప్పులు. నన్ను పంపేయండి వెళ్లిపోతానని చెప్పా. అప్పటి మా ఇన్‌చార్జి సీఐ కళ్యాణి నాకు నచ్చజెప్పారు. అన్నీ తట్టుకొని శిక్షణ పూర్తి చేశా. మొదటి సారి యోగా పోటీల్లో మూడో స్థానం దక్కింది. తర్వాత పెళ్లి, పిల్లలు. ఆపై కరోనా సంక్షోభం. ఇలా 2017 నుంచి 2021 వరకూ పోటీల్లో పాల్గొనలేదు.

> **పతకాల పంట**
>
> 
>
> 2022లో పంజాబ్‌లోని జలంధర్‌లో, 2023 మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో నాలుగో స్థానంలో నిలిచా. దాంతో మరింత పట్టుదలతో ప్రాక్టీస్ చేశా. ఓవైపు ఉద్యోగ విధులు, చంటి పిల్లలను చూసుకోవాల్సిన బాధ్యత. నా భర్త కూడా పోలీస్ ఉద్యోగమే. అవకాశం ఉన్నప్పుడు యూట్యూబ్ వీడియోలు చూస్తూ మెరుగయ్యాను. నా భర్త ధనుంజయ పోలీస్ ఇన్‌స్ట్రక్టర్ కావడంతో ఆయన కూడా కొన్ని మెళకువలు నేర్పుతుంటారు. అలా 2024లో ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పోటీల్లో మూడో స్థానం దక్కింది. 2025లో అమరావతిలో నిర్వహించిన జాతీయ స్థాయి పోటీల్లో రెండు కాంస్య పతకాలు సాధించాను.

యోగాలో పీజీ చేయాలని..

నా భర్త నిడదవోలులో ఆర్పీఎఫ్ హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నారు. నేను జిల్లా కంట్రోల్ రూమ్‌లో పనిచేస్తున్నాను. మాకు ఏడేళ్ల లోహిత్, ఆరేళ్ల లాక్షిత ఉన్నారు. మాకు ఉద్యోగ బాధ్యతల వల్ల వాళ్లతో గడిపే సమయం తక్కువ. నేను యోగా పోటీలకు వెళితే మరీ ఇబ్బందిగా ఉంటోంది. పిల్లలను అత్త అప్పన్నమ్మ, తోడికోడలు చిన్నమ్మ చూసేవాళ్లు. ఇప్పుడు పక్కింటి వాళ్ల వద్ద ఉంచుతూ సమయం సర్దుబాటు చేసుకుంటున్నాం. యోగాలో పీజీ చేయాలని నా కోరిక. ఆ పోటీల్లో నేను మరింత రాణించాలి. నా శాఖకు కూడా మరింత పేరు సాధించాలనేది నా లక్ష్యం. ఆ సాధనకు నాకు సహకారం కూడా ఎంతో అవసరం. ఎవరూ కష్టాలు, కన్నీళ్లని ఆవేదనతో ఆగిపోవద్దు. ముఖ్యంగా మహిళలు విధిని ఎదిరించైనా అవకాశాలను విజయంగా మలుచుకోవాలి. మనకు, మన కుటుంబానికి, మన రాష్ట్రానికి.. దేశానికి పేరు తెచ్చుకోవాలి.

• **రమేష్ నాగేంద్ర పలసల,** రాజమండ్రి

చిన్న పొదుపు.. పెద్ద లాభం

ఇంటిని నడపడం ఒక కళ అయితే, అందులో పొదుపు చేయడం ఒక తెలివైన పని. రూపాయి రూపాయి కలిస్తేనే కదా కొండంత అండ. మీ ఇంటి బడ్జెట్‌ను స్మార్ట్‌గా ప్లాన్ చేసుకోవడానికి ఈ చిట్కాలు పాటించండి.

జాబితా సిద్ధం చేసుకోండి: కిరాణా సామాను కొనడానికి వెళ్లే ముందు ఇంట్లో ఏమున్నాయో చూసుకుని లిస్ట్ రాసుకోండి. దీనివల్ల అనవసరమైన వస్తువులు కొనడం తగ్గుతుంది. ఆకలిగా ఉన్నప్పుడు షాపింగ్‌కు వెళ్లకండి. అప్పుడు ఎక్కువ జంక్‌ఫుడ్ కొనే అవకాశం ఉంటుంది.

విద్యుత్ ఆదా: గది నుంచి బయటకు వచ్చేటప్పుడు ఫ్యాన్లు, లైట్లు కట్టేయడం అలవాటు చేసుకోండి. ఏసీ లేదా గీజర్ వాడకాన్ని అవసరానికి మించి తగ్గించడం వల్ల నెలవారీ కరెంటు బిల్లులో గణనీయమైన మార్పు కనిపిస్తుంది.

బ్రాండెడ్ వస్తువులే వద్దు: కొన్నిసార్లు లోకల్ మార్కెట్‌లో దొరికే నాణ్యమైన వస్తువులు కూడా బ్రాండెడ్ వస్తువుల కంటే తక్కువ ధరకు వస్తాయి. ప్యాకేజింగ్ చూసి మోసపోకుండా నాణ్యతను గమనించండి.

పిగ్గీబ్యాంకు అలవాటు: ప్రతి రోజు మిగిలిన చిల్లరను ఒక డబ్బాలో వేయడం అలవాటు చేసుకోండి. ఏడాది చివర్లో అది పెద్ద మొత్తంగా మారి అత్యవసరాలకు ఉపయోగపడుతుంది.



ఆత్మవిశ్వాసానికి రోల్'మోడల్'

అబోలీ జరిత్... విధితో ఆమె పోరాటం పుట్టుకతోనే మొదలైంది. గాల్ బ్లాడర్ లేకపోవడం, కిడ్నీ సమస్యలతో ఆమె ఎదుగుదల ఆగిపోయింది. వరుస శస్త్రచికిత్సలు, అవహేళనలు... అన్నిటినీ ధైర్యంగా ఎదుర్కొన్నారు. దేశంలో మొదటి వీల్‌ఛైర్ మోడల్‌గా, గాయనిగా, మోటివేషనల్ స్పీకర్‌గా ప్రతిభను చాటుతున్నారు. రాష్ట్రపతి నుంచి పురస్కారాన్ని అందుకొని... విజయానికి వైకల్యం అడ్డు కాదని నిరూపించారు.

మూడు నెలల వయసులోనే... అబోలీ జరీత్ చావు అంచుల వరకూ వెళ్లారు. ఆమెకు తీవ్రమైన అనారోగ్యం రావడంతో తల్లితండ్రులు వైద్య పరీక్షలు చేయించారు. గాల్ బ్లాడర్ లేకపోవడంతో మూత్రం బయటికి వచ్చే మార్గాన్ని సృష్టించడం కోసం శస్త్రచికిత్స చేయాల్సి వచ్చింది. ఆ తరువాత ఆమెకు 'రీనల్ రికెట్స్' అనే దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి ఉందని నిర్ధారణ అయింది. ఆ తరువాత చాలాకాలం ఆసుపత్రుల్లో ఉండాల్సి వచ్చింది. ఎన్నో శస్త్రచికిత్సలు జరిగాయి. ఆమె కుటుంబం ఆర్థికంగా పలు ఇబ్బందులు పడింది. "ఈ పిల్ల మీకు భారం. ఎందుకు ఇంకా వైద్యం చేయించడం?" అంటూ బంధుమిత్రుల అవహేళనలు, బడిలో చేరిస్తే తోటి పిల్లల వేధింపులు... ఎన్ని సమస్యలు ఎదురైనా అబోలీ తల్లిదండ్రులు ఆశ కోల్పోలేదు. ఆమెను బతికించడానికి చేయని ప్రయత్నం లేదు.

మూస ఆలోచనల్ని బద్దలుగొట్టి...

ఎనిమిదేళ్ళ వయసు వచ్చేసరికి అబోలీ పరిస్థితి మరింత దిగజారింది. ఆమెలో ఎదుగుదల ఆగిపోయింది. ఎముకలు బాగా బలహీనపడడంతో నడవడం బాగా కష్టమయింది. చివరికి ఇంటినుంచే చదువు కొనసాగించాల్సి వచ్చింది. పదో ఏట కాలు ఫ్రాక్చర్ కావడంతో... ఇక ఆమె నడవడం అసాధ్యమని వైద్యులు చెప్పేశారు. "అందరికీ నా మనుగడ మీద సందేహమే. కానీ మా అమ్మ మాత్రం "కదలలేకపోయినంత మాత్రాన అధైర్యపడకు. ఏదైనా లక్ష్యం పెట్టుకో. నీకున్న పరిమితులలోనే దాన్ని నెరవేర్చుకొనే ప్రయత్నం చెయ్యి" అని చెప్పేది. ఆమె ప్రోత్సాహంతోనే సంగీతం నేర్చుకున్నాను. నాగపూర్‌లో జరిగిన ఒక టాలెంట్ షోలో పాల్గొన్నాను. ఆ తరువాత 'ఇండియన్ ఐడల్'కు వెళ్ళాను. గెలవడానికి కాదు, నా కథ లోకానికి వినిపించడానికి. నా శరీరాన్ని, నా వైకల్యాన్ని చూసి కాదు, నా గొంతును విని నేనేమిటనేది ప్రపంచం జడ్జ్ చెయ్యాలి" అని చెప్పారు అబోలీ. అక్కడ ఆమె ప్రతిభకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ఆమె కథ కన్నీళ్ళు పెట్టించింది. స్ఫూర్తి కలిగించింది. ఈ అనుభవం అబోలీ ఆత్మవిశ్వాసాన్ని పెంచింది. అప్పుడే ఆమె దృష్టి మోడలింగ్ మీద పడింది. అందంగా ఉండాలి, అవయవ సౌష్టవం బాగుండాలి. ఇవి మోడల్‌కు ఉండాల్సిన కనీస అర్హతలు అనేది మన మనసుల్లో బాగా స్థిరపడిపోయింది. భారతదేశపు మొదటి వీల్‌ఛైర్ మోడల్‌గా మారి... ఆ మూస ఆలోచనలను ఆమె బద్దలుగొట్టారు. "నేను ఊహించని స్థాయిలో విద్యార్థులకు, ఉద్యోగులకు ప్రేరణ కలిగించేలా ప్రసంగించాల్సిందిగా పలు సంస్థలు ఆహ్వానించడం ఆరంభించాయి.



మధుర జ్ఞాపకం...

"మోటివేషనల్ స్పీకర్‌గా ఎక్కడికి వెళ్ళినా మనల్ని మనమే ప్రేరేపించుకొని లక్ష్యాలను అందుకోవాలని సూచిస్తాను" అని చెబుతున్న అబోలీ... 2022లో 'ట్రూలీ బోర్న్ డిఫరెంట్' అనే బ్రిటిష్ డాక్యుమెంటరీలో నటించారు. ఆ తరువాత ఖుర్దిస్తాన్ నేషనల్ టీవీలో, డాక్యుమెంటరీలలో కనిపించారు. 'ఇండియన్ ఐడల్'తో పాటు 'సారేగామా లిటిల్ ఛాంప్స్' లాంటి సింగింగ్ కాంపిటిషన్లలో పాల్గొన్నారు. 2021లో 'మిస్ వీల్‌ఛైర్ ఇండియా' ఫైనలిస్ట్. అలాగే 'ఇండియన్ దివ్యాంగ గ్లామర్ అవార్డ్'ను 2023లో అందుకున్నారు. "కిందటి ఏడాది డిసెంబర్ చివర్లో భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము చేతుల మీదుగా 'నేషనల్ అవార్డ్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజెబిలిటీ-2025'ను స్వీకరించడం నా జీవితాంతం గుర్తుంచుకొనే జ్ఞాపకం. నాకున్న ఆరోగ్య సమస్యలతో ప్రతిరోజూ ఒక సవాలే. నా అభిరుచులతో పాటు చదువునూ కొనసాగిస్తున్నాను. వైకల్యాలు ఉన్నాయని ఆత్మన్యూనత, నిస్పృహ చెందనక్కర్లేదు. చేసే పనిపట్ల అంకితభావం, నిబద్ధత ఉంటే గెలుపు, గుర్తింపు తప్పకుండా వస్తాయి" అంటున్నారు 22 ఏళ్ళ అబోలీ.

మెరుపు నిమిషాల్లో

ఉన్నట్టుండి ఏదైనా ఫంక్షన్‌కు వెళ్లాల్సి వస్తే కంగారు పడకుండా, ఇంట్లో దొరికే వస్తువులతోనే ఇలా మెరిసిపోండి.

కాంతివంతమైన చర్మం కోసం: ఫంక్షన్‌కు వెళ్లే ముందు ముఖం డల్‌గా అనిపిస్తే.. చెంచా కాఫీ పొడిలో కొంచెం తేనె కలిపి ముఖానికి పట్టించి 10 నిమిషాల తర్వాత కడిగేయండి. కాఫీలోని యాంటీ ఆక్సిడెంట్స్ చర్మానికి తక్షణ కాంతిని ఇస్తాయి.



కళ్ల కింద నలుపు: బాగా అలసిపోయినప్పుడు కళ్లు ఉబ్బినట్టు అనిపిస్తే వాడేసిన గ్రీన్ టీ బ్యాగులను కాసేపు ఫ్రిజ్‌లో ఉంచి కళ్లపై పెట్టుకోండి. ఇది కళ్ల చుట్టూ ఉన్న నలుపు, వాపు తగ్గిస్తుంది.

లిప్‌స్టిక్ ఎక్కువసేపు ఉండాలంటే: లిప్‌స్టిక్ వేసుకున్న తర్వాత ఒక టిష్యూ పేపర్‌ను పెదవులపై ఉంచి దానిపై కొంచెం పౌడర్ అద్దండి. దీని వల్ల లిప్‌స్టిక్ మ్యాట్ ఫినిషింగ్‌తో పాటు రోజంతా చెదరకుండా ఉంటుంది.

మెరిసే జుట్టు కోసం: తలస్నానం చేసిన తర్వాత చివరిగా ఒక మగ్గు నీటిలో కొంచెం వెనిగర్, లేదా నిమ్మరసం కలిపి జుట్టును కలపండి. ఇది జుట్టుకు సహజమైన మెరుపును ఇస్తుంది.

బిజినెస్

ఆంథ్రోపిక్‌తో ఇన్ఫోసిస్ జట్టు




టెలికాం, ఫైనాన్స్, మాన్యుఫాక్చరింగ్ రంగాలకు ఏఐ పరిష్కారాల అభివృద్ధి

న్యూఢిల్లీ: అమెరికాకు చెందిన కృత్రిమ మేధ (ఏఐ) కంపెనీ ఆంథ్రోపిక్‌తో దేశీయ ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ మంగళవారం వ్యూహాత్మక భాగస్వామ్యం కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యం ద్వారా టెలికాం, ఆర్థిక సేవలు, తయారీ, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కంపెనీలకు ఏఐ పరిష్కారాలను అందించనుంది. తొలుత టెలీకమ్యూనికేషన్స్ రంగ కంపెనీల అవసరాలకు తగినట్లుగా ఏఐ ఏజెంట్ల అభివృద్ధి, డెలివరీ కోసం ఆంథ్రోపిక్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించి..ఆ తర్వాత ఇతర రంగాలకు విస్తరించనున్నట్లు ఇన్ఫోసిస్ పేర్కొంది. కంపెనీలు తమ సంక్లిష్ట కార్యకలాపాలను యాంత్రీకరించడంతో పాటు వేగంగా సాఫ్ట్‌వేర్ డెలివరీ, నిబంధనలకు లోబడి ఏఐ వినియోగించుకునేందుకు తోడ్పడనున్నట్లు తెలిపింది.ఈ భాగస్వామ్యంలో భాగంగా ఇన్ఫోసిస్ తన టోపాజ్ ఏఐ ఆఫరింగ్స్‌ను ఆంథ్రోపిక్‌కు చెందిన క్లాడ్ కోడ్ సహా అన్ని క్లాడ్ మోడల్స్‌తో అనుసంధానించనుంది. "ఏఐ వ్యాపారాలను పరివర్తించడంతో పాటు పరిశ్రమల నిర్వహణ, ఆవిష్కరణలను కూడా పునర్‌నిర్వచిస్తోంది. ఆంథ్రోపిక్‌తో మా భాగస్వామ్యం ఎంటర్‌ప్రైస్ ఏఐ పురోగతిదిశగా వ్యూహాత్మక ముందడుగు. సంస్థల విలువ పెంపుతో పాటు మరింత తెలివిగా కార్యకలాపాల నిర్వహణ, స్థితిస్థాపకత, బాధ్యతాయుతంగా పనిచేసేందుకు ఏఐ దోహదపడనుంద"ని ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్ అన్నారు.

కోడింగ్ ఇక ప్రధానం కాదు..

- టెక్ ఉద్యోగాలను పునర్‌నిర్వచించనున్న ఏఐ
- ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నందన్ నీలేకని



బెంగళూరు: కృత్రిమ మేధ (ఏఐ) సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ వ్యాకరణాన్ని తిరగరాస్తోందని, టెక్ ఉద్యోగుల ప్రధాన విధి ఇకపై కోడ్ రాయడం కాదని ఇన్ఫోసిస్ సహ వ్యవస్థాపకులు నందన్ నీలేకని మంగళవారం అన్నారు. కోడింగ్ శకం ముగిసి కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయన్నారు. కొన్నేళ్ల క్రితం మనుగడలో లేని ఏఐ ఇంజనీర్లు, ఫార్వర్డ్ డెప్లాయ్‌మెంట్ ఇంజనీర్స్, ఫోరెన్సిక్ అనలిస్ట్ నిపుణుల అవసరం పెరగనుందన్నారు. ఇంటర్నెట్, స్మార్ట్‌ఫోన్స్. ఇలా గత సాంకేతిక పరివర్తనాలతో పోలిస్తే ఏఐని మరింత వేగంగా వినియోగించుకుంటున్నారని, ఇది వ్యాపారాల నిర్వహణను సమూలంగా మార్చనుందని ఇన్ఫోసిస్ ఇన్వెస్టర్స్ డేలో పేర్కొన్నారు. ఇంటర్నెట్ వంద కోట్ల మందికి అందుబాటులోకి వచ్చేందుకు 10 ఏళ్లు, స్మార్ట్ ఫోన్లకు ఐదేళ్లు పట్టింది. ఏఐ వినియోగం మాత్రం తక్కువ సమయంలోనే విస్తృతమైందన్నారు.

ఏఐ ఫస్ట్ ఫ్రేమ్‌వర్క్ ఆవిష్కరణ

ఇన్ఫోసిస్ ఏఐ ఫస్ట్ వేల్యూ ఫ్రేమ్‌వర్క్‌ను ఆవిష్కరించింది. 2030 నాటికి 30,000-40,000 కోట్ల డాలర్ల విలువైన ఏఐ సేవల అవకాశాలను అందిపుచ్చుకోవాలనుకుంటోంది. ఇన్ఫోసిస్ టోపాజ్ సూట్‌తో కూడిన ఈ ఫ్రేమ్‌వర్క్.. కంపెనీల వ్యాపారాభివృద్ధికి అవసరమైన ఏఐ పరిష్కారాలు అందించనుంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,54,910 ▼	1,42,000 ▼	2,60,000 ▼
విజయవాడ	1,57,000 ▼	1,45,000 ▼	2,45,000 ▼
విశాఖపట్నం	1,57,000 ▼	1,42,350 ▼	2,65,000 ▼
రాజమండ్రి	1,54,910 ▼	1,42,000 ▼	2,40,000 ▼
ప్రొద్దుటూరు	1,54,000 ▼	1,41,680 ▼	2,43,800 ▼
ముంబై	1,51,865 ▼	1,39,108 ▼	2,32,955 ▼

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	115	విజయవాడ	115
వరంగల్	115	గుంటూరు	115
కరీంనగర్	115	ఒంగోలు	115
మహబూబ్‌నగర్	115	చిత్తూరు	103
కర్నూలు	115	నెల్లూరు	108
విశాఖపట్నం	115	అనంతపురం	108
గోదావరి	115		

రెండో రోజూ లాభాల్లో మార్కెట్

- సెన్సెక్స్ 173 పాయింట్లు అప్

ముంబై: ప్రపంచ మార్కెట్ల నుంచి ఎలాంటి ఉత్సాహపూరితమైన సంకేతాలు లేకపోవడం, ఇన్వెస్టర్లు వేచి ఉండే ధోరణి అనుసరించిన నేపథ్యంలో మంగళవారం ఈక్విటీ మార్కెట్లు నిస్తేజంగానే ట్రేడయినప్పటికీ ప్రధాన సూచీలు మాత్రం లాభాల్లో ముగిశాయి. బ్యాంకింగ్, ఐటీ, యంత్రపరికరాల షేర్లు ఇందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్ 173.81 పాయింట్ల లాభంతో 83,450.96 వద్ద ముగియగా నిఫ్టీ 42.65 పాయింట్ల లాభంతో 25,725.40 వద్ద ముగిసింది. మార్కెట్ లాభపడడం వరుసగా రెండో రోజు. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మార్కెట్ విలువ రూ.1,52,688.24 పెరిగి రూ.4,70,11,313.57 కోట్లకు చేరింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



18వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	525
వరంగల్	522	గోదావరి	515
చిత్తూరు	593	విశాఖపట్నం	515
		డజను గుడ్లు రూ. 75	

ట్రైడెన్స్ హైదరాబాద్ జీసీసీ విస్తరణ

- 2027 నాటికి 2,200 ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని గ్లోబల్ క్యాపబిలిటీ కేంద్రాన్ని (జీసీసీ) మరింతగా విస్తరిస్తున్నట్లు డేటా సైన్స్, ఏఐ సొల్యూషన్స్ కంపెనీ ట్రైడెన్స్ ఇంక్ ప్రకటించింది. మంగళవారం నాడిక్కడ బయో ఏషియాలో కంపెనీ సహ వ్యవస్థాపకులు, సీటీఓ సుమిత్ మెహ్రా మాట్లాడుతూ.. నానక్‌రాంగూడలో 20,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో కొత్త డెలివరీ, ఇన్నోవేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ట్రైడెన్స్ జీసీసీలో 400 మంది ఉద్యోగులు పనిచేస్తుండగా ఈ ఏడాది 700 మందిని నియమించుకోనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వచ్చే ఏడాది మరో 1,100 మందిని నియమించుకోవటంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,200 చేరనుందన్నారు. జీవ శాస్త్రాలు, హెల్త్‌కేర్, రిటైల్, కన్స్యూమర్ ప్యాకేజ్డ్ గూడ్స్ (సీపీజీ) సేవలందించే సంస్థలకు ఏఐ ఆధారిత సేవలను ఈ కొత్త కేంద్రం అందించనుందని ట్రైడెన్స్ వెల్లడించింది. సుమారు రూ.300 కోట్ల పెట్టుబడితో ట్రైడెన్స్ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తోంది.

ఎగుమతుల కేంద్రంగా భారత్

- త్వరలో భారత్‌లో అల్జీమర్స్ ఔషధం: ఎలీ లిల్లీ

తన ఔషధ ఎగుమతులకు భారత్‌ను కేంద్రంగా చేసుకోవాలని అమెరికా ఫార్మా దిగ్గజం ఎలీ లిల్లీ భావిస్తోంది. 'బయో ఏషియా 2026' సదస్సులో కంపెనీ భారత విభాగం ప్రెసిడెంట్, జనరల్ మేనేజర్ విన్‌సెలో టకర్ ఈ విషయం వెల్లడించారు. మొంజారోతో సహా కొన్ని కీలక ఔషధాలను భారత ఫార్మా కంపెనీల్లో కాంట్రాక్టు పద్దతిలో తయారు చేయించి, వాటిని ప్రపంచవ్యాప్తంగా ఎగుమతి చేయనున్నట్టు తెలిపారు. అయితే భారత్‌లోని ఏ కంపెనీల ప్లాంట్లలో వీటిని ఉత్పత్తి చేయనున్నారనే విషయాన్ని ఆయన వెల్లడించలేదు. భారత్‌లో 100 కోట్ల డాలర్లు (సుమారు రూ.9,000 కోట్లు) పెట్టుబడి పెడతామన్న హామీలో భాగంగా కంపెనీ ఈ నిర్ణయం తీసుకుంది. అల్జీమర్స్ చికిత్సలో ఉపయోగించే డొనానెమాబ్ టాబ్లెట్లను త్వరలో భారత మార్కెట్లో విడుదల చేయబోతున్నట్టు టకర్ సూచనప్రాయంగా వెల్లడించారు. నోవా నార్డిస్క్‌కి చెందిన వెయిట్‌లాస్ డ్రగ్ వెగోవీ నుంచి గట్టి పోటీ ఉన్నా తమ మొంజారో ఔషధ అమ్మకాలు బాగానే ఉన్నట్టు చెప్పారు.



బయోలాజికల్స్‌దే భవిష్యత్

హై వాల్యూ ఔషధాలపై దృష్టి పెట్టాలి

డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వైస్ చైర్మన్ జీవీ ప్రసాద్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జెనరిక్ ఔషధాలతో ప్రపంచానికి తమ సత్తా చాటిన భారత ఔషధ కంపెనీలు ఇక సరికొత్త ఔషధాల పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ)పై దృష్టి పెట్టాలని బయో ఏషియా- 2026 సదస్సులో ప్రసంగించిన దేశీయ ఫార్మా కంపెనీల సీఈఓలు కోరారు. ఇందుకు అధిక సమయం పట్టినా, అందుకు అవసరమైన కృషి ఇప్పటి నుంచే ప్రారంభం కావాలన్నారు. దీని వల్ల అధిక విలువతో కూడిన సరికొత్త ఔషధాల అభివృద్ధి సాధ్యమవుతుందని 'సీఈఓ కాంక్లేవ్'లో స్పష్టం చేశారు. ఇందుకు అవసరమైన పెట్టుబడులు సమీకరించడం కష్టమైనా, వెంచర్ క్యాపిటలిస్టుల నుంచి సమకూర్చుకోవచ్చని సూచించారు. 'జెనరిక్ ఔషధాల ఎగుమతికి మన దేశం ఇప్పటికే అంతర్జాతీయంగా ప్రధాన శక్తి. అయితే ఔషధాల అసలు విలువ సరికొత్త ఔషధాల అభివృద్ధిలో ఉంటుంది. భవిష్యత్ అంతా బయోలాజికల్స్, సేవల్లోనే ఉంటుంది' అని చర్చలో పాల్గొన్న డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వైస్ చైర్మన్ జీవీ ప్రసాద్ స్పష్టం చేశారు. దేశంలో ఏర్పాటవుతున్న జీసీసీలతో సరికొత్త ఔషధాల అభివృద్ధికి మరింత ఊతం లభిస్తుందన్నారు. చర్చలో పాల్గొన్న బయోకాన్ బయోలాజిక్స్ ఎండీ, సీఈఓ శ్రీహస్ తాంబే కూడా ఇదే అభిప్రాయం వ్యక్తం చేశారు.

రూ.400 కోట్లతో వ్యాక్స్‌ఇండో వ్యాక్సిన్ యూనిట్

- జినోమ్ వ్యాలీలో ఏర్పాటు

హైదరాబాద్‌లోని జినోమ్ వ్యాలీలో మరో వ్యాక్సిన్ల తయారీ యూనిట్ రానుంది. జేపీపీఎఫ్ఏ ఇండోనేషియా అనుబంధ సంస్థ వ్యాక్స్‌ఇండో యానిమల్ హెల్త్ ప్రైవేట్ లిమిటెడ్ ఈ యూనిట్ ఏర్పాటు చేయనుంది. రూ.370 కోట్ల నుంచి రూ.400 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేసే ఈ యూనిట్‌లో కోళ్లు, పశువులు, పందులు, రొయ్యలు, చేపలకు వచ్చే వ్యాధులు, వైరస్‌ల నివారణకు ఉపయోగించే బీఎస్ఎల్-3 అనే వ్యాక్సిన్లను ఉత్పత్తి చేస్తారు. అత్యాధునిక పరిజ్ఞానంతో నిర్మించే ఈ ప్లాంటులో ఉత్పత్తి అయ్యే వ్యాక్సిన్లను దేశ,విదేశాలకు సరఫరా చేయాలని వ్యాక్స్‌ఇండో భావిస్తోంది. 2030 నాటికి అందుబాటులోకి రానున్న ఈ ప్లాంట్ ద్వారా 300 మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి.

హైదరాబాద్‌లో జీవ శాస్త్రాల క్యాంపస్

రూ.900 కోట్లతో జినోమ్ వ్యాలీలో ఏర్పాటు
ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్ వెల్లడి

హైదరాబాద్ జినోమ్ వ్యాలీలో మరో లైఫ్ సైన్సెస్ క్యాంపస్ రానుంది. లైఫ్ సైన్సెస్ కంపెనీల పరిశోధనలకు అవసరమైన సమగ్ర మౌలిక సదుపాయాలు ఈ క్యాంపస్‌లో లభిస్తాయి. అంతర్జాతీయ పెట్టుబడుల సంస్థ జనరల్ అట్లాంటిక్ అనుబంధ సంస్థ యాక్టివ్ నిర్వహణలోని ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్ ఈ క్యాంపస్‌ను ఏర్పాటు చేయనుంది. ఇందుకోసం వచ్చే ఆరేళ్లలో 10 కోట్ల డాలర్లు (సుమారు రూ.900 కోట్లు) ఖర్చు చేయనున్నట్లు ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్ సీఈఓ, ఎండీ ఆశిష్ సింగ్ వెల్లడించారు. మొత్తం 12 ఎకరాల్లో దాదాపు 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ క్యాంపస్ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. లైఫ్ సైన్సెస్ కంపెనీల పరిశోధనలు, ఔషధాల అభివృద్ధికి అవసరమైన సమగ్ర లేబొరేటరీస్‌ను ఈ క్యాంపస్‌లో ఏర్పాటు చేస్తారు. కాగా జినోమ్ వ్యాలీలో ఆర్ఎక్స్ ప్రొపెల్లెంట్ ఇప్పటికే 1జీవీ, 3జీవీ పేరుతో రెండు క్యాంపస్‌లను నిర్వహిస్తోంది.

హైదరాబాద్ జీసీసీ విస్తరణ: ఒపెల్లా హెల్త్‌కేర్

హైదరాబాద్‌లోని తన జీసీసీ కేంద్రాన్ని 42,000 చదరపు అడుగులకు విస్తరించాలని అంతర్జాతీయ కన్స్యూమర్ హెల్త్‌కేర్ సంస్థ ఒపెల్లా హెల్త్ కేర్ నిర్ణయించింది. వచ్చే ఏడాది ఈ విస్తరణ పూర్తి కానుంది. దీంతో 500 మందికి ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయని తెలిపింది.

మార్కెట్లోకి మారుతి ఈ-విటారా

ధర రూ.10.99 లక్షలు



న్యూఢిల్లీ: కార్ల తయారీ దిగ్గజం మారుతి సుజుకీ మంగళవారం లాంఛనంగా ఈవీల రంగంలోకి అడుగు పెట్టింది. తొలి బ్యాటరీ విద్యుత్ కారు ఈ-విటారాను మార్కెట్లో ప్రవేశపెట్టింది. ప్రపంచవ్యాప్తంగా 100 దేశాల్లో ఈ కారును విక్రయించాలని మారుతి లక్ష్యంగా పెట్టుకుంది. బ్యాటరీ యాజ్ ఏ సర్వీస్ (బాస్) యాజమాన్య ప్రణాళికతో ప్రవేశపెట్టిన ఈ కారు ధర రూ.10.99 లక్షలు. ఈ కారు 61 కిలోవాట్లు, 49 కిలోవాట్ల సామర్థ్యంతో అందుబాటులో ఉంటుంది. ఒకసారి చార్జింగ్ చేస్తే 543 కిలోమీటర్లు దూరం ప్రయాణిస్తుంది. ఈ కారు కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరికీ 7.4 కేడబ్ల్యూ ఏసీ సామర్థ్యం గల వాల్ బాక్స్ చార్జర్ ఇన్‌స్టలేషన్‌తో సహా కాంప్లిమెంటరీగా లభించనుంది. కొనుగోలుదార్లకు బాస్‌తో కూడిన ఫ్లెక్సిబుల్ ఓనర్‌షిప్ ప్లాన్లు అందుబాటులో ఉంచుతున్నట్టు మారుతి తెలిపింది.

నాగ్‌పూర్‌లో కేర్ హాస్పిటల్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో అత్యాధునిక వసతులతో కేర్ ఆస్పత్రి ఏర్పాటు కానుంది. రూ.600 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు చేయనున్న ఈ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి కోసం క్వాలిటీ కేర్ ఇండియా లిమిటెడ్‌కు (క్యూసీఐఎల్).. మహా-మెట్రో అధికారులు ఎల్ఓఏ అందచేశారు. నాగ్‌పూర్, చుట్టుపక్కల ప్రాంతాల్లో భవిష్యత్తుకు అవసరమైన ఆరోగ్య సంరక్షణ సదుపాయాల ఏర్పాటుకు ఈ హాస్పిటల్ వీలు కల్పించనుంది. దీని ద్వారా 1500 పైగా ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.

స్పోర్ట్స్

నేటి మ్యాచ్‌లు	
దక్షిణాఫ్రికా X యూఏఈ (ఉ. 11 గం. నుంచి)	
పాకిస్థాన్ X నమీబియా (మ.3 గం.)	
భారత్ X నెదర్లాండ్స్ (రా.7 గం.)	

ఆస్ట్రేలియా అవుట్

సూపర్-8కు జింబాబ్వే ● ఐర్లాండ్‌తో మ్యాచ్‌కు వర్షం అడ్డంకి




ఆసీస్ సారథి మార్ష్

పల్లెకెలె: టీ20 వరల్డ్‌కప్‌లో పెను సంచలనం చోటు చేసుకుంది. మాజీ చాంపియన్ ఆస్ట్రేలియా టోర్నీ నుంచి అవుట్ కాగా.. ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన జింబాబ్వే సూపర్-8కు దూసుకెళ్లింది. గ్రూప్-బిలో జింబాబ్వే-ఐర్లాండ్ జట్ల మధ్య మంగళవారం మధ్యాహ్నం జరగాల్సిన మ్యాచ్‌కు వరుణుడు అంతరాయం కలిగించాడు. టాస్ కూడా సాధ్యపడలేదు. సాయంత్రం 5.30 వరకు వేచి చూసిన అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. దీంతో ఐర్లాండ్, జింబాబ్వేకు చెరో పాయింట్ లభించాయి. ఫలితంగా గ్రూప్-బిలో శ్రీలంక 6, జింబాబ్వే 5 పాయింట్లు సాధించి సూపర్-8 బెర్త్‌లు ఖరారు చేసుకొన్నాయి. ఆడిన మూడు మ్యాచ్‌ల్లో ఒక్కటి మాత్రమే గెలిచిన ఆస్ట్రేలియా రెండు పాయింట్లు సాధించింది. ఒమన్‌తో మ్యాచ్ మాత్రమే మిగిలున్న నేపథ్యంలో ఒకవేళ ఆసీస్ విజయం సాధించినా, ఆ జట్టుకు మొత్తం నాలుగు పాయింట్లు మాత్రమే లభిస్తాయి. అంటే.. ఐదు పాయింట్లతో ఉన్న జింబాబ్వేను కంగారూలు అధిగమించలేరు. ఈ క్రమంలో సూపర్-8కు చేరుకొన్న ఏడో జట్టుగా జింబాబ్వే నిలిచింది.

గ్రూప్-బి — పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	ర	పా	ర.రే
శ్రీలంక	3	3	0	0	6	2.462
జింబాబ్వే	3	2	0	1	5	1.984
ఐర్లాండ్	4	1	2	1	3	0.150
ఆస్ట్రేలియా	3	1	2	0	2	0.414
ఒమన్	3	0	3	0	0	-4.546

మ్యా: మ్యాచ్‌లు; గె: గెలుపు; ఓ: ఓటమి; ర: రద్దు; పా: పాయింట్లు; ర.రే: రన్‌రేట్

అభిషేక్ అదరగొట్టేనా?

జోష్‌లో టీమిండియా
నేడు నెదర్లాండ్స్‌తో మ్యాచ్

రాత్రి 7 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



తుది జట్లు (అంచనా)

భారత్: అభిషేక్, ఇషాన్, తిలక్, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్, శివమ్ దూబే, అక్షర్, రింకూ సింగ్, సిరాజ్/బుమ్రా, అర్ష్‌దీప్, వరుణ్ చక్రవర్తి.
నెదర్లాండ్స్: లెవిట్, ఓడౌడ్, బాస్ డి లీడ్, ఏకర్‌మన్, ఎడ్వర్డ్స్ (కెప్టెన్), కాచెట్, లోగన్ వాన్, ఆర్యన్, వాన్ డర్ మెర్వ్, గుగ్టెన్, క్లాసెన్.

అహ్మదాబాద్: టీ20 వరల్డ్‌కప్‌లో జైత్రయాత్ర సాగిస్తున్న టీమిండియా గ్రూప్ 'ఏ'లో ఆఖరి మ్యాచ్ ఆడనుంది. ఆదివారం పాకిస్థాన్‌పై అద్భుత విజయంతో సూర్య సేన ఇప్పటికే సూపర్-8లో అడుగు పెట్టిన విషయం తెలిసిందే. ఇక పసికూన నెదర్లాండ్స్‌తో బుధవారం జరిగే మ్యాచ్‌లో నెగ్గి గ్రూప్ దశను అజేయంగా ముగించాలనుకుంటోంది. అయితే జట్టులో ఇప్పటికీ సరిదిద్దుకోవాల్సిన లోపాలున్నాయి. ముఖ్యంగా ఈ కీలక టోర్నీలో ఓపెనర్ అభిషేక్ శర్మ ఫామ్ ఆందోళనపరుస్తోంది. తను ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఇప్పటికీ పరుగుల ఖాతా తెరవలేదు. వాస్తవానికి అతడి చివరి ఏడు ఇన్నింగ్స్‌లో నాలుగు డకౌట్లున్నాయి. ప్రతి బంతినీ బాదడమే లక్ష్యంగా ఆడుతుండడం కూడా బలహీనతగా మారింది. అలాగే తనను కట్టడి చేసేందుకు ప్రత్యర్థి జట్లు డీప్ కవర్‌లో ఫీల్డర్‌ను ఉంచి దెబ్బతీస్తున్నాయి. అందుకే అతడిని ముందుగా సింగిల్ తీసుకోమంటూ దిగ్గజ ప్లేయర్ గవాస్కర్ సలహా ఇచ్చాడు. ఏదిఏమైనా సూపర్-8కు ముందే ఈ వరల్డ్ నెంబర్ వన్ బ్యాటర్ ఫామ్‌లోకి రావడం జట్టుకు అత్యంత అవసరం. అటు మరో ఓపెనర్ ఇషాన్ మాత్రం అంచనాలకు మించే రాణిస్తున్నాడు. ప్రేమదాస పిచ్‌పై తనొక్కడే దీటుగా నిలబడ్డాడు. కానీ స్పిన్నర్లను ఎదుర్కోవడంలో మిడిలార్డర్ కాస్త తడబడుతోంది. నమీబియా, పాక్ జట్లపై ఈ బలహీనత బయటపడింది. ఎరాస్మస్, తారిఖ్, సయీమ్ తమ వైవిధ్యమైన బంతులతో భారత బ్యాటర్లను కట్టడి చేశారు. ఇక స్టార్ పేసర్ బుమ్రాకు ఈ మ్యాచ్‌కు విశ్రాంతినిచ్చి సిరాజ్‌ను ఆడించే అవకాశం లేకపోలేదు. కుల్దీప్‌ను కూడా పక్కనబెట్టి అర్ష్‌దీప్‌ను బరిలోకి దించవచ్చు. వరుణ్, అక్షర్ ఇతర స్పిన్నర్లుగా ఉంటారు. మరోవైపు నెదర్లాండ్స్ జట్టు భారత్‌ను ఎదుర్కోవాలంటే శక్తికి మించిన ఆటతీరును ప్రదర్శించాల్సిందే. నమీబియాపై గెలిచాక ఈ జట్టు యూఎస్ఏ చేతిలో చిత్తుగా ఓడింది. బ్యాటింగ్‌లో బాస్ డి లీడ్స్, బౌలింగ్‌లో స్పిన్నర్లు ఆర్యన్ దత్, వాన్ డర్ కీలకం కానున్నారు.


నెదర్లాండ్స్ కెప్టెన్ ఎడ్వర్డ్స్

గ్రూప్-సి — పాయింట్ల పట్టిక

జట్టు	మ్యా	గె	ఓ	పా	ర.రే
వెస్టిండీస్	3	3	0	6	1.820
ఇంగ్లండ్	4	3	1	6	0.201
స్కాట్లాండ్	4	1	3	2	0.184
ఇటలీ	3	1	2	2	-0.588
నేపాల్	4	1	3	2	-1.349

గ్రూప్-డి

జట్టు	మ్యా	గె	ఓ	పా	ర.రే
దక్షిణాఫ్రికా	3	3	0	6	1.477
న్యూజిలాండ్	4	3	1	6	1.227
అఫ్ఘానిస్థాన్	3	1	2	2	-0.215
యూఏఈ	3	1	2	2	-0.797
కెనడా	3	0	3	0	-1.865

మ్యా: మ్యాచ్‌లు; గె: గెలుపు; ఓ: ఓటమి; పా: పాయింట్లు; ర.రే: రన్‌రేట్

షమీకి 8 వికెట్లు



- జమ్మూ కశ్మీర్ తొలి ఇన్నింగ్స్ 302
- బెంగాల్ రెండో ఇన్నింగ్స్ 99 ఆలౌట్
- రంజీ ట్రోఫీ సెమీఫైనల్స్

కళ్యాణి: బెంగాల్ వెటరన్ పేసర్ మహ్మద్ షమీ (8/90) అద్భుత బౌలింగ్‌తో రాణించినా.. జమ్మూ కశ్మీర్ విజయం అంచున నిలిచింది. 126 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగిన జమ్మూ జట్టు తమ రెండో ఇన్నింగ్స్‌లో 13 ఓవర్లలో 43/2 స్కోరుతో నిలిచింది. ఇక బుధవారం మరో 83 పరుగులు సాధిస్తే ఆ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ ఫైనల్లోకి అడుగుపెడుతుంది. మూడో రోజు 198/5 ఓవర్‌నైట్ స్కోరుతో తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన కశ్మీర్‌ను షమి దెబ్బతీశాడు. ఆ తర్వాత రెండో ఇన్నింగ్స్‌లో బెంగాల్ కేవలం 99 పరుగులకే కుప్పకూలింది. సునీల్, అకీబ్‌లకు నాలుగేసి వికెట్లు దక్కాయి. బెంగాల్ తొలి ఇన్నింగ్స్‌లో 302 పరుగులు చేసింది. మరో సెమీస్‌లో కర్ణాటక తొలి ఇన్నింగ్స్‌లో 736 పరుగులకు ఆలౌటైంది. స్మరణ్ (135), కృతిక్ (60), విద్యాధర్ (54) రాణించారు. ఆదిత్యకు 4, మయాంక్‌కు 3 వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఆట ముగిసే సమయానికి ఉత్తరాఖండ్ తొలి ఇన్నింగ్స్‌లో 149/5 స్కోరుతో ఉంది.

కివీస్ ముందుకు | అఫ్ఘాన్ అవుట్

కెనడాపై ఘనవిజయం
సూపర్-8లో చోటు
యువరాజ్ శతకం వృథా


ఫిలిప్స్ (76 నాటౌట్)
రచిన్ (59 నాటౌట్)


యువరాజ్ సమ్రా (110)

చెన్నై: స్థాయికి తగ్గ ఆటతీరుతో చెలరేగిన న్యూజిలాండ్ టీ20 వరల్డ్‌కప్‌లో సూపర్-8 దశకు చేరింది. మంగళవారం కెనడాతో జరిగిన మ్యాచ్‌లో 8 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. గ్లెన్ ఫిలిప్స్ (36 బంతుల్లో 76 నాటౌట్), రచిన్ రవీంద్ర (39 బంతుల్లో 59 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్‌తో అదరగొట్టారు. ఇక ఈ ఫలితంతో గ్రూప్ 'డి' నుంచి అఫ్ఘాన్ జట్టు ఇంటిముఖం పట్టింది. ఇదివరకే దక్షిణాఫ్రికా సూపర్-8లో ప్రవేశించిన సంగతి తెలిసిందే. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన కెనడా 20 ఓవర్లలో 173/4 స్కోరుతో ఆకట్టుకుంది. 19 ఏళ్ల యువ ఓపెనర్ యువరాజ్ సమ్రా (65 బంతుల్లో 11 ఫోర్లు, 6 సిక్సర్లతో 110) సెంచరీ సాధించడం విశేషం. దీంతో టీ20 వరల్డ్‌కప్ చరిత్రలో ఈ ఫీట్ సాధించిన అతిపిన్న వయస్కుడిగా నిలిచి, అహ్మద్ షెహజాద్ (21 ఏళ్లు) రికార్డును అధిగమించాడు. అలాగే ఈ టోర్నీలో శతకం బాదిన తొలి అసోసియేట్ దేశ ఆటగాడు కూడా. ఆ తర్వాత ఛేదనలో కివీస్ 15.1 ఓవర్లలోనే 176/2 స్కోరుతో నెగ్గింది. 30/2 స్కోరుతో కష్టాల్లో పడిన జట్టును ఫిలిప్స్-రచిన్ జోడీ సునామీ ఇన్నింగ్స్‌తో ఆదుకుంది. ఫిలిప్స్ 22 బంతుల్లోనే కివీస్ తరఫున ఈ టోర్నీలో ఫాస్టెస్ట్ ఫిఫ్టీని పూర్తి చేశాడు. అలాగే మూడో వికెట్‌కు ఈ ఇద్దరు 72 బంతుల్లో అజేయంగా 146 పరుగులు జత చేయడం విశేషం.

సంక్షిప్త స్కోర్లు

కెనడా: 20 ఓవర్లలో 173/4 (యువరాజ్ 110, దిల్‌ప్రీత్ 36; డఫీ 1/25);
న్యూజిలాండ్: 15.1 ఓవర్లలో 176/2 (ఫిలిప్స్ 76 నాటౌట్, రచిన్ 59 నాటౌట్; సాద్ బిన్ 1/29).

శ్రీజేష్ మళ్లీ దరఖాస్తు



న్యూఢిల్లీ: భారత జూనియర్ హాకీ జట్టు కోచ్ పోస్టు కోసం మాజీ గోల్‌కీపర్ శ్రీజేష్ మరోసారి దరఖాస్తు చేసుకున్నాడు. గత డిసెంబరుతో శ్రీజేష్ కాంట్రాక్ట్ ముగిసింది. అయితే, తాజాగా కోచ్ కోసం ప్రకటన వెలువడగానే.. దరఖాస్తు చేశాడు.

తిరుమలలో అమెరికా క్రికెటర్లు

తిరుమల (ఆంధ్రజ్యోతి): టీ20 ప్రపంచకప్‌లో ఆడేందుకు భారత్‌కు వచ్చిన అమెరికా క్రికెటర్లు తమ కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆ జట్టు కెప్టెన్ మోనాంక్ పటేల్, మిలింద్ కుమార్, సౌరభ్ నేత్రావల్కర్‌లకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు. శ్రీవారి ఆలయంతో పాటు పరిసర ప్రాంతాలు చాలా పరిశుభ్రంగా ఉన్నాయని ఆటగాళ్లు కొనియాడారు.



నేపాల్‌కో గెలుపు

చెలరేగిన ఐరీ ● పోరాడి ఓడిన స్కాట్లాండ్


ఐరీ (50 నాటౌట్)

ముంబై: దీపేంద్ర సింగ్ ఐరీ (23 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 50 నాటౌట్) అజేయ అర్ధ శతకంతో అదరగొట్టడంతో.. టీ20 వరల్డ్‌కప్‌లో నేపాల్ తొలి విజయాన్ని నమోదు చేసింది. గ్రూప్-సిలో మంగళవారం జరిగిన తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో నేపాల్ 7 వికెట్ల తేడాతో స్కాట్లాండ్‌ను చిత్తు చేసింది. తొలుత స్కాట్లాండ్ 20 ఓవర్లలో 170/7 స్కోరు చేసింది. ఓపెనర్ మైకేల్ జోన్స్ (71) అర్ధ శతకం సాధించగా.. జార్జ్ మున్సే (27), బ్రాండన్ మెక్‌ముల్లెన్ (25) ఫర్వాలేదనిపించారు. సోమ్‌పాల్ కామీ మూడు, నందన్ యాదవ్ రెండు వికెట్లు పడగొట్టారు. ఛేదనలో నేపాల్ 19.2 ఓవర్లలో 171/3 స్కోరు చేసి గెలిచింది. ఓపెనర్లు కుశాల్ భుర్టెల్ (43), ఆసిఫ్ షేక్ (33) రాణించారు. మైకేల్ లీస్క్ మూడు వికెట్లు పడగొట్టాడు.



క్యాట్ సర్క్యూట్ బెంచ్ ఏర్పాటు చేసి ఏడాది అయిన సందర్భంగా కేక్‌లు కట్ చేస్తున్న జ్యుడీషియల్, పరిపాలన సభ్యులు లత బసవరాజ్ పట్నే, వీఎస్‌కే కౌముది

ఘనంగా క్యాట్ సర్క్యూట్ బెంచ్ వార్షికోత్సవం

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): విజయవాడలో కేంద్ర పరిపాలన ట్రైబ్యునల్(క్యాట్) సర్క్యూట్ బెంచ్ ఏర్పడి ఏడాది పూర్తయిన సందర్భంగా ఘనంగా వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఆటోనగర్‌లో ఉన్న స్టాలిన్ కార్పొరేట్ భవనంలోని కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో క్యాట్ జ్యుడీషియల్ సభ్యులు డాక్టర్ లత బసవరాజ్ పట్నే, పరిపాలన సభ్యులు విశ్రాంత ఐపీఎస్ వీఎస్‌కే కౌముది కేకులు కోసి క్యాట్ సిబ్బంది, న్యాయవాదులతో ఆనందాన్ని పంచుకున్నారు. అమరావతిలో శాశ్వత బెంచ్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఈ వ్యవహారాన్ని సీఆర్‌డీఏతో సమన్వయం చేసుకుంటున్నామని క్యాట్ రిజిస్ట్రార్ నవీన్ కుమార్ తెలిపారు.

పీఏసీఎస్‌ల్లో హెచ్‌ఆర్ పాలసీ అమలుకు ప్రణాళిక

▸▸ నిర్దిష్ట కాలంలో కార్యాచరణకు ప్రభుత్వం ఆమోదం

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయడానికి నిర్దిష్ట కాలంలో కార్యాచరణ ప్రణాళికను ప్రభుత్వం ఆమోదించింది. అలాగే కంప్యూటరీకరణ తర్వాత పీఏసీఎస్‌ల్లో ఆర్థిక పరిస్థితిని మెరుగుపర్చే సిఫారసులు చేయడానికి, ఉద్యోగుల హెచ్‌ఆర్ పాలసీ సమస్యను పరిశీలించడానికి సహకార శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన సహకార కమిషనర్, ఆప్కాబ్ ఎండీ, నాబార్డు సీజీఎం సభ్యులుగా ఒక ఉన్నత స్థాయి కమిటీని నియమించింది. ఈ మేరకు మంగళవారం వేర్వేరు ఉత్తర్వులు జారీ చేసింది. ప్రణాళిక ప్రకారం ఉద్యోగుల సర్వీస్ రిజిస్టర్ల నవీకరణ, పేస్కేళ్ల ధ్రువీకరణ, సీఈవోలు, అసిస్టెంట్ల అర్హత ధ్రువీకరణ, కేడర్ వారీగా సీనియారిటీల నిర్ధారణ గత నెలలో పూర్తయింది. ఈనెలలో ఉద్యోగి డేటా అప్‌లోడింగ్, ఐడీలు, కోర్టులు, విజిలెన్స్ కేసులతో డేటాబేస్, కామన్‌పూల్ ఖాతాలు, పీఏసీఎస్‌ల వర్గీకరణ చేస్తారు. వచ్చే నెలలో మిగులు సిబ్బంది, ఖాళీ పోస్టుల గుర్తింపు, అవసరమైతే అదనపు సిబ్బంది నియామకం తదితర పనులు చేస్తారు. ఏప్రిల్‌లో జిల్లా కమిటీల ద్వారా పదోన్నతులు, మూడేళ్ల సర్వీస్ పూర్తి చేసిన ఉద్యోగులకు సాధారణ బదిలీలు, మే-జూన్‌లో ప్రత్యక్ష నియామకాలు, జూలైలో పదోన్నతులు పొందిన, కొత్త ఉద్యోగులకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని ప్రతిపాదించారు.

జేఈఈ టాపర్లకు మంత్రి లోకేశ్ అభినందనలు

అమరావతి, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ సెషన్-1లో వంద పర్సంటైల్ మార్కులు సాధించిన రాష్ట్ర విద్యార్థులు నరేంద్రబాబుగారి మహిత్, పసల మోహిత్‌లకు మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి లోకేశ్ అభినందనలు తెలిపారు. దేశవ్యాప్తంగా 12 మంది వంద పర్సంటైల్ సాధించగా, అందులో మన విద్యార్థులు ఇద్దరు ఉండటం అభినందనీయమని మంగళవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. కఠోర శ్రమ, క్రమశిక్షణతో జాతీయ స్థాయిలో రాష్ట్ర కీర్తిని చాటిచెప్పారని ప్రశంసించారు.

మార్క్స్ మెమో వచ్చేవరకూ మార్పుచేర్పులు

▸▸ పేరు, ఇంటి పేరు, పుట్టిన తేదీల్లో సవరణలకు చాన్స్

పదో తరగతి పరీక్షల తర్వాత కూడా పేరు, ఇంటి పేరు, పుట్టిన తేదీల్లో మార్పులు చేసుకోవచ్చని ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కేవీ శ్రీనివాసులు రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సవరణలకు మార్చి 31 తేదీ నుంచి యూడైస్ పోర్టల్‌లో అవకాశం కల్పించనున్నట్టు పేర్కొన్నారు. హాల్‌టికెట్లలో పొరపాట్లు ఉన్నాయని ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, తుది మెమోలూ జారీ అయ్యేవరకు సవరణలు చేసుకోవచ్చని వివరించారు. మార్చి మొదటి వారంలో టెన్త్ హాల్ టికెట్లు విడుదల చేస్తామని తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగులకు 'పీఎఫ్' టెన్షన్!

▸▸ ఈపీఎఫ్ నుంచి సీపీఎస్‌లోకి వచ్చి ఏడాదికి పైగా..
▸▸ నేటికీ పీఎఫ్ సొమ్ము జమ చేయని కమిషనరేట్ ఆఫీస్
▸▸ ఆర్టీసీ నుంచి ఎన్ని లేఖలు రాసినా స్పందన శూన్యం
▸▸ రాష్ట్రవ్యాప్తంగా 3 వేల మంది ఉద్యోగులకు కష్టాలు
▸▸ వారికి జమ కావాల్సిన సొమ్ము రూ.175 కోట్లు
▸▸ ఏడాదికి పైగా వడ్డీ కోల్పోతామన్న ఆందోళన

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

ఆర్టీసీ ఉద్యోగులు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ (ఈపీఎఫ్) స్కీమ్ నుంచి తప్పుకొని, సీపీఎస్‌లోకి వచ్చి ఏడాది దాటినా.. వారికి రావాల్సిన పీఎఫ్ సొమ్ము విడుదలకు నోచుకోవడం లేదు. ఉద్యోగుల పాత పీఎఫ్ ఖాతాల్లో దాదాపు రూ.175 కోట్ల మేర పేరుకు పోయాయి. ఏడాది నుంచి ఆ సొమ్ముకు వడ్డీని కూడా వారు నష్టపోతున్నారు. 3 వేల మంది ఉద్యోగులకు సంబంధించిన ఈ సమస్యను పరిష్కరించాల్సిన పీఎఫ్ కమిషనర్ కార్యాలయం నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వస్తున్నాయి. దీనిపై ఆర్టీసీ యాజమాన్యం నుంచి లేఖలు వెళుతున్నా.. పీఎఫ్ కమిషనరేట్ నుంచి స్పందన లేదు. ఆర్టీసీ ఉద్యోగులు సీపీఎస్‌కు ఆప్షన్ ఇచ్చినప్పటి నుంచి ఉద్యోగి, యాజమాన్య వాటా సీపీఎస్‌కు జమ అవుతోంది. అంతకు ముందు ఈపీఎఫ్‌కు జమయ్యేవి. సీపీఎస్‌కు వెళ్లిన తర్వాత.. పీఎఫ్ నుంచి నేరుగా సీపీఎస్‌కు ఆ డబ్బులు జమ కావటం జరగదు. పీఎఫ్ దగ్గర ఉన్న మిగులు డబ్బులు ఆర్టీసీ ఉద్యోగులకే ఇవ్వాల్సి ఉంటుంది. ఈ డబ్బు ఏడాది కాలంగా రాక ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

గత వైసీపీ ప్రభుత్వంలో మోసం

ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం తర్వాత పాత పెన్షన్ పథకం (ఓపీఎ‌స)ను వర్తింపజేయాలని డిమాండ్ చేసిన ఆర్టీసీ ఉద్యోగులు.. తదనంతర పరిణామాల నేపథ్యంలో సీపీఎస్ వైపు అడుగులు వేయక తప్పలేదు. గత వైసీపీ ప్రభుత్వం సీపీఎస్ ఉద్యోగులకు ఇచ్చిన హామీని విస్మరించి, జీపీఎస్ పేరుతో సీపీఎస్‌కు సవరణలు చేసింది. ఓపీఎస్ విషయంలో నమ్మించి, మోసం చేయటంతో ఆర్టీసీ ఉద్యోగులు తీవ్ర ఆందోళన చెందారు. సీపీఎస్ దిశగా అడుగులు వేసే అవకాశాన్ని కూడా లేకుండా చేసింది. విలీనం పేరుతో ఆర్టీసీ ఉద్యోగులు సొంతంగా ఏర్పాటు చేసుకున్న రూ.5 వేల పెన్షన్ అందుకునే ఎస్‌బీటీ పథకాన్ని కూడా ఎత్తివేసింది. దీంతో పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఎలాంటి పెన్షన్ లేక ఇబ్బందులు పడ్డారు.

ఒక్కొక్కరికి రూ.5-8 లక్షలు

ఎన్నికల అనంతరం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. ఆర్టీసీ ఉద్యోగులకు పెన్షన్ విషయంలో న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో రెండు రకాల ఆప్షన్లు తీసుకొచ్చింది. అప్పటి వరకు ఉన్న కనీస పెన్షన్‌ను గణనీయంగా పెంచేందుకు నిర్ణయం తీసుకుంది. ఈపీఎఫ్‌వో ద్వారా హయ్యర్ పెన్షన్, సీపీఎస్.. ఈ రెండింటిలో ఏదొక దాన్ని ఎంచుకొనేందుకు అవకాశమిచ్చింది. స్వల్ప సంఖ్యలో ఉద్యోగులు ఈపీఎఫ్ హయ్యర్ పెన్షన్‌కు దరఖాస్తు చేసుకోగా.. ఎక్కువ మంది సీపీఎస్‌కు ఆప్షన్ ఇచ్చారు. ఈ క్రమంలో ఈపీఎఫ్ పెన్షన్ స్కీమ్ నుంచి తప్పుకున్న వారికి సంబంధించిన డబ్బులు పీఎఫ్ దగ్గరే ఉండిపోయాయి. ఏడాది కాలంగా ఈ డబ్బులు రాకపోవటంతో ఆర్టీసీ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 3 వేల మంది ఉద్యోగులకు ఒక్కొక్కరికి రూ.5-8 లక్షల మేర రావాల్సి ఉంది. మొత్తంగా రూ.175 కోట్ల మేర ఆర్టీసీ ఉద్యోగులకు పీఎఫ్ సొమ్ము రావాల్సి ఉంది. దీనిపై ఉద్యోగ సంఘాలు ఆర్టీసీ ఎండీకి లేఖ అందజేశాయి. అప్పటి ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు కూడా పీఎఫ్ కమిషనర్‌కు పలుమార్లు లేఖలు రాశారు. అయినా అక్కడి నుంచి స్పందన లేదు. పీఎఫ్ కమిషనర్ అనుమతులు ఇస్తే.. వెంటనే ఉద్యోగుల ఖాతాల్లోకి డబ్బులు జమవుతాయి.

బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటం

▸▸ చంద్రబాబు, పవన్, జగన్... మోదీ బినామీలు
▸▸ కర్నూలు జిల్లా 'రచ్చబండ'లో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



కర్నూలు అర్బన్, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా పోరాటం చేస్తోందని పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. కర్నూలు జిల్లాలోని గార్గేయపురం గ్రామంలో మంగళవారం రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. షర్మిల మాట్లాడుతూ... 'రాష్ట్రంలో చంద్రబాబు, పవన్ కల్యాణ్, జగన్... ప్రధాని మోదీకి బినామీలుగా పని చేస్తున్నారు. అధికారం కోల్పోయాక వారికి ప్రత్యేక హోదా గుర్తుకు వస్తుంది. అధికారంలోకి వచ్చాక మాత్రం బీజేపీకి ఊడిగం చేస్తున్నారు. మహాత్మా జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పథకాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి' అని పిలుపునిచ్చారు. సీడబ్ల్యూసీ సభ్యుడు రాజు, ఏఐసీసీ సభ్యుడు జె.లక్ష్మీనరసింహ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నైరుతి బంగాళాఖాతంలోకి అల్పపీడనం

▸▸ రేపటి నుంచి తమిళనాడు, కేరళల్లో వర్షాలు

విశాఖపట్నం, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య బంగాళాఖాతం, దానికి ఆనుకుని హిందూ మహాసముద్రంలో ఏర్పడిన అల్పపీడనం మంగళవారం నైరుతి బంగాళాఖాతంలోకి ప్రవేశించింది. ఇది రానున్న 24 గంటల్లో పశ్చిమ వాయవ్యంగా పయనించి తీవ్ర అల్పపీడనంగా బలపడనుంది. దీని ప్రభావంతో గురువారం నుంచి తమిళనాడు, కేరళల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇంకా దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ వైపు సముద్రం నుంచి తూర్పు గాలులు వీస్తాయని తెలిపింది. కాగా, మంగళవారం కోస్తాలోని అనేక ప్రాంతాల్లో దట్టంగా పొగమంచు ఆవరించింది. రాయలసీమ, ఏజెన్సీ ప్రాంతాలు, తెలంగాణకు ఆనుకుని కొన్ని ప్రాంతాల్లో చలి తీవ్రత కొనసాగింది. అరకులోయలో 8.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తాలోని పలు జిల్లాల్లో పొగమంచు కురుస్తుందని, ఉదయం పూట వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరించింది.

వైద్యులకు వినయమే హాల్‌మార్క్..!

▸▸ మానవత్వం, వినయంతో సేవలందించాలి
▸▸ గిరిజన గూడేలు, గ్రామాల్లో సేవ చేయాలి
▸▸ 'ఎయిమ్స్-మంగళగిరి' స్నాతకోత్సవంలో లోకేశ్
▸▸ నూతన ఆవిష్కరణలను అందిపుచ్చుకోవాలి
▸▸ కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి అనుప్రియ పటేల్

మంగళగిరి (గుంటూరు), ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): గొప్ప వైద్యులకు 'హ్యూమిలిటీ' (వినయం) అనేది హాల్‌మార్క్‌లాంటిదని.. మానవత్వం, వినయంతో రోగులకు వైద్య సేవలందించాలని మంత్రి లోకేశ్ పిలుపునిచ్చారు. గిరిజన ప్రాంతాల్లో పర్యటించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎక్కువ సమయం గడపాలని, గ్రామీణ ప్రాంతంలోని ఆరోగ్య పరిస్థితులను పరిశీలించాలని సూచించారు. ఎయిమ్స్-మంగళగిరి రెండో స్నాతకోత్సవం మంగళవారం అట్టహాసంగా జరిగింది. ఎయిమ్స్ డైరెక్టర్ అహంతుమ్ సంతా సింగ్ చేతులమీదుగా ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. 2015లో మంగళగిరిలో ప్రారంభమైన ఎయిమ్స్ ఈ రోజు 1,300 మంది విద్యార్థులకు వైద్య విద్యను అందిస్తోందని, 600 పడకలతో రోగులకు మెరుగైన వైద్య సేవలందిస్తోందని తెలిపారు. ఓపెన్ హార్ట్ సర్జరీ, కిడ్నీ మార్పిడి, రోబోటిక్ మోకాలి మార్పిడి, అడ్వాన్స్‌డ్ అంకాలజీ వంటి ఎన్నో అరుదైన సేవలు అందిస్తోందన్నారు. ఇది మరింత విస్తరిస్తుందన్న విశ్వాసం వ్యక్తంచేశారు. ఆందోళనతో అత్యవసర విభాగానికి వచ్చే రోగికి వైద్యులు ఇచ్చేది మందులు కాదని.. ఒక భరోసా అని అన్నారు. "ఈ రోజు మీరు తీసుకున్న డిగ్రీ.. మీ చదువు పూర్తయిందనడానికి ధ్రువపత్రం కాదు. అది జీవితాంతం నేర్చుకోవడానికి ఇచ్చిన లైసెన్సు వంటిది" అని మంత్రి వైద్య పట్టభద్రులకు సూచించారు. 'వైద్యరంగానికి ఏఐ వంటి సాంకేతిక పరిజ్ఞానం ఎంతో ఉపయోగపడుతోంది కానీ... అది రోగులకు తన స్పర్శను అందించి సాంత్వన ఇవ్వలేదు. అందుకే వైద్యులు మానవత్వం, వినయంతో రోగులకు సేవలందించాలి' అన్నారు.

పరిశోధనలు పెంచాలి..

వైద్యులు ధరించే తెల్లకోటు హుందాతనం, క్రమశిక్షణ, అంకితభావానికి నిదర్శనమని, బాధ్యతతో సేవలందించాలని వైద్య పట్టభద్రులకు మంత్రి లోకేశ్ సూచించారు. వైద్య పరీక్షల్లో లోపాలను తగ్గించడానికి టెక్నాలజీని వాడుకోవాలని, వైద్యులు లోతుగా అధ్యయనం చేయాలని, పరిశోధనలను పెంచాలని, ప్రజారోగ్యానికి మద్దతుగా నిలవాలని కోరారు. వాస్తవానికి వైద్య సంస్థలు మౌలిక సదుపాయాల సమస్య, మానవ వనరుల కొరత, ఆర్థిక పరిమితులు, అడ్మినిస్ట్రేషన్ సమస్యలు ఎదుర్కొంటున్నాయని, అయితే ఎయిమ్స్ మంగళగిరి వీటిని స్వల్పకాలంలోనే అధిగమించి ముందుకు సాగుతోందని అన్నారు. అనంతరం 'గర్భవతి సంరక్షణ క్లినిక్' బ్రోచర్‌ను మంత్రి ఆవిష్కరించారు. కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ మాట్లాడుతూ... వైద్య విద్య పూర్తవడం అంటే.. నేర్చుకోవడం ఇప్పుడే మొదలైనట్టని అన్నారు. వైద్యులు నూతన ఆవిష్కరణలను అందిపుచ్చుకోవాలని, కోట్లాది మంది ప్రజలకు ఒక నమ్మకాన్ని కల్పించాలని అన్నారు. ఎయిమ్స్ డైరెక్టర్ అహంతుమ్ సంతా సింగ్.. ఎయిమ్స్ నివేదికను వివరించారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని పలు వైద్య కళాశాలలు, విశ్వవిద్యాలయాల ప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పట్టభద్రులైన విద్యార్థులకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు అనుప్రియ పటేల్, లోకేశ్ ధ్రువపత్రాలు అందజేశారు.



ఎయిమ్స్-మంగళగిరి స్నాతకోత్సవంలో వైద్య విద్య పూర్తిచేసుకున్న విద్యార్థినికి డిగ్రీ ప్రదానం చేస్తున్న మంత్రి లోకేశ్. చిత్రంలో కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

'మరకతమణి' సీక్వెల్ ప్రారంభం



కామెడీ ఫాంటసీతో 2017లో విడుదలై బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకున్న చిత్రం 'మరకతమణి'. అందరూ ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ సినిమా సీక్వెల్ 'మరకతమణి 2' చెన్నైలో జరిగిన పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. హీరో కార్తి క్లాప్ కొట్టగా, కథానాయకుడు ఆర్య, దర్శకుడు వెంకట్ ప్రభు కెమెరా స్విచ్చాన్ చేశారు. ఆది పినిశెట్టి, ప్రియా భవాని శంకర్ జంటగా నటిస్తున్నారు. సత్యరాజ్, నిక్కీ గల్రానీ పినిశెట్టి, మునిష్కాంత్, ఆనందరాజ్, డానీ, అరుణ్‌రాజా కామరాజ్, మురుగానందం తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'మరకతమణి'కి దర్శకత్వం వహించిన ఆర్కే శరవణ్ ఈ చిత్రానికి కూడా దర్శకత్వం వహిస్తున్నారు. ఫ్యాషన్ స్టూడియోస్, దంగల్ టీవీ, ఆర్‌డీసీ మీడియా, యాక్సెస్ ఫిల్మ్ ఫ్యాక్టరీ, గుడ్ షో బ్యానర్లపై సుధన్ సుందరం, మనీష్ సింఘాల్, దుర్గారం చౌదరి, దేవ్ అండ్ కేవీ దురై నిర్మిస్తున్నారు.

42 నియమాలు నిజం కాదు



అల్లు అర్జున్‌తో యాడ్ షూట్ చేయాలంటే 42 నియమాలు పాటించాలని బ్రాండ్ స్ట్రాటెజర్ కావేరి బరువా ఓ పాడ్‌కాస్ట్‌లో పేర్కొనడం.. ఆమె ఆరోపణల్ని పీఆర్ టీమ్ ఖండించిన విషయం తెలిసిందే. తాజాగా ఈ వివాదంపై ఆమె స్పందించారు. అల్లు అర్జున్‌కు క్షమాపణలు తెలిపారు. 'ఇటీవలే నేను చేసిన ఓ పాడ్‌కాస్ట్ వీడియోలో నా వ్యాఖ్యలు తప్పుగా బయటకి వెళ్లాయి. ఆ వీడియోలో అల్లు అర్జున్‌ను కలిసినప్పుడు చేయాల్సినవి.. చేయకూడనివి అంటూ 42 నిబంధనలు ఉంటాయని అన్నాను. అదంతా అవాస్తవం. నేను అలా మాట్లాడినందుకు అల్లు అర్జున్ గౌరవానికి భంగం వాటిల్లినట్లు తెలిసింది. నా వల్ల కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాను. ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకుంటున్నాను' అని పేర్కొన్నారు.

సలీంఖాన్‌కు తీవ్ర అస్వస్థత



ప్రముఖ బాలీవుడ్ రచయిత, హీరో సల్మాన్ ఖాన్ తండ్రి సలీంఖాన్ తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేర్చారు. ఈ వార్త తెలియగానే ఆయన పెద్ద కుమారుడు సల్మాన్‌ఖాన్ హుటాహుటిన బాంద్రాలో ఉన్న ఆ ఆస్పత్రికి వెళ్లారు. సలీంఖాన్‌ను ప్రస్తుతం ఐసీయూలో ఉంచి చికిత్స చేస్తున్నారు. సలీంఖాన్ రెండో భార్య, నటి, నర్తకి హెలెన్, ఇతర కుటుంబ సభ్యులు కూడా ఆస్పత్రికి వెళ్లారు. సలీం-జావేద్... డబ్బైల దశకంలో బాలీవుడ్‌ను శాసించిన స్టార్ రైటర్స్. 'జంజీర్', 'షోలే' వంటి చిత్రాలతో అమితాబ్ బచ్చన్‌కు యాంగ్రీ యంగ్‌మన్ ఇమేజ్ తీసుకువచ్చారు.

అలియా అరుదైన ఘనత



బాలీవుడ్ నటి అలియా భట్ అరుదైన గౌరవాన్ని దక్కించుకున్నారు. ప్రతిష్ఠాత్మకమైన బ్రిటీష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్ (బాఫ్టా) 79వ ఎడిషన్ అవార్డుల కార్యక్రమంలో ప్రజంటర్‌గా వ్యవహరించనున్నారు. ఈ కార్యక్రమంలో ఇతర హాలీవుడ్ నటులతో పాటూ ఆమె కూడా విజేతలకు పురస్కారాలను అందించనున్నారు. మన దేశం నుంచి దీపిక పదుకొణే, ప్రియాంక చోప్రా తర్వాత ఈ ఘనత సాధించిన నటి అలియానే కావడం విశేషం. ఈనెల 22న లండన్‌లోని రాయల్ ఫెస్టివల్ హాల్లో ఈ వేడుక జరగనుంది.


వినోదం పంచే బలవంత్

సుహాస్



'చిన్నప్పటి నుంచి వ్యాపారం చేయాలని ఆలోచించే కుర్రాడి కథే 'హే బల్‌వంత్'. నా పాత్ర వినోదాత్మకంగా ఉంటుంది. ఇలాంటి సినిమా కోసమే ఇన్నాళ్లు ఎదురు చూశాను' అని చెప్పారు సుహాస్. ఆయన కథానాయకుడిగా గోపి అచ్చర దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'హే బల్‌వంత్'. బి.నరేంద్రరెడ్డి నిర్మించారు. ఈనెల 20న విడుదలవుతున్న సందర్భంగా సుహాస్ విలేకరులతో చిత్ర విశేషాలు పంచుకున్నారు. 'కథ వినగానే నచ్చింది. వినోదంతోపాటు భావోద్వేగానికి కనెక్ట్ అయ్యాను. హే భగవాన్ అంటే భగవంతుడు అనే అర్థం వస్తుంది కాబట్టి టైటిల్ మార్చాలని సెన్సార్ బోర్డు సూచించడంతో 'హే బల్‌వంత్'గా మార్చాం. ఈ సినిమాపై అందరికీ నమ్మకముంది. మా చిత్రబృందానికి వంశీ నందిపాటి గారు ఎంతో ధైర్యం ఇస్తున్నారు' అని అన్నారు.

ఆ పాటలు వాడొద్దు



ఇళయరాజా, ఆడియో సంస్థ 'సరిగమ' మధ్య మొదలైన వివాదం కోర్టుకు వెళ్లిన సంగతి తెలిసిందే. తాజాగా ఈ విషయంలో ఢిల్లీ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. తుది తీర్పు వెలువడేవరకు ఆ సంస్థకు సొంతమైన 134 చిత్రాల్లోని పాటలను ఇళయరాజా ఉపయోగించడానికి ఏ మాత్రం వీల్లేదని ఆదేశాలు జారీ చేసింది. ఇళయరాజా సంగీతం అందించిన ఆ చిత్రాల ఆడియో హక్కులను నిర్మాతలు 'సరిగమ' సంస్థకు శాశ్వత ప్రాతిపదికన విక్రయించారు. అయితే కొన్ని మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్‌లకు ఇళయరాజా ఆ పాటలను వాడుకునేందుకు అనుమతులు ఇచ్చారు. దీంతో 'సరిగమ' సంస్థ కోర్టును ఆశ్రయించింది. నిర్మాత నుంచి ఆ పాటలను కొనుగోలు చేశాక వాటి పూర్తి హక్కులు 'సరిగమ'కే ఉంటాయని న్యాయస్థానం స్పష్టం చేసింది. వారి అనుమతి లేకుండా పాటలను వినియోగించడానికి వీల్లేదని పేర్కొంది.

రూ.10 కోట్లు డిపాజిట్ చేయండి

ప్రముఖ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్‌కు సంబంధించిన కేసులో తమిళ హీరో, నిర్మాత విశాల్‌కు చుక్కెదురైంది. విశాల్ రూ.10 కోట్లు డిపాజిట్ చేయాలని మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఆరు వారాల గడువు కావాలని విశాల్ మరో పిటిషన్ దాఖలు చేయగా కోర్టు కొట్టివేసింది.

కొత్తగా..

నేటి తరం 'గీతాంజలి'



సౌమిత్ పోలాడి హీరోగా నటిస్తూ సాయి కే వెన్నం తో కలసి దర్శకత్వం వహించిన చిత్రం 'నిలవే'. శ్రేయాసి సేన్ కథానాయిక. హర్ష చెముడు, సుప్రియా ఐసోలా మరో జంటగా నటించారు. రాజ్ అల్లాడ, గిరిధర్ రావు పోలాడి, సాయి కే వెన్నం నిర్మించారు. సినిమా ఇటీవలె విడుదలై విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం విజయోత్సవ వేడుకను నిర్వహించింది. ఆస్కార్ అవార్డు గ్రహీత, గీత రచయిత చంద్రబోస్ వీడియో సందేశం ద్వారా చిత్రబృందాన్ని అభినందించారు. జెమిని సురేశ్ మాట్లాడుతూ 'చాలా రోజుల తర్వాత మంచి సినిమా చూశాననే అనుభూతి కలిగింది. నేటి తరం 'గీతాంజలి'లా 'నిలవే' నిలుస్తుంది' అని అన్నారు.


విప్లవ వీరుడు షురూ



భారత స్వాతంత్ర్య సంగ్రామంలో సామాన్య ప్రజలు వీరులై సాగించిన వీరోచిత పోరాటమే కథాంశంగా తెరకెక్కుతోన్న చిత్రం 'విప్లవ వీరుడు'. ప్రముఖ నటి ఇంద్రజ కీలకపాత్రలో జైశ్వర్, సోనాలి జంటగా ఎస్. నాగరాజ్ రావు దర్శకత్వంలో ఏవీ జయరాం నిర్మిస్తున్నారు. పూజా కార్యక్రమాలతో చిత్రీకరణ మొదలైంది. ముహూర్తపు సన్నివేశానికి ప్రముఖ రచయిత పరుచూరి గోపాలకృష్ణ ఇంద్రజపై క్లాప్ ఇచ్చారు. బ్రిటిష్ కాలం నాటి చారిత్రక అంశాలతో ఈ సినిమాను రూపొందిస్తున్నామని దర్శకుడు తెలిపారు.

అందరికీ కనెక్టయ్యే చిత్రమిది

విజయ్ ఆంటోని



అజయ్ దిషన్, ధనుషా జంటగా గణేశ్ చంద్ర దర్శకత్వంలో రూపొందిన యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'బుకీ'. విజయ్ ఆంటోని సమర్పణలో శరవంత్ రామ్ క్రియేషన్స్ బ్యానర్‌పై రామాంజనేయులు జువ్వాజీ నిర్మించారు. ఈనెల 20న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. విజయ్ ఆంటోని మాట్లాడుతూ 'మార్గన్'తో అజయ్ మంచి గుర్తింపు తెచ్చుకున్నాడు. 'బుకీ'లో కూడా తన నటన మీ అందర్నీ అలరిస్తుంది. తెలుగు ప్రేక్షకులు ఎప్పుడూ ప్రతిభను ప్రోత్సహిస్తారు. తనని కూడా సపోర్ట్ చేయాలని కోరుకుంటున్నాను. అందరికీ కనెక్ట్ అయ్యే చిత్రమిది' అని అన్నారు. హీరో అజయ్ దిషన్ మాట్లాడుతూ 'ఇందులో అందరూ రిలేట్ చేసుకునే క్యారెక్టర్‌లో కనిపిస్తాను. సంగీతం పరంగా సినిమా అద్భుతంగా ఉంటుంది' అని అన్నారు.

ధవళేశ్వరం బ్యారేజీకి కొత్త గేట్లు: నిమ్మల



అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టుల గేట్లు ప్రమాదకరంగా ఉన్నాయన్న హెచ్చరికల్ని మాజీ ముఖ్యమంత్రి జగన్ పట్టించుకోలేదని మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. అసెంబ్లీలో మంగళవారం ఆయన మాట్లాడుతూ ధవళేశ్వరం బ్యారేజీ గేట్లు పాడయ్యాయని జలవనరుల శాఖ నివేదిక ఇవ్వడంతో 2014-19మధ్య అప్పటి సీఎం చంద్రబాబు 52గేట్లు కొత్తవి ఏర్పాటు చేయించారని గుర్తు చేశారు. ఆ తర్వాత 2024వరకూ నివేదికలతోపాటు హెచ్చరికలు చేసినా వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. గత ఏడాది ప్రతిపాదనలతో కూటమి ప్రభుత్వం నిధులు కేటాయించిందని 100కు పైగా గేట్లు ఏర్పాటు చేసేందుకు టెండర్లు పిలిచామని చెప్పారు.

హజ్ హౌస్‌ను అర్ధాంతరంగా వదిలేసిన జగన్



రాష్ట్ర విభజన తర్వాత కడపలో రూ.25కోట్లతో సీఎం చంద్రబాబు హజ్‌హౌస్ నిర్మాణం చేపట్టారని, 2019లో అధికారంలోకి వచ్చిన జగన్.. అప్పటికే సగానికి పైగా పనులు పూర్తి చేసుకున్న హజ్ హౌస్ నిర్మాణాన్ని గాలికి వదిలేశారని మంత్రి ఫరూక్ విమర్శించారు. ఆగిపోయిన హజ్ హౌస్ నిర్మాణాన్ని ఇప్పుడు మళ్లీ చంద్రబాబు పూర్తి చేస్తున్నారని తెలిపారు.

త్వరలో 110 మంది డాక్టర్ల నియామకం

▸▸ మండలిలో మంత్రి సత్యకుమార్ వెల్లడి

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రూ.194కోట్లతో 100 ప్రాథమిక ఆరోగ్య కేంద్ర (పీహెచ్‌సీ) భవనాల నిర్మాణం జరుగుతోందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ చెప్పారు. త్వరలో 110 మంది డాక్టర్లను నియమించనున్నట్లు వెల్లడించారు. మంగళవారం శాసన మండలిలో టీడీపీ సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, పేరాబత్తుల రాజశేఖరం, బీటీ నాయుడు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. 'రాష్ట్రంలో కొత్తగా 88 పీహెచ్‌సీలు మంజూరు చేశాం. 12 పీహెచ్‌సీలకు కొత్త భవనాలు అవసరమని గుర్తించాం. వాటి నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నాం. 976 పీహెచ్‌సీ భవనాలకు మరమ్మతులు చేపట్టాం. 152 కొత్త పీహెచ్‌సీలకు మౌలిక వసతులు కల్పిస్తున్నాం. ఇటీవల 2,500 మంది డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బందిని నియమించాం. మరో 110 మంది డాక్టర్లను త్వరలో నియమిస్తాం. గత 25 నెలల్లో 19 డయాలసిస్ సెంటర్లు మంజూరు చేశాం. పీహెచ్‌సీల్లో డయాలసిస్ సెంటర్లు లేవు. సీహెచ్‌సీల్లోనే ఉన్నాయి' అని మంత్రి వివరించారు.

ఇళ్ల స్థలాలకు 4.01 లక్షల దరఖాస్తులు: అనగాని



రాష్ట్రంలో ఇళ్ల స్థలాల కోసం 2025 జూన్ నుంచి 2026 జనవరి వరకు 4,01,876 దరఖాస్తులు అందాయని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. వీటిలో 1,03,494 ఆమోదించామని, 1,41,928 తిరస్కరించామని తెలిపారు. మిగిలిన 1,56,454 దరఖాస్తులు విచారణలో ఉన్నాయని చెప్పారు. మంగళవారం శాసనమండలిలో పేదలకు ఇళ్ల స్థలాలపై వైసీపీ సభ్యులు గోవిందరెడ్డి, త్రిమూర్తులు, రామసుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి పైవిధంగా సమాధానం ఇచ్చారు.

పారిశ్రామికవేత్తలుగా బీసీలు

▸▸ ఎంఎస్ఎంఈ పార్కుల్లో వారికే ప్రాధాన్యం: మంత్రి సవిత



అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): బీసీలను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దుతామని, ఎంఎస్ఎంఈ పార్కుల్లో వారికే ఎక్కువ అవకాశం ఇస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. మంగళవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే వంశీకృష్ణయాదవ్ అడిగిన ప్రశ్నకు ఆమె బదులిచ్చారు. రాష్ట్రంలో కొత్తగా 10 ఎంజేపీ బీసీ గురుకులాలు స్థాపిస్తున్నామని, ఆరింటిని జూనియర్ కాలేజీలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని చెప్పారు. త్వరలో బీసీ హాస్టళ్లలో 1291 మంది పారిశుధ్య సిబ్బంది, 142 మంది కుక్, కమాటీ పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. బీసీలను అన్నివిధాలుగా ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నదని, ఆదరణ 3.0 పథకానికి శ్రీకారం చుడుతున్నామన్నారు. విజయవాడలో సివిల్ సర్వీస్ కోసం ప్రత్యేక స్టడీ సర్కిల్ ఏర్పాటు చేశామన్నారు. 13 జిల్లాల కేంద్రాలకు బీసీ భవనాలు మంజూరు చేయగా, చిత్తూరు, శ్రీకాకుళం జిల్లాల్లో నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు.

కేసీఆర్‌కు చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు


అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మాజీ సీఎం కేసీఆర్‌కు ఏపీ సీఎం చంద్రబాబు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంతో మరిన్ని పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. మంత్రి లోకేశ్ కూడా కేసీఆర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మొరాయించిన మైకులు.. ఆలస్యంగా సభ

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): శాసనసభలో మైకులు మొరాయించడంతో సభ గంట ఆలస్యంగా మొదలైంది. శాసనసభ సర్వర్‌లో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో మంగళవారం శాసనసభ మొత్తాన్ని మాన్యువల్ మైకులతో నడిపించాల్సి వచ్చింది. ఉదయం 9 గంటలకు సభ ప్రారంభం కావల్సి ఉండగా.. అకస్మాత్తుగా మైకులు పనిచేయలేదు. టెక్నికల్ సిబ్బంది 9.10 నిముషాల వరకూ సమస్యను పరిష్కరించే ప్రయత్నం చేసినా వీలు కాలేదు. దీంతో డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణం రాజు వచ్చి సాంకేతిక సమస్యల కారణంగా సభ ఒక గంట ఆలస్యంగా ప్రారంభం అవుతుందని, సభ్యులంతా 10 గంటలకు హాజరుకావాలని కోరుతున్నామని ప్రకటించారు. అప్పటికే మెజారిటీ సభ్యులు వచ్చి కూర్చున్నారు. అయితే గంట తర్వాత కూడా సాంకేతిక సమస్య పరిష్కారం కాకపోవడంతో మాన్యువల్ మైకులను తీసుకు వచ్చి మంత్రులు, సభ్యులకు అందించారు. దీంతో మంగళవారం సభ మొత్తాన్ని మాన్యువల్ మైకులతోనే నడిపించాల్సి వచ్చింది.

రబీ శనగల కొనుగోలు ప్రారంభం

▸▸ 15 రోజుల్లో సొమ్ము చెల్లింపు: అచ్చెన్న



అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత రబీ సీజన్‌లో పండించిన శనగలను రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నట్టు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రకటించారు. శనగలు కొనుగోలు చేసిన 15 రోజుల్లోగా రైతులకు సొమ్ము చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కేంద్రం సహకారంతో నాఫెడ్, ఎన్సీసీఎఫ్‌ల ద్వారా 94,500 టన్నుల శనగల కొనుగోలుకు మద్దతు ధర పథకాన్ని అమలు చేయనున్నట్లు తెలిపారు. సీఎం యాప్ ద్వారా అన్ని జిల్లాల్లో రైతు సేవా కేంద్రాల్లో రైతులు వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు. పీఏసీఎస్‌లు, రైతు ఉత్పత్తి సంఘాలు శనగలు కొనుగోలు చేస్తాయని చెప్పారు. ప్రతి జిల్లాలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన జిల్లాస్థాయి సేకరణ కమిటీలు కొనుగోలు ప్రక్రియను పర్యవేక్షిస్తాయన్నారు. కొనుగోలు చేసిన శనగలను కేంద్ర, రాష్ట్ర గోదాముల్లో నిల్వ చేస్తామన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం 3.25లక్షల హెక్టార్లలో శనగ పంట సాగవ్వగా, 3.77లక్షల టన్నుల ఉత్పత్తి వస్తుందని అంచనా వేసినట్లు వివరించారు. ఈమేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

పంచాయతీ ఎన్నికలకు సన్నద్ధం!



▸▸ బీసీ కులగణనకు డెడికేటెడ్ కమిషన్

▸▸ రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం యోచన

▸▸ రాష్ట్ర నూతన ఎన్నికల కమిషనర్‌గా నీరబ్‌కుమార్ ప్రసాద్ నియామకానికి నిర్ణయం!

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గ్రామ పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం ఏప్రిల్ 2వ తేదీతో ముగియనుంది. ఈ క్రమంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించడంపై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రా నేతృత్వంలో 'డెడికేటెడ్ కమిషన్' ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం యోచిస్తున్నట్లు సమాచారం. గతంలో ఎస్సీ వర్గీకరణకు సంబంధించి రాజీవ్ రంజన్ మిశ్రా ఏకసభ్య కమిటీ అధ్యయనం చేసి నివేదిక ఇచ్చింది. అయితే బీసీల కులగణనపై డెడికేటెడ్ కమిటీ ఏర్పాటు చేసిన తర్వాత నివేదిక ఇవ్వడానికి 3 నెలల సమయం పడుతుంది. ఈ క్రమంలో ప్రస్తుత పంచాయతీల పాలకవర్గాల పదవీకాలం ముగిసే ఏప్రిల్ దాకా ఈ ఎన్నికల ప్రక్రియ ప్రారంభించే అవకాశం కనిపించడం లేదు. మరోవైపు నూతన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నియామకం జరిగిన తర్వాతనే గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుత కమిషనర్ నీలం సాహ్ని పదవీ కాలం మార్చి నెలాఖరుతో ముగియనుంది. నూతన కమిషనర్‌గా విశ్రాంత సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను నియమించేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చినట్లు తెలిసింది. సెప్టెంబరులో జడ్పీ, మండల పరిషత్‌ల పదవీకాలం కూడా ముగియనుంది. అప్పుడు ఆ ఎన్నికలు కూడా నిర్వహించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో అప్పుడే అన్ని స్థానిక సంస్థలకూ వరుసగా ఎన్నికలు నిర్వహించే అవకాశముందని కూడా భావిస్తున్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాలు ఇవీ..: పంచాయతీ ఎన్నికలు నిర్వహించాలంటే ఆయా రాష్ట్రాలు 'ట్రిపుల్ టెస్ట్'ను అమలు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశాలిచ్చింది. బీసీ కులగణన కోసం డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసి, రిజర్వేషన్లు 50 శాతం మించకుండా చర్యలు తీసుకోవాలని తీర్పులో పేర్కొంది. డెడికేటెడ్ కమిటీ ఏర్పాటు చేయకుండా, రిజర్వేషన్లను 50 శాతం మించి అమలు చేయాలని పలు రాష్ట్రాలు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో తెలంగాణలో కూడా డెడికేటెడ్ ఏర్పాటు చేసి 50 శాతం రిజర్వేషన్లకు పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో కూడా బీసీల కులగణన కోసం డెడికేటెడ్ కమిటీ ఏర్పాటు చేయాలని ఇటీవల బీసీ సంఘాలు కూడా ప్రభుత్వాన్ని కోరాయి.

50 శాతం రిజర్వేషన్లకు పరిమితం!: స్థానిక సంస్థల్లో బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అమలుపై కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇది నెరవేర్చాలంటే సుప్రీం తీర్పు ఆటంకంగా ఉంది. సుప్రీం తీర్పునకు విరుద్ధంగా రిజర్వేషన్లు అమలు చేసే పరిస్థితి ఉండదు. మన రాష్ట్రంలోనూ 50 శాతం రిజర్వేషన్లకు పరిమితం కావాల్సిందే. కూటమి పార్టీలు తమ పార్టీ పరంగా రిజర్వేషన్లు అమలు చేసే అవకాశముంది. డెడికేటెడ్ కమిటీ అధ్యయనం చేయడానికి, నివేదిక ఇవ్వడానికి మూడు నెలల సమయం పడుతున్నందున.. ఇప్పుడే పంచాయతీ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాకపోవచ్చని సమాచారం.

సుప్రీంలో శ్రీలక్ష్మికి ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

తెలిపింది. పొరపాటున ఇచ్చిన స్టేను ఇన్నిరోజులు ఎంజాయ్ చేసినట్లు కనిపిస్తోందని వ్యాఖ్యానించింది. ఓబుళాపురం కేసులో తనను నిర్దోషిగా ప్రకటించాలని కోరుతూ శ్రీలక్ష్మి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించగా, ఆ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. హైకోర్టు తీర్పును గతేడాది ఆగస్టు 12న శ్రీలక్ష్మి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్ మంగళవారం జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, ఎన్. కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. శ్రీలక్ష్మి తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో అప్పటి రాష్ట్ర గనుల శాఖ మంత్రి (సబితా ఇంద్రారెడ్డి), అప్పటి ప్రభుత్వ కార్యదర్శి (కృపానందం) సహా కీలకంగా ఉన్నవారు అందరూ నిర్దోషులేనని తేలిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. బాధ్యతలు స్వీకరించిన కొత్తలో శ్రీలక్ష్మి వద్దకు ఆ ఫైల్ వచ్చిందని గుర్తు చేశారు. నిర్ణయాధికారంలోని ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు అందరూ కేసులో నిర్దోషులుగా తేలగా, ఒక ఆఫీసర్‌ను మాత్రం ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిప్పడం సరికాదన్నారు. "ఓఎంసీకి మైనింగ్ లీజులు ఇచ్చే సమయంలో.. ప్రభుత్వ ఉత్తర్వులో 'క్యాప్టివ్ మైనింగ్' (సొంత పరిశ్రమల అవసరాలకు మాత్రమే ఖనిజాన్ని వాడుకునే) అనే పదాన్ని ఉద్దేశపూర్వకంగానే శ్రీలక్ష్మి తొలగించి అక్రమాలకు పాల్పడ్డారని సీబీఐ ఆరోపిస్తోంది. అయితే, శ్రీలక్ష్మి కేంద్రం చెప్పినట్లు పనిచేస్తే అది నిబంధనల ఉల్లంఘన అనడం సరికాదు. ఐరన్ ఓర్ అనేది మేజర్ మినరల్. ఈ విషయంలో రాష్ట్రం సిఫారసులు మాత్రమే చేసింది. కావున, లీజుల కేటాయింపులో తుది నిర్ణయం కేంద్రానిదే. అసలు.. అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలంటే లంచం అడిగి తీసుకున్నట్లు ఆధారాలు ఉండాలి. శ్రీలక్ష్మి విషయంలో ఎక్కడా డబ్బు చేతులు మారలేదు. నీరజ్ దత్తా కేసులో రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు ప్రకారం.. ఆరోపణల ఆధారంగానే అవినీతి ముద్ర వేయజాలము" అని సిద్ధార్థ్ దవే వాదనలు వినిపించారు. సీబీఐ తన వాదనలు వినిపిస్తూ.. శ్రీలక్ష్మి సోదరి భర్త (రాకేష్ బాబు) 2005-09 మధ్య కాలంలో ఆదాయానికి మించి భారీగా ఆస్తులు కూడబెట్టారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లింది. శ్రీలక్ష్మి గనుల శాఖ కార్యదర్శిగా ఉన్న సమయంలో ఆమె మరిది భారీగా అక్రమాస్తులు కూడబెట్టారని తెలిపింది. గనుల కేటాయింపులో శ్రీలక్ష్మి కూడా లంచాలు డిమాండ్ చేసినట్లు సాక్షులు వాంగ్మూలాలు ఇచ్చారని కోర్టుకు వివరించింది. ట్రయల్ కోర్టులో విచారణలో అక్రమ వ్యవహారాలన్నీ బయటపడే అవకాశం ఉందని ధర్మాసనం దృష్టికి సీబీఐ తీసుకెళ్లింది. దీని వెనుక క్విడ్ ప్రో కో ఉందన్న కోణంలో విచారణ జరిగిందని గుర్తు చేసింది. శ్రీలక్ష్మిపై అవినీతి ఆరోపణలకు బలమైన ఆధారాలు ఉన్నాయని తెలిపింది. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం.. కేసు విచారణ దశలో ఉన్నందున, మెరిట్స్‌లోకి వెళ్లలేమని తెలిపింది. ఈ అంశాన్ని ట్రయల్ కోర్టులోనే తేల్చుకోవాలని చెబుతూ శ్రీలక్ష్మి పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు ముగించింది.



అసలు ఏం జరిగిందంటే...

కర్ణాటక - ఆంధ్ర సరిహద్దుల్లోని బళ్లారి, అనంతపురం జిల్లాల పరిధిలో అక్రమంగా ఇనుప ఖనిజం తవ్వకాలు జరుపుతున్నారంటూ ఓబుళాపురం మైనింగ్ కంపెనీ(ఓఎంసీ)పై అనేక ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని 2009లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది. దీంతో కేంద్రం ఆ కేసు బాధ్యతలను సీబీఐకి అప్పగించింది. 2007లో ఆ సంస్థకు ఏపీ ప్రభుత్వం నుంచి ఇనుప గనుల లైసెన్సు ఇవ్వగా, ఆ సంస్థ గనుల తవ్వకాల్లో అక్రమాలు చేస్తోందంటూ 2009 డిసెంబరులో కేసు నమోదైంది. బీవీ శ్రీనివాస రెడ్డి, గాలి జనార్దన రెడ్డి, వీడీ రాజగోపాల్, లింగారెడ్డి, వై శ్రీలక్ష్మి, మెఫజ్ అలీఖాన్, కృపానందం, సబితా ఇంద్రారెడ్డిలను నిందితులుగా సీబీఐ చార్జిషీటులో పేర్కొంది. ఇందులో లింగారెడ్డి మరణించగా, ఏ6 గా ఉన్న ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మిపై కేసును 2022లో హైకోర్టు కొట్టేసింది. అలాగే, కృపానందం, సబితా ఇంద్రారెడ్డిలను నిర్దోషులుగా తేల్చిన న్యాయస్థానం, మిగిలిన ఐదుగురికి ఏడేళ్ల శిక్షను విధించిన విషయం విదితమే. అయితే, శ్రీలక్ష్మిని నిర్దోషిగా తేల్చడంపై 3 ఆగస్టు 2023న సీబీఐ సుప్రీంకోర్టులో సవాల్ చేసింది. ఆ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ ఎంఎం సుందరేశ్ నేతృత్వంలోని ధర్మాసనం.. మూడు నెలల్లో శీలక్ష్మి పాత్ర తేల్చాలని 2025, మే7న తెలంగాణ హైకోర్టుకు సూచించింది. 25 జూలై 2025న తెలంగాణ హైకోర్టు శ్రీలక్ష్మి డిశ్చార్జ్ పిటిషన్‌ను కొట్టివేసింది. హైకోర్టు తీర్పును శ్రీలక్ష్మి 12 ఆగస్టు 2025న సుప్రీంకోర్టులో మళ్లీ సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై విచారించిన సర్వోన్నత న్యాయస్థానం ట్రయల్ కోర్టులోనే తేల్చుకోవాలని తీర్పునిచ్చింది.



గోదావరి నదీ పరివాహక ప్రాంతాలను మ్యాప్‌లో పరిశీలిస్తున్న గోదావరి నదీ యాజమాన్య బోర్డు చైర్మన్ (జీఆర్‌ఎంబీ) బీపీ పాండే, కేఆర్‌ఎంబీ కార్యదర్శి కాంబోజ్

గోదావరి డెల్టా సిస్టమ్ సంతృప్తికరం

▸▸ పోలవరాన్ని పరిశీలించిన జీఆర్‌ఎంబీ చైర్మన్ బృందం

పి.గన్నవరం, అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గోదావరి నదీ యాజమాన్య సంస్థ(జీఆర్‌ఎంబీ) చైర్మన్ బీపీ పాండే బృందం పోలవరం ప్రాజెక్టును సందర్శించింది. చైర్మన్‌తోపాటు జీఆర్‌ఎంబీ/కేఆర్‌ఎంబీ మెంబర్ సెక్రటరీ సతీశ్ కాంబోజ్ మంగళవారం ప్రాజెక్టు నిర్మాణ పనులను పరిశీలించారు. గోదావరి డెల్టా పరిశీలనలో భాగంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరంలో కాటన్ నిర్మించిన ఆనకట్టను పరిశీలించి అనంతరం చైర్మన్ బీపీ పాండే మాట్లాడారు. 'గోదావరి డెల్టా సిస్టమ్ పరిధిలో ఎంతమేర ఆయకట్టు ఉంది, బ్యారేజీ నుంచి కాల్వలకు ఏడాదికి రెండు పంటలకు సంబంధించి ఎంతమేర నీరు వెళుతోంది అనే అంశాలను పరిశీలించాం. గోదావరి డెల్టా సిస్టమ్ సంతృప్తికరంగానే ఉంది' అని అన్నారు. వారి వెంట ఇరిగేషన్ ఎస్ఈ గోపీనాథ్, ఈఈలు వేణుగోపాలరావు, కె.వెంకటేశ్వరరావు, డీఈ ప్రసాదరాజు, ఏఈఈ బి.రమేష్‌బాబు, పి.గన్నవరం వాటర్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ వైస్ చైర్మన్ బొల్లంగి సత్యనారాయణమూర్తి, నీటి సంఘం అధ్యక్షుడు కె.సత్యనారాయణరాజు ఉన్నారు.

నేడు రాజధాని సచివాలయంలో...

జీఆర్‌ఎంబీ బృందం బుధవారం వెలగపూడి సచివాలయంలో జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, సలహాదారు ఎం.వెంకటేశ్వరరావు, ఈఎన్‌సీ నరసింహమూర్తితో సమావేశం కానుంది. ఈ భేటీలో పోలవరం-నల్లమల సాగర్ అనుసంధానంపై చర్చించే వీలుంది. బోర్డు నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరనుంది.

నాణ్యమైన లడ్డూలు



(మొదటి పేజీ తరువాయి)

సూచించిన ధరను పరిగణనలోకి తీసుకొన్నామని, టెండరు కేటాయింపులు అత్యంత పారదర్శకంగా జరిగాయని వివరించింది. శ్రీవారి ప్రసాదాల నాణ్యతను, పవిత్రతను కాపాడటానికి టీటీడీ బోర్డు కట్టుబడి ఉందని స్పష్టం చేసింది. టీటీడీ ప్రకటనలో ముఖ్యాంశాలివీ..

ఆరోపణలు- వాస్తవాలు...

ఆరోపణ: నందిని డెయిరీ (కేఎంఎఫ్)ని తప్పించారు.

వాస్తవం: 2024 నుంచి నందిని డెయిరీని తప్పించారనే ప్రచారంలో వాస్తవం లేదు. మొత్తం ఏడు టెండర్లలో 4 నందినీ డెయిరీకి దక్కాయి. ప్రస్తుతం అవసరమైన నెయ్యిలో 62 శాతం ఈ సంస్థ సరఫరా చేస్తోంది. 2019-24 మధ్య నందిని డెయిరీకి ఎటువంటి టెండర్లు ఇవ్వలేదు.

- 11-2024 బోర్డు రిజల్యూషన్ నం.16 - 10 లక్షల కిలోలు (ఒక్కో కేజీ రూ.495 లెక్కన సరఫరా)
- 01-2025 బోర్డు రిజల్యూషన్ నం.182 - 20 లక్షల కిలోలు (ఒక్కో కేజీ రూ.513 లెక్కన సరఫరా)
- 05-2025 బోర్డు రిజల్యూషన్ నం.292 - 10 లక్షల కిలోలు (ఒక్కో కేజీ రూ.600 లెక్కన సరఫరా)
- 10-2025 బోర్డు రిజల్యూషన్ నం.484 - 20 లక్షల కిలోలు (ఒక్కో కేజీ రూ.716.92 లెక్కన సరఫరా. ఇందులో 10 లక్షల కిలోలు మాత్రమే సరఫరా చేయగలమని తెలిపింది.)

ఆరోపణ: ఇందాపూర్ డెయిరీకి మాత్రమే టెండరు ఇచ్చారు.

వాస్తవం: ఇందాపూర్ డెయిరీకి మాత్రమే టెండరు ఇచ్చారనేది అవాస్తవం. ఏడు టెండర్లలో ఈ సంస్థ కేవలం రెండు మాత్రమే దక్కించుకుంది. మొత్తం 10 లక్షల కిలోల నెయ్యి సరఫరాకు ముందుకొచ్చింది.

- 12-2025 బోర్డు రిజల్యూషన్ నం.590 - 6.5 లక్షల కిలోలు (ఒక్కో కేజీ రూ.658 లెక్కన సరఫరా)
- 12-2025 బోర్డు రిజల్యూషన్ నం.605 - 3.5 లక్షల కిలోలు (ఒక్కో కేజీ రూ.657 లెక్కన సరఫరా)

ఆరోపణ: ఇతర డెయిరీ సంస్థలకు అవకాశం ఇవ్వలేదు.

వాస్తవం: టెండర్లలో మొత్తం ఏడు డెయిరీలు పాల్గొన్నాయి. వీటిలో నాణ్యత ప్రమాణాల ప్రకారం అర్హత సాధించిన నందిని, మదర్ డెయిరీ, సంగం, ఇందాపూర్ డెయిరీలకు నెయ్యి సరఫరాకు ఆర్డర్లు ఇచ్చాం.

ఆరోపణ: రేట్లు పెంచి ఆర్డర్ ఇచ్చారు.

వాస్తవం: 2016లో ఆవు పాల ధర లీటరు రూ.17 నుంచి 20 మధ్య ఉండేది. అప్పుడు ఆవు నెయ్యి ధర రూ.278 ఉంది. ప్రస్తుతం ఆవు పాల ధర రూ.42 (సుమారు 147% పెరిగింది). ఆవు నెయ్యి మార్కెట్ ధరలు కూడా దీనికి అనుగుణంగా ఇప్పుడు రూ.658 (సుమారు 137% పెరిగింది) ఉంది. ఇతర డెయిరీ సంస్థలు సైతం ఇంచుమించు ఎక్కువ ధరలకే కోట్ చేశాయి.

ఆరోపణ: కమీషన్ల కోసం రేటు పెంచారు.

వాస్తవం: సగటు ఎన్‌సీడీఎఫ్ఐ ఆవు వెన్న ధర, దేశవ్యాప్త ఆవు నెయ్యి హోల్‌సేల్ మార్కెట్ (ఎన్‌సీడీఎఫ్ఐ అండ్ ఐడీఏ) పరిస్థితులను పరిశీలించాం. ఎన్‌డీడీబీ నిపుణులు సూచించే ధరలను పరిగణనలోకి తీసుకున్నాం. అందువల్ల ఈ ఆరోపణలు పూర్తిగా అవాస్తవం.

ఆరోపణ: పరిధి మీరి కట్టబెట్టారు.

వాస్తవం: పెరిగిన ధరల వల్ల బోర్డు రిజల్యూషన్ నం. 484 మేరకు 20 లక్షల కిలోల నెయ్యిని సరఫరా చేయలేమని నందిని డెయిరీ చెప్పింది. ఇందులో కేవలం 10 లక్షల కిలోలు మాత్రమే సరఫరా చేస్తామని తెలిపింది. నెయ్యి సరఫరాలో అంతరాయం కలగకుండా ఉండేందుకు రవాణా పరిధిని దాటి ఎల్-2గా నిలిచిన జాతీయ స్థాయి డెయిరీలకు అవకాశం ఇచ్చాం.

ఆరోపణ: 2019-24 మధ్య ఇందాపూర్ డెయిరీ టెండర్లలో పాల్గొనలేదు.

వాస్తవం: 2019-24 మధ్య ఇందాపూర్ డెయిరీ ఆరు సార్లు టెండర్లలో పాల్గొంది.

నిబంధనల్లో మార్పులు

- గతంలో ఉన్న 1,500 కి.మీ. సేకరణ పరిధిని 800 కి.మీ.కు తగ్గించాం.
- నెయ్యి రవాణా చేసే ట్యాంకర్లకు జీపీఎస్ లాక్ సిస్టమ్ ఏర్పాటు తప్పనిసరి చేశాం.
- డెయిరీ ప్రాసెసర్ల తయారీ సిద్ధతను అంచనా వేసేందుకు ఎంఆర్‌ఎల్ స్కోర్ బోర్డు విధానాన్ని ప్రవేశపెట్టాం.
- ఎఫ్ఎస్ఎస్ఆర్ 2.1.8 నిబంధనలతోపాటు మిల్ ఫ్యాట్ ప్యూరిటీ పరీక్షలను (ఐఎస్‌వో 17678:2019), సెన్సరీ పారామీటర్స్ (ఐఎస్ కోడ్: 7770:1975) కఠినతరం చేశాం.
- నెయ్యి సరఫరా చేసే సంస్థల గుత్తాధిపత్యానికి తావివ్వకుండా 2024-25 మధ్య ఏడు విడతలుగా టెండర్లు నిర్వహించాం. పారదర్శకంగా మొత్తం 65 లక్షల కిలోల నెయ్యి సేకరణకు చర్యలు చేపట్టాం. ఈ ప్రక్రియలో నందిని(కేఎంఎఫ్) నాలుగు, మదర్ డెయిరీ రెండు, ఇందాపూర్ డెయిరీ రెండు, సంగం డెయిరీ ఒక టెండరు చొప్పున దక్కించుకున్నాయి. ప్రీమియర్ అగ్రి డెయిరీ, కొల్హాపూర్ డెయిరీ (గోకుల్), గోవింద్ మిల్క్ సంస్థలకు టెండరు దక్కలేదు.

తండ్రిలా దరిచేరి తలదించుకునే పనులు

▸▸ దళిత వితంతువు, ఆమె కుమార్తెకు లైంగిక వేధింపులు

▸▸ పోక్సో కేసులో అసెంబ్లీ ఏఎస్‌వో మునిరాజా అరెస్టు

▸▸ సహకరించిన సహోద్యోగులు రవిపాల్, హరిబాబు, జుబేదా



మునిరాజా


విజయవాడ, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): భర్త చనిపోవడంతో కుమార్తెతో కలిసి జీవిస్తున్న దళిత మహిళకు మాయమాటలు చెప్పి దగ్గరయ్యాడు. ఏ తోడూ లేదని బాధపడొద్దంటూ.. భరోసానిచ్చాడు. ఆమె కుమార్తెకు తండ్రిలా ఉంటానని నమ్మబలికాడు. కానీ.. ఆ తర్వాత ఆ వితంతువుతోపాటు ఆమె కుమార్తెను సైతం లైంగికంగా వేధించాడు. వారు దుస్తులు మార్చుకునే సమయంలో ఫొటోలు తీసి.. వాటిని చూపించి వారిని లొంగదీసుకోవాలని బెదిరించాడు. ఈ వేధింపులు భరించలేక బాధితురాలు పోలీసులను ఆశ్రయించడంతో.. అసెంబ్లీలో అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్ (ఏఎస్‌వో)గా పనిచేస్తున్న కృష్ణంనాయుడు మునిరాజా బండారం బయటపడింది. దీంతో నున్న పోలీసులు పోక్సో కేసులో అతన్ని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. గుంటూరు జిల్లా తాడేపల్లిలో నివాసముంటున్న బండారం కృష్ణంనాయుడు మునిరాజా అసెంబ్లీలో ఏఎస్‌వోగా పనిచేస్తున్నాడు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు విజయవాడలో తూనికలు కొలతల శాఖకు డిప్యుటేషన్‌పై వచ్చాడు. ఈ శాఖలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న క్రమంలో 2023 జూన్ 11న నున్న పోలీస్ స్టేషన్ పరిధిలో ఆర్‌ఎంపీగా పనిచేస్తున్న దళిత మహిళ క్లినిక్‌కు వెళ్లాడు. ఛాతిలో అలజడిగా ఉంది.. పరీక్ష చేయాలని అడిగాడు. ఆ తర్వాత నుంచి ఆ ప్రాంతానికి తనిఖీలకు వెళ్లినప్పుడల్లా ఆమె క్లినిక్‌కు వెళ్తుండేవాడు. ఈ క్రమంలో ఆమె భర్త కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి అని, అనారోగ్యంతో చనిపోయాడని తెలుసుకున్నాడు. ఇకపై ఆ కుటుంబానికి పెద్దదిక్కుగా ఉంటానని ఆమెకు మాటిచ్చాడు. అయితే 2023 జూన్ 28న కారుణ్య నియామకంలో భాగంగా ఆమెకు భర్త ఉద్యోగం రావడంతో క్లినిక్ మూసేసింది. అయినా మునిరాజా ఆమె ఇంటికి వెళ్తుండేవాడు. 2024లో అతడికి గుండెపోటు రావడంతో ఆస్పత్రిలో చేరాడు. ఆయన భార్య బీకే దేవి.. ఈ మహిళకు ఫోన్ చేసి వైద్యం కోసం డబ్బులు అడిగింది. దీంతో ఆమె రూ.5 లక్షలు ఒకసారి, రూ.2 లక్షలు మరోసారి ఇచ్చింది. బంగారం తాకట్టు పెట్టి రూ.5 లక్షలు ఇచ్చింది. చిత్తూరు జిల్లాలో తన ఆస్తులు కోర్టు వివాదాల్లో ఉన్నాయని చెప్పి మునిరాజా మరో రూ.10 లక్షలు తీసుకున్నాడు. ఆ మహిళ ఇంటికి వెళ్లిన ప్రతిసారి ఆమెతోపాటు కుమార్తెను అసభ్యకరంగా తాకేవాడు. బాధితురాలు, ఆమె కుమార్తె దుస్తులు మార్చుకునే సమయంలో సెల్‌ఫోన్‌లో ఫొటోలు తీసి ఆమె స్నేహితులు, తోటి ఉద్యోగులు, బంధువులకు పంపాడు. తనకు లొంగకపోతే ఫొటోలు మరింత మందికి పంపుతానని బెదిరించాడు. ఆమె నున్న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. మునిరాజా తప్పయిందని అంగీకరించి క్షమాపణలు చెప్పాడు. ఆమె నుంచి తీసుకున్న మొత్తంలో రూ.6.47లక్షలు ఇచ్చేశాడు. మిగిలిన మొత్తాన్ని విడతలవారీగా ఇస్తానని అంగీకరించాడు. దీంతో ఆమె కేసు వాపసు తీసుకుంది. తర్వాత ఆమెపై పగతో అజిత్‌సింగ్ నగర్, నున్న ప్రాంతాల్లో బాధితురాలిపై చెడు ప్రచారం మొదలుపెట్టాడు. అసెంబ్లీలో అతడితోపాటు పనిచేసే ఎం.రవిపాల్, ఈ.హరిబాబు, ఎన్.జుబేదాతో సాక్షి సంతకాలు చేయించుకుని గుంటూరు కోర్టులో బాధితురాలిపై దావా వేశాడు. బ్యాంక్ తాకట్టులో ఉన్న ఇంటిని ఆమె అమ్మకానికి పెట్టినట్టు ప్రచారం చేశాడు. బాధితురాలు, ఆమె కుమార్తెకు వీడియో కాల్స్ చేసి కులం పేరుతో దూషించేవాడు. అసభ్యకర సందేశాలు పంపేవాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నున్న పోలీసులు ఎస్సీ, ఎస్టీ చట్టం, పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి సోమవారం అతన్ని అరెస్టు చేశారు. మంగళవారం విజయవాడలోని ఆరో అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచారు. మునిరాజాకు కోర్టు 14 రోజుల రిమాండ్ విధించింది.

నకిలీ మద్యం కేసులో సుదర్శన్‌కు బెయిలు

విజయవాడ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): నకిలీ మద్యం కేసులో నిందితుడిగా ఉన్న సుదర్శన్‌కు విజయవాడ ఆరో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు బెయిలు మంజూరు చేసింది. దీనికి సంబంధించిన తీర్పును న్యాయాధికారి జి.లెనిన్‌బాబు మంగళవారం వెల్లడించారు. విజయవాడ ఇబ్రహీంపట్నం, ములకలచెరువులోని కేంద్రాల్లో సుదర్శన్ నకిలీ మద్యం తయారు చేశాడు. ములకలచెరువు, భవానీపురం ఎక్సైజ్ పోలీసు స్టేషన్లలో నమోదైన కేసుల్లో అతడు నిందితుడిగా ఉన్నాడు. ప్రస్తుతం నెల్లూరులోని కేంద్ర కారాగారంలో ఉన్న సుదర్శన్... తనకు బెయిలు మంజూరు చేయాలని కొద్దిరోజుల క్రితం కోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై వాదప్రతివాదనలు ముగియడంతో బెయిల్ ఇస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చారు. రూ.25 వేల చొప్పున రెండు పూచీకత్తులు సమర్పించాలని కోర్టు షరతు విధించింది. ఇంతకుముందే ములకలచెరువు కేసులో బెయిల్ మంజూరవడంతో సుదర్శన్ జైలు నుంచి బుధవారం విడుదల కానున్నాడు.

సెంథిల్.. విచారణ 19కి వాయిదా

నకిలీ మద్యం కేసులో మరో నిందితుడు సెంథిల్ కుమార్ పిటిషన్లపై విచారణ 19కి వాయిదా పడింది. సెంథిల్‌ను 5 రోజులు కస్టడీకి ఇవ్వాలని ఎక్సైజ్ పోలీసులు పిటిషన్ వేశారు. మరో వైపు నిందితుడు బెయిల్ కోసం పిటిషన్ వేశాడు. దానిపై కౌంటర్ దాఖలు చేయాలని ఎక్సైజ్ పోలీసులను, కస్టడీ పిటిషన్‌పై కౌంటర్ దాఖలు చేయాలని సెంథిల్ తరపు న్యాయవాదులను ఆదేశిస్తూ విచారణను కోర్టు 19కి వాయిదా వేసింది.





మండలిలో వైసీపీ రచ్చ!

హెరిటేజ్‌పై చర్చకు పట్టు.. గంటల తరబడి నినాదాలు.. ఛైర్మన్ పోడియంను చుట్టుముట్టిన ప్రతిపక్ష సభ్యులు

- సంబంధం లేని అంశాన్ని ప్రస్తావిస్తారా?: మంత్రుల ఆగ్రహం
- హిందూ దేవుళ్లు, భక్తులపై జగన్ పగబట్టారు: అచ్చెన్న
- కల్తీ లడ్డూ పాపాన్ని దారి మళ్లించేందుకే: కొలుసు
- పలుమార్లు సభ వాయిదా

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థ టీటీడీకి నెయ్యి సరఫరా చేసిందని ఆరోపిస్తూ మంగళవారం శాసన మండలిలో వైసీపీ సభ్యులు రగడ సృష్టించారు. మండలి ప్రారంభం కాగానే మైకుల్లో సాంకేతిక సమస్య కారణంగా సభను ఛైర్మన్ గంటసేపు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభం కాగానే.. ఇందాపూర్ డెయిరీ పేరుతో టీటీడీకి హెరిటేజ్ నెయ్యి సరఫరా చేసిందన్న ఆరోపణలపై చర్చించాలని వైసీపీ సభ్యులు కేఆర్‌జే భరత్, సిపాయి సుబ్రహ్మణ్యం ఇచ్చిన వాయిదా తీర్మానాన్ని ఛైర్మన్ తిరస్కరిస్తున్నట్లు ప్రకటించి, వెంటనే ప్రశ్నోత్తరాలు చేపట్టారు. పేదలకు ఇళ్ల స్థలాలపై రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, పీహెచ్‌సీ భవనాల పునర్ధురణపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ సమాధానం ఇస్తుండగా, వైసీపీ సభ్యులు ఛైర్మన్ పోడియంను చుట్టుముట్టారు. కొందరు పోడియంపైకి ఎక్కి, హెరిటేజ్‌పై చర్చకు అనుమతించాలని పట్టుబట్టారు. 'హెరిటేజ్ పాలు, పెరుగు, నెయ్యి, కూటమి పాలన, సీఎం చంద్రబాబు విధానాలు కల్తీ.. గోవిందా.. గోవిందా' అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ పెద్దపెట్టున నినాదాలు చేశారు. పశువైద్యశాలల్లో పరికరాల కొరతపై మంత్రి అచ్చెన్నాయుడు సమాధానం చెప్పేందుకు ప్రయత్నిస్తుండగా వైసీపీ సభ్యులు పెద్దగా నినాదాలు చేస్తూ ఛైర్మన్ పోడియం వద్ద ఆందోళన చేశారు. మంత్రి పార్థసారథి జోక్యం చేసుకుని, శ్రీవారి లడ్డూ విషయంలో వైసీపీ నేతలు చేసిన పాపం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు హెరిటేజ్ గురించి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. హెరిటేజ్ వల్ల ప్రభుత్వానికి, టీటీడీకి ఏ నష్టం జరిగిందో చెప్పాలన్నారు. వైసీపీ పక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడేందుకు ప్రయత్నిస్తుండగా, ఆ పార్టీ సభ్యులు నినాదాలు కొనసాగించారు. 'మంత్రులు మాట్లాడేటప్పుడు నినాదాలు చేస్తున్నారు. సభను గౌరవించి, పోడియం దిగండి. మీ పార్టీ నేత మాట్లాడతారు' అని ఛైర్మన్ కోరారు. అయినా వైసీపీ సభ్యులు చర్చకు పట్టుబట్టడంతో సభను 10 నిమిషాలు వాయిదా వేశారు. తిరిగి సభ ప్రారంభం కాగానే సభ్యుల విజ్ఞప్తి మేరకు మిగిలిన ప్రశ్నలను వాయిదా వేస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు. దీంతో హెరిటేజ్‌పై చర్చకు అనుమతించాలని వైసీపీ సభ్యులు మరోసారి డిమాండ్ చేశారు. ఇదే సమయంలో ప్రత్యేక అంశాల ప్రస్తావనకు ఛైర్మన్ అనుమతించడంతో బీజేపీ సభ్యుడు సోము వీర్రాజు, జనసేన సభ్యుడు నాగేంద్రబాబు, టీడీపీ సభ్యుడు రాంగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపీమూర్తి తదితరులు వివిధ అంశాలపై మాట్లాడుతుండగా, వైసీపీ సభ్యులు పెద్దగా నినాదాలు చేయడంతో గందరగోళం నెలకొంది. ఆందోళన విరమిస్తే బడ్జెట్‌పై చర్చ చేపడతామని ఛైర్మన్ చెప్పినా వారు నినాదాలు చేస్తుండటంతో సభను మరో 15 నిమిషాలు వాయిదా వేశారు. గంట తర్వాత సభ ప్రారంభం కాగానే మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడబోతుండగా, వాయిదా తీర్మానంపై చర్చ కోరుతూ వైసీపీ సభ్యులు మరోసారి తమ స్థానాల నుంచి లేచి, పోడియం వద్దకు వచ్చారు. దీంతో అచ్చెన్నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆధారాలు లేకుండా నిందారోపణలు చేయడం వైసీపీకి అలవాటుగా మారిందని మంత్రి సత్యకుమార్ మండిపడ్డారు. దేవుడిపైన, హిందూ భక్తులపైనా జగన్ పగబట్టారని, లడ్డూల కల్తీని పక్కదారి పట్టించడానికి హెరిటేజ్ అంశాన్ని తెచ్చారని అచ్చెన్న మండిపడ్డారు. సభా మర్యాదను, గౌరవాన్ని కాపాడాలని కూటమి ఎమ్మెల్సీలు ఛైర్మన్‌కు విజ్ఞప్తి చేశారు. 'అన్నీ కల్తీ కల్తీ' అంటూ నినాదాలు చేస్తున్న వైసీపీ సభ్యుడు రుహుల్లాపై ఛైర్మన్ మండిపడ్డారు. 'దేవుడి పేరు చెప్పి.. లడ్డూల కల్తీ అంటూ కూటమి ప్రభుత్వమే అవినీతికి పాల్పడుతోంది' అని బొత్స ఆరోపించారు. వాయిదా తీర్మానంపై చర్చ జరగాల్సిందేనని డిమాండ్ చేశారు. అధికార, ప్రతిపక్ష సభ్యుల నినాదాలతో మండలి దద్దరిల్లడంతో ఛైర్మన్ సభను బుధవారానికి వాయిదా వేశారు.



సిగ్గు పడాల్సింది పోయి ఎదురుదాడా?: అచ్చెన్న ఫైర్

'మండలిలో పెద్ద డ్రామా జరుగుతోంది. సభకు ఏమాత్రం సంబంధం లేని విషయాన్ని వైసీపీ సభ్యులు ప్రస్తావించి, డ్రామా ఆడుతున్నారు. దేవుళ్లు, హిందువులపై పగబట్టినట్లు వ్యవహరిస్తున్నారు' అని మంత్రి అచ్చెన్నాయుడు మండిపడ్డారు. 'హెరిటేజ్‌కు తిరుపతి లడ్డూకి సంబంధం ఏమిటి? కల్తీ జరిగిందని అప్పటి టీటీడీ ఛైర్మన్ సుబ్బారెడ్డే అంగీకరించారు. హెరిటేజ్‌పై ఆరోపణలకు ఆధారాలేవీ? ప్రజల దృష్టి మళ్లించాలని చూస్తున్న వైసీపీకి దమ్ముంటే లడ్డూ కల్తీపై చర్చకు రావాలి. ఏడుకొండల వాడికి జగన్ తండ్రి రెండు కొండలు చాలన్నారు. చేసిన తప్పిదానికి లెంపలేసుకోవాల్సింది పోయి, వెనకేసుకొచ్చి మాట్లాడుతున్నారు. తప్పుచేసి, ఇరుక్కుపోయిన వైసీపీని యావత్ హిందూ సమాజం ఛీ కొడుతోంది. సిగ్గు పడాల్సింది పోయి, ఎదురు దాడిచేసి, సభను పక్కదారి పట్టించాలనే ఆందోళన చేస్తున్నారు. కుట్ర రాజకీయాలు సాగవు. మండలి స్తంభించిపోయినట్లు మీ పత్రికలో రాసుకోవాలనా? హిందూ దేవుళ్లు, హిందూ భక్తులపై జగన్‌తో సహా వైసీపీ వారు పగబట్టారు. హిందూ సంప్రదాయాన్ని దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారు. నిజం దాగదు. బాధ్యులపై చర్యలు తప్పవు' అని అచ్చెన్న హెచ్చరించారు. హెరిటేజ్ విషయంలో ఆధారాలుంటే చూపించాలని వైసీపీ సభ్యులను మండలి ఛైర్మన్ కోరాలని, లేకపోతే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అచ్చెన్నాయుడు కోరారు.

ఆక్వా రైతులకు యూనిట్ రూ. 1.50కే

- రైతులందరికీ రిజిస్టర్ సర్టిఫికెట్లు ఇస్తున్నాం: మంత్రి గొట్టిపాటి



అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఆక్వా రైతులందరికీ యూనిట్ రూ.1.50కే కరెంటు ఇవ్వడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. ఆక్వాకు ఇచ్చే విద్యుత్ సబ్సిడీలో జోన్, నాన్ జోన్ విధానం అమలు చేస్తున్న విషయం వాస్తవమేనా? అని మంగళవారం అసెంబ్లీలో ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రశ్నించారు. ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ ఆక్వా రైతులందరికీ సర్టిఫికేషన్ చేయాలని సీఎం చెప్పారని, ఇప్పటి వరకూ ఈ ప్రక్రియ పూర్తి చేయలేదని చెప్పారు. వీటికి మంత్రి బదులిస్తూ.. గతంలో రూ.2 సబ్సిడీ ఇచ్చేవారమని, రూ.1.50కే ఇస్తామని వైసీపీ రైతుల్ని మోసం చేసిందన్నారు. 2020లో జోన్, నాన్ జోన్ అని విభజించి, రైతుల సంఖ్యను గణనీయంగా తగ్గించిందని చెప్పారు. 900 కోట్ల సబ్సిడీ బకాయిలూ వదిలేసిందని, తాము 490 కోట్లు చెల్లించామన్నారు. వైసీపీ ప్రభుత్వం 4.27 లక్షల మందికి సబ్సిడీ అమలుచేస్తే.. కూటమి ప్రభుత్వం 5.20 లక్షల రైతులను జోన్‌లోకి తీసుకువచ్చి రూ.1.50కి యూనిట్ ఇస్తోందన్నారు. జోన్లతో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్ పరిధిలో ఉన్న వారందరికీ రూ.1.50కి యూనిట్ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

విద్యుత్‌లో భద్రతకు 10 కోట్లు

విద్యుత్ శాఖ పరిధిలోని సేఫ్టీ డెవలప్‌మెంట్ విభాగానికి రూ.10 కోట్ల నిధులు కేటాయించామని గొట్టిపాటి తెలిపారు. నెల్లిమర్లలో హైటెన్షన్ విద్యుత్ లైన్లు తక్కువ ఎత్తులో ఉండడంతో ప్రాణనష్టం జరుగుతున్న విషయం వాస్తవమేనా? దానిని మార్చడానికి ఏం చర్యలు తీసుకున్నారని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అడిగిన ప్రశ్నలకు ఆయన బదులిచ్చారు. 16ఏళ్ల బాలిక విద్యుత్ తీగలు తగిలి మరణించిందని, రాష్ట్రం మొత్తంమీద చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారని చెప్పారు. స్పందించిన మంత్రి విద్యుత్ లైన్ల ఎత్తు పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. సేఫ్టీ చర్యలు తీసుకోవాలని ప్రతి జిల్లాకు కోటి రూపాయలు ఇచ్చామన్నారు. కొన్ని జిల్లాల్లో తోటలు పెరిగినచోట కూడా రైతులు విద్యుత్ షాక్‌లతో మరణిస్తున్నారని, దీని నివారణకు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సభలో మూడు బిల్లులు



రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం మూడు బిల్లులను శాసనసభలో ప్రవేశపెట్టింది. ఆంధ్రప్రదేశ్ పురపాలక చట్టాల మొదటి సవరణ బిల్లు, రెండో సవరణ బిల్లు, ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ డ్యూటీ సవరణ బిల్లులను సభ పరిగణనలోకి తీసుకున్నట్లు డిప్యూటీ స్పీకర్ రఘురామ ప్రకటించారు.

బడులకు 5 స్టార్ రేటింగ్

- ప్రస్తుతం ఒక్కటీ లేదు.. అన్నింటినీ ఆ పరిధిలోకి తెస్తాం
- వెయ్యి కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం
- వైసీపీ తెచ్చిన జీవో 117తో పిల్లలు బడికి దూరం
- కూటమి ప్రభుత్వం వచ్చాక రద్దు చేశాం
- 'వన్ క్లాస్-వన్ టీచర్' విధానం 33 శాతానికి పెంచాం: మంత్రి లోకేశ్
- 'నాడు-నేడు'లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి: గౌతు శిరీష





అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలన్నింటినీ 5స్టార్ రేటింగ్‌లోకి తెస్తామని, రూ.వెయ్యి కోట్లతో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ చెప్పారు. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో మంగళవారం 'నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా పాఠశాలల ఆధునీకరణలో అనేక అవకతవకలు చోటుచేసుకున్నాయని, ఆ పనులకు సకాలంలో బిల్లులు చెల్లించిన విషయం వాస్తవమేనా?' అని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అడిగిన ప్రశ్నకు మంత్రి బదులిచ్చారు. గత ప్రభుత్వం నాడు-నేడు కార్యక్రమం చేపట్టిన తర్వాత కూడా 233 పాఠశాలల్ని మూసివేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. గత ప్రభుత్వం తెచ్చిన జీవో 117 వల్ల పేద పిల్లలు ప్రభుత్వ పాఠశాలలకు దూరమయ్యారని, కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ జీవో రద్దు చేశామని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎస్ఎంసీ అకౌంట్‌లో రూ.200 కోట్లు ఉన్నాయని, ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.800 కోట్లు అదనంగా కేటాయించామన్నారు. ఈ రెండూ కలిపి వచ్చే ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.1000 కోట్లు ఖర్చు చేసే అవకాశం వచ్చిందన్నారు. మరోవైపు పాఠశాలల విద్యాభివృద్ధిలో 'వన్ క్లాస్- వన్ టీచర్' విధానం చాలా కీలకమైందన్నారు. గతంలో 3 శాతం పాఠశాలల్లోనే ఈ విధానం ఉంటే.. ఇప్పుడు 33 శాతానికి పెంచామన్నారు. దీనిద్వారా మెరుగైన ఫలితాలు వస్తున్నాయన్నారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు సంబంధించి ప్రధానంగా ఐదు అంశాలను పరిగణలోకి తీసుకున్నామని తెలిపారు. లీక్ ప్రూఫ్ బిల్డింగ్స్, పెయింట్స్, బెంచీలు, టాయ్‌లెట్స్, తాగునీరు అందించాలని నిర్ణయించామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలలకు స్టార్ రేటింగ్ ఇస్తున్నామని, అన్ని పాఠశాలలను 5 స్టార్ రేటింగ్‌కు తేవాలన్నది ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. ఇప్పటి వరకూ ఒక్క పాఠశాల కూడా 5 స్టార్ రేటింగ్‌లో లేదన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేయాల్సిన బాధ్యత తమపై ఉందని, అవసరమైనచోట పాఠశాల భవనాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని నిర్ణయించామన్నారు. 2014-19లో చేసిన పనులకు బిల్లుల చెల్లింపునకు చర్యలు చేపడతామన్నారు. తొలుత మాట్లాడిన గౌతు శిరీష గత ప్రభుత్వం నాడు-నేడు పేరుతో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిందని, నేటికీ అనేకచోట్ల అసంపూర్తి నిర్మాణాలు ఉన్నాయని చెప్పారు. వైసీపీ ప్రభుత్వంలో 'నాడు-నేడు'లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. అసంపూర్తిగా నిలిచిపోయిన భవనాలను పూర్తి చేయాలని కోరారు.

మహిళలపై నేరాలు తగ్గాయి

- హోంమంత్రి అనిత



అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మహిళలపై నేరాలు తగ్గాయని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. హాస్టళ్లలోని బాలికలు, ఇతర మహిళలపై అఘాయిత్యాలు పెరిగాయా? అంటూ వైసీపీ ఎమ్మెల్యేలు లిఖితపూర్వకంగా అడిగిన ప్రశ్నకు హోంశాఖ మంత్రి సమాధానం ఇచ్చారు. హాస్టల్ విద్యార్థినులపై లైంగిక దాడి కేసులు 2024లో 13నమోదు కాగా 2025లో 8 నమోదైనట్లు చెప్పారు. మహిళలపై అత్యాచారాలు, ఇతర నేరాలు 2024లో 1,533 నమోదైతే 2025లో 1,485కు తగ్గాయన్నారు. గంజాయి వినియోగం వల్ల కలిగే నష్టాలను వివరిస్తూ ఉత్తరాంధ్ర జిల్లాల్లో గత ఏడాది నవంబరులో ప్రారంభించిన 1300కిలోమీటర్ల 'అభ్యుదయం' సైకిల్ యాత్ర ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిందన్నారు. ఇటీవల చేపట్టిన 'సంకల్పం'లో విద్యార్థులు, యువత, గిరిజనులు స్వచ్ఛందంగా పాల్గొనడం పెద్ద విజయంగా పేర్కొన్నారు.

రాష్ట్రంలో గంజాయి జీరో

రాష్ట్రంలో గంజాయి సాగు లేదని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. మంగళవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయక్రిష్ణ అడిగిన ప్రశ్నలకు ఆమె బదులిచ్చారు. ఆంధ్రా-ఒరిస్సా సరిహద్దుల వెంబడి గంజాయి అక్రమ రవాణా క్రియాశీలకంగా ఉన్న విషయం వాస్తవమేనా? అని ఆయన ప్రశ్నించగా.. రాష్ట్రంలో గంజాయి నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకున్నామని, ఇందు కోసం ప్రత్యేకంగా ఈగల్ టీమ్ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో గంజాయి సాగు జీరో అయినా, ఏవోబీలో కొంత సమస్య ఉందన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే గంజాయిని అడ్డుకోడానికి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. పాలకొండ, సాలూరు, పార్వతీపురం నియోజకవర్గాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాలతో సర్వేలెన్స్ చేస్తున్నామన్నారు. ఐదు జిల్లాల పరిధిలో 1,423 కేసులు నమోదు చేశామని, 762 వాహనాలు సీజ్ చేశామని, 3,515 మందిని అరెస్టు చేశామన్నారు. గంజాయి ద్వారా వచ్చే సమస్యలపై అవగాహన కల్పించేందుకు రాష్ట్రంలో 493 ఈగల్ క్లబ్స్ ఉన్నాయన్నారు. పక్క రాష్ట్రాల నుంచి ఏపీలోకి వచ్చే గంజాయిని కూడా నివారిస్తున్నామన్నారు.

ఆరోగ్య రంగంలో ఏఐ వినియోగం

- త్వరలో ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ ఒప్పందం: మంత్రి సత్యకుమార్



అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం, గేట్స్ ఫౌండేషన్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యంలో ఏఐ సాయంతో ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తెచ్చేందుకు ప్రభుత్వం సిద్ధమైందని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. అమరావతికి గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిల్ గేట్స్ రాక సందర్భంగా రాష్ట్రంలో డీసీజ్ మోడలింగ్ అండ్ డెసిషన్ ఇంటెలిజెన్స్ సెంటర్ (డీఎంఐడీసీ) ఏర్పాటు చేస్తామని సీఎం చెప్పిన నేపథ్యంలో మంత్రి ఈ అంశంపై మంగళవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో చర్చించారు. విజయవాడలోని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ కేంద్రంగా 'డీఎంఐడీసీ' ఏర్పాటుకు సిద్ధమయ్యారు. ప్రాథమికంగా నిర్ణయించిన ప్రకారం సింగపూర్ నేషనల్ యూనివర్సిటీలోని పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్‌తో ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ ఒప్పందం చేసుకోనుందని మంత్రి పేర్కొన్నారు. ఇప్పటికే సింగపూర్ వర్సిటీ పబ్లిక్ హెల్త్ డిపార్టుమెంట్‌తో గేట్స్ ఫౌండేషన్ భాగస్వామ్య ఒప్పందం చేసుకుందన్నారు. ఈ క్రమంలో ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ కూడా ఒప్పందం చేసుకోనుందని, దీనివల్ల సింగపూర్ వర్సిటీ నుంచి సాంకేతిక సాయం లభిస్తుందని తెలిపారు.డీఎంఐడీసీ స్థాపనలో భాగంగా ఆరోగ్య రంగంలో వివిధ విభాగాల నిపుణుల నియామకాలు జరుగుతాయన్నారు. అవేర్ సాంకేతికను డీఎంఐడీసీకి అనుసంధానం చేస్తారన్నారు. హెల్త్ వర్సిటీ ద్వారా మాస్టర్స్ ఇన్ పబ్లిక్ హెల్త్‌లో రెండేళ్ల వ్యవధి కోర్సు ప్రారంభించడంపై చర్చించారు.

118 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు పదోన్నతి

ప్రభుత్వ వైద్య కళాశాలలు, బోధనాసుపత్రుల్లో పనిచేసే 118 మంది అసోసియేట్ ప్రొఫెసర్లకు ప్రొఫెసర్లుగా పదోన్నతి కల్పించే ఫైల్‌ను మంత్రి సత్యకుమార్ ఆమోదించారు. క్లినికల్ విభాగాల్లో 81 మందికి, నాన్‌క్లినికల్ విభాగాల్లో 37 మందికి, సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో ఇద్దరికి పదోన్నతి కల్పించారు. ఈ ప్రక్రియ ద్వారా ఖాళీల్లో 45 శాతం ప్రొఫెసర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసింది.

దుమ్ము ఎక్కువగా ఉంది.. అందుకే మాస్క్: సత్యకుమార్

శాసనమండలిలో ముఖానికి మాస్కు పెట్టుకుని మాట్లాడటంపై మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను లాబీలో ఉన్న విలేకరులు ప్రశ్నించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ.. 'మండలిలో వేసిన కార్పెట్‌పై దుమ్ము ఎక్కువగా ఉందని, చెప్పులకు కూడా దుమ్ము అంటుకుని రంగు మారిపోతున్నాయి' అని చెప్పారు. తనకు డస్ట్ అలర్జీ ఉండటంతో మాస్క్ పెట్టుకుని మాట్లాడానని, దుమ్ముపై మండలి ఛైర్మన్‌తో మాట్లాడానని చెప్పారు.

బడ్జెట్‌లో సింహభాగం బీసీలకే

- గత ప్రభుత్వం ఒక్కరికీ రుణం ఇవ్వలేదు
- జనసేన ఎమ్మెల్యేలు వంశీకృష్ణ యాదవ్, జయకృష్ణ

గత ప్రభుత్వం 56 కార్పొరేషన్లు పెట్టి.. వాటి ద్వారా ఒక్కరికీ రుణం ఇవ్వలేదని, ఆయా సామాజిక వర్గాలకు ఇతర ప్రయోజనాలేవీ కల్పించలేదని జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ విమర్శించారు. మంగళవారం అమరావతి అసెంబ్లీ మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వం చేతి వృత్తుల వారికి ఆదరణ ద్వారా కొంత ఫైనాన్షియల్ సపోర్టు ఇచ్చిందన్నారు. వివిధ పథకాల ద్వారా వారికి రుణాలు ఇచ్చిందన్నారు. అదేవిధంగా కూటమి ప్రభుత్వం బీసీల అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తుందని, బీసీలకు బడ్జెట్‌లో సింహభాగం కేటాయింపులు చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశలో నడిపిస్తోందని, పెట్టుబడిదారులు ముందుకు వస్తున్నారని తెలిపారు. జనసేన ఎమ్మెల్యే నిమ్మక జయరామకృష్ణ మాట్లాడుతూ ప్రజలు మెచ్చే బడ్జెట్‌ను కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టడంతో తట్టుకోలేక వైసీపీ సభ్యులు శాసనమండలిలో రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. సమావేశాలను అడ్డుకుంటూ సభ్యత, సంస్కారం మరిచి వ్యవహరిస్తున్నారన్నారు.

జగన్ పాలనలో అప్పుల కుప్ప

- అధిక వడ్డీలకు అప్పులు తెచ్చారు
- రాయలసీమ లిఫ్టులో వెయ్యి కోట్లు దోచేశారు
- ఈ బడ్జెట్ రాష్ట్ర అభివృద్ధికి బ్లూ ప్రింట్: ఎమ్మెల్యేలు

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జగన్ ఐదేళ్ల విధ్వంస పాలనతో ఆర్థికంగా చితికిపోయిన రాష్ట్రం.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో తిరిగి పునరుజ్జీవం పొందుతోందని పలువురు అధికార పార్టీ ఎమ్మెల్యేలు చెప్పారు. 12 నుంచి 18 శాతానికి అప్పులు తెచ్చి రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని, ఐదేళ్లలో ఏకంగా రూ.7 లక్షల కోట్లకు పైగా అప్పుల భారాన్ని రాష్ట్ర ప్రజల నెత్తిన వేశారని మండిపడ్డారు. మంగళవారం శాసనసభలో బడ్జెట్‌పై చర్చలో పదకొండు మంది ఎమ్మెల్యేలు మాట్లాడారు. కూన రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికి బ్లూ ప్రింట్ మాదిరిగా బడ్జెట్‌ను రూపొందించారని చెప్పారు. జగన్ 102 నీటి ప్రాజెక్టులను నిలిపివేసి రాయలసీమ ప్రాంతానికి తీరని అన్యాయం చేశారని కె.మురళీమోహన్ విమర్శించారు. రాయలసీమ లిఫ్టు ప్రాజెక్టులో రూ.వెయ్యి కోట్లు దోచేశారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకోవడానికి వైసీపీ నేతలు ప్రయత్నిస్తున్నారని ప్రత్తిపాటి పుల్లారావు మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వ విధ్వంస పాలనతో రాష్ట్రం నుంచి పారిశ్రామికవేత్తలు పారిపోగా.. ఇప్పుడు సీఎం చంద్రబాబుపై నమ్మకంతో పెట్టుబడిదారులు రాష్ట్రానికి తరలివస్తున్నారని ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) చెప్పారు. విశాఖ ఎకనామిక్ జోన్ కోసం ఉత్తరాంధ్ర ప్రాంతంలో పంట భూములను కాకుండా ఇతర భూములను సేకరించాలని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జగన్ పాలనలో ఉద్యోగులకు ఒక్క నెల కూడా 5వ తేదీలోపు జీతాలు రాలేదని ఏలూరి సాంబశివరావు ఎద్దేవా చేశారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ సూపర్ సిక్స్ హామీల అమలు సాధ్యం కాదని వైసీపీ నాయకులు విమర్శించారని, ఇప్పుడు సీఎం చంద్రబాబు నాయకత్వంలో ఆ పథకాలన్నీ విజయవంతంగా అమలు చేస్తున్నారని చెప్పారు. ఆదోని కేంద్రంగా ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని కోరారు. ఎమ్మిగనూరు ఎమ్మెల్యే జయనాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పేరుతో వైసీపీ నేతలు డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. విశాఖపట్నం పశ్చిమ ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) మాట్లాడుతూ విధ్వంసం నుంచి వికాసం వైపు రాష్ట్రాన్ని తీసుకువెళ్లే బడ్జెట్‌గా అభివర్ణించారు. గంగాధర నెల్లూరు ఎమ్మెల్యే థామస్ మాట్లాడుతూ.. రాష్ట్ర జనాభా పెరిగేలా ఎక్కువ మంది పిల్లలను కనాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చిన నేపథ్యంలో.. ఒకే కాన్పులో నలుగురు పిల్లలను పుట్టించే ఐవీఎఫ్ ట్రీట్‌మెంట్‌ను రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు.



సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆర్థిక మంత్రి పయ్యావుల, సభ్యులు

అసెంబ్లీకి రాకుండా జీతాలెలా తీసుకుంటారు?

- వైసీపీ ఎమ్మెల్యేల విషయంలో త్వరలో ఓ నిర్ణయం: స్పీకర్



అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): జీతం తీసుకుంటూ ఉద్యోగం చేయకపోతే ఎవరైనా ఊరుకుంటారా? అలాగే అసెంబ్లీ సమావేశాలకు రాకుండా జీతభత్యాలు ఎలా తీసుకుంటారని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశ్నించారు. శాసనసభకు రాని వైసీపీ ఎమ్మెల్యేల విషయంలో ఏం చేయాలనేది త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. మంగళవారం అసెంబ్లీలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అసెంబ్లీకి రావడం ఎమ్మెల్యేల విధి అని, జీతాలు తీసుకుంటూ అసెంబ్లీకి రాని వాళ్లను రీకాల్ చేయాలని లక్నోలో జరిగిన అఖిల భారత స్పీకర్ల సదస్సులో కూడా చెప్పానని, విశాఖపట్నంలో జరిగిన ఓ సమావేశంలో ఇదే అంశాన్ని ప్రస్తావిస్తే 80 శాతం మంది తనకు మద్దతు పలికారని చెప్పారు. మనది ప్రజాస్వామ్య దేశం కావడంతో ఏం చేయాలన్నా పార్లమెంటుకు చెప్పాలని, రీకాల్ అంశంపై కూడా పార్లమెంటు ఓ నిర్ణయం తీసుకోవాలన్నారు. చిన్న పిల్లల మాక్ అసెంబ్లీ అద్భుతంగా జరిగిందని, మా మంత్రులు, ఎమ్మెల్యేల కంటే వాళ్లే బాగా మాట్లాడారని అన్నారు. అసెంబ్లీ సమావేశాలను చూసేందుకు ఆహ్వానిస్తే.. పాఠశాలల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయన్నారు. మంగళవారం ఉదయం సభలో చిన్న సాంకేతిక సమస్య తలెత్తడంతో గంట ఆలస్యంగా ప్రారంభమైందన్నారు. వైసీపీ వాళ్లు దేన్నైనా రాజకీయం చేస్తారని, ఇంతకుముందు ఫేస్ టు ఫేస్ రాజకీయాలు ఉండేవని, ఇప్పుడు వెనకే ఉండి గోతులు తవ్వుతున్నారని అన్నారు.

రాజ్యాంగం, చట్టం ఆమోదిస్తే మా ఎమ్మెల్యేలపై 'వేటు' వేసుకోండి

- డిజిటల్ హాజరును సమర్థిస్తాం: బొత్స



అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): 'గైర్హాజరయ్యే శాసన సభ్యుల సభ్యత్వాలను రద్దు చేయడాన్ని చట్టం, రాజ్యాంగం ఆమోదిస్తే... మా సభ్యులపై వేటు వేసుకోవచ్చు' అని మండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. మంగళవారం శాసనమండలి ప్రాంగణంలోని తన చాంబరులో, అసెంబ్లీ గేటు బయట మీడియాతో మాట్లాడారు. 'సభాపతి తన నిర్ణయాన్ని రాజ్యాంగానికి లోబడే తీసుకోవాల్సి ఉంటుంది. డిజిటల్ హాజరును సమర్థిస్తున్నాం. ఆధునిక సాంకేతికత అందుబాటులోకి వచ్చినప్పుడు దానిని వినియోగించుకోవడాన్ని తప్పుపట్టం. అయితే దానిని శాసనమండలిలో ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలి. వ్యక్తిగత ప్రచారం కోసమే బిల్ గేట్స్‌ను చంద్రబాబు రాష్ట్రానికి తీసుకొచ్చారు. ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో బిల్‌గేట్స్ పేరును కేంద్రం తప్పించిందంటున్నారు. దీనిపై రెండు మూడు రోజుల్లో క్లారిటీ వస్తుంది. వచ్చాక స్పందిస్తాం. ఒకవేళ కేంద్రం గేట్స్ పేరును పక్కన పెట్టినట్లయితే ఏపీకి ఆహ్వానించడం సబబుకాదు. టీటీడీలో నెయ్యి ఎప్పటినుంచో కిలో రూ.320కే కొంటుంటే చంద్రబాబు హయాంలో ఒక్కసారిగా రూ.658 ఎలా చేశారు? శ్రీ వేంకటేశ్వరస్వామిని రోడ్డుపైకి చంద్రబాబే తీసుకువచ్చారు. కడప మేయర్ సురేశ్ అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ పదవినుంచి తొలగించారు. ఇప్పుడు అదే సిద్ధాంతం చంద్రబాబుకు వర్తించదా..! టీటీడీకి నెయ్యి సరఫరా చేస్తున్న ఇందాపూర్ డెయిరీకి, హెరిటేజ్‌కు సంబంధం ఉంది. వారం క్రితం వరకూ హెరిటేజ్ వెబ్‌సైట్‌లో ఇందాపూర్ వివరాలు ఉన్నాయి. గతంలో రూ.300కే ఆ సంస్థ ద్వారా నెయ్యిని హెరిటేజ్ తిరుమలకు సరఫరా చేసింది. ఇప్పుడు రూ.700కు సరఫరా చేస్తున్నారు. ఇందాపూర్‌ను అడ్డంపెట్టుకుని హెరిటేజ్ దోపిడీ చేసే ప్రయత్నం చేస్తుంది. గతంలో ఇందాపూర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టారు. ఇప్పుడు తొలగించారు. దీనిపై సభలో చర్చకు ఎందుకు ఒప్పుకోలేదో చెప్పాలి. దీనికి బాధ్యతవహిస్తూ చంద్రబాబు సీఎం పదవికి రాజీనామా చేయకపోతే ప్రతిపక్షపార్టీగా చూస్తూ ఊరుకుంటామా? హెరిటేజ్ దోపిడీకి వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధం. దీనిపై మండలిలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం' అని బొత్స అన్నారు.

గంజాయితో తండాయి పాలు

- హైదరాబాద్‌లో గ్లాసు రూ.150 చొప్పున విక్రయం
- ఒక్కో చాక్లెట్‌లో 5 గ్రాముల గంజాయి
- గుట్టుగా విక్రయిస్తున్న యూపీ వ్యక్తి అరెస్టు


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి చాక్లెట్లు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): ఇప్పటిదాకా గంజాయి విక్రయాలు చూశాం. గంజాయి చాక్లెట్ల అమ్మకాలు చూశాం. గంజాయి మరపట్టి తీసిన హాషిష్ ఆయిల్ (గంజాయి తైలం)ను కూడా చూశాం, విన్నాం.. కానీ, గంజాయి కలిపిన తండాయి పాలను చూడలేదు.. వినలేదు.. కాచి చల్లార్చిన పాలల్లో ఐస్, డ్రైఫ్రూట్స్ కలిపి తండాయి పాలు అనే పేరుతో ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో విరివిగా విక్రయిస్తుంటారు. వేసవిలో తండాయి పాలకు మంచి గిరాకీ ఉంటుంది. అయితే, యూపీకి చెందిన ఓ వ్యక్తి మామూలుగా కాకుండా గంజాయి చాక్లెట్లు కలిపిన తండాయి పాలను హైదరాబాద్‌లో నడిరోడ్డుపై విక్రయిస్తున్నాడు. ఒక్కో గ్లాసు రూ.150 చొప్పున అమ్మేస్తూ చాలామందిని గంజాయికి బానిసలను చేస్తున్నాడు. ఈ సంగతి తెలుసుకున్న ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు ఆ వ్యక్తిని మంగళవారం అరెస్టు చేశారు. అతని వద్ద 1920 గంజాయి చాక్లెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఆగ్రాకు చెందిన బి. వికాస్ శర్మ కొంత కాలంగా హైదరాబాద్‌లోని చుడీబజార్ నుంచి బేగంబజార్ మధ్యలో తండాయి పాలు విక్రయిస్తున్నాడు. హోలీ సమయంలో ఆగ్రా ప్రజలు అధికంగా సేవించే ఈ పానీయం ఒక్కో గ్లాసు ధర రూ.50 ఉంటుంది. అయితే, వికాస్ శర్మ గంజాయి చాక్లెట్‌ను పాలలో కలిపి ఒక్కో గ్లాస్ రూ.150 చొప్పున విక్రయిస్తున్నాడు. ఈ వ్యవహారంపై అందిన సమాచారం మేరకు వికాస్ శర్మపై నిఘా పెట్టిన ఎస్టీఎఫ్ పోలీసులు.. చార్మినార్ ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఉప్పుగూడలోని ఓ ఇంట్లో వికాస్ శర్మ తండాయి పాలు తయారు చేస్తుండగా దాడి చేసి పట్టుకున్నారు. గంజాయి చాక్లెట్లను ఆగ్రా నుంచి తెప్పించానని, ఒక్కో చాక్లెట్‌లో 5 గ్రాముల గంజాయి ఉంటుందని వికాస్ పోలీసులకు తెలిపాడు.

తెల్లాపూర్‌లో 101 కిలోల గంజాయి స్వాధీనం

హైదరాబాద్‌లోని తెల్లాపూర్ ప్రాంతంలోని ఓ లేబర్ అడ్డాలో రూ.25.72 లక్షల విలువైన సుమారు 101.7 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఏపీకి చెందిన ఇద్దరిని అరెస్టు చేశారు. మరొకరి కోసం గాలిస్తున్నారు. ఏపీకి చెందిన బస్వ జగన్నాథం(37), పల్లపు లక్ష్మీనారాయణ (52) గంజాయి వ్యాపారం చేస్తుంటారు. ఒడిశాకు చెందిన రాజు నుంచి సుమారు 101.7 కిలోల గంజాయిని తెప్పించి తెల్లాపూర్‌లో కార్మికుల క్యాంపుల వద్ద నిల్వ చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు దాడిచేసి జగన్నాథం, లక్ష్మీనారాయణను అదుపులోకి తీసుకున్నారు.






యుద్ధ నౌకలు సిద్ధం

నేడే విశాఖలో ఇంటర్నేషనల్ ఫ్లీట్ రివ్యూ.. భారత్ నుంచి 70కి పైగా నౌకలు, జలాంతర్గాములు

- ప్రత్యేక ఆకర్షణగా ఐఎన్ఎస్ విక్రాంత్
- 'ఐఎన్ఎస్ సుమేధ' నుంచి రాష్ట్రపతి సమీక్ష
- విశాఖకు చంద్రబాబు.. నేడు రివ్యూకు హాజరు

(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నం తీరంలో అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష (ఐఎఫ్ఆర్)కు సమయం ఆసన్నమైంది. భారత నౌకాదళం నుంచి 70కిపైగా యుద్ధనౌకలు, సబ్‌మెరైన్లు, కోస్ట్‌గార్డు నౌకలు, 20 దేశాల నుంచి మరికొన్ని నౌకలు ఈ రివ్యూలో పాల్గొంటున్నాయి. బంగాళాఖాతంలో బుధవారం ఉదయం 8.55 గంటలకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దేశ, విదేశీ నౌకలను సమీక్షించనున్నారు. అంతర్జాతీయ నౌకల సమీక్ష చేస్తున్న తొలి మహిళా రాష్ట్రపతిగా ఆమె చరిత్ర పుటల్లోకి ఎక్కనున్నారు. ఆమె కోసం తూర్పు నౌకాదళం ప్రత్యేకంగా 'ఐఎన్ఎస్ సుమేధ' యుద్ధనౌకను అందంగా తీర్చిదిద్దింది. ఆపరేషన్ సిందూర్‌లో కీలకంగా వ్యవహరించిన యుద్ధ విమాన వాహన నౌక ఐఎన్ఎస్ విక్రాంత్ ఈ సమీక్షలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. దీనితో పాటు వివిధ నగరాల పేరుతో నేవీ నిర్మించిన నౌకలు ఐఎన్ఎస్ చెన్నై, ఐఎన్ఎస్ విశాఖ, ఐఎన్ఎస్ ముంబై, ఐఎన్ఎస్ మైసూర్.. అలాగే, ఐఎన్ఎస్ రాణా, రణ్‌వీర్, రణ్‌విజయ్, తరఖాన, తమల్, నీలగిరి, హిమగిరి, ఉదయగిరి తదితర నౌకలతో పాటు సబ్‌మెరైన్లు సింధుకీర్తి, సింధుకేసరి, కోస్ట్‌గార్డు నౌకలు రివ్యూలో పాల్గొంటున్నాయి.

హిమగిరి, ఉదయగిరి ఒకేసారి

విశాఖపట్నం కేంద్రంగా పనిచేస్తున్న యుద్ధ నౌకలు ఐఎన్ఎస్ హిమగిరి, ఐఎన్ఎస్ ఉదయగిరి మంగళవారం విశాఖపట్నంలో రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చేతుల మీదుగా నౌకాదళంలో చేరాయి. వేర్వేరు షిప్‌యార్డుల్లో తయారై ఒకేసారి ఒకే చోట కమిషనింగ్ కావడం వీటి ప్రత్యేకత. ప్రాజెక్టు 17ఏలో మొదటిదైన స్టెల్త్ ఫ్రిగేట్ హిమగిరి (ఎఫ్34)ని కోల్‌కత్తాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ నిర్మించగా, ఉదయగిరి (ఎఫ్35)ని ముంబైలోని మజగాన్ డాక్ షిప్ బిల్డర్స్ రూపొందించింది. భారత నౌకాదళం వార్‌షిప్ డిజైన్ బ్యూరో రూపొందించిన 100వ నౌక కూడా ఇదే కావడం విశేషం. సూపర్ సోనిక్ క్షిపణులు, మీడియం రేంజ్ క్షిపణులు, 76 ఎంఎం మీడియం రేంజ్ గన్, 30 ఎంఎం, 12.7 ఎంఎం ఆయుధాలు, యాంటీ సబ్‌మెరైన్, సముద్రం అంతర్భాగంలో ప్రయోగించే ఆయుధాలు వీటిపై అమర్చారు.

ఐఎఫ్ఆర్‌కు రిహార్సల్స్ పూర్తి

అంతర్జాతీయ యుద్ధనౌకల సమీక్ష నేపథ్యంలో భారత నౌకాదళం మంగళవారం రిహార్సల్ నిర్వహించింది. నౌకాదళాధిపతి దినేష్ కె త్రిపాఠి ఈ సమీక్ష చేశారు. ఐఎన్ఎస్ సుమేధ యుద్ధనౌక ముందు వెళుతుండగా, వెనుక ఐఎన్ఎస్ సుకన్యలో మీడియా ప్రతినిధులను తీసుకువెళ్లారు. ఉదయం 9గంటలకు ప్రారంభమైన సమీక్ష మధ్యాహ్నం ఒంటి గంట వరకు కొనసాగింది. సముద్రంలో వరుసగా లంగరేసిన నౌకల మధ్య నుంచి రాష్ట్రపతి రథం నెమ్మదిగా వెళుతుండగా, ఆయా నౌకల్లోని సిబ్బంది డెక్ పైకి వచ్చి సుమేధకు సెల్యూట్ చేశారు. రిహార్సల్స్‌లో భాగంగా మంగళవారం సాయంత్రం ఆర్కే బీచ్‌లో నేవీ కమాండోలు ప్రదర్శించిన సాహస విన్యాసాలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి.

రాష్ట్రపతి రథం ప్రత్యేకత ఇదీ..

రాష్ట్రపతి రథంగా పిలుస్తున్న ఐఎన్ఎస్ సుమేధ.. సరయూ తరగతికి చెందిన యుద్ధనౌక. దేశీయ పరిజ్ఞానంతో గోవా షిప్‌యార్డులో తయారు చేశారు. ఇది 2014 మార్చిలో నౌకాదళంలో చేరగా, విశాఖపట్నం కేంద్రంగా తూర్పు నౌకాదళం నుంచి సేవలందిస్తోంది. ఇది తీర ప్రాంత గస్తీ నౌక. ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్న ఐఎన్ఎస్ విక్రాంత్.. దేశీయ పరిజ్ఞానంతో నిర్మించిన తొలి యుద్ధవిమాన వాహక నౌక. దీని బరువు 43 వేల టన్నులు. పొడవు 262 మీటర్లు. వెడల్పు 62 మీటర్లు. ఎత్తు 59 మీటర్లు. ఇందులో 14 డెక్‌లు ఉంటాయి. 1,700 మంది సిబ్బంది ఉంటారు. దీనికోసం విశాఖపట్నం పోర్టు అవుటర్ హార్బర్‌లో ప్రత్యేకంగా జెట్టీ నిర్మిస్తున్నారు.

35 ఏళ్లు పూర్తి చేసుకుంటున్న డేగా

తూర్పు నౌకాదళం విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన వైమానిక స్థావరం పేరు ఐఎన్ఎస్ డేగా. దీనిని 1991 అక్టోబరులో ప్రారంభించారు. 35 ఏళ్లు పూర్తి చేసుకోబోంది. ఇక్కడ జెట్ విమానాలను నడపడంలో పైలట్లకు శిక్షణ ఇస్తారు. ఇక్కడే పౌర విమానాశ్రయం కూడా ఉంది. ఈ జూన్‌లో భోగాపురంలో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైతే విశాఖ విమానాశ్రయాన్ని పూర్తిగా నేవీనే ఉపయోగించుకోనుంది.

విశాఖ చేరుకున్న రాష్ట్రపతి

త్రివిధ దళాల అధిపతి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ప్రత్యేక విమానంలో విశాఖకు విచ్చేశారు. ఐఎన్ఎస్ డేగాలో ఆమెకు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, నగర మేయర్ పీలా శ్రీనివాసరావు తదితరులు స్వాగతం పలికారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్‌సింగ్, భారత నౌకాదళం చీఫ్ అడ్మిరల్ దినేశ్ కె.త్రిపాఠిలు కూడా విశాఖకు వచ్చారు. వీరితో పాటు తూర్పు నౌకాదళం ఉన్నతాధికారులు, విశాఖకు చెందిన ప్రముఖ నాయకులకు రాష్ట్రపతి ఈఎన్‌సీ ఆఫీసర్స్ మెస్ రాజ్‌పుత్ హాలులో రాత్రి విందు ఏర్పాటు చేశారు. తర్వాత రాష్ట్రపతి తన విడిది చోళ సూట్‌కు వెళ్లిపోయారు.


విశాఖ చేరుకున్న సీఎం చంద్రబాబు

విశాఖకు ముఖ్యమంత్రి చంద్రబాబు

ఐఎఫ్ఆర్‌లో పాల్గొనేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు మంగళవారం రాత్రి విశాఖకు చేరుకున్నారు. విమానాశ్రయంలో ఆయనకు ఎంపీ ఎం.శ్రీభరత్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, నేవీ అధికారులు తదితరులు స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి ఆయన నేరుగా పోర్టు గెస్ట్ హౌస్‌కు చేరుకుని బస చేశారు.

చిట్టితల్లిని చిదిమేశాడు!

- గంజాయి మత్తులో ఓ మానవమృగం ఘాతుకం
- ఏడేళ్ల బాలికను కిరాతకంగా హింసించి, హత్యాచారం
- మృతదేహాన్ని నీళ్ల డ్రమ్ములో చుట్టిపెట్టి మత్తులోకి
- కఠినంగా శిక్షిస్తామని మంత్రులు లోకేశ్, అనిత హామీ
- మదనపల్లెలో తీవ్ర ఉద్రిక్తత


నిందితుడు కులవర్ధన్

మదనపల్లె, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): గంజాయి మత్తులో మునిగిన ఓ మానవమృగం ఏడేళ్ల చిన్నారిపై అత్యాచారం చేసి, అతి కిరాతకంగా హతమార్చింది. ఈ అమానవీయ ఘటన అన్నమయ్య జిల్లా మదనపల్లెలో వెలుగు చూసింది. పోలీసుల కథనం మేరకు.. మదనపల్లెలోని నీరుగట్టువారిపల్లెకు చెందిన బాలిక(7) స్థానికంగా ఓ ప్రవేట్ పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. మహాశివరాత్రి సందర్భంగా పాఠశాలకు సెలవు కావడంతో సోమవారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటోంది. గంజాయికి, మద్యానికి బానిసై జులాయిగా తిరిగే కులవర్ధన్(30) వీరి ఎదురింటి బయట కూర్చున్నాడు. అప్పటికే మత్తులో ఉన్న అతను ఆ చిన్నారికి మాయమాటలు చెప్పి పక్కనే ఉన్న తన ఇంట్లోకి తీసుకెళ్లాడు. సాయంత్రం బాలిక ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ దొరకలేదు. దీంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే నిందితుడు.. ఆ చిట్టితల్లిపై అత్యాచారానికి పాల్పడి, దారుణంగా హత్య చేశాడు. ఇంట్లోని నీళ్ల డ్రమ్ములో మృతదేహాన్ని చుట్టిపెట్టి మత్తులోకి జారుకున్నాడు. మంగళవారం ఉదయం పోలీసులు జాగిలాలతో ఆ ప్రాంతాన్ని గాలించారు. అవి కులవర్ధన్ ఇంటి ముందుకు వెళ్లి ఆగడంతో అనుమానించిన పోలీసులు గట్టిగా విచారించగా నేరాన్ని అంగీకరించాడు. డ్రమ్ములో ఉంచిన బాలిక మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు.. నిందితుడ్ని స్టేషన్‌కు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న స్థానికులతో పాటు చేనేతలు, కుల, ప్రజాసంఘాలు, రాజకీయ నాయకులు, మహిళా సంఘాల ప్రతినిధులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని తరలించడానికి అంబులెన్స్‌తో వచ్చిన పోలీసులను చుట్టుముట్టారు. నిందితుడిని తమకు అప్పగించే వరకూ మృతదేహాన్ని ఇచ్చేది లేదని తేల్చిచెప్పారు. బాలికతో పాటే వాడికీ అంత్యక్రియలు చేయాలని, ప్రజాకోర్టులో ప్రవేశపెట్టాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారుల సంఖ్య క్రమంగా పెరగడంతో నీరుగట్టువారిపల్లె, కాట్లాటవారిపల్లె రోడ్డులో తీవ్ర ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కడప ఎస్పీ నికసిత్ విశ్వనాథ్, సబ్‌కలెక్టర్ చల్లా కల్యాణి, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు జి. శ్రీరామ్‌చినబాబు తదితరులు బాలిక తల్లితండ్రులతో చర్చలు జరిపారు. న్యాయం చేస్తామని, నిందితుడికి కఠినంగా శిక్ష పడేలా చర్యలు తీసుకుంటామని హోంమంత్రి అనిత, మంత్రి లోకేశ్ ఫోన్‌లో హామీ ఇవ్వడంతో ఆందోళనకారులు శాంతించారు. జిల్లా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు. బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడు ఆపై హత్య చేశాడని డీఐజీ కోయ ప్రవీణ్ నిర్ధారించారు. కాగా, మదనపల్లెలో ఏడేళ్ల బాలికపై హత్యాచారం ఘటనలో నిందితుడికి కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ డిమాండ్ చేశారు.

ఆత్మహత్యకు ప్రేరేపించడం.. నేరమే

- సినీ నటి ప్రత్యూష కేసులో సిద్ధార్థరెడ్డికి రెండేళ్ల జైలు శిక్షను ఖరారు చేసిన సుప్రీంకోర్టు
- 4 వారాల్లోగా లొంగిపోవాలని ఆదేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): సామూహిక ఆత్మహత్య ఒప్పందం(మ్యూచువల్ సూసైడ్ ప్యాక్ట్)లో బతికి ఉన్నవాళ్లు దోషులేనని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఇద్దరూ కలిసి ఆత్మహత్యకు యత్నించినప్పుడు అందులో ఒకరు ప్రాణాలతో బయటపడితే... అది ఆ వ్యక్తి చేసిన నేరంగానే పరిగణించాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. సినీనటి ప్రత్యూష కేసులో ఆమె స్నేహితుడైన సిద్ధార్థ రెడ్డే స్వయంగా విషపదార్థం కొనుగోలు చేసినట్లు తేలిందని, అతడు ముమ్మాటికీ దోషేనని పేర్కొంది. 24 ఏళ్ల క్రితం సంచలనం సృష్టించిన ప్రత్యూష కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించిన సుప్రీం ధర్మాసనం.. నిందితుడు సిద్ధార్థ రెడ్డికి రెండేళ్ల జైలు శిక్షను ఖరారు చేసింది. నాలుగు వారాల్లోగా లొంగిపోవాలని సిద్ధార్థరెడ్డిని ఆదేశించింది. 2002 ఫిబ్రవరి 23న సినీనటి ప్రత్యూష, ఆమె స్నేహితుడు సిద్ధార్థ రెడ్డి కూల్‌డ్రింక్‌లో పురుగుల మందు కలుపుకొని తాగి ఆత్మహత్యకు యత్నించారు. మరుసటి రోజు (ఫిబ్రవరి 24న) ప్రత్యూష మరణించగా, ఆస్పత్రిలో చికిత్స తర్వాత సిద్ధార్థ రెడ్డి కోలుకున్నాడు. ప్రత్యూష మృతిపై పలు అనుమానాలు రావడంతో అప్పటి ప్రభుత్వం సీబీఐ విచారణకు ఆదేశించింది. అప్పట్లో విచారణ చేపట్టిన ట్రయల్ కోర్టు.. 2004 ఫిబ్రవరి 23న సిద్ధార్థ రెడ్డిని దోషిగా తేల్చింది. ఆత్మహత్యకు ప్రేరేపించినందుకు ఐపీసీ సెక్షన్ 306 కింద ఐదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5,000 జరిమానా విధించింది. ఆత్మహత్యాయత్నం చేసినందుకు ఐపీసీ సెక్షన్ 309 కింద మరో ఏడాది శిక్ష విధించింది. ట్రయల్ కోర్టు తీర్పును సవాలు చేస్తూ సిద్ధార్థ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు. అదేక్రమంలో తన కుమార్తె మృతికి సిద్ధార్థ రెడ్డే కారణమని, అతడికి కఠిన శిక్ష విధించాలని ప్రత్యూష తల్లి సరోజినీ దేవి కూడా పిటిషన్ వేశారు. విచారణ చేపట్టిన అప్పటి ఉమ్మడి ఏపీ హైకోర్టు.. 2011 డిసెంబరు 28న తీర్పు వెలువరించింది. సిద్ధార్థ రెడ్డికి ట్రయల్ కోర్టు విధించిన 5 ఏళ్ల జైలు శిక్షను 2 ఏళ్లకు తగ్గించి, జరిమానాను రూ.5,000 నుంచి రూ.50,000కు పెంచింది. ఈ తీర్పును సిద్ధార్థ రెడ్డి సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. తనను నిర్దోషిగా ప్రకటించాలని అభ్యర్థించారు. మరోవైపు.. తన కుమార్తె మరణానికి సిద్దార్థ రెడ్డినే కారణమని, అతడికి యావజ్జీవ శిక్ష విధించాలని కోరుతూ ప్రత్యూష తల్లి సరోజినీ దేవి కూడా సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఆ రెండు పిటిషన్లను సుదీర్ఘకాలం పాటు విచారించిన సుప్రీంకోర్టు ధర్మాసనం.. గత ఏడాది నవంబరులో తీర్పును రిజర్వ్ చేసింది. మంగళవారం జస్టిస్ రాజేష్ బిందాల్, జస్టిస్ మన్మోహన్‌తో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరిస్తూ.. సిద్ధార్థరెడ్డికి రెండేళ్ల జైలు శిక్ష విధించడాన్ని సమర్థించింది.



మునిస్వామి నివేదిక 'అన్ ప్రొఫెషనల్'

డాక్టర్ మునిస్వామిని విచారించకపోవడం వల్లే ఈ కేసులో స్పష్టత లోపించిందని ప్రత్యూష తల్లి తరపు న్యాయవాది ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. ప్రత్యూష గొంతు పిసికి చంపినట్లుగా ఆధారాలు ఉన్నాయని మునిస్వామి నివేదికలో ఉందని గుర్తు చేశారు. ఈ క్రమంలో ధర్మాసనం తీవ్రంగా స్పందించింది. "మునిస్వామిని విచారించాల్సిన అవసరం లేదని కోర్టు భావిస్తోంది. ఎందుకంటే ఆయన ఇచ్చిన నివేదికను ముగ్గురు సభ్యుల నిపుణుల కమిటీ, ఎయిమ్స్ కమిటీ పూర్తిగా తప్పుబట్టాయి. ఇది గొంతు పిసికి చంపిన కేసు కాదు, విషప్రయోగం వల్ల జరిగిన మరణమని స్పష్టం చేశాయి. మునిస్వామి అన్ ప్రొఫెషనల్‌గా వ్యవహరించారు. ఎఫ్ఎస్ఎల్ నివేదిక రాకముందే, కేవలం కంటితో చూసి అటువంటి నిర్ధారణకు రావడం వైద్య శాస్త్రానికి విరుద్ధం. చికిత్స సమయంలో ఏర్పడిన గాయాలను హింస వల్ల కలిగిన గాయాలుగా తప్పుగా చిత్రీకరించారు" అని ధర్మాసనం పేర్కొంది. ప్రత్యూష మరణానికి విషప్రయోగమే కారణమని, గొంతు నులిమి చంపినట్లు ఆధారాలు లేవని, ఆమె మరణానికి ముందు లైంగిక దాడి జరిగినట్లు ఆధారాలు లేవని డాక్టర్ ఎం.నారాయణ రెడ్డి కమిటీ నివేదిక ఇచ్చిన విషయాన్ని గుర్తు చేసింది. "2002 ఫిబ్రవరి 23న రాత్రి 8 గంటల సమయంలో విషం సేవించారంటూ ప్రత్యూషను ఆస్పత్రికి తీసుకురాగా, ఆ సమయంలో ఆమె స్పృహలో ఉండి.. స్పష్టంగా మాట్లాడగలిగారు. ఆ తర్వాతి రోజు ఉదయం 11.45గంటల వరకు ఆమెకు వైద్యులు చికిత్స అందించారు. 'గొంతు పిసికి చంపడం' ఆమె మరణానికి కారణం కాదు. లైంగికదాడి ఆధారాలేమీ దొరకలేదు. ఇది "ఆర్గానోఫాస్ఫరస్ పాయిజనింగ్" వల్ల సంభవించిన మరణమని పేర్కొనబడింది" అన్న నిపుణుల కమిటీ నివేదికను పరిగణనలోకి తీసుకుంటున్నట్లు సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.

మాకు న్యాయం జరగలేదు

- 24 ఏళ్లుగా నాది ఒంటరి పోరాటం
- న్యాయం జరిగే వరకూ పోరాడతా: ప్రత్యూష తల్లి

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): ప్రత్యూష మృతి కేసులో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పును ఆమె తల్లి సరోజిని స్వాగతించారు. అయితే, తమకు పూర్తిస్థాయిలో న్యాయం జరగలేదని, దోషికి యావజ్జీవ శిక్ష పడుతుందని ఆశించినా.. ఆ దిశగా ఉత్తర్వులు రాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. "నా కూతురు ఆత్మహత్య చేసుకోలేదు. అత్యాచారం చేసి చంపేశారు. దోషికి యావజ్జీవ శిక్ష పడి ఉంటే మా అమ్మాయి ఆత్మకు శాంతి కలిగేది. 24 ఏళ్లుగా నాది ఒంటరి పోరాటం. మెడికో లీగల్ కేసు కింద ప్రత్యూష ఆస్పత్రిలో చేరినప్పుడు ఆమె ధరించిన దుస్తులు భద్రపరచాల్సి ఉండగా.. తగలబెట్టామని చెప్పారు. డబ్బు, అధికారం, పరపతిని ఉపయోగించి సాక్ష్యాలను నాశనం చేశారు. గాంధీ ఆస్పత్రి మార్చురీలో నిర్జీవంగా పడి ఉన్న ప్రత్యూష మెడపై పంటి గాట్లు గమనించి డాక్టర్లను అడిగితే.. చికిత్స చేసేటప్పుడు జరిగినవని బదులిచ్చారు. ప్రత్యూషపై అత్యాచారం జరిగిందని మునిస్వామి నివేదిక వెల్లడించినా.. పక్కన పెట్టేశారు. ముగ్గురు వైద్యుల కమిటీ ఇచ్చిన రిపోర్టును మాత్రమే కోర్టులకు సమర్పిస్తున్నారు. నా కుమార్తె చావుకు కారణమైనవారికి తగిన శిక్షపడే వరకు పోరాటం కొనసాగిస్తా" అని పేర్కొన్నారు.

సుప్రీం కోర్టు పేర్కొన్న 12 అంశాలు ఇవీ

1) ప్రత్యూషను గొంతు నులిమి చంపారన్న ఆరోపణలకు సరైన ఆధారాలు లేవు. 2) నిపుణుల కమిటీ నివేదికను పరిశీలించిన తర్వాత ప్రత్యూష విషం తీసుకుని ఆత్మహత్యకు పాల్పడిందని నిర్ధారణ అవుతోంది. 3) ఈ కేసులో నిందితుడు సిద్ధార్థ రెడ్డి ప్రత్యూషపై అత్యాచారానికి పాల్పడ్డాడన్న ఆరోపణలు రుజువు కాలేదు. 4) ఆత్మహత్య జరిగిన చాలా కాలం తర్వాత అత్యాచారం ఆరోపణలు చేయడం సరికాదు. దానికీ సరైన ఆధారాలు లేవు. 5) డాక్టర్ మునిస్వామి సమర్పించిన పోస్టుమార్టం నివేదిక అశాస్త్రీయంగా, బాధ్యతారహితంగా ఉంది. ఆయన తీరు 'అన్ ప్రొఫెషనల్'గా ఉంది. 6) నివేదికను అధికారికంగా సమర్పించకముందే.. అసంపూర్తి సమాచారాన్ని మునిస్వామి బహిర్గతం చేశారు. కేసు దారి మళ్లడానికి ఇదే కారణం. 7) హైదర్‌గూడలోని 'రేవతి ఏజెన్సీస్' షాపులో పని చేస్తున్న సేల్స్‌మాన్ జి.అనిల్‌కుమార్ (పీడబ్ల్యూ-34) వద్ద 'నువాక్రాన్' అనే విషాన్ని నిందితుడు కొనుగోలు చేశాడు. హిమాయత్‌నగర్‌లోని 'ఫుడ్‌వరల్డ్' షాపులో పనిచేస్తున్న ఆనంద్ రావు(పీడబ్ల్యూ-35) వద్ద చాక్లెట్, కత్తి సేకరించాడు. 8) ఈ కేసులో పరిస్థితుల ప్రభావం, సాక్ష్యాలు స్పష్టంగా నిందితుడికి వ్యతిరేకంగా ఉన్నాయి. 9) కూల్‌డ్రింక్‌లో ఏదో కలిపామని, అది ప్రమాదవశాత్తు జరిగిందన్న డిఫెన్స్ వాదనను తిరస్కరిస్తున్నాం. 10) విషం కొన్నది సిద్ధార్థరెడ్డే అని సాక్ష్యాలతో సహా రుజువైంది. ఆత్మహత్యకు ప్రేరేపించడం నేరమే. 11) ఇద్దరు వ్యక్తులు పరస్పర అంగీకారంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నప్పుడు.. అందులో ఒకరు చనిపోయి, మరొకరు బతికితే.. చట్టప్రకారం బతికున్న వ్యక్తి ఆ మరణానికి బాధ్యుడవుతాడు. 12) గతంలో వెల్లూరు కేసులో ఇచ్చిన తీర్పును ఈ కేసులో అన్వయించుకోలేం.

మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురు

- కిడ్నాప్ కేసులో అరెస్ట్ నుంచి రక్షణకు నిరాకరణ

అమరావతి, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): మోహన్‌బాబు యూనివర్సిటీ ఛాన్స్‌లర్, సినీనటుడు మోహన్‌బాబుకు హైకోర్టులో చుక్కెదురైంది. విద్యార్థి నాయకుల కిడ్నాప్ కేసులో అరెస్ట్ నుంచి రక్షణ కల్పించేందుకు న్యాయస్థానం నిరాకరించింది. విద్యార్థి నాయకుల కిడ్నాప్‌నకు ముందు, తరువాత కూడా కేసులో ప్రధాన నిందితుడు వర్సిటీ పీఆర్‌వో సతీష్‌తో పిటిషనర్ ఫోన్‌లో మాట్లాడారని, మెసేజ్‌లు కూడా చేసుకున్నారని పోలీసులు చెబుతున్నారని గుర్తుచేసింది. ఫోన్ కాల్స్‌తో పాటు మెసేజ్‌లను విశ్లేషించి ఫోరెన్సిక్ ల్యాబొరేటరీ నివేదిక అందజేయాల్సి ఉందని పేర్కొంది. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ ఇవ్వలేమని స్పష్టం చేసింది. అరెస్ట్‌తో పాటు ఎఫ్ఐఆర్ ఆధారంగా తదుపరి చర్యలు నిలుపుదల చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలన్న మోహన్‌బాబు అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. అనుబంధ పిటిషన్‌ను కొట్టివేసింది. వ్యాజ్యంపై లోతైన విచారణ జరుపుతామని పేర్కొంటూ క్వాష్ పిటిషన్‌పై విచారణను మార్చి 3కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. విద్యార్థి నాయకుల కిడ్నాప్ కేసుకు సంబంధించి బాధితుడు రెడ్డి కుమార్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఈ నెల 3న తిరుపతి జిల్లా, తిరుచానూరు పోలీసులు తనపై నమోదు చేసిన కేసును కొట్టివేయాలని కోరుతూ మోహన్‌బాబు పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం ఇటీవల విచారణకు రాగా మోహన్‌బాబు తరపు సీనియర్ న్యాయవాది కేఎస్ మూర్తి, న్యాయవాది ఎన్.అశ్వనీకుమార్ వాదనలు వినిపించారు. అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సందీప్ వాదనలు వినిపిస్తూ.. విద్యార్థి నేతల కిడ్నాప్ వ్యవహారంలో మోహన్‌బాబు పాత్రపై ఆధారాలు ఉన్నాయన్నారు. ఘటన సమయంలో ప్రధాన నిందితుడు వర్సిటీ పీఆర్‌వో సతీష్, మోహన్‌బాబు మధ్య ఫోన్ సంభాషణ జరిగిందన్నారు. సతీష్ నుంచి పిటిషనర్‌కు ఓ మెసేజ్ కూడా వచ్చినట్లు గుర్తించామన్నారు. దర్యాప్తు అధికారి ముందు హాజరు కావాలని మంచు విష్ణుకు(ఏ3) పోలీసులు నోటీసులు ఇచ్చినప్పటికీ ఆయన విచారణకు హాజరుకాలేదన్నారు. దర్యాప్తు ప్రాథమిక దశలో ఉందన్నారు. ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ జారీ చేయవద్దని అభ్యర్థించారు. బాధితుడు రెడ్డి కుమార్ తరఫున న్యాయవాది నల్లూరి మాధవరావు వాదనలు వినిపిస్తూ.. విద్యార్థి నాయకులను కిడ్నాప్ చేసేందుకు యూనివర్సిటీ వాహనాలనే ఉపయోగించారన్నారు. కిడ్నాప్ ఘటన వెనుక పిటిషనర్ పాత్ర ఉందన్నారు.

ఇప్పుడు కలవలేను.. తరువాత రండి!

- మాజీ మంత్రి అమర్నాథ్‌తో ములాఖత్‌కు అంబటి నిరాసక్తత

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 17(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మాజీ మంత్రి అంబటి రాంబాబు ములాఖత్‌లో మాజీమంత్రి అమర్నాథ్‌ను కలవడానికి ఆసక్తి చూపలేదు. రాంబాబుతో ములాఖత్‌కి అమర్నాథ్‌తో పాటు మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, పార్టీ నేత మజ్జి శ్రీనివాసరావు మంగళవారం ఉదయం 11 గంటలకు సెంట్రల్ జైలు వద్దకు చేరుకున్నారు. తనకు నలతగా ఉందని.. మధ్యాహ్నం 3 గంటలకు రావాలని జైలు అధికారుల ద్వారా వారికి రాంబాబు తెలియజేశారు. దీంతో ఆ నేతలు కాకినాడలో మాజీ మంత్రి కన్నబాబును కలవడానికి వెళ్లారు. అక్కడ సమయం మించిపోవడంతో తిరిగి రాలేకపోయారు. అంతకుముందు మీడియాతో అమర్నాథ్, ధర్మశ్రీ మాట్లాడుతూ, ప్రభుత్వం మారిన తర్వాత ఏ రకమైన పరిస్థితి ఉంటుందో తెలుసుకోవాలని కూటమి నేతలను హెచ్చరించారు.

ఐబొమ్మ రవికి బెయిల్ మంజూరు

హైదరాబాద్, ఫిబ్రవరి 17 (ఆంధ్రజ్యోతి): పైరసీ ఆరోపణలతో గతేడాది నవంబర్‌లో అరెస్టయిన ఇమ్మడి రవి అలియాస్ ఐబొమ్మ రవికి హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. హైదరాబాద్ విడిచి వెళ్లరాదని, సాక్ష్యాలను తారుమారు చేయడం వంటి చర్యలకు పాల్పడరాదని, వ్యక్తిగత బాండ్, పూచీకత్తులు సమర్పించాలని పేర్కొంటూ పలు షరతులు విధించింది. ప్రతిరోజు ఉదయం 11 గంటలకు సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ (సీసీఎస్)లో హాజరుకావాలని ఆదేశించింది. పైరసీ ఆరోపణలతో పోలీసులు నమోదు చేసిన కేసుల్లో దర్యాప్తు పూర్తయిందని, ఇంకా తనను జైల్లో ఉంచడం చట్టవ్యతిరేకమని పేర్కొంటూ రవి హైకోర్టులో వేర్వేరుగా నాలుగు బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ జరిపిన జస్టిస్ కే సుజన ధర్మాసనం అనుకూలంగా తీర్పు ఇచ్చింది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao,on behalf of Aamoda Publications Pvt.Ltd., Aamoda Press, Door no.1078, Vengalayapalem village, Guntur Rural Mandal,Guntur, Editor: N.Rahul Kumar Phone No: (0863)2512379,2512376 , RNI no.APTEL/2003/9781. Managing Director : Vemuri Radha Krishna. Founder: K.L.N.Prasad.